డి. త్వక్సారములు :—నేరేడు, మోదుగ, మఱ్ఱి, కానుగ, రావి, తుమ్మ, లొద్దుగ, మామిడి, వేప, పెద్దమ్రాను, మ్రానుపసుపు మొదలగునవి.

ఇ. సారసారములు :—చంద్ర, వేగిస, వేప, చందనము, రక్తచందనము, దేవదారు, నేరేడు, ఇప్ప, అగురు మొదలగునవి.

ఎఫ్. నిర్యాససారములు :—మోదుగ, బూరుగ, గుగ్గిలము, సర్జరసము, నల్లమందు, మునగ, ఇంగువ, వేప, తుమ్మ, మహిసాక్షి, వెలగ మొదలగునవి.

జి. పత్రసారములు :—గుంటకలగర, తెల్లజిల్లేడు, ఆకుచేముడు, సరస్వతి, గలిజేరు ద్వయము, ఉమ్మెత్త, కాకర, పొట్ల, వావిలి, పొన్నగంటి, గోరింటి, ఉప్పి, అడ్డసరము మొదలగునవి.

ఎచ్. పుష్పసారములు :—సంపంగి, కలువ, పొన్న, పొగడ, జాజి, మొల్ల, సరాప, నందివర్ధనము, భూజపత్రి, మునగ, ఏల, లవంగం, వాసాని, పాదిరి మొదలగు పుష్పజాతులు.

ఐ. ఫలసారములు :—ద్రాక్ష, దానిమ్మ, ఖర్జూరము, అరటి, పనస, మామిడి, తాడి, మారేడు, కొబ్బరి, నిమ్మ, దబ్బ, మాదీఫలం, వెలగ మొదలగునవి.

జె. బీజసారములు :—వరిజాతులు, ధాన్యజాతులు, కాయధాన్యములు, ఆముదము, ప్రత్తి, చారపప్పు, వేప, పొగడ, అవిసె, ఓమము, ధనియాలు, ఆవాలు, మెంతులు, చిల్లగింజలు మొదలగునవి.

కె. క్షారసారములు :—పొగడ, చిత్రమూలము, చేముడు, కానుగ, ఉత్తరేణి, నువ్వులు, మద్ది, దేవదారు, నేపాళము, జిల్లేడు మోదుగ మొదలగునవి.



ఎల్. సర్వాంగసారములు :—గుంటకలగర, కలబంద, వేప, చేదుపొట్ల, నేలవేము, కలిక, పులిచింత, [illegible], సేవ్యము మొదలగునవి. వీని సర్వాంగములు ఔషధోపయోగములు.

వీనిని ఆయా ఋతువులలో తెచ్చి నీడను ఆరించి దుమ్ము వగైరాలు పట్టకుండా జాగ్రత్త పరచవలెను. ఔషధములలో చేర్చు ప్రతి ఓషధియు సారవంతమైనదిగా నుండవలెను. నిస్సారములగు మూలికల కూటమి రూపమాత్రమేగాని గుణమందు ప్రసిద్ధి వహింపను. గాన మంచి నేలయున మూలికల గ్రహించి ఔషధముల యందు చేర్చవలెను. కొన్ని మూలికల స్వరసము గ్రహించి మర్దన భావనాదులు జరిగించవలెను.

ఓషధులలో కొన్నింటికి దేవతల పేర్లున్నవి. ఉదాహరణ! అర్క=జిల్లేడు. అర్కశబ్దము సూర్యపదము. అనగా సూర్యునివలె నీ ఓషధికూడా తీక్ష్ణగుణముగలది. వహ్ని=చిత్రమూలం. వహ్ని=అగ్ని ముట్టుకొన్నచో దహించు స్వభావము. చిత్రమూలము కొంత్రెగ నూరి పట్టువేసినయెడల వెంటనే దేహమునందు మంటలుపుట్టి పొక్కి పుండగును. బ్రాహ్మి=సరస్వతి. సరస్వతి ఆకు. ఈ ఓషధి వాగధిదేవత వలెనే వాక్కునకు పటుత్వమిచ్చును. రంభ=అరటిచెట్టు, పనసి, అవిసె, మత్స్యాక్షి=పొన్నగంటి, సర్పాక్షి=రెడ్డివారినానుబాలు చెట్టు.

ఇట్లు ఓషధులయొక్కయు, జంతువులయొక్కయు నుపయోగ ఫలంబులు ననుభవించువారు మనుష్యులు. మర్త్యశబ్దము మృతిని పొందు వారు అని అర్థము. మృతిని పొందువారికి పై వానితో ఉపయోగమేమి? చనిపోవువరకు శక్తిసామర్థ్యములతో నారోగ్యవంతులై బ్రతుకుటయే దీనిఫలము. మనుజులు విజ్ఞానవంతులు. గనుక వారిచే ధర్మార్థ కామ మోక్షములను నాలుగు పురుషార్థములు కోరబడుచున్నవి. ధర్మము చేయుటకు అర్థము కావలెను. అర్థసంపాదనకు శరీర దృఢత ముండవలెను. అందువలననే—" శరీరమాద్యం ఖలుధర్మసాధన " మ్మనిరి. కామమునకు

కూడ దేహారోగ్యమే ముఖ్యము. ఆరోగ్యమే మహాభాగ్యముగ బరిగణింపఁబడినది.

క॥ ఆరోగ్యము కలిగిన జనుఁ
డేడేడు జగంబులందు ♦ నిం పొందుతగన్
ఆరోగ్యము లేకుండిన
కాలి దుంబడును నరుఁడు ♦ కడుదుఃఖితుఁడై ॥

సాధారణముగా ఆరోగ్యవంతుఁడు స్వాస్థ్యనాడి కలవాఁడుగను, సమాన జఠరాగ్ని కలవాఁడునై యున్నాఁడు. అనఁగా వాని శరీరమునందు ♦లవణాదుల లోపముగాని, *విటమినుల లోపముగాని లేదని బోధపడుచున్నది. ఆరోగ్యములేని మహారాజుకంటె ఆరోగ్యముకల కూలివాఁడు సుఖవంతుఁడు.

కొన్ని మూలికలకు స్వయం తేజోశక్తి కలదు. ఒకప్పుడు (ఇది త్రేతాయుగం మాట) శ్రీరామచంద్రమూర్తి వాని సహోదరుఁడగు లక్ష్మణుఁడు మూర్ఛనొందగా అవక్ర విక్రమ బలవీర్య సంపన్నుఁడగు ఆంజనేయుఁడు సంజీవికై హిమవత్పర్వతమున కేగెననియు, అందు నిశీథ సమయంబున స్వయం తేజో విరాజితంబులగు సంజీవకరణి, సంధానకరణి, విశల్యకరణి యనఁబడు లతలు తమ తమ కాంతులను మరగుపరచి అదృశ్యము లయ్యెననియు, అందువలన సామీరి కోపించి పర్వత శిఖరంబును పెకల్చి తెచ్చి మృతప్రాయుఁడగు లక్ష్మణుని ప్రాణంబుల గాపాడెననియు శ్రీమద్రామాయణమున యుద్ధకాండంబున వాల్మీకి మహామునిచే వర్ణింపబడియున్నది.

అనారోగ్యమునకు మూలకారణములు ఆహార విహారాదుల నియమము పాటింపకుండుట, రాత్రులు మేలుకొనుట, మలమూత్రముల వేగం అడ్డుట మొదలగునవి. అనారోగ్య శరీరంబున ♦జీవాణువుల

♦ లవణములనుగూర్చి. * విటమినులనుగూర్చి ముందు వ్రాయబడియున్నది.
♦ జీవాణువులగూర్చి ముందు వ్రాయబడియున్నది.



శక్తి తగ్గిపోవును. అందువలన అనేక రోగములు పుట్టుచున్నవి. జీవాణువుల శక్తిని శరీరమునందున పూర్తిపరచు విధానమే "చికిత్స" అని చెప్పవచ్చు. ఒకానొక జ్వరితుని లంఘనము వుంచుచున్నాము గదా! ఎందుచేత? వాని జఠరాగ్ని మందగించినది. అగ్ని స్వస్థానము వీడి శరీరమంతట వ్యాపించినది. అన్నము పచనముకాలేదు. అన్నము పచనంబై అగ్ని స్వస్థానమును చేరి జఠరాగ్ని వృద్ధినొందినగాని పథ్యము ఇచ్చుటకు వీలులేదు. అందుచేత గుమాచ్యాది కషాయముగాని మరి యేయితర కషాయములుగాని అనుపానములుగ నిచ్చుచున్నారు.

ఆహారము షడ్రసయుక్తంబులగు భక్ష్య, భోజ్య, చోష్య, లేహ్య పానీయంబులని అయిదు విధంబులుగ నున్నది. ఆహారము భుజించిన వెంటనే దేహంబునకు బలంబు, వీర్యంబు, తేజంబు గలుగుచున్నది. ఆహారం రెండు విధంబులు. 1. సాత్వికాహారం. 2. తామసాహారము సాత్వికాహారము మధురరస ప్రధానమైనది. తామసాహారం రూక్షగుణ ప్రధానమైనది. సాత్వికాహారము పక్వాహారమనియు, అపక్వాహారమనియు రెండు విధములు. పక్వాహారంబుకంటె అపక్వాహారమే ఉత్తమమైనది. అపక్వాహారమువలన ఆరోగ్యమెన్నఁడు చెడదు. అందలి విటమినులు నశించవు. పశుపక్ష్యాదులు అపక్వాహారము లగుటచేతనే దృఢకాయంబులు గలవై యున్నవి.

మన ఋషులు వాయుపర్ణాంబు భక్షులై చిరకాలం తపం బొనర్చినట్లు పురాణంబులు దెలుపుచున్నవి. వాలఖిల్యాదులు సూర్యకిరణంబులనే ఆహారముగాగొని తపస్సు చేసినారు. సూర్యకిరణంబుల యందలి జీవాణు ప్రసారణ శక్తిని సమస్త చరాచరంబులు ధరించి సృష్టి, స్థితి, లయంబుల బొందుచున్నవి. చెట్లు ఎండబడి నడచి వచ్చిన పాంథునకు తమ చల్లని నీడనిచ్చి పద పరిశ్రమనుండి కాపాడి సూర్యాతపమును దాము భరించుచున్నవి. మరియు తమ స్వాదు ఫలదానంబున క్షుత్పిపాసల నడంచి బల వీర్యాదుల నొసంగుచున్నవి. పరోపకార గుణంబన నిట్టిదియే కదా?

వృక్షములు :—మహావృక్షములు, క్షుద్రవృక్షములు అని చెట్లు రెండు తెగలుగ నున్నవి. చిరకాలము జీవించు మఱ్ఱి, మామిడి మొదలగునవి మహావృక్షము. కొలది వత్సరములు మాత్రమే జీవించు అవిసె మొదలగునవి క్షుద్రవృక్షములు. గుల్మములు అనగా పొదలు, మొక్కలు, తీగలు ఇవి ఉద్భిజములని చెప్పబడును. వీని యన్నిటి యందును మనుజులకు కావలసిన బలవర్ధక శక్తులు, వ్యాధిహారణశక్తులు కలవు కనుకనే ఆయుర్వేదమున వివిధ ఓషధీ సంయోగముచే ననేక విధములగు ఔషధ నిర్మాణ యోగములు వ్రాయబడియున్నవి ఈ మూలికలయందు కొన్ని ప్రాణరక్షణములు, కొన్ని ప్రాణహరణములు. ప్రాణరక్షణములు పెన్నేరు, నేలతాడి, నేలగుమ్మడి మొదలగునవి బుద్ధి, వృద్ధి కలుగజేయును ప్రాణహరణములు వత్సనాభి, చన్న చర్లగడ్డ, పచ్చగన్నేరు మొదలగునవి.

పరమేశ్వరుడు సర్వభూత దయామయుడు. ఆయన మనల నిరామయులుగను, ఆయురారోగ్య సంపన్నులుగను సృజించినాడు. ఆరోగ్యము అందరికి సమానమైన హక్కుగ నున్నది అయితే రోగములు వచ్చుటకు కారణమేమి? చపలబుద్ధియే రోగము లుత్పన్నమగుటకు కారణము. అనగా ఆహార నియమము పాటింపక జిహ్వకు రుచిగా నున్నదని ప్రమాణమునుమించి భుజించుట. అందువలననే మనవారు— "హితవుగనున్నది, మితముగ భుజింపు" మని చెప్పెదరు. మితిమీరి భుజించిన పదార్థములు జీర్ణశక్తి లోపముచే సరిగా జీర్ణమునకురాక కొందరకు విరేచనములుగను, వాంతులుగను బహిర్గతమగుచున్నవి. ఇరువది కుంచముల ధాన్యము బరువు మోయువానికి మరి పదికుంచముల బరువెట్లు సహింప శక్యముకాదో అట్లే అంతరింద్రియములు కూడ విశేష పదార్థ జీర్ణశక్తిని పొందజాలవు.

ఆరోగ్యము చెడుటకు ముఖ్యముగా మరబియ్యము కారణము. ఇందు జీవపోషక పదార్థములు పోవుచున్నవి. 'బి' విటమినులు బియ్యపు



గింజల నంటియుండు సన్నని పొర నాశ్రయించి యుండును. అది పూర్తిగా పోవుటచే గింజయొక్క సారం నశించిపోవుచున్నది. తరువాత గంజిలో కొంత పోవుచున్నది. ఇక మిగిలినది పిప్పిమాత్రమే. ఆ అన్నం తినిన బలము ఎట్లు చేకూరును? పోనీ, చెబియ్యము వండుకొని తినుద మన్న కంటికి హితవుగా నుండదు. "కంటికి ఇంపుగానిది కడుపున కింపుగాద" ను సామెత కలదు. కావున దంపుడు బియ్యము వాడు కొనుట మంచిది. మన పూర్వులు "మరబియ్యము" అను మాటయైన నెరుంగని కాలమువా రగుటచే సహస్ర మాస జీవులుగను, అంత కెక్కువ శత వర్షాధిక జీవులుగ నున్నారు. ఇప్పుడన్నచో 'శతా మష్టిః' అన్న వాక్యము యదార్థ మగుచున్నది. అల్యూమినము పాత్రలతో వంటలు ఇవి అనారోగ్యకరమైనందున వీటిని వర్జించుట ముఖ్యము. ఇందు ఉప్పుగాని, పులుపు పదార్థములుగాని చేర్చిన చిల్లులు పడిపోవుట మనము చూచుచున్నాము. ఇందలి మలిన పదార్థమునే మనం ఆహారముగ నుపయోగించుచున్నాము అందువల్ల జీర్ణశక్తి నశించుచున్నది. ఈ పాత్రలే యిప్పుడు విరివిగా వాడబడుచున్నవి.

నిద్ర :—సకాలమందు నిద్రింపకపోవుట. అనగా వినోదములచేతను అనగా సినిమాలు చూచుటచేతను కండ్లకు ఎలక్ట్రిక్కు పవరు కలిగి కండ్లు దృష్టిహీనమగుచున్నవి. రాత్రులు నిద్రమాని పగలు నిద్రించుట. ఇవి అనారోగ్య హేతువు లగుటచేత పెక్కు వ్యాధు లుత్పన్నమయి జనుల పీడించుచున్నవి. ఈ వ్యాధులు హరించుటకు చక్కని మందు లవసరము. మందులు తయారు చేయుటకు గుణాంతములగు ఓషధులు ముఖ్యము, కావున ఏ యే రోగములయందు ఏ యే ఓషధులు ఉపయోగించునో ఈ క్రింద తెలుపబడుచున్నవి. వీని సంయోగముచే వ్యాధి నివారక ఔషధములు యుక్తియుక్తముగా తయారు చేసికొనుటకు వీలగును.

" పూర్వ జన్మ కృతం పాపం వ్యాధి రూపేణ బాధతే
తచ్ఛాంతి రౌషధై ర్దానై ర్జప హోమార్చనాదిభిః "

అని కలదు. పూర్వజన్మ కృతమగు పాపమే వ్యాధిగా జనించి బాధించును. అందులకు శాంతిగా ఔషధములు, దానములు, జపములు హోమములు, దేవతా అర్చనలు మొదలగునవి కావించవలెను.

ఈ క్రింద కొన్ని ప్రసిద్ధ వర్గములు సూచించబడినవి. వీనిని చదివి వైద్యులు చికిత్స చేయుటలో లాభమును పొందెదరు. వీనిని కలిసిగాని విడివిడిగా గాని చూర్ణ కషాయ రూపమున ప్రయోగింపనగును. వస్తువుల విడివిడి వర్ణన ఆ యా శీర్షికల క్రింద చూడనగును.

1. అగ్నివర్ధకములు (Stomachies & Carminatives) :—పిప్పళ్ళు, మిరియాలు, సొంఠి, చిత్రమూలము, దాల్చిని చెక్క, లవంగములు, ఏలకులు, తాళిస పత్రి, ధనియాలు, కర్పూరము, క్షారములు, లవణములు, నవాసారము, ఇంగువ, వస మొదలగు చేదు పదార్థములు, అతివిష పెన్నేరు మొదలగు పిత్తపదార్థములు, మామిడి, దానిమ్మ మొదలగు పులుపు పదార్థములు. ఈ ద్రవ్యములు ఆమాశయమునను, ప్రేగులకు శక్తినిచ్చును. పైత్యమును పచనముచేయు రసములకు పుష్టినిచ్చును. ఇంగువ మొదలగు చేదు పదార్థములు అంత్రములయందలి వాయువును వెలికి ద్రోయును. లేక ద్రోయుటకు సాయపడును. మరియు వాతనాశనకరములని చెప్పబడుచున్నవి. అనాహాది రోగములయందు వాతమును బహిర్గతము చేయుటకు ఇంగువ మొదలగు ద్రవ్యములు లాభకారులై యున్నవి. వీనిని చూర్ణములుగను, కషాయములుగను, వటుకములుగనుచేసి వాడవచ్చును. వాడు విధానము ముందు గ్రంథమునందు సూచింపబడుచున్నవి.

2. అగ్నిసాధకములు :—ఘృతము, పాలు, బెల్లము, మిఠాయి, గోధుమాది మధుర ద్రవ్యములు, పిప్పల ద్రవ్యములు సుమద్రవ్యములు మొదలగు కషాయ ద్రవ్యములు.



3. అతిసారమును హరించునవి లేక గ్రహింపదగినవి :—(Intestinal Astringents or Constipatives) నల్లమందు, అతివిష, నాగభస్మము, సింధూరము, వంగభస్మము, చంద్రశ, జమ్మి, కవిరి, మొదలగు వృక్షముల చెక్కలు, ఫలములు, చేవలు మొదలగునవి. కవిరి, మొదలగు వృక్షముల చెక్కలు, ఫలములు, చేవలు మొదలగునవి. పెద్ద వేగు జిగురులు, మోదుగ జిగురు, శొంఠి, క్షారములు, దానిమ్మ, బూరుగ పండ్లు, సున్నము, సింధుకము, దేవకాంచనము, బూరుగ, బూరుగ జిగురు, అరటి, నిమ్మ, ఉమ్మెత్త, పాక, చేదుపుచ్చ మొదలగు కటు పిత్త కషాయరసములుగల ద్రవ్యములు ప్రాయికముగా అతిసారమును హరించునవిగా నున్నవి. కటురసము, పిత్తరసముగల ద్రవ్యములు జఠరాగ్నిని వృద్ధిచేయునవి అగుటచే అతిసారమును నిరోధింపఁ గలుగుచున్నవి. కషాయ రసముగల ద్రవ్యములు గురుగుణము గలవిగ గ్రహించవలెను. ఇవి ప్రేగులయొక్క బాధను తగ్గించి శోథను అడంచును.

అరుచిని పోగొట్టునవి :—దానిమ్మ మొదలగు పుల్లని వస్తువులు, పంచలవణములు, మిరియములు మొదలగునవి కటురసముగలవి. పచ్చకర్పూరము మొదలగు (Aromatic) సుగంధ ద్రవ్యములు.

అర్శస్సును హరించునవి :—(Curer of piles) 1. రక్తార్శస్సును హరించునవి : కొడిశ, చేదుపుచ్చ, రసాంజనము, నల్లనువ్వులు, జీడి, సోపు, చిత్రమూలము మొదలగునవి లోనికి వాడునవి. జిల్లేడుపాలు మొదలగునవి పైకిపూయుటకు (Bleeding piles) 2. వాత కఫ అర్శను హరించుటకు (Blenal piles) : కంద, అడవి కంద, ఉత్తరేణి, తెగడ మొదలగు రేచన ద్రవ్యములు, జీడి, కరక్కాయ, సోపు, చిత్రమూలము, సేన్యము, సజ్జిగ మొదలగునవి లోనికి సేవించునవి. జిల్లేడుపాలు మొదలగునవి పైకి పూయుటకు.

అరోచకరోగమునకు (Amtilihic) —కొండపిండిచెట్టు, (పెలక పిండిచెట్టు) పల్లేరు, దూర్వాదితృణములు, గుమ్మడి, గలిజేరు, ఉలిమిడి

మొదలగునవి మూత్రమును జారీచేయునవి. అశ్మరీ రోగమునందు లాభకారులు.

ఆనాహరోగమునకు (Carminatives) :—ఇంగువ, లవణములు, శంఖభస్మము మొదలగునవి.

ఆమ పాచనమునకు (Digestive Stimulant) :—శొంఠి, తుంగముస్తలు, అతివిష, సర్పాటకము, మారేడు, చేనుపుచ్చ, వాము, జీలకఱ్ఱ, ధనియాలు మొదలగునవి.

అనువాతమును పోగొట్టునవి (Antishcaumatic) :—శొంఠి, ఆముదము, జిల్లేడు, ఉలవలు, తిప్పతీగె, పల్లేరు, గలిజేరు, ప్రసారిణి, దశమూలములు మొదలగునవి.

ఆస్యరోచకములు లేక లాలాజలమును పుట్టించునవి (Sialogogus) :—దానిమ్మ, చింత మొదలగు పులుపు వస్తువులు, ఉప్పులు, తుంబురులు, మంగ మొదలగు కాంతిచేయు ద్రవ్యములు, పాదరసము, సీసము మొదలగు ధాతువులు, విషము ఇవి లాలాజల గ్రంథులకు ఉత్తేజము గలిగించును.

ఆస్యశోషకములు లేక లాలాజల నిరోధకములు (Anti-Sialogogus) :—ఉమ్మెత్త, ముషిణి, నల్లమందు, క్షారములు, సోడా మొదలగునవి.

ఆక్షేపక నివారణములు (Anti-Spemodic) :—ఉమ్మెత్త, నల్లమందు, గంజాయి, కర్పూరము, ఇంగువ, జాజికాయ మొదలగునవి. ఇవి శ్వాస, కాస, శూల మొదలగు రోగములలో మాంసపేశీలకు అనుచితమైన వేగమును తగ్గించి యథాస్థితికి తెచ్చును.

ఉపదంశమునకు (Antisy philitic) :—రసకర్పూరం, గన్నేరు వేళ్ళు, స్వర్ణక్షీరి, సుగంధి, శంఖము మొదలగు రక్తశోధకద్రవ్యములు, ఫిరంగిచెక్క.



కండూహరములు దురదనుహరించునవి (Counter-irritant:-) కటుకరోహిణి, చంగల్వకోష్టు, గంధకము, వేపనూనె, మొదలగునవి. పైపూతకు స్వర్ణక్షీరి, కవిరి, నెయ్యి, వెన్న మొదలగునవి.

కర్ణరోగములకు :—తైలములు, బ్రాంది (Spirit) రసాంజనం, ఉమ్మెత్త స్వరసము, నల్లమందు, గులాబీ అత్తరువు, నిమ్మనూనె, సుదర్శనాది లేక పారిభద్రాది తైలములు, ఈ ద్రవ్యముల కషాయములుగాని, స్వరసములుగాని తైలములయందు పాచనముచేసిగాని, సారాయములలో కలిపిగాని కర్ణములలో పోయవలెను.

కఫఘ్నములు (శ్లేష్మం హరించునవి) :—త్రికటికములు మొదలగు కటిద్రవ్యములు, తిక్తద్రవ్యములు, కషాయద్రవ్యములు, కటికరోహిణి, చంపు మొదలగునవి.

కామలానాశకములు :—కటికరోహిణి, మ్రానుపసుపు, తిప్పతీగె, రేల, దంతి మొదలగు పిత్తహర ద్రవ్యములు.

కామమును వృద్ధిచేయునవి (Aphrodisiac) :—కస్తూరి, కర్పూరము, ముషిణి, మద్యము, గంజాయి, జాజికాయ, ఉమ్మెత్త, శంఖములు, పెన్నేరు జీవనీయ గణములు.

కామసాధకములు (Antiaphrodisiac) :—నల్లమందు, కోస్తు, తిప్పతీగె, వట్టివేళ్ళు మొదలైన తిక్తకషాయ ద్రవ్యములు.

కుష్ఠఘ్నములు (For skin diseases) :—చంద్ర, తుమ్మ, సుగంధి, కటికరోహిణి, పసుపు, నిమ్మ, సప్తపర్ణి, కాకమాచి, వాయువిడంగములు, చంగల్వకోష్టు, జీడి, గన్నేరు, జిల్లేడు మొదలగునవి.

క్రిమిఘ్నములు (Antisepthie Germicidal) :—పైకి పూయుటకు (Externally) మైలతుత్థము, రసకర్పూరము, క్షారములు, జిల్లేడు, నేడి, చేముడు, బ్రహ్మదండి, బలురక్కసి, జిల్లేడుపాలు, వెలిగారము, మద్యము, నిమ్మ, వేపనూనె, ఆవాలు, ఉమ్మెత్త, వాయువిడంగములు మొదలగునవి.

క్రిమిరోగనాశకములు (Antelmintic Vermifuge) :-వాయు విడంగములు, కంపిల్లకము, మోదుగవిత్తులు, కరంజీవాము, నిమ్మ, గంధకము, రసాంజనము మొదలగునవి.

కేశవర్ధకములు:—కొబ్బరినూనె, నువ్వులనూనె, విభీతక తైలం, గురువెందగింజలు, త్రిఫలములు.

కేశములను నలుపుచేయునవి (Hair blackner) :—గుంట కలగర, పేశరాజ్, విభీతక (తాడికాయ పెచ్చులు) తైలము, మామిడి టెంకలలోని పప్పు, త్రిఫలములు, లోహము, మాండూరము, మంకెన పుష్పములు, నీలిఆకు.

గండమాలను హరించునవి (For Glands) :—దేవకాంచనం, బోడసరము, లోహము, తిప్పతీగ, సుగంధి, గుగ్గిలము మొదలగునవి.

గర్భమును వృద్ధిపరచునవి :—లక్ష్మణపంజి, పద్మకాష్టము, బలా, శతావరి, నల్లకలువ, అశోకము, వటాంకురము.

గర్భస్రావమును చేయునవి (Abortifacient) :-జిల్లేడుపాలు, చెముడుపాలు, అరిష్ట, కుంకుడుకాయలు, జ్యోతిష్మతి, కరక్కాయ, ఏలకులు, సమస్త విరేచన ద్రవ్యములు మొదలగునవి.

గర్భమును కలుగకుండ జేయునవి :—గులివెంద, పార మొదలగునవి.

గర్భాశయమును శోధించునవి:-రజః ప్రవర్తకమును చూడుము.

గుల్మనాశకములు :—సర్వ అనాహఘ్న ద్రవ్యములు, అగ్ని విషకములు, రేచక ద్రవ్యములు.

జ్వరఘ్నములు (Febrifuge):—తిప్పతీగ, నాగదమణి, నేల వేము, కటికరోహిణి, నిమ్మ, సప్తాటకము మొదలైన పిత్తద్రవ్యములు, చందనము మొదలైన శీత ద్రవ్యములు. రేల మొదలైన రేచక ద్రవ్యములు, మిరియములు, తుంగముస్తలు స్వేదక ద్రవ్యములు.



జ్వరవేగమును నిరోధించునవి (Antiperiodic) :— గానుగ గింజలు, నాగదమనము, పటిక, శంఖపాషాణములు, తులసి, వావిలి చెక్క, చేదుపొట్ల ఆకులు మొదలగునవి, పైన చెప్పబడిన ద్రవ్యములు సాధారణముగా విషమ జ్వరములు (Malaria) కొరకు ఉపయోగింప బడును.

తాలుశోషను పోగొట్టినవి :—ఆల్ బకరా, ద్రాక్ష, ఏలకులు. ఖర్జూరాలు, ఉసిరిక మొదలగు ఆమ్లరసముగల ద్రవ్యములు లేక పిచ్ఛిల ద్రవ్యములు.

దంత్యములు (Useful for Teeth) :—త్రిఫలములు, తుంబురులు, అక్కలకర్ర, వకులము, పొగడ, జిల్లేడు, కానుగ, మిరియములు మొదలైనవి. తుమ్మ, కవిరి.

దంతశూలను హరించునవి (In Toothache) :—అక్కలకర్ర, ఇంగువ, జిల్లేడుపాలు, మామిడి పుడకలు, జాజి,

నిద్రానాశకములు (For Sleeplessness) :—గేదె పాలు, ఉపోధికాశాకము, వాతాది తైలము, ఆనబ తైలము.

నేత్రప్రసారములు :—చిల్లగింజలు, కర్పూరము, మహేంద్రీ మొదలైనవి.

నేత్రరోగములకు (For Eye-diseases) :-నల్లమందు, పటిక, రసాంజనము, కర్పూరము, ఉమ్మెత్త, లొద్దుగ, మయిలతుత్థము, జంగాలీపచ్చ, శంఖము, త్రిఫలములు మొదలైనవి.

నేత్రప్రసారమునకు :—సముద్రఫలము, సారయపీ.

పాండురోగమునకు (For Aneamia) :-కామలా రోగమును చూడుము. లోహభస్మము విశేషమైనది.

పైత్యరోగమునకు :-కామలయం దుపయోగించు ద్రవ్యములు, పిత్తశీతల ద్రవ్యములు విశేషంగా నుపయోగించును. తెగడ మొదలగు విరేచన ద్రవ్యములు.

ప్రతిశ్యాయమందు (Anti-cater catarhal):—త్రికటికములు, జయంతి వాకుడు, కర్కాటకశృంగి మొదలగు కాసహార ద్రవ్యములు.

ప్రదరహారములు :—నాగకేసరములు, తమలపాకులు, మజ్జి, లొద్దుగ, అశోకము, బూరుగ పువ్వులు, దేవకాంచనము, బూరుగ జిగురు, త్రిఫలములు, అరటి.

ప్రమేహ హారములు (In Urinary diseases :—త్రిఫలములు, మ్రానుపసుపు, మద్ది, పల్లేరు, శతావరి, మామిడిచెక్క, వంగము, ప్రవాళము మొదలగునవి.

ప్లీహారోగమునకు (For Enlarged spleen) :—లోహము, కలబంద, నేలవేము, చేదుపుచ్చ, జిల్లేడు, శరపుంఖ, హాపుసాములు మోదుగ.

మధుమేహమునకు (For Diabetes Milletus) :—దొండ. పసుపు. మామిడిటెంకలజీడి, నేరేడుపండ్ల గింజలు, శిలాజిత్తు, వంగము, ప్రవాళము, కుంకుమపూవు, త్రిఫలములు, యవలు, క్షుద్రధాన్యములు, శనగలు మొదలగునవి.

మూత్రకృచ్ఛ్రము (For Dysuria) :—మూత్రమును విప్పు ద్రవ్యములు.

మూత్రమును జారీచేయునవి (Diuretic) :—పల్లేరు, గలిజేరు, కుశ, కాశ, రెల్లు, దర్భ మొదలైన పంచ తృణ మూలములు, శిలాజిత్తు, చెరుకు, పంచదార, ఏలకులు, గుమ్మడి, చందనము, కొబ్బరి కాయలోని నీరు, ఎడనీరు, దూలగొండి, ఉసిరిక మొదలైనవి.

మేధ్య (Nervine Tonic):—సువర్ణము, రజతము, బ్రాహ్మీ, మండూకపల్లి, శంఖపుష్పి, బాదము, వస మొదలైనవి.

రక్తపిత్తమును పోగొట్టినవి :—చందనము, ఉసిరిక, పంచదార, చెరకు, పొట్ల, పర్పాటకము, నిమ్మ, నల్లకలువ, పద్మకాష్టము, మజ్జి, బలాచతుష్టయము, కాచురు బుడమ, కొడిశ, నేలవేము.



రక్తస్తంభనము చేయునవి (Styptis) :—పంచవల్కలములు, సీసము, రసాంజనము, చందనము మొదలైన రక్తపైత్యమును హరించు ద్రవ్యములు.

రసాయనములు (Generl Tonic) :—కరక్కాయ, అష్టవర్గ ద్రవ్యములు, శిలాజిత్తు, స్వర్ణాదిధాతువులు, గుడూచి, శతావరి, నేల గుమ్మడి. మొదలగు మధుర వర్గములు.

రేచకములు—విరేచనము చేయునవి (Turgatives) :—చేదు పుచ్చ, నేపాళము, తెగడ, రేల, ఆముదము, కటుకరోహిణి, దంతివేరు, చెముడు, జిల్లేడు, సునాముఖి, కంకుష్టము, కరక్కాయ, పిక్కాయఆకు మొదలగునవి. ఇవి స్వల్పముగా వాడిన మృదురేచనము చేయును.

వాంతి కలిగించునవి (Emtcic) :—మదనము (మంగ) మైల తుత్తము, ఉప్పు. కొడిశ. వేప, ఆవాలు, చెరకు. మధుయష్టి, చేదు పొట్ల చేదు ఆనప, చేదు బీర, నేపాళము మొదలగునవి.

వాజీకరణములు (Aphro-disiac) :—కామోత్తేజకములు చూడుము.

విషహారములు (For Poisons) :—వాంతి ద్రవ్యములు, రేచన ద్రవ్యములు.

మూలికలకు ప్రతివిషములు ప్రయోగించినది :—యవలు, శిరీషము. నల్లమందు, ముషిణి, గలిజేరు మొదలగునవి.

వీర్యమును స్తంభించునవి :—శతావరి, నేలతాడి, కోకిలాక్షి, నేలగుమ్మడి, బలాబీజములు, పెన్నేరు, అష్టవర్గ ద్రవ్యములు, బూరుగ వేరు మొదలగునవి.

నొప్పులను హరించునవి (Aneasthetic):—నల్లమందు, ఉమ్మెత్త, కురంజీవాము, గుగ్గిలము, కర్పూరము, వాము, ఆముదము, తెగడ, మొదలగు రేచన ద్రవ్యములు.

శోభను హరించునవి :—గలిజేరు, కాకమాచి. అపరాజిత, (విష్ణుక్రాంత,) గుగ్గులం, దశమూలములు, ఆముదపువేళ్ళు.

శ్వాసకాసహారములు (Asthina and Bronchitis) :-త్రికటికములు, తాళీసపత్రి, చంగల్వకోష్టు, పుష్కరమూలము, కర్కాటకశృంగి, గంటిభారంగి, వాకుడు. తాడికాయ, యష్టిమధుకము. శ్లేష్మాతకము (విరిగి) ద్రాక్ష, గోజుమాన్.

శిరోరోగమునకు :-మారేడు, జిల్లేడాకులు, కరవీరం (నశ్యార్థం), ముషిణి, నల్లమందు. ఉమ్మెత్త. గంజాయి. ముచికుందము

స్తన్యశోధకములు :—నింబ, కటుకరోహిణి. తిప్పతీగె. పాఠ, రసాంజనము, సుగంధి మొదలగు తిక్త రక్త శోధక ద్రవ్యములు.

స్తన్యవర్ధకములు (Galactogogue) :-ప్రత్తిగింజలు లేక తైలం, మినుములు, పెన్నేరు, నేలగుమ్ముడు, శాలిపర్ణి, పృష్నిపర్ణి, మద్యము మొదలగునవి.

స్వేదమును కలిగించునవి (Diapharetic) :—తుంగముస్తెలు, నల్లమందు, మిరియాలు, తులసి, వత్సనాభి, వెలిగారము, హింగుళము మొదలైనవి.

స్వేదహారములు (Anti Diaphoritic) :—ముషిణి, తిప్పతీగె, దానిమ్మ మొదలగు పులుపు వస్తువులు.

హృదయమునకు బలము నిచ్చునవి (Lardiac or Heart Tonics):—మద్ది, గోజుమాన్, ఉసిరిక, కరవీరముపేళ్ళు మొదలైనవి, సువర్ణము.

వెక్కిళ్ళు (For Hicough) :—శ్వాసకాస హారములు చూడుము.

రజశ్శోధకములు (Emmenagague) :—నల్లజీలకఱ్ఱ, ప్రత్తివేళ్ళచెక్క, కరక హింగు మొదలగునవి.



రజఃప్రసారకములు :—అశోకము మొదలైనవి ప్రదరహరవర్గములు.

ఇంకను అనేక వర్గములు చెప్పబడియున్నవి. అవి అన్నియు ఆ యా సంహితలయందు చూడనగును. (పై దేవ నిఘంటులో గల భాగ మిచ్చట చేర్చితిమి.)

పైని చెప్పబడిన ద్రవ్యములు శరీరమునందలి ఏ ఏ యంగముల యందు పనిచేయునో తెలుపఁబడియున్నది. ఉదాహరణ :—రక్తశోధకములు రక్తమునందును, కేశవర్ధకములు కపాలమునందును, హృద్యద్రవ్యములు హృదయమునందును పనిచేయును. మరియు మూత్ర సంబంధమైన ద్రవ్యములు వృక్క, మూత్రాశయాది మూత్ర యంత్రములపై పనిచేయును. ఈ విషయంలో చరకము, సుశ్రుతము మొదలగు చికిత్సా గ్రంథములయందు కనబడుచున్నవి. దేశ కాల పాత్రములను, రోగ బలాబలములను గుర్తెఱిగి ఓషధుల గుణవీర్య విపాకాదులను తెలిసికొని వైద్యము చేయవలెను.

యుక్తి :—యుక్తి అనగా ద్రవ్యముల నెట్లు రోగములయందు ఉపయోగించవలెనో ఆ జ్ఞానము 'యుక్తి' అందురు.

శ్లో. మాత్రా కాలాశ్రయా యుక్తిః సిద్ధిర్యుక్తౌ ప్రతిష్ఠితా
తిష్ఠత్యుపరి యుక్తిజ్ఞో ద్రవ్యజ్ఞానవతాం సదా.

యుక్తి మాత్రకాలములయందు ఆశ్రయించియున్నది. వైద్యుని జ్ఞానవిశేషము యుక్తియందు నిలచియున్నది. యుక్తిని తెలిసిన వైద్యుఁడు ఉత్తమమైన వైద్యుఁడుగ పరిగణింపబడుచున్నాడు. ఒక కవీశ్వరుఁడు— "బండ్లరాయుడి వెజ్జు పటిమ దెల్పు" అని వర్ణించియున్నాడు.

బుద్ధిమంతుఁడగు వైద్యుఁడు కొద్ది ద్రవ్య ప్రయోగముననే అనేక రోగములను కుదర్పఁగలుగుచున్నాడు. ద్రవ్యములును చిన్నచిన్న రూపములుగ వ్యవహరింప బడుచున్నవి. 1 చూర్ణములు, 2 కషాయములు, 3 ఫాంటములు, 4 అసనారిష్టములు, 5 లేహ్యములు, (మోదక

ములు), 6 కల్కములు, 7 స్వరసములు, 8 లేపములు (పట్టీలు), 9 తైలములు, 10 ఘృతములు, 11 క్షారములు, 12 నస్యములు, 13 ధూమాదులు (పొగలు పీల్పించుట మొదలగునవి) ఇవి సాధారణముగా ముఖము మార్గముననే శరీరమునందు ప్రవేశపెట్టబడుచున్నవి. కాని కొన్ని కొన్ని రోగములలో గుదము, యోని, శిశ్న, కర్ణ, నేత్ర, నాసా, శరీర మార్గములకూడ ప్రవేశపెట్టబడుచున్నవి. ఇప్పుడు అల్లోపతి సిద్ధాంతానుసారము సూచీముఖమున శరీరమందు ఔషధప్రయోగము చేయబడుచున్నది. దీనికే "ఇంజక్షను" అని పేరు.

మాత్రా ప్రమాణము :-ద్రవ్య విజ్ఞానము ననుసరించి మాత్రా నిర్ణయము చేయవలెను. రోగియొక్క దేహబల, రోగబల, జఠరాగ్ని బల, ఋతుబల, వయస్సు, ద్రవ్యముల ననుసరించి మాత్రా ప్రమాణం నిర్ణయించవలెను.

శ్లో. మాత్రాయానా స్త్వవస్థానం దోష మగ్నిం బలం వయః
వ్యాధి ద్రవ్యం చ కోష్ఠశ్చ వీక్ష్య మాత్రం ప్రయోజయేత్.

ఇందులోనే వైద్యుని తెలివితేటలు బయల్పడగలవు. మేధావంతుఁడగు వైద్యుఁడు తన ప్రతిభావిశేషముచే ఒక చిన్న ఔషధముచే పెక్కురోగముల కుదర్చగలుగుచున్నాఁడు. విశేషించి అనుపానముల భేదము చేయగలుగుచున్నాఁడు. ప్రస్తుతము ఆయుర్వేదమునందు అంతగా ఆదరాభిమానములు లేకుండుటచే డాక్టరుల ఇంగ్లీషుమందులు, ఇంజక్షనులు ప్రజలకు ప్రీతిపాత్రము లగుచున్నవి. తాత్కాలికోపశమనమునకే ఇంజక్షనులు అర్హములుగాని శాశ్వతముగా గుణమును నిలబెట్టునవి ఆయుర్వేద ఔషధములే.

ఒక్కొక్క మూలిక ఎంత ప్రభావము కలదో చూడుడు. ఒక స్త్రీ ప్రసవాయాసము పొందుచున్నప్పుడు ఉత్తరేణివేరు నడుమునకు గట్టిన వెంటనే సుఖప్రసవమగును. ఊడుగకొనలు, మూడుగలపలవ తెచ్చి కొనలు క్రిందకుండునట్లు పొట్లముకట్టి కొప్పులో నుంచినచో



వెంటనే సుఖప్రసవమగును. ప్రసవమైనవెంటనే తీసివేయవలెను. మూలికల ప్రభావము అనిర్వచనీయము. గాయపు దెబ్బకు రక్తము కారకుండ తాటిపువ్వారము పనిచేయుట అందరెఱిగిన విషయమేకదా !

రసములు ఆరు :—పులుపు, చేదు, వగరు, ఉప్పు, తీపి, కారం. ఒక్కొక్క మూలికయందు ఒక్కొక్క రసము ఇమిడియున్నది. కొన్నిటియందు రెండు మూడు రసములు మిళితమగుట ద్యోతకమగుచున్నది. మామిడివేరు వగరు. చెక్క వగరు, పువ్వు వగరు, పిందె వగరు, కొంచెము ముదిరిన పిందె పులుపు, పండు తీపి. వేపవేరు చేదు, చెక్క చేదు, పువ్వు చేదు, పండు తీపి, గింజ చేదు. కరక్కాయ వగరు, తీపు, చేదు, పులుపు, కారము ఈ రసము లన్నియు గలిగి యుండును. ప్రకృతి సిద్ధముగా మూలికలు ఆరోగ్యకరమగు సత్వమును పొందియున్నవి. ఆ సత్వములలోనే విటమినులు ఇమిడియున్నవి. వీనిని గూర్చి ముందు గ్రంథమున చూడనగును.

ఈ గ్రంథ రచనకు కొన్ని నిఘంటువులు సహాయపడినవి. నాకుగల అల్పమేధతో నిట్టి యుద్గ్రంథ రచన చేయుట హాస్యాస్పదము. శ్రీ పరమేశ్వరుని కరుణాకటాక్షముచే నెట్టులో వ్రాసి ముగించితిని. పండిత హంసలు క్షీర నీర విభాగంబున హంసలు క్షీరంబుల నెట్లు గ్రహించునో అట్లే ఇందలి తప్పుల వదలి ఒప్పులనే స్వీకరింతురని ప్రార్థించుచున్నాను.

బహుగ్రంథ పరిశోధనా ఫలితమగు నీ గ్రంథమును మహారాజశ్రీ కాళహస్తి తమ్మారావు అండ్ సన్సు వారు అపేక్షించి ప్రకటించినందుకు వారికి శ్రీ పరమేశ్వరుఁడు నిత్యము ఆయురారోగ్య ఐశ్వర్య లాభాభివృద్ధుల నొసంగి కాపాడుగాక ! అని నా యాశీస్సు.

రాజమండ్రి
శీతంపేట

ఇట్లు బుధజనవిధేయుఁడు,
చెరుకుపల్లి వెంకట్రామశాస్త్రి.

# మా వంశ చరిత్రము

నేను పీఠికాపుర వాస్తవ్యుడను.
ఇంటి పేరు చెఱుకుపల్లి వారు.

గోత్రం శౌనకస గోత్రము. ప్రపితామహుఁడు వెంకన్న అవధాని. వేదాధ్యయన సంపన్నుఁడు. అప్రతిగ్రహీత. పితామహుఁడు రామశాస్త్రి. తండ్రి కృష్ణయార్యుఁడు. కవీశ్వరుఁడు. పీఠికాపుర వాస్తవ్యులగు దేవులపల్లి సర్వావధానులుగారి కుమార్తె సోమమాంబను పరిణయంబై ఆమెయందు 1 వెంకట్రామశాస్త్రి, 2 రాజేశ్వరరావు అను ఇరువురు తనయులను, నలువురు తనయలను గాంచెను. ఆ పూజ్యదంపతుల సంతానములో జ్యేష్ఠుఁడనగు నాకు జ్యేష్ఠమాతులుఁడగు లింగావధానులుగారి కుమార్తెయగు చి॥ సౌ॥ హనుమాయితో వివాహము జరిగినది. చిన్నతనములో అమర నిఘంటువు తండ్రిగారియొద్ద జదివితిని. ఆంధ్రమందు అభినివేశము గలదు. పీలాపురంబున గొంతకాలము తెలుగు పండితుఁడుగ నుంటిని. అప్పట్లో నా ద్వితీయ భావుకుఁడగు బ్రహ్మశ్రీ కొత్తపల్లి సుందరరామ కవీశ్వరునియొద్ద చందశ్శాస్త్రం నేర్చి రూపకముల గొన్నింటిని రచించితిని. అవి అప్పటప్పట అచ్చు వేయబడి ప్రకటింపబడినవి. కొన్ని వైద్యగ్రంథములుకూడ రచించితిని. వానిని మహారాజశ్రీ కాళహస్తి తమ్మారావు అండ్ సన్సువారు ప్రకటింపనైయున్నారు. నాకు వైద్యశాస్త్ర పరిచయములో మొదట ఉపదేశికులు పిరాట్ల వెంకట సూర్యనారాయణగారు. తరువాతవారు బొమ్మకంటి వెంకట సుబ్బారాయుడు, పాలపాటి కొండ్రాజుగార్లు. వంశపరంపరకాకున్నను నాకు 30 సంవత్సరములనుండి వైద్యానుభవము గలదు. హిందీలో రాష్ట్రభాష ప్యాసైతిని. ఆ సుగుణరాశియగు హనుమాయితో సంసార సుఖము అనుభవించుచు 1 భైరవశాస్త్రి,



2 కుక్కుటలింగమూర్తి, 3 వెంకటేశ్వర్లు అను ముగ్గురు తనయులను, ఐదుగురు కూతుండ్రను గాంచితిని. 1 భైరవశాస్త్రి సాంగోపాంగముగ వేదమును, వ్యాకరణ శాస్త్రమును అధ్యయన మొనర్చినాడు. ద్రాక్షారామ కాపురస్థులగు ఇంద్రకంటి వీరావధానులుగారి కుమార్తె చి॥ సౌ॥ రామలక్ష్మి నిచ్చి పాణిగ్రహణ మొనర్చితిని. ఆ జంటకు వెంకట సత్య సుబ్రహ్మణ్య కృష్ణశాస్త్రి అను తనూభవు డుద్భవించి బాలకుఁడై చిరంజీవియై మాకు కన్నులపండువై యున్నాడు. 2 కుక్కుటలింగమూర్తికి రామచంద్రపుర కాపురస్థులు గరిగిపాటి సుబ్బారాయుడుగారి కుమార్తె చి॥ సౌ॥ వెంకటరమణను ఇచ్చి వివాహం జరిగించితిని. ఆ చిన్ని దంపతులు చిలుక గోరింకలవలె నానంద సాగరంబున నోలలాడుచున్నారు. పెద్దకుమార్తె లిరువురు మనుమలనెత్తి సుఖంబున నున్నవారు. నా తమ్ముఁడగు రాజేశ్వరరావు ముగ్గురు కొమరులు ముగ్గురు కూతుండ్రతోఁగూడి సుఖియై యున్నవాఁడు. ఇది మా వంశ చరిత్రము.

రాజమండ్రి
1950

ఇట్లు,
రచయిత.

# విటమినుల ప్రశంస

## VITAMINS

విటమినులు అనగా దేహమందు జవమును, ఆరోగ్యమును ప్రసాదించు సూక్ష్మ ద్రవ్యములు. ఇవి ప్రకృతిసిద్ధముగా ఆహార పదార్థము లన్నిటి యందు వున్నవి. ఈ పదార్థములను ఎక్కువగా నుడికించినను, చాల రోజులు నిలువ యుంచినను ఈ సూక్ష్మద్రవ్యములు నశించిపోవుచున్నవి. ఇంతవరకు శాస్త్రములు పరిశోధనలుజరిపి A-B-C-D-E-F-G-H-K-L అనెడు 10 రకముల జీవద్రవ్యములను కనిపెట్టినారు. ఒక్కొక్క ఆహార పదార్థములలో ఒక్కొక్క జీవద్రవ్యము అధికముగా కనిపించును. ఈ జీవద్రవ్యములను అధికముగా తినిన ప్రమాదములేదు. గాని, ఈ ద్రవ్యము లోపించినప్పుడు కొన్ని బాధలు కలుగుచున్నవి. గనుక ఈ బాధలు పుట్టిన రోగులను ఆ యా విటమిన్ ద్రవ్యము కలిగిన ఆహారములను తినిపించినప్పుడు మందు అవసరము లేకుండగనే బాధలు నయమగుచున్నవి. ఈ విషయములను పరిశోధనల మూలముగా బుజావు చేసినారు. కనుక ఈ సూక్ష్మ ద్రవ్యములు ఏ ఏ పదార్థములలో నున్నవో, అవి లోపించినప్పుడు కలిగిన బాధ లెవ్వియో తెలిసికొని వాటికే చికిత్స ఉపయోగించవలెను.

A. Vitamin :—ఇది పసిపిల్లలకు చనుబాలలో విశేషముగా లభించును. పెద్దవారికి కోడిగ్రుడ్డు సొనలోను, ఆకుకూరలలోను, పాల లోను, గుమ్మపాలలోను విశేషముగా లభించును. Codliver oil, Shark liver Halibet అనే చేపల చమురులలో విటమిన్ ఎ. ద్రవ్యం విశేషముగా దొరకునని కనిపెట్టినారు. ఎ. విటమిన్ లోపించినవారికి రేచీకటి, పొయ్యగండలు మొదలైన నేత్రరోగములు కలుగుచున్నవి.



ఇంకను Phelig a అనెడి అజీర్తి, అతిసారరోగమున్ను, చర్మవ్యాధు లున్ను పుట్టుచున్నవి. గనుక రోగులకు పైనిచెప్పిన ఆహారపదార్థములు ఎక్కువగా తినిపించవలెను ఎ. విటమిన్ లోపించిన రోగులకు రోగ నిగ్రహశక్తి తగ్గిపోవును. కనుక Typhaid మొదలగా తీవ్ర దీర్ఘ వ్యాధులలో వాని శక్తిని వృద్ధిచేయుటకు ఎ. విటమిన్ కలిసిన అవు పాను ఇంజక్షన్ (Injuction) చేయుచుందురు. చనుపాలు త్రాగించు చుందురు.

B. Vitamin :—ఈ సూక్ష్మ ద్రవ్యము బియ్యపు గింజను చుట్టియున్న సన్నని పొరలోను, ఇంకను గింజలు మొలకలెత్తు సమయములో ఆ గింజలలో ఆ బి. విటమిన్ వృద్ధియగుచున్నది. మరియు కల్లుమడ్డిలోను, పులిసిన గంజి, తరవాణి, పులిసిన మజ్జిగయందు బి. విటమిన్ వృద్ధియగుచున్నది మరబియ్యము తినువారికి ఈ ద్రవ్యము ముఖ్యముగా లోపించుచున్నది. ఈ లోపము ఇతర విధముగా భర్తీ కానియెడల వారికి Beri-Beri (నంజు వ్యాధి) పుట్టును. ఈ వ్యాధిలో ముఖ్య లక్షణములు :-తిమ్మిరలు, మునుకులు, నీరసము మొదలగునవి. బెరి బెరి వ్యాధి 3 రకములుగా కనిపించుచున్నది.

1. Peralylic form :—అనగా ఏకాంగవాతము. సంధ్యా వాతముతో కూడుకొన్నది. కాళ్ళు చేతులు చచ్చువాతముపొంది ఎండిపోవును.

2. Orapz eal Form :—ఒళ్ళు అంతయు నిగనిగలాడుచు గట్టిగా కమురుకట్టి కండలు నొక్కినప్పుడు నొప్పిగా నుండును. చర్మంపైన సొట్టలు పడవు. తిమ్మిరి, మునుకు, ఆయాసము వుండును. కొంచెం రక్తము క్షీణించును. (Anemia.)

2. Cordiac form Bari-Bari :—రోగిని చూచుటకు మామూలుగానున్నను ఏ మాత్రము పనిచేసినను అలసట, గుండె బరువు, గుండె దడ కన్పించును. ఈ రోగులకు చేబియ్యము అన్నము గాని, లేక లెవుడు దొడ్డుగాని తినిపించవలెను. కల్లుమడ్డిని Yeast అందురు. ఈ పొడను రోజు ఒక్కొంటికి 2 తులములు తినిపించవలెను. Yeast white tablets కూడా అమ్ముదురు. బియ్యపు తవుడును ఆయుర్వేద ఔషధములు తయారుచేయుటకు అనేక యోగములలో ఈ తవుడు నుపయోగించుచున్నారు. ఈ రోగులచేత కోడిగ్రుడ్డుసొన, గుమ్మపాలు త్రాగించవచ్చును. పెసలు, శనగలను నానవేసి మొలకలెత్తిన తర్వాత తినిపించుటవల్ల చాల మేలు కలుగును. వాత ప్రకోపమువల్ల చురుకులు, పిత్తాధిక్యము వలన మంటలు, కఫాధిక్యము వలన తిమ్మెరలు కలుగును. ఇంకను Beri-Beri రోగమునకు బి. విటమిన్ ఎక్కువగాగల ద్రవ్యములు, ఇంజక్షనుగూడ చేయవలసి యున్నది. ఒక్కొక్క కంపెనీవారు ఒక్కొక్క పేరు పెట్టుకొన్నారు. Example :—Benerva, Betamin, Vybesc మొదలైనవి. బి. విటమిన్‌లలో రెండు రకము లున్నవి. 1 నరములకు బలమున్ను, 2. జీర్ణశక్తిని వృద్ధిచేసి మలబద్ధమును తొలగించునవియై యున్నవి.

3. C. Vitamin :—ఈ సూక్ష్మ ద్రవ్యము లోపించుటవల్ల రక్తపిత్తము ఏర్పడుచున్నది. ఈ వ్యాధిని ఇంగ్లీషులో Scurvy (సీతారం) అని పిలుతురు. వివిధ రంధ్రములద్వారా రక్తస్రావము తరుచుగా జరుగుచున్నది. సి. విటమిను ద్రవ్యములు ఆకుకూరలలోను, టమాటా రసములోను, ఉసిరిక, పచ్చిద్రాక్ష, దానిమ్మ, నిమ్మ, దబ్బ, నారింజ రసములలోను ఎక్కువగా నున్నది. పసిపిల్లలకు యకృత్ ప్లీహావృద్ధి సి. విటమిన్ లోపంవల్ల కలుగుచున్నదని పండితులు చెప్పుచున్నారు. సి. విటమినులు చనుబాలలో పుష్కలముగా నున్నవి



గనుక పైని చెప్పిన రోగులకు పండ్లరసములు, ఆకుకూరలు ఎక్కువగా నీయవలెను. సి. విటమిన్ ఇంజక్షన్ కూడా దొరకుచున్నది.

4. D. Vitamin :—ఈ ద్రవ్య సహాయమున ఆహార పదార్థము నందలి (Calcium salts) అవి అణువులలోనికి ఐక్యమగుచున్నది. అందువలన పసిపిల్లలకు ఎముకలు గట్టిపడుటకున్ను, దంతములు మొలచుటకున్ను డి. విటమిన్ అవసరం. డి. విటమిన్ను ఇస్తే పిప్పిదంతములు పోవును. లోపించిన పిల్లలకు Rickets అను వ్యాధి సంభవించును. అనగా ఎముకలు గట్టిపడవు. 2 సంవత్సరములు దాటినను నడకరాదు. దంతములు మొలవవు. చర్మమునందున్న చమురు అంతా ఆర్పుకొని పోవును. బిడ్డ ఎండిపోవును. వివిధ గ్రంథులు వాచును. తలకాయ పెద్దదిగా కనిపించును. రాత్రులయందు ఎముకలలోనుండి పోట్లు పుట్టి నిద్ర పట్టదు. ఈ రోగులకు డి. విటమినుతో సహా కాల్షియం ఇంజక్షను చేయవలెను. చనుబాలలోను, కాడ్‌లివరు ఆయిలులోను, కోడిగ్రుడ్డు సొనలోను డి. విటమిన్ను ఎక్కువగా గలవు కనుక వీనిని తరుచుగా నియ్యవలెను. శరీరమునకు నూనెరాసి కూర్చుండబెట్టినప్పుడు సూర్య కిరణ ప్రభావముచేత డి. విటమిను ద్రవ్యములు పుట్టి శరీరములో ప్రవేశించును.

5. E Vitamin :—ఈ సూక్ష్మ ద్రవ్యము మొలకలెత్తు గోధుమలలో విశేషముగా గలదు. ఈ విటమిను తక్కువ అయిన స్త్రీ పురుషులు వంధ్యులగుదురు. తక్కిన విటమినులనుగూర్చి ఇంకను పరిశోధనలు జరుగుచున్నవి.

ఆహార పదార్థములలో మాంసకృత్తులు, పిండి పదార్థములు వగైరాలు తెలుపు పట్టిక.

| నెం | పదార్థములు | మాంసకృతులు పిండి పదార్థములు | పిండి పదార్థములు | క్రొవ్వు పదార్థములు | నీరు | బూడిద | [illegible] కొలతలు |
|---|---|---|---|---|---|---|---|
| | | % | % | % | % | % | |
| 1 | పితల్లిపాలు | 1.6 | 9.9 | 0.3 | 87.6 | 0.3 | 225 |
| 2 | చిక్కైన వి[illegible]ములు | 9.4 | 4.1 | 0.6 | 58.8 | 2.0 | 740 |
| 3 | బంగాళాదుంప-S. T. ఉడకని | 2.2 | 18.4 | 0.1 | 78.3 | 1.0 | 385 |
| 4 | మేకమాంసం (తరిగిన భాగము) | 17.8 | | 28.3 | 53.0 | 1.0 | 1540 |
| 5 | పందిమాంసం (తరిగిన భాగము) | 16.9 | — | 30.8 | 52.0 | 1.0 | 1586 |
| 6 | గోమాంసం (తరిగిన భాగము) | 18.0 | — | 18.5 | 61.9 | 1.0 | 1150 |
| 7 | కాడ్ చేప (క్రొవ్వులేనిది) | 16.8 | — | 4.0 | 82.6 | 1.2 | 325 |
| 8 | మాకెరల్ చేప క్రొవ్వుతో సహా | 18.3 | — | 7.1 | 73.4 | 1.2 | 645 |
| 9 | కోడిగ్రుడ్డు సంపూర్ణము | 14.8 | — | 10.5 | 73.7 | 1.0 | 700 |
| 10 | కోడిగ్రుడ్డు పసుపు భాగము | 16.1 | — | 33.3 | 49.5 | 1.1 | 1608 |
| 11 | కోడిగ్రుడ్డు సొన | 13.0 | — | 0.2 | 86.2 | 0.2 | 285 |
| 12 | పాలు సంపూర్ణము | 3.0 | 5.0 | 4.0 | 87.0 | 0.7 | 310 |
| 13 | పాలు మీగడ తీసివేసినవి | 3.4 | 5.1 | 0.3 | 90.5 | 0.7 | 165 |
| 14 | మీగడ | 2.5 | 4.5 | 18.5 | 74.0 | 0.5 | 885 |
| 15 | జున్ను | 25.9 | 2.4 | 33.7 | 34.2 | 3.8 | 1950 |
| 16 | మజ్జిగ | 3.0 | 4.8 | 0.5 | 91.0 | 0.5 | 160 |
| 17 | తెల్లరొట్టె | 9.2 | 53.1 | 1.3 | 35.3 | 1.1 | 1215 |
| 18 | సంపూర్ణ గోధుమరొట్టె | 9.7 | 49.7 | 0.9 | 38.4 | 1.3 | 1140 |
| 19 | మొక్కజొన్నరొట్టె | 7.9 | 48.3 | 4.7 | 38.9 | 2.2 | 1205 |
| 20 | నిప్పులపైన కాల్చిన రొట్టె | 11.5 | 61.2 | 1.6 | 24.0 | 1.7 | 1420 |
| 21 | గొఱ్ఱె క్రొవ్వు | 4.7 | — | 81.8 | 18.2 | 6.3 | 3510 |
| 22 | పందిమాంసం ఉప్పు వేసినది | 9.4 | — | 67.4 | 18.8 | 4.4 | 3030 |
| 23 | వెన్న | 1.0 | — | 85.0 | 11.0 | 3.0 | 3410 |
| 24 | పంది క్రొవ్వు | — | — | 100.0 | — | — | 4080 |
| 25 | ఆలివ్ నూనె | — | — | 100.0 | — | — | 4080 |
| 26 | బెల్లపుపాగు | 2.4 | 69.3 | — | 25.1 | 3.2 | 1280 |
| 27 | పొడిపంచదార S. T. కలకండ | — | 100.0 | — | — | — | 1860 |
| 28 | పటికబెల్లం S. T. కలకండ | — | 96.5 | — | 3.0 | 0.5 | 1785 |
| 29 | తేనె | 0.4 | 81.2 | — | 18.2 | 0.2 | 1530 |
| 30 | సీమరేగుపండు | 0.4 | 14.2 | 0.5 | 86.6 | 0.3 | 290 |
| 31 | అరటిపండు | 1.3 | 22.0 | 0.6 | 75.3 | 0.3 | 460 |



| No | Vitamins Content of Foods | A | B | C | D | E |
|---|---|---|---|---|---|---|
| 1 | Almond | — | 1 | — | — | — |
| 2 | Apple | 1 | 1 | 1 | — | — |
| 3 | Bcre:ated emutision of cod liver oil | 3 | — | — | 2 | 1 |
| 4 | Banana | 1 | 2 | 1 | — | 1 |
| 5 | Berley | 1 | 2 | — | — | 1 |
| 6 | Beet root | — | 1 | 2 | — | — |
| 7 | Bi-feral | 3 | 2 | — | 3 | — |
| 8 | B-Vita 13 | — | 3 | — | — | — |
| 9 | Brains | 1 | 2 | — | — | 1 |
| 10 | Bran | 2 | 3 | — | — | — |
| 11 | Bread made with milk | 2 | 2 | 1 | 1 | — |
| 12 | Bread made with water | 1 | 2 | — | — | — |
| 13 | Bringal | 1 | 2 | 1 | — | — |
| 14 | Butter milk | 1 | 1 | 1 | — | — |
| 15 | Cabbage (cooked) | 1 | — | 1 | — | — |
| 16 | Cabbage green fresh | 3 | 1 | 3 | — | 1 |
| 17 | Caralina beans | 1 | 2 | 1 | — | — |
| 18 | Carrats (cooked) | 1 | 1 | 1 | — | — |
| 19 | Carrats raw | 3 | 1 | 2 | — | — |
| 20 | Cauli flower (raw) | 1 | 1 | 2 | — | — |
| 21 | Cheese | 2 | 1 | — | — | — |
| 22 | Coco-nuts | 1 | 2 | 1 | 1 | — |
| 23 | Coco oil | 1 | 1 | 1 | — | 1 |
| 24 | Cod liver oil emulsion B-1 | 3 | — | — | 3 | — |
| 25 | Cod liver B-P | 3 | — | — | 3 | — |
| 26 | Colloid calcium with Vitamins D (B-1) | — | — | — | 3 | — |
| 27 | Cod Halibutal | 3 | — | — | 3 | 1 |
| 28 | Creece | 2 | 2 | 1 | 2 | — |
| 29 | Creas-oted warrhus malt | 3 | 2 | — | 2 | 1 |
| 30 | Cucunber | 1 | 1 | 1 | — | — |
| 31 | Dates | 1 | 1 | 1 | — | — |
| 32 | Emulsion of cod liver oil 5% with collaid calcium | 3 | — | — | 3 | — |
| 33 | Eggs white | — | 2 | — | — | — |
| 34 | Eggs yalk | 2 | 3 | - | 2 | 2 |

| No | Vitamins Content of Foods | A | B | C | D | E |
|---|---|---|---|---|---|---|
| 35 | Egg fowl | 2 | 1 | - | 1 | 1 |
| 36 | Egg Duck | 2 | 1 | - | | 1 |
| 37 | Fish fat) | 1 | 1 | - | - | - |
| 38 | Fish (ral) | 1 | 1 | - | 1 | - |
| 39 | Fish prown | 1 | - | - | - | - |
| 40 | Crape fruit | 1 | 1 | 1 | - | - |
| 41 | Green beans | 2 | 3 | 3 | - | - |
| 42 | Green chilli | 1 | - | 2 | - | - |
| 43 | Ground nuts | 1 | - | - | . | - |
| 44 | Hali butal orrange | 3 | - | 3 | 2 | - |
| 45 | Halive malt | 3 | 2 | - | 3 | 1 |
| 46 | Haemogen | - | 2 | - | - | - |
| 47 | Haemo malt | - | 3 | - | - | - |
| 48 | Hemogen with liver extract | 2 | 2 | - | - | 1 |
| 49 | Haemagen with narmal screen | - | 2 | - | - | - |
| 50 | Haemo Hypophosphites co | - | 2 | - | - | - |
| 51 | Haemo liverex | 2 | 2 | - | | 1 |
| 52 | Haemo sarsaparilla | - | 2 | - | - | - |
| 53 | Haemo lecithin phos | 2 | 2 | - | 2 | - |
| 54 | Heart | 1 | 2 | 1 | 1 | - |
| 55 | Kidneys | 2 | 2 | 1 | 1 | - |
| 56 | Lemon guice | 1 | - | 2 | - | - |
| 57 | Lentel | 1 | 1 | - | - | - |
| 58 | Lettuee | 3 | 1 | 2 | - | 3 |
| 59 | Liver | 3 | 3 | 2 | 1 | - |
| 60 | Maize (whale grain) | 1 | - | 1 | - | 1 |
| 61 | Malt extract B-1 | - | 2 | - | - | - |
| 62 | Mango (ripe) | 2 | - | 3 | - | - |
| 63 | Marrow haemagen | 2 | 2 | - | 2 | - |
| 64 | Marrow malt | 2 | 2 | - | 2 | - |
| 65 | Malt faston | - | 2 | - | - | - |
| 66 | Malt Terro-iodide | - | 2 | - | - | - |
| 67 | Malt licithin phosphate | 2 | 2 | - | 2 | - |
| 68 | Malt extract with pepsin pancuatin | - | 2 | - | - | - |
| 69 | Malt extract witn cod liver 6il and iron codide | 3 | 2 | - | 2 | - |
| 70 | Malthypo-phosphitesco | 2 | 2 | - | 2 | - |



| No | Vitamins Content of Foods | A | B | C | D | E |
|---|---|---|---|---|---|---|
| 71 | Malt liverex | 1 | 2 | - | - | - |
| 72 | Milk condenced | 2 | 2 | 1 | 1 | - |
| 73 | Milk fresh cow's | 2 | 2 | 1 | 1 | 1 |
| 74 | Milk goats | 1 | 1 | 1 | - | - |
| 75 | Milk shimmed | 1 | - | 1 | - | - |
| 76 | Marrhuo malt | 2 | 2 | - | 2 | - |
| 77 | Melasses cane | - | 2 | - | - | - |
| 78 | Mastard oil | 1 | - | - | - | - |
| 79 | Mution | - | 2 | - | - | - |
| 80 | Narey beans white beans | 1 | 3 | - | - | - |
| 81 | Oats | 1 | 1 | - | - | - |
| 82 | Onions | 1 | 1 | 2 | - | - |
| 83 | Orange juice | 1 | 1 | 3 | - | 1 |
| 84 | Palm oil (red) | 1 | - | - | - | 2 |
| 85 | Papaya | 2 | - | 3 | - | - |
| 86 | Parsnip | 1 | 2 | 1 | - | - |
| 87 | Peaches raw | 1 | - | 1 | - | - |
| 88 | Peas fresh | 1 | 1 | 1 | - | - |
| 89 | Pepper (green) | 2 | 1 | 3 | - | - |
| 90 | Prpper (red) | 2 | - | 1 | - | - |
| 91 | Pinepsple row or tined | 1 | - | 2 | - | - |
| 92 | Plum | 1 | 1 | 1 | - | - |
| 93 | Patataes (co-okod) | 1 | 1 | 2 | - | - |
| 94 | Punpren | 2 | 1 | 1 | - | - |
| 95 | Quino haemoyen | - | 2 | - | - | - |
| 96 | Rasp berries row or tined | - | - | 3 | - | - |
| 97 | Radio cod liver oil | 3 | - | - | 3 | 1 |
| 98 | Radio halibutal | 3 | - | - | 3 | 1 |
| 99 | Radio haemagen | 1 | 2 | - | 2 | - |
| 100 | Radiated malt | 2 | 2 | - | 3 | - |
| 101 | Radio sterin | - | - | - | 3 | - |
| 102 | Radish | 1 | 1 | 1 | - | - |
| 103 | Rairin | - | 1 | - | - | - |
| 104 | Rice polished | - | 1 | - | - | - |
| 105 | Rice whole grain | 1 | 1 | - | - | - |
| 106 | Rye ground | 1 | 2 | - | - | - |
| 107 | Spinch (row) | 3 | 1 | 2 | 1 | - |

| No | Vitamins Content of Foods | A | B | C | D | E |
|---|---|---|---|---|---|---|
| 108 | Spinch (cooked) | 2 | 1 | 1 | – | – |
| 109 | Soya bean | 1 | 2 | – | – | 1 |
| 110 | Swede | 1 | 1 | – | – | – |
| 111 | Sweet potatoes | – | – | – | – | – |
| 112 | Tamarind green | 1 | – | 1 | – | – |
| 113 | Tomato row or preroved | 2 | 1 | 3 | – | – |
| 114 | Twrnip | 1 | 1 | 3 | – | – |
| 115 | Usual wabnut | – | 1 | – | – | – |
| 116 | Vino malt | – | 2 | 2 | – | – |
| 117 | Whita & red potatoes | 2 | 1 | 1 | – | – |
| 118 | Whact bran | 1 | 2 | – | – | – |
| 119 | Whacten bread made with milk | 2 | 2 | – | – | – |
| 120 | Whacten bread made with water | – | 2 | – | – | 3 |
| 121 | Whact flour white | 2 | 2 | – | – | – |
| 122 | Whact enbryo whole meal | 1 | 2 | – | – | 1 |

## ఏ ఏ రోగములయందు ఆయుర్వేద ఇంజక్షనులు పనిచేయునో తెలుపు పట్టిక

1. అజీర్ణము :—ఆద్రక్ (అల్లం)
2. అండవృద్ధి :—ఇంద్రవారుణి (చేదుపుచ్చ)
3. అంత్రవృద్ధి :—ఇంద్రవారుణి (చేదుపుచ్చ)
4. ఆమాతిసారము :—ఇంద్రవారుణి, ముషిణి, కుచ్ల, కుటజ అంకురం, కొడిశపాల గింజలు,
5. అమ్లపిత్తము :—గుడూచి (Gilae`, తిప్పతీగ, దుగ్ధాం. హాద్ (పాలు).
6 అర్శస్సు (మూలవ్యాధి):—జమీకంద (అడవికంద).
7. ఆమాశయ రోగములు :— బేక్ (మారేడు).



8. ఉపదంశరోగము (కొరుకుసవాయి) :—స్వర్ణక్షీరి. (బ్రహ్మదండి లేక బలురక్కసి)
9. ఉదరరోగము :—జ్యోతిష్మతి తైలము (మాల్కంగిణి.)
10. ఉన్మత్తకు విరుగుడు :—చినోలా (ప్రత్తిగింజలు.)
11. ఉబ్బసరోగము :—దతూర్ (ఉమ్మెత్త), భల్లాతకి (జీడి).
12. కఫజ్వరము :—పిప్లీ (పిప్పళ్ళు)
13. కుష్ఠు :—ఖదిర (చండ) మోదుగ (పడాసీ.)
14. క్రిమిరోగము :—అనార్ (దానిమ్మ).
15. గనేరియా (సెగరోగము) :—బిరోభా తైలము.
16. గళగండరోగము :—అపరాజితా (నల్లదింటెన.)
17. గండమాల :—కాంచనార్, దేవకాంచనము.
18. గుల్మరోగము :—వరుణ (ఉలిమిరి చెట్టు)
19. చరి :—ఉసీర (వట్టివేళ్ళ.)
20. ధనుర్వాతము :—కకుర్ భాంగ్రా (గుంటకలగర.)
21. నల్లమందు విరుగుడు :—హింగ్ కోరా (ఇంగువ.)
22. న్యుమోనియా :—హారతికర్పూరం.
23. నిద్రపట్టించుటకు :—అజవాన్ (కురంజివాము), అహిఫేన్ (నల్లమందు)
24. ప్రదరరోగములు :—అశోక.
25. ప్రమేహ రోగములు :—పడాసీ (మోదుగ).
26. పిత్తజ్వరము :—పిత్తపాపర (పర్పాటకము.)
27. పిత్తకఫజ్వరము :—పంచల (చేదుపొట్ల.)
28. భగంధరము :—చోపచీని (ఫిరంగిచెక్క.)
29 మసూచిక :—సైరేంయ (ములుగోరింట)
30. మలేరియా జ్వరము :—నాయిూ. ఇది ఆయుర్వేద ఇంజక్షనులలో నొక మిశ్రమ యోగము.
31. మూత్రకృచ్ఛ్రము :—నిర్గుండి (వావిలి.)
32. మేధోరోగము :—తాళపత్ర (తాటిఆకు.)
33. యకృత్ ప్లీహవృద్ధి అపరేచనలు :—శరపుంఖా (వెంపలి)

34. రక్తపిత్తము—శ్వాసకాసలు—దగ్గు.—వాస (అడ్డసరము), కంటకారి (వాకుడు.)

35. రక్తవికారం—విషూచి (మలేరియా) :—సర్పగంధి, ఈశ్వరి, వాకుచి, నిమ్మ.

36. క్షయ (రాజయక్ష్మ) :—కాకజంఘా (చిపురు వెలగచెట్టు.)

37. వాత జ్వరము :—గుడూచి (తిప్పతీగ), పిత్తపాపర (పర్పాటకము.)

38. వాత జ్వరాతిసారము :—ఇంద్రయవ (చేదుపుచ్చ), పుటజ (చండ), కుర్చి (ముషిణి.)

39. వాత కఫ జ్వరము :—కంటకారి (వాకుడు), గుడూచి (తిప్పతీగ.)

40. వాతరోగ :—ఏరండ (ఆముదము.)

41 విరాహము :—గుడూచి.

42. విషూచి (కలరా) :—భల్లాతకాది ఇంజక్షన్.

43. శీతపిత్తము :—అగ్నిమంథ (నెల్లి.)

44. శీతాంగ సన్నిపాతము :—సూతికాభరణరసం, కస్తూరి.

45. శ్లీపదరోగము (క్షయ) :—లహసన్ (వెల్లుల్లి.)

46 సవాయి :—స్వర్ణక్షీరి (బ్రహ్మదండి), రసకర్పూరము.

47. సన్నిపాతజ్వరము :—వనప్షా.

48. సూతికాజ్వరము :—దశమూల.

49. స్తన్యవృద్ధికొరకు :— స్తన్యము.

50 స్వరభేదము :—బ్రాహ్మి (సరస్వతి ఆకు.)

51. శ్వేతప్రదర :—దూద్.

52. హృద్రోగము :—అర్జున (తెల్లమద్ది), రక్తాశ్వఘ్న.

53. గుండెకాయకు శ్వాసకు చురుకు నిచ్చునవి :—కుర్చి (ముషిణి.)

పైని చెప్పఁబడిన రోగములకు ఆయుర్వేదమున నీ ఇంజక్షనులు వాడిన గుణకారి యగును. అనుభవము మీద గుణము తెలియగలదు. ఒక్కొక్క మూలిక ఇంజక్షను యే యే రోగములయందు పని చేయునో గ్రంథాంతమున చేర్చబడినది.

# ధర్మామీటరు

ఇది ప్రాణవైద్యమునందు డాక్టరులచే నుపయోగింపఁబడు ఉష్ణ కొలతయంత్రము. దీని నోటియందుగాని, చంకలందుగాని ఉంచి శరీర మందలి వేడిమిని పరీక్షింతురు. దీనివలన శరీరమందెంత వేడియున్నదియు తెలియును. వాతపిత్త, శ్లేష్మములగూర్చి దీనివలన నేమియు తెలియదు. దీనిని ఉదయ సాయంత్రములయందు ఉపయోగించి శరీరమునందలి జ్వరాదులను గుర్తింతురు. ఇందు 95 లగాయతు 107 వరకు డిగ్రీలు కలవు. డిగ్రీకి డిగ్రీకి మధ్యను చిన్నచిన్న 5 గీట్లుండును. ఇవి పాయింట్లను తెలుపును.

92 To 93 మహావాతము.

93 To 95 తీవ్రవాతము. బ్రతకవచ్చునని చెప్పవచ్చును.

95 To 97 వాతగతి అపాయములేదు.

97 To 95 ఎక్కువ అపాయములేదు.

99-5 To 99 సాధారణస్థితి. రోగముకాదు.

97 To 101 ఉదయము. } స్వల్పజ్వరము.
99 To 102 సాయంత్రము }

102 To 104 హెచ్చుజ్వరము. అపాయములేదు. సాధారణముగా కుదరడము రివాజు.

104 To 105 చాలకాలము ఇట్లే తగ్గకుండా ఉన్నయెడల అపాయము.

105 To 106 కుదురుట కష్టము.

106 To 107 మిక్కిలి అపాయము—మరణము.

పిల్లలపొంగులో 100 లగాయతు 103 వరకు అనగా పొక్కులు పోవునవరకుండును. మశూచికములో 104 లగాయతు 106 వరకు ప్రారంభదశలో పొక్కులు పొక్కిన పిమ్మట 104 To 105 వరకుండును. టయిఫాయిడు జ్వరములో సాయంత్రము 2 డిగ్రీలు హెచ్చు, ఉదయం 1 డిగ్రీ తగ్గు. 104 To 105 వరకు హెచ్చును. క్షయకు 102 To 103. మహావాతమునకు 100 To 104, సాధారణ జ్వరమునకు 103 To 105 వరకుండును.

# శరీరమునందలి సూక్ష్మలవణములు

| | |
|---|---|
| కాల్షియము (సున్నము)<br>పొటాషియము<br>సోడియము<br>లోహము<br>మెగ్నీషియము<br>షిలీసియా | ఇవి నిరింద్రియ లవణములు. వీని నిర్మాణమున శరీరం బలవంతము, తేజోవంతము అగుచున్నది. |

నిరింద్రియ లవణములు పన్నెండు. కాల్కేరియాఫ్లోరు. కాల్కేరియాఫాసు, కాల్కేరియాసల్ఫు, కాలీమూరు, కాలీఫాసు, కాలీసల్ఫు, ఫెరంఫాసు, నెట్రంమూరు, నెట్రంసల్ఫు, నెట్రంఫాసు, మేగ్నీషియాఫాసు, సైలీషియా.

| శరీర భాగములు | వానికి సంబంధించిన నిరింద్రియ లవణములు |
|---|---|
| Nerves నరములు | మేగ్నీషియాఫాసు, కాలీఫాసు, కాల్కేరియాఫాసు. |
| Muscles కండరములు | మేగ్నీషియాఫాసు, కాలీఫాసు, కాలీమూరు, కాల్కేరియాఫాసు. |
| Bones ఎముకలు | కాల్కేరియాఫాసు, కాల్కేరియాఫ్లోరు, షిలీషియా, మెగ్నీషియా. |
| (Com) Connictive tissue వివిధ కోశములను కలిపెడు సూక్ష్మనిర్మాణంగల కోశము | షిలీషియా కాల్కేరియాఫాసు. |
| Elastie tissue రబ్బరువలె సాగునట్టి గొట్టము | కాల్కేరియాఫ్లోరు. |
| Cortiloge తరుణాస్థి<br>Macous చీము<br>Hair వెంట్రుకలు | నెట్రంమూరు. |
| Ceystalline lens కంటిలోని స్పటికా కార్చుబిళ్ళ | ఫెరంఫాసు. |

ఈ లవణములను గురించి విపులీకరించిన గ్రంథములు పెక్కులు గలవు. వానియందు పరిశీలింపనగును.

శ్రీరస్తు

శ్రీ మద్ధన్వంతరయేనమః

శ్రీ సీతా లక్ష్మణ భరతశత్రుఘ్న హనుమత్సమేత శ్రీరామచంద్ర పరబ్రహ్మణేనమః

# వస్తుగుణచంద్రిక

గీ. శ్రీరమాసంగరు నమృతంపు చెలితోడ
సకల రుజముల దాపెడు సార మమృత
కలశ చేబట్టి క్షీరసాగరమునందు
బుట్టి ధన్వంతరినిగొల్తు పూర్ణభక్తి.

ఉ. ఒక్కట పర్వతావళుల నొక్కట భూరుహ గుల్మవల్లులన్
ప్రక్కన వాహినీజలము ప్రాపున జంతుసమూహ సంతతుల్
చక్కగ జేరికొల్పగను సర్వమహౌషధ రూపిణంచు సొం
పెక్కిన భారతాంబను వహిప గుణాఢ్యమతిం దలంతు సంతయున్.

## అ

అక్కలకర్ర:—ఇది మూలికాజాతిలోనిది. దీని మూలికకే ఆయుర్వేదమున విస్తారము ప్రచారము కలదు. అక్కలకర్ర పెక్కుమందులలో నుపయోగము పడుచున్నది. ఉష్ణవీర్యముకలది. బలము నిచ్చును. వగరుతో గూడిన చేదు, రుచి గలది. ప్రతిశ్యాయ, సంజ, కామల, శీత పైత్య జ్వరము హరించును. చర్మము అర్చును. వాపులు, నొప్పులు, దెబ్బలు హరించును. జీర్ణకారి. ఆమదోషము హరించును. చెమ్మటను బుట్టించును. విరేచనము చేయును. వీర్యస్థంభన చేయును. ఎముకల నతుకును. విషమ జ్వరములలో అక్కలకర్ర, శొంఠి, సన్నరాష్ట్రము మూడు కలిపి రసముతీసి ఆ రసము అనుపానముతో జ్వరహారౌషధ మిచ్చిన మిక్కిలి మేలు చేయును. నాడిని తిన్నబరచును. నాలుకపై వేసికొనిన నాలుక చిమచిమలాడును. లాలాజలము స్రవించును. విషమ జ్వరములలో దాహము కలిగినప్పుడు దాహశాంతికై అక్కలకర్ర, యష్టిమధుకము నీళ్ళలో వేసి కాచి ఆ నీళ్ళు

దాహమిచ్చిన తృష్ణ హరించును. నాలుక ముల్లువారి పొడి అస్పష్టముగాని పోయినప్పుడు అక్కలకఱ్ఱ, యష్టిమధుకం, ద్రాక్ష, సైంధవలవణము, మారేడు వేరు, రజితము, పగడము వీనిని కాకిదొండకాయ రసములో ఉడికించి తీసిన రసములో అనుగడిసి ఆ రసములో ఉడికించి నాలుకకు రాసి బంగారపు రేకుతో నాలుకగీసి గండూషము చేసిన నాలుక ముళ్ళు పోయి నాలుక శుభ్రపడును. కొందరు నిమ్మకాయ రసములో పై క్రమము చేయుటకూడా కలదు. రక్త, కృష్ణక జిహ్వా దోషములు హరించును. వీర్యవృద్ధికి అక్కలకఱ్ఱ, తక్కోలపుట్టి, దేశవాళి కొంకి, సన్నపిప్పళ్ళు, జాజికాయ, లవంగములు, కుంకుమపువ్వు, శ్రీగంధము, నల్లమందు ఇవి అన్నియు కలిపి చూర్ణము చేసి తేనెతో మర్దించి మాత్రలు చేసి సేవించిన శుక్రనష్టము కట్టును. వీర్యమును స్తంభింప చేయును. ఆవుపాలలో పంచదార చేర్చి త్రాగవలెను. నల్లమందు నాల్గు భాగములు. పై దినుసులు ఒక్కొక్క భాగము చేర్చవలెను. అక్కల కఱ్ఱ రసాయనకారి. వేడిచేయు స్వభావము కలది. నీళ్ళతో నూరి గడ్డలపై వేసిన గడ్డలు పక్వమునకువచ్చి చితుకును. లోనికి సేవించిన ఆమము పచనమగును. పుప్పిపంటికి దీనిగుండ నొక్కిపట్టిన గుణ మిచ్చును. అక్కలకఱ్ఱరసములో గోపీచందనము, ఆవునెయ్యి, పంచ దార, కలిపి లోనికిసేవించిన ఋతుదోషము హరించునని చెప్పుదురు. సవాయిపొడలకు అక్కలకఱ్ఱ చూర్ణము తులము, ఇంగిలీకము నుండి తీసిశుద్ధిచేసిన పాదరసము అర తులము, చంద్రచూర్ణము అర తులము, తేనె మూడుతులములతో మర్దనా చేసి, యేడుమాత్రలు చేసి, యేడురోజులు ఇచ్చిన సవాయిపొడలు హరించునని భావప్రకాశిక యందు కలదు. పూర్వము వచ్చుఅక్కలకఱ్ఱకును, ఇప్పుడువచ్చు అక్కలకఱ్ఱకును రూపభేదము కలదు. అక్కలకఱ్ఱ కషాయములో పంచ దార తేనెచేర్చి మధ్యస్థ పాకముగా కాచి ప్రతిరోజు సేవించిన శరీరము నకు మేలుచేయును.



సంస్కృతమున అకారకరభ, ఇంగ్లీషులో Anacyclus Pyrethrum హిందీలో అకర్కరా, కర్ణాటంలో అకలకరె, అరవంలో అక్కారాకారం, బంగ్లాలో అకర్కరా, ఫారసీలో అకర్కర్హా.

☞ అక్కుళ్ళు :—ఇవి ధాన్యవిశేషములు. ఇందులో రెండురకంలు కలవు. 1 సన్న అక్కుళ్ళు 2 ముదుగుఅక్కుళ్ళు. అన్నము రుచికరము. చలువచేయును. వేడి, పైత్యముచేయును. ఆకలినిచ్చును. జీర్ణకారి. కొన్నితత్వములవారికి ఇది సరిపోవదు. అనగా ఆరోగ్యమునకు భంగము కలిగించును. దీనికివిరుగుడు అన్నమునకు చూడుడు. A kind of Rice.

☞ అక్రోటు :—ఇది బీజసారముగలది. కమ్మనిరుచికలది. అందు కొంచెము పులుపు రుచికూడ కలిగియుండును. ఇది కాబూలు దేశము నందును, కొంకణదేశమునందును ఉత్పత్తియగును. కాయగుండ్రము. వేడిచేసి నీటిని ఆర్చును. శుక్రధాతువునకు బలమిచ్చును. క్రిమినిహరిం చును. హృదయమునకు మేలుచేయును. వీర్యమును వృద్ధిపరచును. విరేచనముచేయును. బలప్రదమైనది. జీర్ణశక్తి కలిగించును. తరుచుగా హకీములు తమయూనానీ ఔషధములలో సర్వసాధారణముగా వాడు చుందురు. దీనితో తయారుచేయు ధాతుపుష్టిలేహ్యము శరీరమునకు బహువిధముల గుణకారి. పాకమున స్నిగ్ధము, బరువు, వాతము, పిత్తము నశించును. కఫమును పెంచును. రక్తదోషము హరించును. దీనికి విరుగుడు, పుల్లదానిమ్మరసము, నిమ్మరసము, ఉప్పు, ద్రాక్షరసము మాదీఫలరసము మొదలగు పులుపుపదార్థములు.

సంస్కృతంలో అక్షోట. ఇంగ్లీషులో Walnut, హిందీలో అఖరోట్, బెంగాలీలో అఖరోట్, కొంకణభాషలో అక్రోడ్, ప్రాకృత భాషలో అక్కోడ అనిపిలతురు.

☞ అగురు :—ఇది సారసారము. సుగంధద్రవ్యములోనిది. చేదురుచి కలది. చెమ్మటవాసనను హరించును. శోష, నేత్రరోగంలు, కర్ణరోగం

వాతము, శ్లేష్మము, కుష్ఠు, క్రిమిరోగముల హరించును. నొప్పులు హరించును. బలమిచ్చును. దేవతా పూజాద్రవ్యముల లోనిది యొకటిగ చెప్పబడియున్నది. ఈ చెట్లు ఆస్సాం, బూటాన్, ఫసిఫిక్ సముద్ర ప్రాంతము నందలి దీవులయందు విస్తారముగా కలవు. దీనిచేవ నల్లగ లోహమువలె దృఢముగ నుండును. దీనిని నీటిలో వైచిన మునిగి పోవును. దీనిని కృష్ణాగురు అందురు. బజారులో అమ్మబడు అగరువత్తు లనబడు వత్తులు దేవతాపూజలయందు ధూపమున కుపయోగింపబడు చున్నవి. అగరువత్తులుచేయు పరిశ్రమ మైసూరు ప్రాంతమందు విశేష ముగా కలదు. అగురువృక్షములలో అయిదురకములు గలవు. 1 కృష్ణాగురు, 2 దాహాగురు, 3 స్వాదుఅగురు, 4 మంగళ్యఅగురు, 5 కాష్టాగురు.

ఇందులో కృష్ణాగురు శ్రేష్టమైనది. ఉష్ణవీర్యము, బాహ్య ప్రయోగమున చల్లదనము. అగరుగంధము శరీరమునకు వాసననిచ్చును. దుర్గంధము నశించును. దురదలు తగ్గును. లోపలకుయిచ్చిన త్రిదోష శమనము చేయును. విశేషముగా పిత్తము, ముఖరోగము, వాంతి రోగము, వాతరోగము శమింపచేయును.

2 దాహాగురు :—చేదురుచికలది. ఉష్ణవీర్యము, సువాసన నిచ్చును. కేశదోషము హరించును. కురులను పెంచును. వర్ణమును గలిగించును.

3 స్వాదుఅగురు :—చేదురుచి, వగరు, ఉష్ణవీర్యము. దీని ధూపమువలన వాతము హరించును. సుగంధము కలిగించును.

4 మాంగల్యఅగురు :—దీనిగుణములు కృష్ణాగురు గుణములతో సమానమే అయియున్నది.

5 కాష్టాగురు :—ఇది పీతవర్ణముకలది. చేదురుచి, ఉష్ణవీర్యము, కఫనాశనము, బాహ్యప్రయోగమున రూక్షచేయును. దీనిచేవనుండి అత్తరువులు, సెంట్లు తయారుచేయుదురు.



ఇంగ్లీషులో Eagla wood, సంస్కృతమున రాజార్హా క్రిమిజ అగురు, హిందీలో కలీఅగర్, కర్ణాటమున అగరు, అరవంలో అగిల్.

☞ అగరుబొంతి :—చిరుబొద్ది చూడుడు.

☞ అగసిచెట్టు :—దీనికి సంస్కృతమున తపసి అనిపేరు అతసి అని కూడా నందురు. ఇది వృక్షజాతికి చేరినది. ఈ చెట్టు తమలపాకు తోటలలో పాలుగా వేసి పెంచుదురు. వీని మొదట తమలపాకు తీగెనాటి పెంచుదురు. ఎండవేడిమి తగులకుండ కాపాడుట కుపయోగించును. దీని ఆకు పసరు వ్రణముల నార్చును. గవదబిళ్ళలపై పూసిన బిళ్ళలు కరగును. ఆకు కూర వండుకొని తిందురు. అవిసెచెట్లు నాలుగు విధములు. 1. తెల్ల అవిసె, 2. ఎఱ్ఱఅవిసె, 3. నల్ల అవిసె, 4. పచ్చ అవిసె. సాధారణముగా తెల్లఅవిసె మాత్రమే మన దేశమందు విరివిగా కన్పించుచున్నది. దక్షిణదేశమునందు దీని ప్రచారము హెచ్చు. అవిసె కాయలకూర వండుకొని తిను నలవాటుకూడకలదు. వేపకాయలనే వండుకొని తిందురు. ఇందు పులుసు ఆవ చేర్చివండిన రుచికరముగా నుండును. త్వరగ జీర్ణముకాదు. అగిసె. శీతలము, రూక్షగుణము, పిత్తరసముగలది. వాతమును ప్రకోపింపజేయును. కఫము, పిత్తము, చాతుర్థికజ్వరము హరించును. ఆకుచేదు. పిత్తరసముకలది. గురుగుణము కలది. క్రిములను హరించును. కఫహరము. దురదను పోగొట్టును. విషమును హరించును. రక్తమును శోషింపజేయును. పిత్తమును హరించును. కొంచెము కాకచేయును. మధురమైనది. విషమును హరించును. పుష్పములు సమశీతోష్ణమైనవి. కటివినాశి. పిత్తరసముకలది. కషాయం వాతమును పోజేయును. పిత్తము, కఫము, రేచీకటి వీనిని పోగొట్టును. స్వాదురసముగలది. రూక్షగుణముకలది. శూల, పాండు, ప్లీహా, శోష, గుల్మం హరించును. కాయలుపైత్యం జేయును. చాతుర్థిక జ్వరమనగా

నాలుగురోజుల కొకసారివచ్చు విషమజ్వరం. అవిసెఆకు రసం కండ్లలో వేసిన కండ్ల నలక రోగములు హరించును. నస్యముచేసిన ముక్కువెంట కారు దుష్టనీరుపోవును. ఇందువలన శిరస్సునందలి బాధలు హరించును. అపస్మారం హరించును. అవిసెపువ్వుల కూరవండుకొనికాని, ఆకుకూర వండుకొనికాని కార్తీకశుద్ధ ద్వాదశిరోజున భుజించిన పుణ్యమని కొందరిమతము. ఇందువలన ఏకాదశి ఉపవాసముండిన నీరసముతగ్గును. అవిసెగింజలనుండి చముర్తీయుదురు. ఆనూనె వాతమును హరించును, వ్రణములనార్చును. అగ్నిమాంద్యము చేయును నేత్రములకు మేలు చేయును ఈ నూనెతో కార్తీకమాసములో దీపముంచిన పుణ్యప్రదమని చెప్పెదరు. ఈ నూనెలో వంగము (తగరము) కరగిపోసిన శుద్ధి అగును. 15 సారులు కరగిపోయవలెను. ఆకుపసరులో సున్నముకలిపి పూసిన నజ్జులుహరించును. పట్టకషాయము విరేచనకారి ఎఱ్ఱఅవిసె పుష్పములు వాదవిద్య కుపయోగించునని చెప్పెదరు. విషహారమనిన తేలు, జెఱ్ఱి మొదలగు వానివిషము హరించును. ఆకురసము మోతాదు 3 నుండి 6 తులములవరకు పట్టచూర్ణము మోతాదు 3 నుండి 6 చిన్నముల ఎత్తువరకు ఇవ్వవచ్చును. శ్రీకృష్ణభగవానుని శరీరము అతసీ పుష్పకోమలమని వర్ణింపబడినది.

శ్లో॥ అతసీ పుష్పసంకాశం హారనూపుర శోభితం
హార కుండలకేయూరం కృష్ణంవందే జగద్గురుం॥

సంస్కృతమున అతసి నల్లఅవిసె. హిందీలో అగస్తియా. హథియా, హదగా. కర్ణాటకమున అగసేమెలె. అరవంలో అగత్తియిలై. బెంగాలీలో బకఫూల్‌గాఛ్. మరాఠీలో అగస్తా. గుజరాతీలో అగథియో. ఇంగ్లీషులో Leaf of Linseed Plant.

అగ్ని :—అష్టదిక్పాలకులలో నొకడు అగ్ని. దహించు స్వభావము. జమ్మి. చంద్ర, కంది, బలుసు మొదలగు పుల్లలను కలిపి



మథించిన అగ్ని పుట్టును. అగ్ని తేజోవంతమైనది. సమస్త కర్మలకు అగ్ని ప్రధానము. చకుముకి రాతిని లోహపు కడ్డీతో రాపాడించిన అగ్ని పుట్టుచున్నది. అగ్నిలేనిదే మనకేపనియు కాదు. మేఘములనుండి అగ్ని పుట్టుచున్నది. దానిని విద్యుత్తు అందురు. మెరుపు సారమని కూడ చెప్పుదురు ఈ మెరుపు సారము సహాయమున ననేక యంత్రములు నడుపఁబడుచున్నవి. ఇండ్లలో దీపములు వెలిగింపఁ బడుచున్నవి. Fans విసరబడుచున్నవి కొందరు బీదలు ఊక ఎరువుచేర్చి నిప్పు చేసి కొని చలి కాచుకొనుచుందురు. చంటిబిడ్డలకు కడుపునొప్పి వచ్చినప్పుడు ఆముదము కడుపునకు రాచి చేతికాపడము పెట్టిన వెంటనే శమించును కొన్ని కొన్ని నొప్పులకు ఇటుకపొడితోను, ముగ్గుతోను, కందులతోను, ఇప్పతోను, ఇసుకతోను, ఆముదము గింజలతోను, తవుడుతోను కాపడము పెట్టుదురు లంఖణములలో ఉప్పుతో కాచకూడదు. కొన్ని కొన్ని కఫపు దెబ్బలకు నిమ్మకాయ చెరిసగము కోసి నేయికాచి అందు నిమ్మకాయ పెచ్చు ముంచి కాపడము పెట్టిన కఫపుదెబ్బవలన నొప్పి శాంతించును. లేదా గుడ్డముంచి కాపడము పెట్టినను దుముగట్టిన రక్తము కరిగిపోయి సుఖమిచ్చును. గుండె నొప్పులకు వేడినీళ్ళలో గొంగళిగుడ్డగాని, ముతకగుడ్డగాని ముంచి గుండెలకు యూకలిప్టస ఆయిలుగాని, అమృతాంజనముగాని, అమృత బామ్‌గాని, కొబ్బరినూనెగాని, కర్పూర తైలముగాని మర్దనచేసి ఆవిరి కాపడము పెట్టిన వెంటనే గుణము కన్పించును. చంటిబిడ్డలకు అల్పాచమానము బంధించి కడుపు పొంగరించినప్పుడు బొడ్డునకు రేవలచిన్ని, సురేకారము చనుబాలతో నూరి పట్టువేసి వెదురుకణుపుల నిప్పులతో చేతికాపడము పెట్టిన వెంటనే మూత్రపు పట్టి విడిపోయి మూత్రము జారీఅగును బిడ్డలకు ఈడ్పుగుణము కనిపించినప్పుడు (బాలపాపచిన్నె) చుట్టనిప్పుతోగాని, పసుపుకొమ్ము కాల్చికాని నొసలు కణతలు, మెడ, గుండెలయందు రక్ష వేయుదురు. వెంటనే శ్లేష్మము నెరి

యిచ్చి తెలివివచ్చును. కలరాలో మూత్రము బంధించినప్పుడు తెల్లని సీసాలో వేడినీళ్ళుపోసి కడుపుపై దొర్లించిన నయము కనిపించును. తేలు విషము హరించుటకు నీటి ఆవిరి పట్టవలెను. పదిహేను నిముషములలో విషము చెమట రూపమున తిరిగి బైటకు వచ్చును. సుఖము కలుగును. అగ్నియందు పక్వముకాని యే పదార్థములు చాలవరకు మనకు అనుకూలింపవు. చంటిపిల్లలకు కడుపునొప్పులు రాకుండుటకై కడుపుమీదను, కండ్లరెప్పలలో కురుపులు పుట్టకుండుటకు కణతలందును సూదికాల్చి రక్షలు వేయుదురు. ఈ రక్షాకర్మ గంజాము, విశాఖపట్నము జిల్లాలయందంతటను గనిపించుచున్నది. తూర్పు గోదావరిజిల్లాలో కొంతవరకు ప్రచారము కలదు. జీవజాలమందు జఠరాగ్నియు, సముద్రమధ్యమందు బడబాగ్నియు కలవు. ఎన్ని మహానదులువచ్చి కలిసినను సముద్రము వేల దాటి పైకి రాకుండుటకు బడబాగ్నియే కారణము. కొందరికి ఎంతతినినను ఆపోవదు. తినిన వెంటనే ఆకలి అగుచుండును. ఈ రోగమునందు గురుకర పదార్థములు తినవలెను. నెయ్యి సమృద్ధిగ సేవించవలెను. పిచ్చికబీరఆకు గుప్పెడు ఆకు నమలి రసమును మ్రింగిన పదిరోజులకు ఈ రోగము శాంతించును. ఈ పుడకతోనే దంతధావనము చెయ్యవలెను. ఔషధముల వంటయందు అగ్నులు మూడుగ విభజింపబడి యున్నవి. 1 దీపాగ్ని, 2 కమలాగ్ని, 3 గాఢాగ్ని.

1 దీపాగ్ని :—పొయ్యిమీది పాత్రకు మంట తగిలీ తగలనట్లు సన్నమంటపెట్టుట.

2 కమలాగ్ని :—పొయ్యిమీద పాత్రకు మంట తగులుచు కమలమువలె విడిపోవునట్లు పెట్టినమంట.

3 గాఢాగ్ని :—పొయ్యిమీది పాత్ర అంచులువరకు వచ్చునట్టి పెట్టుడుమంట.



కొంచెము వేడిగల ఉదకముతో స్నానముచేయుట పథ్యకరము, ఆరోగ్యప్రదము. వేసవికాలములో కొంచెము వెచ్చని నీటితో స్నానము చేసిన వెంటనే చమటపట్టి అనంతరము శరీరమునకు తేలిక సుఖము నిచ్చును.

శ్లో. ఉష్ణోదక శిరస్నానం కించి దుష్ణాన్న భోజనం
మానవానామిదం పథ్యం పయఃపానం వయఃస్త్రియః—అని కలదు.

సంస్కృతమున అగ్నిః, వైశ్వానరః వహ్నిఃఇత్యాది. హిందీలో ఆగ్. ఇంగ్లీషులో Fire.

☞ అగ్ని వేంద్రము :—ఇది చిన్నమొక్కజాతి పత్రసారము. ఆకుపసరు వంటికితగిలిన అగ్నిదాహమువలె మంటలుపుట్టును. పక్వమునకురాని గడ్డలు పగులుటకై యీ ఆకునూరి కట్టుదురు. వ్రణములు పగులును. తెలుపు, ఎరుపురంగుగల కాండముగలదు. ఆకుకొంచెము కోలగానుండును. దీనినే అజ్ఞానపాకు అనిపిలుతురు. ముదిరినచెట్టు పసిమి ఎరుపురంగుకలిగి యుండును. పాలిజ్వరములయందు దీని ఆకు నూరి నాడిపైకట్టిన జ్వరము రాకుండ ఆపుశక్తికలదు.

☞ అజామోదము :—ఇది ఓమము జాతిలోనిది. వైద్యశబ్ద నిఘంటువునందు దీనికి ఓమము అనిపేరు. అమరకారుడు "అజామోదా తూగ్రగంధా బ్రహ్మదర్భా యవానికా" అనివ్రాసినాడు. యవానికా శబ్దము వాము అనిపేరు. ఇది బీజసారముకలది. ఇది పలుచోట్లకలదు. ఆకులు చేదుగనుండును. అజామోదము పెక్కు ఔషధములయందు చేరుచున్నది. ఓమముగుణములే దీనియందును గలవు. రుచిచేదు. ఉష్ణవీర్యము, రూక్షగుణము, తేలికరుచికరము. అగ్నివృద్ధి, విదాహి, మలబద్ధకము, బలవర్ధకము, శుక్రవృద్ధి, వాతము, కఫము, క్రిమినశనము, ఎక్కిళ్లు, వస్తిశూల, నేత్రరోగములయందు హితకారి. ఏద్రవ్యములయందు పులుపులేక చేదురుచులుగలిగి

యుండునో ఆ ద్రవ్యములు సాధారణముగా ఉష్ణవీర్యము గలిగియుండును. ఉష్ణవీర్యము గలవానియందు లఘువు, కఫవాతనాశనము, పైత్యవృద్ధి, వృష్యము, లఘుపాకము, భ్రమ, తృష్ణ, గ్లాని, స్వేదము, దాహము, వీనినికలిగించును.

సంస్కృతమున అజాగంధా, విగంధికా. హిందీలో అజామోద్, అజమోత్. బెంగాలిలో వనమోయాన్. ఇంగ్లీషులో Celery Seed.

అటుకమామిడి :— ఇది తీగజాతిలోనిది. సాధారణముగా పాటి పెరళ్ళలో ఇవిపుట్టును. రెండుమూడుగజములు వరకు ప్రాకును. ఇందులో మూడుజాతులు కలవు. ఒకటి తెలుపు, రెండు నీలము. మూడు ఎరుపు. ఆకులు గుండ్రము. పుష్పములనుబట్టి రంగు నిర్ణయించుకోవచ్చును. నల్ల అటుకమామిడి వేడిచేయును కారపురుచి, ఉష్ణస్వభావము. రసాయనకర్మకుపయోగించును. శ్లేష్మవాతముల హరించును. మరియు పాండువు, ఉబ్బువ్యాధులయందుకూడ పనిచేయును. ఎఱ్ఱని కుసుమవ్యాధులను ఖండించుటలో ఉత్తమమైనది. తెల్లది స్త్రీ సంగమదోషమును పోగొట్టును. మొత్తంమీద అటుకమామిడి కూర వండుకొని తినిన ఉబ్బులు శాంతించును. శ్వాసకాసలు తగ్గును గుల్మము, వాతము, కడుపునొప్పి, మొదలగు బాధలు శమించును. శగరోగములో నీరుడు జారి అగుటకు దీనికషాయము గుణకారిగనున్నది. సంస్కృతంన నాడిక. ఇంగ్లీషులో Spreading Hogweed.

అటుకులు :— ఇవి ధాన్యము వేడినీళ్ళలో ఒకరోజునానవేసి మరునాడు మంగలమున వేసి వేయించి రోటిలోపోసి దంపుదురు. ఇవి చింతాకులవలె సాగును. వీనికి అటుకులు అనిపేరు. ఇవితినుటకు రుచికరముగా నుండును. తీపిలో కమ్మదనము కలిగియుండును. గురుగుణము కలవి. బలమునిచ్చును. వీనిని బహువిధముల సంస్కరించి భుజింతురు. పాలలోను, పెరుగులోను నానవేసుకొని కొందరు తిందురు. కొందరు



పులుసులో తాలింపుపెట్టి నానవేసుకొని తిందురు. వీనిని పులిహోర అటుకులందురు. అటుకులను నేతిలోగాని, నూనెలోగాని వేయించి, కారముచల్లి బజారులలో అమ్ముచుందురు. అటుకులు బెల్లము కొబ్బరి చేర్చి పిల్లలకు పెట్టుచుందురు. ఏయేసంభారములు కలిపిన ఆయా సంభారముల గుణముకలిగియుండును. సంస్కృతమున చిపిట.

అట్లు :— ఇవి ఒకభక్ష్యవిశేషము మినపపప్పు నానవైచి, చక్కగరుబ్బి అందువరిపిండిచేర్చి ఉప్పుసంబారములుచేర్చి పెనముమీద కాల్చి తయారుచేతురు. వీనికి మినపఅట్టు అనిపేరు. ఇవిగురుగుణము గలవి బలకారి. అజీర్ణముచేయును. తినుటకు హితవుగనుండును. కాఫీ హోటళ్ళలో వీనిని మినపదోసెలని అమ్ముదురు. అందులో సాంబారు అనబడు పప్పుపులుసుచేర్చి భుజింతురు ఇందు మెంతిపిండి కలిపికూడ అట్లు తయారుచేయుదురు. రుచికరముగనుండును. సువాసన కలిగియుండును. మేహశాంతి చేయునని చెప్పెదరు.

అడవిద్రాక్ష :— ద్రాక్షచూడుము.

అడవి అరటి :— అరటిచూడుము.

అడవి ఆముదము :— ఆముదముచూడుము.

అడవి ఉల్లి :— ఉల్లిచూడుము.

అడవి కంద :— ఇది మిక్కిలి దురదపెట్టును. ఇది మూలవ్యాధికి మంచిమందు. దీనితో వైద్యులు సూరణాదిమోదకములు చేయుదురు. ఈ చూర్ణము పంచదారతో పుచ్చుకొన్న అర్శోరోగము హరించును. మిక్కిలి ఉష్ణముచేయును. ఆమవాతము, మందాగ్ని, వాతార్శస్సు, కఫరోగము. హరించును. సంధివాతము, శ్లీపదము హరించును. మొలకలు హరించును. మిరియాలు 1 భాగం, శొంఠి 2 భాగంలు, చిత్రమూలం 8 భాగంలు, కందచూర్ణం 16 భాగంలు, కలిపి వీనికి రెండురెట్లు

పంచదార పాకముపట్టి లేహ్యము తయారుచేసి శరీరబలము తెలుసుకొని సేవించిన రక్తమూలశంక రోగం హరించును. వెదురాకు కషాయంలో అడవికంద చూర్ణంకలిపి సేవించిన ఋతుబద్ధదోషం హరించును, వ్రణములు పగులును. ఉబ్బసములు హరించును. సంస్కృతమున వన సూరణ అందురు.

శ్లో॥ విశేషార్శసేపథ్యః ప్లీహగుల్మ వినాశనః సర్వేషా
కందశాకానాం సూరణః శ్రేష్టఉచ్యతే దద్రూణాం
రక్తపిత్తానాం మష్టినాం నహితో హిస
సందానయోగ సంప్రాప్తః సూరణో గుణవత్తరః॥

(భావప్రకాశిక)

☞ అడవి కాకర :—దీని ఆకు కాయ చేదురుచిగలవి. ప్రతిడొంకల మీదను ప్రాకుఒకవిధమైన తీగ. దీనినే పొట్టికాకర అందురు. వేడిచేయు స్వభావముకలది. దీనిఆకులు ఎండబెట్టి చూర్ణముచేసి ఆచూర్ణముతో పులుసుకాచుకొందురు. ఇది నులిపురుగులు హరించును. మలబద్ధమును పోగొట్టును. దీనికాయలు ముక్కలుచేసి ఎండబెట్టి వరుగుచేయుదురు. ఈ వరుగును పథ్యముకొరకు వేయించుకొని తిందురు. ఇది కఫమును హరించును. లోహజాతులు దీనిఆకుపసరుతో భస్మములగునని చెప్పెదరు. సంస్కృతమున వనకటిల్లక అందురు.

☞ అడవి కోడి :—దీనిని కాకకోడి అనిఅందురు. దీనిమాంసము తేలికగా జీర్ణమగును. కఫముచేయు స్వభావముగలది. శుక్రనష్టము హరించి యింద్రియపుష్టి చేయును. దీనిగ్రుడ్డునందు A. B. C. D. విటమినులుగలవు. రోగముపడి లేచినవెనుక కలుగు నీరసము హరించుటకై దీనిమాంససేవ యుచితము. మొత్తముమీద ఆరోగ్యకారియై యున్నది. రూక్షచేయును.

సంస్కృతమున వన కుక్కుట. ఇంగ్లీషులో Wild Fowl, హిందీలో వన్ముర్గా.



☞ అడవి గగ్గెర :—గగ్గెర మూడురకములు. వృక్షజాతిలోనిది. గగ్గెర, నల్లగగ్గెర, అడవిగగ్గెర. యీ మూడును రూక్షగుణముకలవి. శీతలము. కారముగ నుండును. పిత్తమును చేయును. కఫము, వాత రక్తములు, క్రిమివిషము, దురదలను హరించును. ఇది సుగంధ ద్రవ్యములలోనిది. చక్కని నిద్రను పట్టించును. దీని వేరు నూరి పట్టువేసిన పార్శ్వశూల హరించును. మూడింటికిని కొంచెము గుణభేదము కలదు.

సంస్కృతమున అర్జకః, బర్బరీవల్లో సర్జకః, కరాళమున వటపత్రిక.

☞ అడవి గోధుమలు :—ఇవి అడవులలో వానిఅంతట అవే పెరుగును మామూలు గోధుమలకంటె కొంచెము పెద్దగింజలుగా నుండును. వేడిచేయును. నీటిని ఆర్చును ఉబ్బు వ్యాధులలో దీనిరొట్టె కాల్చుకొని తినిన గుణకారిగా నుండును

సంస్కృతము: గవేధుక, ఇంగ్లీషున A kind of wheat coix **Barbata** హిందీలో గోఖీ, బంగాలీలో దే-ధాన్.

☞ అడవి చెమ్మ.—చమ్మ చూడుము.

☞ అడవి చెఱకు:—ఇది పేరుమాత్రమున ఇక్షుగాని రూపమున చెరుకువలె నుండదు. ఇది తీగవలె ప్రాకును. రుచి తియ్యగ నుండును. విపాకమునగూడ తీపిరుచిగనే యుండును. వీర్యవృద్ధి చేయును. చలువ చేయును. ఆమ్లమును, శ్లేష్మమును పెంచును. వేడితత్వముగల క్షయ రోగులకు ప్రశస్త గుణము నిచ్చును. సంస్కృతమున వనఇక్షు అందురు.

☞ అడవి జీలకర్ర :—దీనిని అడవి జీలకర్ర అనియు విషకంటక మనియు చెప్పెదరు. ఇది మొక్కజాతిలోనిది. కారముతో గలసిన వగరు రుచి గలది. చేదు రుచి గూడ కలదు. ఉష్ణగుణము కలది. విపాకమున కారపు రుచిగ మారును. ఇది గుజ్జములకు వచ్చెడు జబ్బులకు విస్తారముగా వాడబడుచున్నది. వ్రణములను మాన్పు సామర్థ్యము గలది. చిడుము, గజ్జి, దురదలను పోగొట్టును. ఊరుస్థంభవాతము

హరించును. దీని గింజలనుసి నీళ్ళలో కలిపి త్రాగిన శూలలు నిస్సంశయముగా పోవును. దీనిని కొందరు నల్లజీలకర్ర అని వాడుచున్నారు. సంస్కృతమున వనజీరక అందురు.

అడవితులసి :—ఇది తెలుపు నలుపు అను రెండు రకములు కలది. మామూలు తులసికంటె దీని ఆకులు కొంచెము మోటగాను చిన్నవిగ నుండును. ఇది కారము రుచి కలది. బాగుగా వేడిచేయు స్వభావముకలది రక్తమునందలి దోషమును హరించి చిడుము, దురద, పొక్కులు, క్రిములు మొదలగు చర్మసంబంధమైన జబ్బులను హరించు శక్తి కలిగియున్నది. మంచి సువాసన కలదు. గుండెలయందలి బరువు దీని ఆకుల రసము సేవించిన హరించును. జంతు విషములను, లోనికి పెట్టిన విషములను నశింపుచేయుశక్తి దీనికున్నది. దీని ఆకులు ప్రక్కపై పరచుకొని నిద్రించిన చక్కని నిద్ర వచ్చును. ఉబ్బురోగము, నేత్ర రోగములు దీని సేవవలన తగ్గిపోవును. దీని ఆకు నూరి పొత్తికడుపునకు కట్టినను, రసము లోనికిచ్చినను, కష్టపడుచున్న గర్భిణీలు సుఖప్రసవము గాంతురు. ఇట్టి విశేషగుణమీ మూలికకు కలదు. మరియు ఈ మూలిక భూత ప్రేత పిశాచ గ్రహంబులకు వేరుపురుగు వంటిది. దీనిపేరు చెప్పినంతనే సమస్త గ్రహంబులు తొలగిపోవును. మూడు లగాయతు ఆరు తులముల వరకు పసరు యివ్వవచ్చును. సంస్కృతమున అర్జక, ఇంగ్లీషులో Wild ocimum sanctum అందురు.

అడవినాభి :—పొత్తిదుంప చూడుము.

అడవి దమనము :—ఇది గుజ్జగ బెరుకుమొక్క జాతిలోనిది. ఇవిరెండు విధములు. 1 అడవిదమనము, 2 అగ్నిదమనము. మొక్క ఆకులు కోలవాటముగా ఊండుగఆకులవలె నుండును. ఆకులు బిరుసుగా నుండును. వగరు చేదు గలిగిన రుచిగలిగియుండును. పైత్యశాంతి చేయును. శుక్లనష్టమును పోగొట్టును. వీర్యమును స్థంభింపచేయును.



వాత, పిత్త, శ్లేష్మ దోషములు మూడింటిని హరించును. మరియు జంతువిషము కృత్రిమవిషము హరించును. రక్తదోషమువలన బుట్టు వికారములను, కురుపులను, దురదలను [illegible]ఫలను, పోగొట్టు శక్తి యీ మూలికయందు గలదు. అగ్నిదమనము [illegible] పైగుణములను గలిగియున్నది. వాత, కఫములహరించి హృదయమునకు బలమిచ్చును. సంభోగశక్తి వృద్ధిపరచును. సంస్కృతమున వనదమనక అందురు.

అడవిపంది :—ఇది క్రూర ఘాతుకమృగము. మంచిపౌరుషం కలది. అడవులలో వసించును. మనిషి అలికిడి వినిపించిన పారిపోవును. గంధకపువాసన దీనికిగిట్టదు. చేలలోబడి జొన్న మొదలగువానిని పాడుచేయును. పూర్వము భూమిని చాపవలెచుట్టిన హిరణ్యాక్షుని శ్రీ మహావిష్ణువు వరాహమూర్తియై సంహరించి భూమిని తన పంటి కోరపై నెత్తెనని పురాణప్రసిద్ధము. దీనివెంట్రుకలు బిరుసు. యీ వెంట్రుకలనుగూర్చి "వరహాకట్టి" లను పేరున కట్టలుగా కట్టి నగలుతో ముకొందురు. ఈ జంతువు చాలబలముకలది. దీనిని మాంసమునకై వేటాడుదురు. దీనిమాంసం జిగటగ ఉష్ణముగనుండును. బలమిచ్చును. వాతముహరించును. గురుత్వము వీర్యపుష్టినిచ్చును. మధుర కషాయ రుచులు గలది. స్వేదమును కలిగించును. విపాకమున కారపురుచిగ మారును. చక్కనిరుచికలిగి బలమును కలుగజేయును. దీనిమాంసము నుండి చమురుతీయుదురు. దానిని పందిక్రొవ్వు అనిపిలచెదరు. పంది క్రొవ్వు పాషాణములు మొదలగు పొగసరుకులను కట్టి భస్మముచేయుటకనుకూలించును. వాతపునొప్పులకు మర్దనా (పందిచమురు) చేసిన మంచి గుణము కనిపించును. సంభోగశక్తి లేనివారికి రసకర్పూరము, పంది చమురు, తేనె, కలిపి అంగమునకు మర్దనాచేసిన లేపనశక్తి హెచ్చును. దీనిమాంసముగాని, వెంట్రుకలుగాని పొగవేసిన సమస్తగ్రహములు వదలిపోవును. దీనిపిత్తముతో కొన్నికొన్ని ఔషధములు మర్దనభావన

లను చేయుదురు. పంచపిత్తములలో నిదియొకటి. దీనిదంతముతో కత్తి పిడులు చేయుదురు. పంచపిత్తములు అనగా అడవిపంది, నెమలి, దున్నపోతు, మేక, తాబేలు, లేక గండుమీను.

ఇంగ్లీషులో Wild Fig. సంస్కృతమున వనవరాహ. హిందీలో సువర్, సూకర్.

అడవి పసుపు:—దీనిదుంపయే ఔషధములయందు ఉపయోగము. మిక్కిలి వేడిచేయు స్వభావము. కారములో చేదు రుచి. చర్మవ్యాధులు హరించును. ఇది కందసారముగలది. వాతరోగము, క్రిమిరోగముకూడ హరించును. అగ్నిమాంద్యము హరించి జఠరదీప్తి చేయును. దీనిదుంప చూర్ణము ధూమపానవిధిగ పొగబీల్చిన ఆయాసము, దగ్గు, శ్లేష్మము, మొదలగు కఫసంబంధమగు బాధలు శమించును. అడవి పసుపుకషాయము పెట్టి పుక్కిలించిన నోటిపుండ్లు, ఇగుళ్ళసలుపులు, దంతబాధలు పోవును.

సంస్కృతమున వనహరిద్ర. హిందీలో వన్‌హర్ది బెంగలిలో వనహలుద్. మరాటీలో సాలీ. కొంకణదేశమందు అడివిపసు, అరిసన్. తెనుగు కస్తూరిపసుపు. బొంబాయిప్రాంతములో సుగామజ్జల్. తను కస్తూరీమంజల్.

అడవి పావురము:—పావురముచూడుము.

అడవి పెసర:—ఇది తీపి వగరు రుచులుకలది. గురుత్వమైనది. అగ్నిని మందగింపజేయును. త్వరగ జీర్ణముకాదు. పైత్య శాంతి చేసి తాపజ్వరమును పెసరకట్టు హరించును. చక్కని వీర్యవృద్ధినిచ్చును. కఫమును పెంచును. గ్రాహి, శీతలము, పచ్చనిరంగుగల పెసర మిక్కిలి గుణవంతమైనది. మామూలు పెసల గుణములు దీనియందును గలవు. సంస్కృతమున వనముద్గ, కువనకే. హిందీలో వన్‌మూంగ్.

అడవి పిప్పలి:— పిప్పలిచూడుము.



అడవి పొట్ల:—దీనినే చేదుపొట్ల అని చెప్పవచ్చును. మామూలు పొట్లవలెనే ఇదికూడ తెల్లని పువ్వులతో నుండునుకాని ఆకులొంచము చిన్నది. కాయకూడ చాలపొట్టి. రెండు అంగుళము కన్న ఎక్కువ వుండదు. తీగ నాలుగయిదుగజముల దూరముకన్న ఎక్కువప్రాకదు దీనిసమూలము ఉపయోగకరమైనదే. వేడిచేయు స్వభావము. చేదులో కారము. విపాకమున కారపురుచియే. పాదుచచ్చిపోయినను పండు కొంతకాలమువరకు పచ్చిగనే కన్పించును. అందువలననే దీనికి అమృతఫలమని పేరుపెట్టిరి. ఇది సర్వాంగసారమైనది. మలబద్దము హరించును. విరేచనముచేయును. శ్లేష్మముహరించును. రక్తశుద్ధి చేయును. సాధ్యకుష్ఠువుల హరించును. శరీరమునందలి దురదలను పోగొట్టును హృదయమును బాగుపరచును. వీర్యమును వృద్ధిపొందించును. గుల్మమును పోగొట్టును. దీనితో తయారుచేసిన తామ్రభస్మము, యాకృత్ ప్లీహాల నణంచును. నరిపుసుగులకు పరమ శక్తివ్వు వేరు బాగుగా విరేచనము చేయించును. ఆకు పైత్య శాంతి చేయును. ఆకు 1 తులము, ధనియాలు 1 తులము ఇవి ఏకముచేసి రాత్రి 8 రెట్లు జలములో నానించి ప్రొద్దుటతీసి కషాయము సేవించిన కాండము శ్లేష్మమును పోగొట్టును. పండు త్రిదోషహరమైనది. వట్ల వేర్ళు మధుమిశ్రితముగా సేవించిన పైత్యజ్వరము నశించును. చేదపొట్ల ఆకులు చూర్ణముచేసిగాని, కషాయముపెట్టిగాని, పంచదారచేర్చి పుచ్చుకొనిన రక్తపైత్యము హరించును. నరాల్వయ రోగమునందు సమూలము చిదుగకొట్టి కషాయముపెట్టి సేవించవలెను. చూర్ణము తులము మోతాదు. ఆకుగాని, పండుగాని, కషాయముగాని, కూరగ వండుకొనిగాని భుజించిన సజ్జవ్యాధి హరించును. బీజములు విరేచకారులు. క్రిమినాశము చేయును. మసూచికము వ్యాపించియున్నచోట పొట్లచేదు కషాయము త్రాగిన విరేచనములయి మసూచికము

రాకుండా నాపును. అడవిపొట్లపండులో వాము కారం కలపి ఎండబెట్టి వరుగుచేసి ఆ వరుగు పథ్యముగా వేయించుకొని తిందురు.

సంస్కృతమున పటోలా పాండుఫలః, హిందీలో కడుమపరవక్, బంగాలీలో పిక్తపటోక్, పిత్‌సక్‌తా, మరాటీలో కడమ పడవక్, గుజరాతీలో కడుమ పటోక్.

☞ అడవిమల్లె :—ఇది నేపాళదేశమందు పెరుగు ఒకానొక వృక్షము. ఆకులు గుండ్రములో కోలదనం కలిగియుండును. పూవులు మామిడి పూవులవలె గుత్తులు గుత్తులుగ పూయును. సువాసన గలిగి యుండును. ఇది కారము చేదు రుచి కలిగియుండును. విపాకమున కారపు రుచిగ మారును. నాసికా కర్ణ జిహ్వా రోగములను మాన్పును అని చెప్పెదరు. అడవిమల్లె తీగజాతిలోనిది. పొదలపై ప్రాకును. తెల్లనివంటి రేకపువ్వులు పూయును. మల్లెపువ్వులమాదిరి వాసన గలిగి యుండును ఉష్ణముచేయు స్వభావము. చర్మరోగముల హరించును. దీని ఆకులు తమలపాకులలో చేర్చి నమలి మ్రింగినచో ఆయాసము, దగ్గు మొదలగు కఫ ప్రధాన రోగములు హరించును. నిమ్మరసము ఆకు రసము సమముగా చేర్చి శరీరమునకు రాసిన చిడుము, గజ్జి, తామర మొదలగు చర్మవ్యాధులు హరించును.

సంస్కృతమున వాసంతీ, ఇంగ్లీషులో **Wild jasmine**. హిందీలో బేలా, బంగాలీలో వల్లికా.

☞ అడవిబచ్చలి :—ఇది చలువచేయును. కారములో తీపిరుచి. విపాకమున తీపిరుచిగ మారును. మలబద్ధము, విశేషముగ కఫము జేయును. రక్తపైత్యము విషం హరించును. సంస్కృతమున పాలంక్యా.

☞ అడవిమాదీఫలము :—ఇది చలువచేయు స్వభావం గలది. పులుపురుచి. విపాకమున పులుపు రుచిగానే యుండును. నాలుక



మొదలుకొని ఆమాశయమువరకుగల భాగమును శోధించును. అరుచిని పోగొట్టి అగ్నిదీప్తి నిచ్చును. మాదీఫల రసములో సైంధవలవణము చేర్చి నాలుగు చుక్కలు ముక్కులో నస్యము చేసిన సన్నిపాత జ్వరములో మాంద్యము హరించును. జిగట విరేచనములు, మూలశంఖలు హరించును. తొనల రసము శూలను పోగొట్టును. గింజలు వంధ్యస్త్రీల దోషము హరించును. శ్వాసకాసలు పోవును. సంస్కృతమున వనాఢ్య అందురు.

☞ అడవిమొల్ల :—ఇది చేదు కారము రుచిగలిగి యుండును. త్రిదోష శమనము చేయును. కండ్లకు, పండ్లకు నోటికి హితవు గలిగించును. ఇది మూత్రప్రధానమైనది. మూలసారము. సంస్కృతమున యూథికా అందురు.

☞ అడవివాము :—వాము చూడుము.

☞ అడవిమెంతులు :—మెంతులు చూడుము.

☞ అడవివాయింట :—ఇది అడవి తులసి జాతిలోనిది. కారపురుచి. వేడిచేయు స్వభావము. విపాకమున కారపు రుచిగానే మారును. దీని ఆకు పసరు దయ్యములు పట్టినవారికి వంటికి బూసినను, ఆకు ధూపము వేసినను గ్రహములు వదలిపోవును. దీని వాసన వానికి గిట్టదు. సంస్కృతమున బర్బలీ, ఇంగ్లీషున **Gynandropsis pentaphylla wild** అందురు.

☞ అడవిసదాప :—దీనిరుచి తియ్యగా నుండును. చలువచేయు స్వభావము గలది. మధురవిపాకి. అర్శోరోగమును పోగొట్టును. త్రిదోషములను పోగొట్టును. క్షయకు మంచిది. వీర్యవృద్ధిని కలిగించును. సంస్కృతమున మైత్రేయ, ఇంగ్లీషున **Peucedanum sowa wildrue** అందురు.

అడ్డసరము:—ఇది గుల్మజాతిలోనిది. దీని ఆకు కోలగా పెళుసుగా నుండును. దీనికి విత్తనములేదు. కొమ్మపాతినచో మొలకయెత్తును. ఇది తెల్లని పూవులు గుత్తులు గుత్తులుగ పూయును. ఆకు పెళుసు అగుటచే స్వరసమురాదు. వచ్చినను బహు తక్కువ. అతికష్టముమీద వచ్చును. దీని సర్వాంగములు మందుల కుపయోగించును. ఈ చెట్టులో రాగిలోహము కలదని చెప్పుదురు. పువ్వులనుండి (తేనె) మకరంద బిందువులు బిందువులుగ రాలుచుండును. ఇది చలువచేయు స్వభావము కలది. శ్లేష్మమును హరించును. శ్వాసకాసలను పోగొట్టును. రుచిచేదు. విపాకమున కారపు రుచిగా లఘువుగా మారును. పైత్యములు నశింపచేయును. రక్తపిత్త వ్యాధి అనెడు మదించిన గజమునకు ఇది సింహమువంటిది. స్వరభంగమును బాగుపరచును. కఫపిత్త జ్వరము హరించుటలో నిపుణమైనది. స్త్రీల అసృగ్దర వ్యాధులు హరించుటకు మంచి మందు. చచ్చువాతము, కుష్టము మొదలగు వ్యాధులు దీనిసేవవలన హరించును. శ్వాసకాస, రక్తపిత్తము, క్షయ, జ్వరము, మేహము, కామల, వమనము, తృష్ణ, అరుచి. కుష్ఠము హరించును. రక్తపైత్య వ్యాధి అనగా రక్తముచెడి పిత్తదోషముతో గూడినదై చెవులు, ముక్కు, నోరు, కన్నులు, మూత్రద్వారము వీనివెంట రక్తము స్రవించు రోగము. గుదమునుండియు రక్తము స్రవించును. దీనికి చికిత్స వాసాఘృతము. అడ్డసరపుఆకు, పువ్వులు, మోదుగ పువ్వులు వేరు మెత్తగ చిదుగకొట్టి కషాయముకాచి ఆ కషాయములో ఆవునెయ్యి పోసి కాచుచున్న సమయమున పై వస్తువులు నూరిన ముద్దవైచి ఘృతపక్వవిధిగా పాకముచేసి సేవించిన రక్తపైత్యవ్యాధి హరించుటకు సందేహములేదు. (చరకము) అడ్డరసపు పువ్వులతో కాచిన నేతిలో తేనె చేర్చి సేవించిన శోషవ్యాధి, క్షయ, శ్వాసకాస హరించును కేవలము శ్వాసగాని, కాసగాని (దగ్గులేని) కళ్లెపడని దగ్గుగాని హరించును. మరియు అడ్డసరపు పువ్వులు, ఆకులు కషాయముపెట్టి



అందు పంచదార తేనెచేర్చి సేవించిన పైత్యశ్లేష్మజ్వరము, ఆమ్లపిత్తం, కామలరోగము హరించును. అడ్డసరపువేరు తెచ్చి కష్టపడుచున్న గర్భిణీస్త్రీ మొలకుగట్టినను వేరు గంధముతీసి పొత్తికడుపునకు, నాభికి, యోనికి లేపనముచేసినను సుఖప్రసవమగును. (చక్రదత్త స్త్రీరోగ చికిత్స) అడ్డసరము లేతఆకులు పసుపు నేరేడుచెక్క రసములో నూరి శరీరమునకు మూడురోజులు పూసిన కచ్ఛూఅనెడు కుష్ఠముహరించును. మరియు అడ్డసరపు ఆకులు నీడనుఆరించి చూర్ణంచేసిగాని, వేరుపైపొట్టిగాని, కాగితమున చుట్టిగాని, లేక చిలుములోవేసిగాని పొగపీల్చిన ఎట్టి ఉబ్బసపు వ్యాధిఅయినను తత్క్షణము హరించి సుఖము నిచ్చును. రసాయనశాస్త్రజ్ఞులు దీనియందు ఉబ్బసముహరించు శక్తి ముఖ్యంగా కలదని పరిశోధనలవల్ల కనిపెట్టినారు. బెంగాళీయులు యీ వ్యాధికి దీని ధూమపానమున విశేషగుణము కలదని తరుచువాడుచుందురు. అడ్డసరముతో తయారుచేయు లేహ్యము అరిష్టము ఈ రెండు మనపూర్వులు కనిపెట్టి వానికి ప్రాముఖ్యతనొసంగిరి. ఉబ్బసమునకు పై రెండును ముఖ్యంగా వాడతగినవైయున్నవి. అడ్డసరము పువ్వులు పిత్తరసము, కటిపాకము, కాసము, క్షయరోగముల హరించును.

సంస్కృతమున వాసకసా. హిందీలో అడూసా, బాకస్ బకసా. బెంగాలిలో వాసక్. మరాటిలో అడుసా. కర్ణాటకమున ఆడ్సోగే. ఇంగ్లీషులో Adhatoda justicia-adhatoda.

అతిమధురము:—ఇది వేరు ప్రధానమైనది. గుల్మజాతిలోనిది. రుచి తీపితోగూడిన కారము. విపాకమున తీపిరుచిగనే మారును. నోటిలోవేసికొనిన నాలుక చిమచిమలాడి లాలాజలము స్రవించును. నోటిని శుభ్రపరచును. విషము జ్వరములలో విదాహముకట్టును. మరియు నాలుక ముల్లుబారి దాహము పుట్టినప్పుడు గండూషము

చేయించుటకు లేఖనక్రియకు నుపయోగించును. శరీరమునకు బలమొసంగి వీర్యవృద్ధిని చేయును. వీర్యస్తంభన చేయును. కేశములకు రంజన మొనరించును. కండ్లకు బలమొసంగును. మరియు నిగనిగ, మెత్తదనము నిచ్చును. మెదడుకు చలువచేయును. బాలనెరుపులు హరించును. స్త్రీల కుసుమ వ్యాధులు హరించును. ఎఱ్ఱకుసుమవ్యాధి హరించు ఔషధములో దీని ఉపయోగముకలదు. నేత్రరోగముల కిది చాలమంచిది. పైత్యశాంతిచేయును. వాంతిని కట్టును. క్షయకు చాల మంచిది. వ్రణములయందలి కుళ్ళును పోగొట్టి మాన్పును. ముఖసంబంధ వ్యాధులలో నిది యుపయోగించును. యష్టిమధుకము చూర్ణించి, పాలతో గలిపి త్రాగిన ముసలివారికి సహితము బలమొసంగి రోగములను అడ్డుకొని చిరకాలము బ్రతుకునట్లు చేయును. ఇది రసాయనము. శొంఠి, యష్టిమధుకము కషాయముపెట్టి ఆవుపాలలో కలిపి త్రాగినను లేక యష్టిమధుకచూర్ణం పాలలో కలిపి త్రాగినను క్షతక్షీణము హరించును. క్షతక్షీణము అనగా గుండెలోనుండు అవయవమునకుగాని ఇతర మర్మావయవమునకుగాని దెబ్బతగిలినచో ముఖంనుండి రక్తం పడును. మనిష్యుడు క్షీణించును. యష్టిమధుకము నేలగుమ్మడి కలిపి కషాయంపెట్టి త్రాగిన వాతరక్తము హరించును. వాతరక్తమనగా వాతంప్రకోపించి రక్తమునుచెరిచి అరికాళ్ళలోను అరిచేతులలోను నల్లనిమచ్చలుపుట్టి తిమ్మెరపోట్లు కలుగువ్యాధి యష్టిమధుకమును, మంచిగంధంను పాలతో మెత్తగానూరి ఆముదపాలలోగలిపి త్రాగిన రక్తవాంతి కట్టును. ఇది నమలిన శలైనా పుట్టును. శ్లేష్మం గడ్డకట్టి గొంతులో చిక్కుకొని ఊపిరాడని సమయంలో అతి మధురసము శ్లేష్మమును కరగించి, శ్వాసను చక్కబరచును. పొడిదగ్గు, ఆస్మా మొదలగు కఫ ప్రధాన రోగములు అతిమధుర రసమున కట్టును. ఇట్లు నవీన వైద్యకమతమున గలదు.



శ్లో॥ యష్టిహిమా గురుః స్వాద్వీచక్షుష్యా బలవర్ణకృత్
సుస్నిగ్ధా శుక్రలాకేశ్యా స్వర్యాపిత్తాని చాప్రజిత్
వ్రణశోఫ విషచ్ఛర్ది తృష్ణాగ్లాని క్షతుసహా॥

సంస్కృతమున మధుయష్టి. Glycyrrhiza glabra. హిందీలో ములహాటీ, ముకేటీ, ఖిారీ, కారీ. బెంగాలిలో యష్టిమధు, గుజరాతిలో జేరీ, మధుమూల్. The weil knoum siguarice root.

అతివస:—దీనిదుంపనే వైద్యమున కుపయోగింతురు. కంద సారముగలది. ఇది మొక్కజాతికి చేరినది. చేదు కారం రుచికలిగి యుండును. వేడిచేయు స్వభావము. విపాకమున కారపురుచిగ మారును. దీనికి అతిసారఘ్ని అనిపేరు. శ్లేష్మం, పైత్యం, జ్వరం హరించును. ఆమవిరేచనములను, దగ్గును, విషమును హరించును. క్రిములను సంహరించును. మరియు వాతనొప్పులకు, మేహములకు దీనిఆకు చాల మంచిది. అతివిష అగ్నిదీప్తిని కలిగించును. గాన శొంఠి అతివిష కషాయంపెట్టి యిచ్చిన ఆమవిరేచనములు కట్టును. అతివస, తుంగ దుంపలు, పిప్పళ్లు. కర్కాటకశృంగి ఈ నాలుగు సమభాగములు చూర్ణంచేసి 3-4 గింజలఎత్తు చూర్ణం తేనెతో యిచ్చిన పిల్లలకు గలుగు జ్వరం, దగ్గు, పైత్యం, విరేచనములు కట్టును అని వైద్యగ్రంథములయందు గలదు. జాజికాయ, అతివిష, పొంగించిన వెలిగారం, (బాలింతబోలు) రససింధూరం, దేశవాళిగుగ్గిలం కొడిశపాలగింజలు, నల్లమందు, జాపత్రి. లవంగాలు, ఖర్జూరపుకాయలు మర్దించి లఘుపుటంపెట్టి మాడకుండా తీసి తేనెతో మర్దించి కందిగింజలవలె మాత్రలుచేసి అనుపానవిశేషముల యిచ్చిన నీళ్ళవిరేచనములు ఆంబ విరేచనములు, రక్తవిరేచనములు కట్టును. కడుపునొప్పులు హరించును. ఇది జాతీఫలాది మాత్రలని చెప్పబడును. ఈ యోగం ఒకానొక ఘన వైద్యునిచే వాడబడుచుండెడిది. అనుభూతము. ఇది కాశ్మీరదేశమున పుట్టును. తెలుపు, నలుపు రెండురకములు. తీపిలో నిక్కిలిచేదు, ఇవికుంతము,

సంస్కృతమున అతివిషా. హిందీలో అతీస్. పంజాబీలో తతీస్. బెంగాలీలో ఆచఇచ్. మరాటీలో అతివిష. గుజరాతీలో అతివఖ్. అతివిష. ఇంగ్లీషులో Aconitum heterophyllum an erect leafy herb.

అనాసపండు :— ఇవి ఆంధ్రదేశమునందలి విశాఖపట్నముజిల్లా సింహాచలము కొండయందును, క్రిందప్రదేశమునందును నీటిధారల సమీపమున బెరుగును. ఇది కిత్తనార చెట్టువలె మట్టలు గలిగి గజము ఎత్తువరకు బెరుగును. మట్టలు పొడుగుగా నుండును. అంచున ముండ్లు వుండును. ఆకుల మధ్యనుండి కాయ పుట్టును. ఆ కాయకు గదులు గదులుండును. పచ్చికాయ పచ్చగను, పండు ఎరుపుతో గూడిన పసిమి వర్ణముగను ఉండును. చలువచేయును. తీపిరుచిగా నుండును. విపాకమున తీపిరుచిగానే వుండును. దీనికి విత్తనము పండుతో బుట్టిన గుజ్జు మొలకయే విత్తనము. కాయ పండిన తర్వాత చెట్టు చనిపోవును. అరోచకము, దప్పిని హరించును. శ్రమము నడంచును. మేహశాంతి చేయును. పచ్చికాయ త్వరగా జీర్ణముకాదు. పిత్తకఫముల బెంచును. ఈ పండ్లు వేసవికాలములో వచ్చును. ఈ పండ్లను భుజించుటకుముందు చక్కగా పెచ్చుకోసి ఉప్పుతో బాగుగాకడిగి ముక్కలుకోసి పంచదార అద్దుకొని తిందురు. ఆ ప్రకారం చేయనియెడల నోరుఅంతయు దురద పెట్టును. ఈఫలం గర్భిణీస్త్రీలు భుజించరాదు. భుజించినచో గర్భస్రావం చేయును. పచ్చికాయ రసములో ఈ శక్తి విశేషముగా కలదు. పచ్చికాయ రసములో ఉప్పుచేర్చి గర్భిణీస్త్రీలు త్రాగినచో 24 గంటలలో తప్పక గర్భస్రావమగునని ఆధునిక వైద్యులు పరిశోధనల మూలముగా కనుగొనినారు. దీనిలో ఈ క్రింది పదార్థము లుండినట్లు కనుగొనినారు. Phosphoric (ఫోస్ఫారిక్), Sulphuric acids (సల్ఫ్యూరిక్ ఆసిడ్), Lime magnesea (లైమ్ మాగ్నీషియా), Silica (సిలికా),



Iron (అయిరన్), Sodium (సోడియం) మొదలగునవి. ఆకుల రసములోకూడా గర్భస్రావము గలిగించు గుణము కలదని పరిశోధనల ఫలితముగా తేలినది. మూడు నెలల లోపు గర్భములను సులువుగా బోగొట్టునని తెలియుచున్నది. గాన గర్భిణీస్త్రీలు ఎంతమాత్రము అనాసపండును భుజింపరాదు. సంస్కృతమున అన్నంనాసా, ఇంగ్లీషున Pineapple European jack fruit అందురు.

అనుములు :— ఇది చిక్కుడు జాతికి చెందినది. ఆకు పువ్వు చిక్కుడువలెనే యుండును. కాయ మదము వాసనగలది. గింజలు ప్రధానమైనవి. రెండు మూడు గజములకన్న నెక్కువ దూరము ప్రాకదు. ఈ పువ్వుల వాసన కోతులకు గిట్టదు. పైరుచేలను కోతులు పాడుచేయకుండా కోతులు విస్తారముగా గల గ్రామముల రైతులు పైరుచేలకు చుట్టు అనుముకూడా పైరుచేయుదురు. గింజలు వగరుతో గూడిన తీపిరుచిగలవి. విపాకమున పులుపురుచిగ మారును. అనుములు వేయించి పప్పు చేయుదురు. ఆషాఢమాసంలో అనపప్పు మునగకూర కలిపి వండి తిందురు. ఇందువలన విషరోగములు హరించునని నమ్మకం. అనుములు గుగ్గిళ్ళు చేసికొని భుజించిన త్వరగ జీర్ణంకాక కడుపు ఉబ్బి అపానమార్గంన వాయువు ధ్వనితో వెడలును. బాలెంతలకు స్తన్యవృద్ధి చేయును. విషం, వాపులు, కఫం హరించును. సంస్కృతముననిష్పావ. ఇగ్లీషులో A sort of beans.

అనులేపములు :— ఆ యా వస్తువులు చూడుము.

అనూపదేశము :— మన్యప్రదేశములన్నియు సాధారణంగా అనూపప్రదేశములనియు. చెప్పబడును. ఇచ్చట చెరువులు, సెలయేరులు, చెట్లచేతను గప్పబడి యుండును. తేమతో జిమజిమలాడు భూమి గలిగియుండును. ఇచ్చటబుట్టిన ఓషధులు, పక్షులు, జంతువులు అన్నియు శ్లేష్మవృద్ధిని గలిగించును. అందుచేతనే అందలి నీళ్లు త్రాగిన

జ్వరములు సాధారణంగా రాకమానవు. శీతోష్ణసితులుగూడ విషమముగనే యుండును. ఇంగ్లీషులో Water on imarty graund.

అన్నభేది :—ఇది ఖనిజపదార్థం. అన్నభేదిని కాశీసమందురు. ఇది రెండు విధములు. 1 పుష్పకాశీసం. 2 ధాతుకాశీసం. ఇందులో పుష్పకాశీసము శ్రేష్టం. ఉప్పు, తీపి, వగరు, అను మూడు రుచులు కలవు. వేడిచేయు స్వభావం. విపాకమున పులుపు రుచిగ మారును. కాశీసంలో లోహం కలదు. గుంటకలగరాకు రసంలోను, నిమ్మకాయ రసంలోను భావనచేసిన అన్నభేది శుద్ధియగును. శుద్ధిఅయిన అన్నభేదిని నిమ్మకాయ రసంతో మర్ధించి బిళ్ళకట్టి ఆరించి పుటం వేసిన ఎఱ్ఱగ భస్మమగును. దీనిని కాశీస సింధూరనుందురు. కాంతకాశీసమను నొక భస్మప్రక్రియగలదు. గంధకం, కాశీసం, నిమ్మపండ్ల రసంతో నూరి పుటంవేయవలెను. కాశీసభస్మం అజీర్ణమును పోగొట్టును. నేత్రరోగములకు హితమైనది. వాతకఫములను, దగ్గును, విషమును, హరించును. బొల్లిని హరించును. పాండువును పోగొట్టును. కేశములను నల్లబరచును. మృదుత్వం కలుగజేయును. నెరపులను తగ్గించును. కేశరంజనమునకు దీనితో చాలవుపయోగములు కలవు. స్త్రీల ఋతుబద్ధం హరించును. వ్రణంలను శోధించి మాన్పును. చంటిపిల్లల అజీర్ణ విరేచనములకు కాశీసభస్మం శొంఠిచూర్ణం ఈ రెండును కలిపి స్వల్పమోతాదు నేతితో ఇచ్చిన కట్టును. శొంఠి, పిప్పలి, మిరియములు, కరక, తాడి, ఉసిరికలు చూర్ణంతో కాశీభస్మం జతచేసి ఇచ్చిన మృత్పాండువు నశించును. తేనె అనుపానం, మృత్పాండువు అనగా పిల్లలు మట్టిగాని, వెలిబూడిదగాని, సుద్దగాని తినినప్పుడు రక్తం చెడిపోయి తెల్లబడుదురు. ఇది మృత్పాండువు అని చెప్పబడును. తేనెతో కాశీసభస్మం సేవించిన దగ్గు, ఆయాసం కట్టును. కాశీసభస్మం ముసాంబరం, వెలిగారం, ఇంగువ సమభాగములు కలబందరసమున మర్ధనచేసి,



మాత్రలుకట్టి సేవించిన ఋతుబద్ధం హరించును. గుంటకలగరాకు రసంలోను, గాడిదగడపాకు నిమ్మకాయ రసంలోను, నూరి పుటం వేసిన అన్నభేది భస్మం ఉసిరికాయ రసంలోనిచ్చిన ధారుణమగు ఉబ్బులు హరించును. చప్పిడి పత్యం చేయవలెను. పూటకు చిన్నం మోతాదు రెండుపూటల మందునియ్యవలెను. పచ్చిఉసిరికాయలు దొరకనిచో ఉసిరిక వలుపురసంతో నీయవచ్చును. పచ్చగ, వగరుగ నుండును. శీతలం, స్నిగ్ధం, కాంతివర్ధకం, నేత్ర కేశ హితకరం, కుష్టం, క్రిమి హరించును.

సంస్కృతమున కాశీసం. ఇంగ్లీషులో Green sulphate of iron. హిందీలో కాశీస్. బెంగాలిలో హోరాకస్, పుష్పకాచ్సము.

అన్నము :—వరిఅన్నము, గోధుమాన్నము, జొన్నఅన్నము. కొఱ్ఱ, గంటె, చామ, ఆరిక మొదలగు అన్నములు కలవు. ప్రాయికముగా వరిఅన్నమే జనులందరు భుజింతురు. అన్నము సర్వప్రాణులకు హితమైనది. చలువచేయు స్వభావము గలది. షడ్రసములతో గూడిన పదార్థమును జేర్చి తిన్నప్పుడే అన్నము రుచించును. విడిగా ప్రత్యేకము అన్నము తినుటకు హితవుండదు. అన్నములో తీపి వగరు రుచులు ఇమిడివున్నవి. అన్నము తినునప్పుడు చన్నీటిని అప్పుడప్పుడు త్రాగుచుండవలెను. ఇందువలన జఠరాగ్ని వృద్ధియగును. అన్నముతో పులిహోర అనబడు చిత్రాన్నమును, చక్రపొంగలి అను ముద్గాన్నమును, దధ్యోదన మనబడు తధ్యాన్నమును (పెరుగుతో కూడిన అన్నము), కేసరీభాత్ అను సుగంధమిళితాన్నమును, పాయసమను క్షీరాన్నమును ఇంకను అనేక విధములుగా తయారుచేసి భుజింతురు. ఇందుచేరిన వస్తుగుణములనుబట్టి వాని వాని గుణములుబుట్టును. అన్నం భుజించునప్పుడు కాళ్లు చేతులు పరిశుభ్రముగా కడుగుకొని పద్మాసనస్థుడై నిర్మల మనస్సుతో తన శరీరబల జఠరాగ్నులయందు లక్ష్యముంచి ప్రాఙ్ముఖ

ముగ గూర్చుండి భుజింపవలెను. భుజించునప్పుడు మాటాడరాదు. తొందరగాగాని, అతినెమ్మదిగాగాని భుజింపరాదు. పదార్థములయందు లక్ష్యముంచి ఏవి సేవ్యములో ఏవి విసర్జనీయములో గ్రహించి భుజించిన ఆ యన్నము శరీరమునకు మేలు చేకూర్చును. మరియు కొంచెము వెచ్చగనున్న అన్నమే తినుటకు యోగ్యమైనది. తన శరీరమందు జఠరాగ్ని సమముగ తేజరిల్లుచు ధాతువులు స్వభావసిద్ధముగ నిర్మలములై త్రేనుపులు తేలికగా వచ్చునప్పుడే భోజనముచేయుకాలమని తెలియవలెను. అప్పుడు సమమైన ఆకలికూడ కలిగియుండును. ఇందుకు భగవద్గీతయందు—

"అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః
ప్రాణాపాన సమానశ్చ పచామ్యన్నం చతుర్విధం."

అని కలదు. భగవంతుడే అగ్నిరూపుడై ప్రాణులు భుజించు ఆహారమును పక్వము చేయుచున్నాడు. అన్నము ఎట్లుండవలెను? అన్నము పరిశుభ్రమైనదిగ, తెల్లగ, కంటికింపు గలుగజేయునదిగ, గంజి వార్చినదిగ, మృదువుగ నున్న యన్నమే శ్రేష్ఠమైనది. అన్నము తినిన వెంటనే శరీరమునకు బలమొసంగును. వెరడాపుబియ్యము అన్నము ఎఱ్ఱగనుండును. స్త్రీ కుసుమ వ్యాధులయందు పథ్యము. బియ్యము కొంచము వెచ్చచేసి వండిన అన్నము తేలికనిచ్చును. గుణకారి. మూత్రమును జారీచేయును. అన్నదోష జ్వరములలో అన్నము పసుపు చేర్చి మాడపట్టిన కాచిన దోషము హరించును. అన్నమునుండి సారా తయారు చేయుదురు. అన్నమునందు కొంచెము మత్తుగుణముకూడ కలదు. అన్నమునందు హితవు తప్పిన ఉపద్రవమునకు మూలాంకురం. అన్నద్వేషం కలుగరాదని మనవారు సాధారణముగ చెప్పుచుందురు. మిల్లులో తయారయిన బియ్యపుటన్నము గుణహీనమైనది. కొంచెం తవుడుతోనున్న బియ్యపుటన్నం శ్రేష్ఠమైనదిగ పరిశోధించి తెలుపు



చున్నారు. ఇంగ్లీషులో Boiled rice సంస్కృతమున ఓదనః. హిందీలో భాత్.

అభ్యంగము:—అభ్యంగము అనగా పాదములనుండి తలవరకు ఓషధీమిళితముగు భృంగామలక, అమృతామలక, మొదలగు తైలములతో మర్దనచేసికొని స్నానము చేయుట. ఇందువలన శరీరమునకు తేలిక, సుఖనిద్ర, ఇంద్రియములకు తేజస్సు, బలము, అగ్నిదీప్తి, ఆరోగ్యం, ఆయువృద్ధి కలుగును. ఈ సంస్కారం ఆరోగ్యవిధులలో నొకటి. చర్మమునకు కాంతి, నునుపు కలుగును. చర్మరోగములు హరించును. భోజనం చేసిన పిమ్మట తలంటుకొనరాదు. మరియు అజీర్ణరోగులు, కఫరోగులు, విరేచనములకు మందు పుచ్చుకొన్నవారు తలఅంటుకొనరాదు.

అభ్రకము:—ఇది గనులనుండి త్రవ్వి తీయబడు ఖనిజపదార్థము. ఇందు నాలుగు రకములు గలవు. అభ్రకము నాలుగు విధములు. 1 పినాకం, 2 నాగం, 3 మండూకం, 4 వజ్రం. పినాకం రంగు నలుపు. అగ్నియందువైచిన ధనుస్సు నారి ప్రయోగించినట్లు ధ్వని కలుగును. నాగం రంగు నలుపు. అగ్నియందువైచిన పాము బుస్సువలె బుస్సుకొట్టును. మండూకం రంగు నలుపు. అగ్నియందువైచిన కప్పవలె దుముకును. వజ్రం రంగు నలుపు. అగ్నియందువైచిన చిటపటగాని, పొగగాని లేక యథాస్థితిగ నుండును. దీనినే కృష్ణాభ్రకమందురు. శ్రేష్ఠమైనది. సమస్త ఔషధ కర్మలయందును కృష్ణాభ్రక భస్మం వాడబడుచున్నది. శ్వేతాభ్రకముగూడా కొన్ని కొన్ని రోగములయందు వాడబడుచున్నది. అభ్రక మనినంతనే కృష్ణాభ్రకమనియే స్ఫురించును. ఇది యోగవాహిని. ఇది ఔషధములచేరి విశేషగుణ మిచ్చుచున్నది. కేవలం సేవించినను ఆయురారోగ్యముల ప్రసాదించుచున్నది. అభ్రక

పరీక్షకు రేఖాపూర్ణము కావలెను. అనగా భస్మమునందు వ్రేలిపెట్టి నొక్కినచో వ్రేలిరేఖలు స్పష్టముగా కనుపించవలెను. నిశ్చంద్రికగా నుండును. అనగా తళుకు ఉండరాదు. వారితరము గావలెను నీటిపై నిడిన తేలవలెను. ఇది సాధారణ పరీక్ష. ఇంకొక పరీక్షా విధానం కలదు. మనము భుజించు వస్తువులన్నియు నొక పాత్రయందుంచి అందు అభ్రకభస్మముచేర్చి మూతపెట్టినచో తెల్లవారుసరికి అంత అన్నము పదార్థములు నీరై యుండవలెను. ఇటులుండినది మేలైన అభ్రకభస్మమని కొందరు వైద్యశేఖరులు చెప్పెదరు. సాధారణముగా ఇట్టి అభ్రకం లభించుట దుర్లభం. అభ్రకం ఎన్ని పుటములు వేసిన అంత గుణకారి. అనగా నూరు పుటములు దాటినమీదట ధాన్యాభ్రక పుటవిధులు రస ప్రదీపిక, భస్మప్రకాశిక మొదలగు గ్రంథములయందు జూడుడు. ఇది తీపి వగరు రుచులు గలది. చలువచేయు స్వభావం గలది. విపాకమున తీపిరుచిగ మారును. క్షయ, వాత పిత్త రోగములు హరించును దుష్ట రక్తమును పోగొట్టి మంచిరక్తమును బుట్టించును. దగ్గు, ఆయాసం, గ్రహిణి, అజీర్ణం, పాండువు కుసుమ వ్యాధులను ఖండించును. శరీరమునకు మంచి కాంతిని, బలమును ప్రసాదించును. వీర్యవృద్ధిచేయును. వేయేల దీనివలన సమస్త వ్యాధులు శమించును. అపక్వ అభ్రకం సేవించిన సమస్త వ్యాధులు కలుగును అభ్రక భస్మమునకు అనుపానములు వెన్న, పంచదార, గుల్కందుతో సేవించిన పైత్యములు, తేనె, శొంఠి, సన్నరాష్ట్రిం, గంటిభారంగి, అక్కలకర్ర, ఏలకులు, లవంగాలు మొదలగు అనుపాన విశేషమున కఫవ్యాధులు, దశమూలకషాయం. నెయ్యి, శొంఠి, పిప్పలి, మిరియములు చూర్ణము మొదలగు అనుపానములతో వాతము, శీతోఫలాది తాళిసాది చూర్ణముగాని, ద్రాక్షాసవము, వాసారిష్టం మొదలగువాని అనుపానముతోగాని సేవించిన క్షయ, కాస, ఊత వేళ్ళ కషాయముతో స్త్రీల ఎఱ్ఱ కుసుమ వ్యాధులు హరించును. ఈ కషాయం పాలతో పెట్టి యివ్వవలెను. రక్తగ్రహణికి



పంచదార. తేనెతో నిచ్చిన కట్టును. నేలగుమ్ముడుగడ్డ చూర్ణము అభ్రకం, పంచదారతోగాని, వెన్నతోగాని సేవించిన వీర్యవృద్ధి చేయును. చాతుర్జాతక చూర్ణముతో అభ్రకం సేవించిన శుక్రనష్టము కట్టును. మోతాదు 3 గింజల ఎత్తు. సంస్కృతమున గగనం, హిందీన అబరల్, ఇంగ్లీషున Mica, బెంగాలీలో అభ్ర అంబర్.

అమరశిల గంధకము :—గంధకము చూడుము.

అయస్కాంతము :—ఇది ఖనిజము. అనగా గనులనుండి త్రవ్వి తీసినది. ఇది అయిదువిధములుగ విభజింపఁబడి యున్నది. 1 భ్రామకము, 2 చుంబకము, 3 కర్షకము, 4 ద్రావకము, 5 రోమకము. ఇందులో పసుపు, ఎరుపు, నలుపు అను మూడుజాతులు కలవు. నలుపు పసుపు జాతికాంతము ఎచ్చటను లేదు. ఇది యినుమును ఆకర్షించు గుణము కలిగియున్నది. కాంతపురాయియందు అన్ని ముఖముల ఇనుము ఆకర్షించునది సర్వతోముఖ అని చెప్పుదురు. ఇది భస్మప్రక్రియకు చాల ఉత్తమమైనది. కాంతలోహపాత్రలో నీళ్ళుపోసి నూనెబిందువు వేసిన వికసించదు. పాలుపోసికాచిన పాలు పొయ్యిలోనికి పొంగిపోవు. అవుగడ్డితో కాంతపురాయి కాల్చిన శుద్ధిఅగును. ఆవుపంచితములో ముంచవలెను. ఇంగువవాసన పైకిరాదు. వేపవల్కలు వాసన చేదు నశించిపోవును. ఇది కాంతపరీక్ష. దీనిరుచి చేదు. ఉష్ణగుణము. విపాకమున కారపురుచిగ మారును. ఐనను చలువచేయును. పరిశుద్ధమైన అనగా వారితరము రేఖాపూర్ణము అయి బాలసూర్యునికాంతివలె సింధూరించిన అయస్కాంత భస్మము సేవించిన క్షయ, పాండువు, కామిల, మూలశంఖ, గుల్మము, ఉదరరోగము. అమ్లవాతము, భగంధరము, కుష్ఠము, మేదోరోగము, విషరోగము, దురదలు మూర్ఛ మొదలగు వ్యాధులను హరించుటయేగాక దీర్ఘాయువును, బలమును, కాంతిని, వీర్యమును కలుగచేయును. మరియు మేహ ఉబ్బులను పోగొట్టును.

రక్తబుద్ధి వృద్ధిని గలిగించును తేనెతో అనుపానము చేసి యివ్వవలెను. ఇందులో బంగాళాకాంతమను లోహము బజారులలో అమ్మబడు చున్నది. అది చక్కగ పుటములువేసి వాడినచో పైగుణములు అన్నియు గలుగును. కాంతముతో కాంతవల్లభరసము, స్వర్ణకాంతవల్లభరసము. కాంతరసాయనము, కాంతాభ్రక సింధూరము. మహావాత రాక్షసము మొదలగు పెక్కు ఔషధ యోగములు కలవు. అవి ఆయా గ్రంథములయందు చూడదగును. మోతాదు రెండు గురిగింజలయెత్తు మొదలు 4 గింజల యెత్తువరకు రోగబలము ననుసరించి యివ్వవచ్చును.

అయిలారము:—ఇది బజారులలో అమ్మబడు నొకజాతి గ్రంధిదినుసు. పూర్వ వైద్యగ్రంథముల యందు దీనిపేరెచ్చటను గనిపించదు. దీనియందు మలమూత్రముల జారీచేయు శక్తి కలదు. పైకి చూచుటకు గలిజేరు వేరువలె నుండును. ఇది మూలసారమైనది. స్త్రీల గర్భకోశమును శోధించును. వేరు నూరిన ముద్దగాని, కషాయముగాని ఉబ్బురోగమునకిచ్చు గంటతర్వాత పెరుగు అన్నము పెట్టినచో స్వేదము పట్టి నీరంతయు హరించును. ఇది గర్భనిరోధక ద్రవమని చెప్పుదురు. ఇంగ్లీషులో A medicinal root.

అరటి:—ఈ చెట్టు పొడవు వెడల్పుగల ఆకులతో విరాజిల్లుచుండును. దీనికి కొమ్మలుండవు. దుంపనుండి పిలకలు పుట్టుచుండును. విత్తనము దుంపయే. ఇందులో అనేకజాతులు కలవు. బంగారు అరటి, వామనకేళీ, తెల్లచక్రకేళీ, ఎఱ్ఱచక్రకేళీ, అమృతపాణి, బత్తీసా, బొంత, బూడిదబొంత, ఏడాకులఅరటి, పచ్చఅరటి కర్పూరచక్రకేళీ, మొదలగునవి పెక్కురకములు గలవు. వీనికి నీరు అవసరము అగుటచేత నీటివసతిగల ప్రదేశములయందు బాగుగ పెరుగును. ఆకులు భోజనము చేయుటకు విస్తృతముగ నుపయోగించును. మేహశాంతి చేయును పరి



శుభ్రముగ నుండును. సంతర్పణ మొదలగు కార్యములలో వీనిని యుపయోగింతురు. బత్తీసా, బొంతకాయలు కూరలకుపయోగింతురు. అరటికాయలందు లోహముకలదని చెప్పుదురు. బూడిద బొంతకూడ కూరలకు పండ్లకు ఉపయోగింతురు. మూత్రపు, నీటిచురుకునకు చక్రకేళీపండు భస్మము ఉపయోగించును. ఒకపిడతలో చక్రకేళీ పండు ముక్కలు వేసి అందునిండుగ నల్లేరుఆకు పసరుపోసి పైన ప్రమిదచేమూసి చీలమన్ను యిచ్చి పుటమువేసిన భస్మమగును. ఈ భస్మము శరీర బలానుసారము పంచదార వెన్న గుల్కందు మొదలగు అనుపానములతో సేవించిన సెగవలన పుట్టిన నీటిచురుకు హరించును. కాయలను పలువిధముల కూరలకుపయోగింతురు, కొందరు ఇగురుకూరలు, ఆవపెట్టికొందరు, వేయించికొందరు, పప్పులోచేర్చి కొందరు తమతమ యుక్తిని అనుసరించి వండుదురు, కాయను కుమ్ములో ఉడికించి లోపలి గుంజులో ఉప్పు కారముచేర్చి పచ్చడిగను ఉపయోగింతురు. ఇది జిగటవిరేచనములను కట్టును. పులుసులో కలిపికూడ పచ్చడి చేయుదురు. కొందరు అరటికాయ బజ్జీలను భక్ష్యవిశేషముల తయారుచేయుదురు. లేతఅరటికాయ వగరుగ నుండును. అరటిపువ్వు కూరవండుకొని భుజింతురు. అజీర్ణముచేయును. కర్ణరోగములను రక్తపిత్తమును దాహమును హరించును. దుంప మేహశాంతిచేయును దూటపచ్చడుల కుపయోగించును. ఇదియును మేహశాంతి చేయునదియే. ఎనుబపాము అనబడు తొడలలో బయలుదేరు వాపునకుగాని చేతులలో బయలుదేరు వాపునకుగాని అరటిదుంపరసములో దుప్పికొమ్ము అరగతీసి పట్టు వేసినను, వెలిబూడిద తడపివేసినను సలుపు మంట తక్షణము హరించును. పండు రుచిగ, స్నిగ్ధముగ, వీర్యవృద్ధికరముగ, పుష్టికరముగ, శీతల, శ్రమ, తృష్ణా, వాతపిత్త, రక్తపిత్త దాహ హరముగనుండును. అరటిపండ్లు శుభకార్యముల కుపయోగింతురు. కాయ పచ్చడి చేయుదురు. అరటి పట్టల నుండి నారతీయుదురు. ఈ నారతో వస్త్రములు నేయుదురు.

అరటిపట్టలు కాల్చిన బూడిదతో మహాద్రావకం అనబడు ద్రావకం తయారుచేయుదురు. ఈ ద్రావకం శూలనొప్పులను హరించును. కర్పూరపు చక్కెరకేళీపండ్లు తినుటకు రుచిగానుండును. వీర్యవృద్ధి చేయును. పచ్చఅరటిపండ్లు నెల్లూరు మొదలగు ప్రాంతములలో విశేషముగా దొరకును. అరటిజాతులలో అడవిఅరటి అనునది యొకటిగలదు. దీని పండ్లలో గింజలు పెద్దవిగ నుండును. దీనిని కాష్టకదళీ అందురు. అరటి పువ్వుతో వడియములు పెట్టుకొందురు. ఇవి శ్వాసకాస, కిలాసకము రక్తాతిసారములయందు హితవుగనుండును.

సంస్కృతమున కదళీరంభా. ఇంగ్లీషున Musa sapientum. హిందీలో కేలా. బెంగాలీలో కలా. మరాటీలో కేల్. గుజరాతిలో కేళ్య.

అరిసెలు:—ఇవి బియ్యము నానబోసి పిండికొట్టి బెల్లంగాని, పంచదారగాని పాకంపట్టి అందు వరిపిండిపోసి కలిపి ముద్దచేసి నూనెలోగాని, నేతిలోగాని గారెలవలెతట్టి వేయించి తయారుచేయబడు భక్ష్య విశేషము. వివాహాదులలో ఫలహారపు వస్తువుగ దీని నుపయోగింతురు. ఇది త్వరగా జీర్ణంకాదు. విదాహం పుట్టును. క్రొవ్వు బెంచును. ఈపిండి ముద్దలో వేచిన నూపప్పు, వేచిన కొబ్బరికాయముక్కలు చేర్చిన పాకపు చలిమిడని అందురు. అజీర్ణకారి. పై రెండు దినుసుల భక్ష్యములకు పాకం ముదురుపాకం రావలెను. ఈ పాకము సరిగా రానిచో అరిసెలు సరిగా వేగక విడిపోవును. మరియు బెల్లం లేతపాకముగా అనగా నీళ్ళలో బెల్లంగాని, పంచదారగాని వేసి కుతకుత ఉడుకుచున్నప్పుడు వరిపిండిపోసి దించి పైవానివలెనే వేయించిన వానిని అప్పములందురు. ఇదియును బలకారి. గురుత్వము చేయును. అరిసెలను అతిరసములనియు, అప్పములను అపూపములనియు పేళ్లు గలవు.

ఆరోరూట్:—ఇది దుంపజాతికి చెందినది. ఇది దేశీయమైనది కాదు. ఈ దుంపనుండి పిండిచేయుదురు. ఈ పిండి బజారులో



ఆరోరూట్ అనిపేరున అమ్మబడును. ఇది తేలికగ జీర్ణమగు పదార్థము. దీనితో జావగా చేదురు. బాలురకు, వృద్ధులకు, రోగులకు, నీరసించిన వారికి, లఘువుగ జీర్ణమగుటకై యిచ్చెదరు. ఇంగ్లీషున Arrow root.

అలచందలు:—ఇది మొక్కజాతి. కొద్దిగ తీగగాకూడ ప్రాకును. దీనిపువ్వు చిక్కుడుపువ్వువలె నుండును. కాయలు సన్నగ గుండ్రముగ నాలుగయిదు అంగుళములుండును. ఆకు చిక్కుడు ఆకును పోలియుండును. మెట్ట ప్రదేశముల యందు వీనిని పైరు చేయుదురు. ఈ గింజలు వేయించి పప్పుచేయుదురు. పప్పు రుచికరముగా నుండును. గురుత్వముచేయును. వగరుతో గలసిన తీపి రుచిగనుండును. మలమూత్రముల జారీచేయును. చనుబాలను వృద్ధిచేయును. పచ్చిపప్పు నానబోసి గారెలు, అట్లు, మొదలగు పిండివంటల చేయుదురు. ఇవి మినప గారెలకన్నను, పెసర అట్లుకన్నను రుచిగానుండును. పప్పు పిండి విసరి అప్పడములు చేయుదురు. గురుగుణం కలిగియుండును. పప్పు వాతమును, కఫమును, ఆమమును బెంచును. బలకరము. వేయించిన లఘుగుణము కలిగి యుండును. పైత్యమును చేయును. పచ్చికాయలు కాల్చుకొని తిందురు. ఆమమును బెంచును. బొత్తు పశువులకు మేతగా నుపయోగించును. ఇది తినిన పశువులు పాలు నెక్కువగా నిచ్చును. ఇందులో బొబ్బర్లని యొకజాతిగలదు. బొబ్బర్లు అలచందలకంటె కొంచెం చిన్నవిగా నుండును. గుణం సమానమే. ఇవి ద్విదళధాన్యముల జాతికి చెందినవి. సంస్కృతమున రాజమాష.

అల్లముగడ్డి:—ఇది ఒక తృణవిశేషము. అల్లము వాసన గలిగియుండును. దీనినుండి తైలము తీయుదురు. ఇది వాతపునొప్పులు హరించును. వేడిచేయును. ఈ గడ్డి కషాయము పెట్టి లోనికిచ్చినను వాతపు నొప్పులు హరించును. పైనపూత పూయవచ్చును. జ్వరమును హరించును. నరములకు బలమిచ్చును. సంస్కృతమున ఆర్ద్రకఘాస. ఇంగ్లీషున Ginger grass అందురు.

అల్ల నేరేడు:—నేరేడు చూడుము.

అల్లము:—ఇది దుంపజాతిలోనిది. కందసారముగలది. కారపు రుచిగలది. ఇది విపాకమున తీపిరుచిగా మారును. వేడిచేయు స్వభావం. ఆకుకూడ కారముగనే యుండును. ఈ మొక్కలు పసుపు దుంపరాష్ట్రం మొదలగు మొక్కలవలె నుండును. హిందూదేశమునం దంతటను ఇది పైరుచేయబడును. పంజాబులో మాత్రము దీనిని పైరుచేయుటలేదు. అల్లం బహువిధముల ఉపయోగకారి. అల్లం ఉడికించి ఎండించిన శొంఠి అగును. వాత పైత్య శ్లేష్మమును హరించును. కోష్టమును శోధించును. అగ్నిదీప్తి నిచ్చును. మలవిసర్జనము చేయించును. శరీరమునకు చురుకు నిచ్చును. మూత్రబద్ధము విప్పును. వాంతి, శూల, కాస, శ్వాస, అరుచి, మందాగ్ని, క్రిమి మొదలగు వ్యాధులు హరించును. వీర్యవృద్ధిని చేయును. కంఠరోగములు, కోష్టదోషములు హరించును. నాసిక రోగములయందు నిది పనిచేయును. పాండువు, జ్వరం, పీనస మొదలగు రోగములను పోగొట్టును. అల్లపురసం, తేనె కలిపి సేవించిన గుండె యందలి శ్లేష్మమును హరించి హృదయమునకు మేలుచేయును. గుండె బరువు తగ్గును. అల్లపుకొమ్ము చెరిసగముగకోసి అందు కొంచెము నల్లమందు చేర్చి రెండుబద్దలు చేర్చికట్టి గుడ్డచుట్టి మట్టిపూసి కుమ్ములో ఉడికించితీసి కల్వమునందుంచి నూరి పండబారిన శనగలవలె మాత్రలు చేసి ఇంగుపగంధం అనుపానముతో నిచ్చిన ఆమాతిసారం తగ్గును. అల్లం చిన్న ముక్కలుగ తరిగి సమముగ జీలకఱ్ఱ చేర్చి నేతిలో వేయించి వేగిన తర్వాత బెల్లంగాని, పంచదారగాని చేర్చి కలపిన లేహ్యంవలె నగును. ఆ ముద్ద కరక్కాయఅంత భక్షించిన అనగా పరగడుపున భక్షించిన అజీర్ణం, పైత్యం, అరుచి, వికారం, కడుపులో మంట హరించును. ఆకలి వృద్ధిఅగును. విరేచనము చేయును అల్లం ముక్కలు, జీలకఱ్ఱ, సైంధవలవణం నిమ్మకాయ రసములో ఊరించి



ఎండబెట్టి ప్రతిరోజు ప్రాతఃకాలమున పావుతులం చొప్పున సేవించిన అజీర్ణం, కడుపు ఉబ్బు హరించి నోటికి రుచిని కలుగజేయును. అల్లం వేయించి ఉప్పు, చింతపండు, మిర్చి మొదలగు సంబారములుచేర్చి చేసిన పచ్చడి నోటికి చాల హితవుగ నుండును. ఆకలిని పుట్టించును. జీర్ణశక్తినిచ్చును. అల్లం ఆమ్లమును హరించుటలో చాల శ్రేష్టమైనది. వంకాయయందు ఆమ్లము పెంచు గుణము కలదు. అందువలన అల్లం వంకాయకూరలో ఆమదోషహరమునకై తప్పక చేర్చవలెను. అల్లపు రసముతీసి కొంతసేపుంచిన అడుగున తెల్లనిమడ్డి చేరును. దీనిని సత్తు అందురు. ఆ సత్తు తీసివేసిన తేటరసమునే గ్రహించవలెను. అల్లపు రసము ఆవుపాలలో వేసి కాచి అందు తేనెవేసి యిచ్చిన గర్భిణీస్త్రీల శూల హరించును. అల్లపురసం, తేనె, ఆముదం మూడు గ్రాహిచేసి పరగడుపున పుచ్చుకొన్న చక్కని విరేచనములగును. శరీరమునకు తేలిక నిచ్చును బుద్ధి వికసించును. సోమరితనం పోవును. ఈ రసముతో అనేక ఔషధములు మర్దన చేయుదురు. జ్వరములయందు అల్లపురసం అనుపానముగా నిత్తురు. అల్లపుముక్కలు, సైంధవలవణముగాని, ఉప్పుగాని, నిమ్మకాయరసము చేర్చిగాని నెయ్యి చేర్చిగాని ప్రథమ కబళము భుజించిన మంచి మేలుచేకూర్చును. భోజనానంతరం తినినచో చక్కగా జీర్ణశక్తి కలుగును. అల్లముపై పొట్టుగీసి ఊతముండ్లతో చిల్లి ఆవిరిపై ఉడికించి తేనెలో ఊరించిన దానిని మురబ్బా అని అందురు. ప్రతిరోజు ఉదయమున సేవించిన పైత్యశాంతి చేయును. నోట నీరూరుట కట్టును. గుండెకు బలమిచ్చును. కొందరు పంచదార పాకములోను ఊరింతురు. అల్లపు రసముతో తయారుచేసిన జలజీమచీను అనబడు సోడా కారంగా నుండును. కడుపుబ్బరం కట్టును. అల్లముతోచేయు పచ్చడులు అనేకములు కలవు. సంస్కృతమున ఆర్ద్రిక, శృంగిబేర, హిందీలో అదరక్. ఇంగ్లీషున Ginger, కర్ణాటమున అల్ల, అరవంలో ఇంజి.

అల్లి చెట్టు:—ఇది అడవులలోనుండు ఒక జాతిచెట్టు. దీనిని యిండ్లకు అల్లి వాసమని వాసములుగ వేయుదురు. బలముగానుండును. చెట్టు గుబ్బుగా నుండును. పువ్వులు నలుపువర్ణముకలిగి సువాసనగా నుండును. వేరు చక్క వగరుగా నుండును. పండ్లు నల్లగా నుండును. ఈ పండ్లను తినిన నాలుకకు నీలిమందు రంగువలె రంగు పట్టుకొనును. దీనిరసము అన్నిరకముల విరేచనములను కట్టును. కుసుమ వ్యాధులు హరించును. నేత్రరోగములకు దీని ఆకు పసుపు పన్నీరులో కలిపి కండ్ల యందు 4—5 చుక్కలు వేయుచున్న కండ్లమసకలు, కలకలు కట్టును. ఇంగ్లీషున Memecylon Tinctorium అందురు.

ఆవగూడచెట్టు:—ఇది సాధారణముగా తాటిచెట్లపై ప్రాకు తీగ జాతిది. దీని ఆకులు ద్రాక్ష ఆకులనుపోలి నల్లగ నుండును. పువ్వు తెలుపు. కాయలు లక్కరంగు కాయలవలె నెఱ్ఱగ నుండును. లోన గుంజు సీతాఫలము గుంజువలె మృదువుగా నుండును. గింజలు నలుపు వర్ణం కలిగియుండును. గుంజు తీపి రుచి కలిగియుండును. ఆకు వెగటు కారం చేదు రుచులు గలిగియుండును. దీని గింజ ఎండబెట్టి చూర్ణం చేసి అందు పిప్పలి చూర్ణంచేర్చి నస్యము చేయించిన మూర్ఛలు తగ్గును. దీని ఆకుతో భూతులసి ఆకుచేర్చి మెత్తగానూరి వంటికి పూసిన చర్మరోగములు, చిడుము, గజ్జి మొదలగునవి హరించునని చెప్పెదరు.

అశోకము:—ఇది వృక్షజాతిలోనిది. ఇందులో రెండుజాతులు కలవు. ఒకటి రామాఫల. (రాంబాళి) ఆకులను బోలిన ఆకులతో నారింజపండు వర్ణముగల పువ్వులతో నుండునది. రెండవది మామిడి ఆకులవలె పొడవుగల ఆకులు తెల్లని పూవులతో నుండునది యొకటి దీని కాయలు నీలపువర్ణముగానుండి పండినప్పుడు ఎఱుపురంగుగ మారును. లోపలిగింజలు తినుటకు ఉపయోగించవు. అశోకము



త్వక్సారము గలది ఇది ముఖ్యముగా స్త్రీల ప్రదర వ్యాధుల యందు చాల ఉపయోగకారి. అశోకము శీతలము, తిక్తము, కషాయము, దోషము, అతఃస, తృష్ణా, దాహము, క్రిమి, శోథ, విషము, అసృగ్దరము హరించును దీనితో తయారుచేయబడిన అశోకారిష్ట స్త్రీల కుసుమ వ్యాధులకు పెట్టినదిపేరు. ఋతుబద్ధమును పోగొట్టును. స్త్రీల గర్భాశయమును శుద్ధిచేయును. అశోకవృక్షము స్త్రీల విహారస్థలముల నుండి సంతోషమును గూర్చునదిగ నున్నది. పట్ట చిదుగగొట్టి కషాయము కాచి పాలతో సేవించిన రక్తకుసుమ కట్టును. దీనిగింజ రసము మూత్రాశ్మరి మూత్రాఘాతరోగముల హరించును. అశోకఘృతం స్త్రీలపాలిటి కామధేనువవంటిది. అశోకమును స్త్రీ కాలితో తన్నిన అకాలమున పుష్పించునని గ్రంథములయందు గలదు.

సంస్కృతమున అశోకః. హిందీలో అశోక, అశోగ. ఇంగ్లీషున Saraca Indica Jonesia Asoka. బెంగాలీన అశోక. గుజరాతిలో ఆంజ్‌పాలె.

అశ్వమూత్రము:—ఇది మూత్ర వర్గములలో నొకటి. జంతువుల మూత్రము కట్టవలసి వచ్చినప్పుడు ఆడజంతువుల మూత్రమే ప్రశస్తము. అశ్వమూత్రము కారమురుచిగలది. మిక్కిలిఘాటైనది. విపాకమునగూడ కారపు రుచిగనే మారును. కఫమును శోషింపచేయును క్రిమినాశనకరము. కుష్టము, వాతము హరించును. అగ్నిదీప్తి నిచ్చును. అస్థిగత వ్రణములు బోదకాలురోగములు నివర్తించును. వైక్రాంతముకాచి అశ్వమూత్రములో వైచిన శుద్ధిబొందును. అశ్వమూత్రము వేడిచేయును. ఇంగ్లీషున Horse wrine.

అష్టవర్గము:—ఇది ఎనిమిది వీర్యవర్ధకములగు మూలికల చేరిక. దీనికి అష్టవర్గమనిపేరు. జీవనీయ గణమనికూడ చెప్పుదురు. కాకోళి, క్షీరకాకోళి, మేద, మహామేద, బుద్ధి మహాబుద్ధి, జీవకము,

వృషభకము. ఈ ఎనిమిది వీర్యమును వృద్ధిచేయునవియై యున్నవి. ప్రాచీనుల వాడుకలో కాకోళి, క్షీరకాకోళి మాత్రమే ఉదహరించి వాడుచున్నారు. తక్కినవి కన్పించుటలేదు. ఇటీవల హిమాలయ డ్రగ్ స్టోర్సువారు తక్కినమూలికలుకూడ సప్లయిచేయుదుమని ప్రకటించిరి. పూర్వులు వీనికి అభావమున ప్రతినిధి మూలికలను నిరూపించియున్నారు. మేదమహామేదలకు పిల్లిపీచర జీవక వృషభకములకు నేలగుమ్మడు కాకోళి, క్షీరకాకోళికి బదులు పెన్నేరు వృద్ధి మహావృద్ధులకు నేలతాడి వాడవచ్చును. ఇవి వీర్యవంతములైన మూలికలు. కాంతి, బలము, వీర్యము, తేజస్సు ప్రసాదించును. ఇదిగాక అష్టచూర్ణమను నది యొకటి వాడబడుచున్నది. శొంఠి, పిప్పళ్లు, మిరియాలు, అజామోదం సైంధవలవణం. తెల్ల, నల్ల జీలకఱ్ఱలు, ఇంగువ, యీ ఎనిమిదింటి చూర్ణం అష్టచూర్ణమనబడుచున్నది. కారం రుచి. వేడిచేయును. అజీర్ణమును హరించును. వాతగుల్మం వాతశూల పోగొట్టును. ఋతు శూలలకు బాగుగ పనిచేయును. తెల్లకుసుమను హరించును. మరియు దీనిని కారపుపొడికి బదులుగ అన్నముతో భుజించిన అజీర్ణం. శూల, మొదలగు బాధలు శమించును. జఠరమును శోధించును తినినపదార్థం తేలికగ జీర్ణమగును.

శ్లో॥ అష్టవర్గో ద్వికాకోళీ ద్విమేధా జీవకర్షభేః
బుద్ధివృద్ధియుతైః క్వాతిజీవంతీ మధుకాన్వితైః॥

గుణము

శ్లో॥ అష్టవర్గో కామః స్వాదుర్బృంహిణః శుక్రలోగురః
గర్భసంధానకృచ్ఛీతో బలాసబలవర్ధనః
వాతపిత్తాస్రతృడ్దాహ జ్వరశోష క్షతప్రణుత్॥

అష్టవర్గం, శీతము, మధురం, బృంహణం, వీర్యవృద్ధికరం, గురుత్వము. గర్భప్రసాధనం, బలకరం, కఫకరం, శక్తివృద్ధికరం, వాతహరం,



రక్తపిత్తం, పిపాస, దాహం, జ్వరం శోష, (శరీరము ఎండుట లేక క్షయరోగం), క్షతం, (ఉరఃక్షతము మొదలగునవి) హరించును.

అష్టవర్గ ప్రతినిధి వర్గములు

శ్లో॥ కాకోళీ యుగళాభావే శతావర్యాయుగంధికేత్
మేదాభావేశ్వగంధాస్యా మహామేదా ప్రసారిణీ
జీవకర్షభకాభావే గుడూచీవంశలోచనే
బుద్ధిస్థానే బలాయోజ్యా వృద్ధిస్థానే మహాబలా॥

సుగమము_ కాకోళిద్వయగుణము :—వృష్యం, మధురం, శీతం గురుత్వం పుష్టిని కలుగజేయును. వాతపిత్త దాహ శోష జ్వరాదులు హరించును.

మేదా మహామేదలగుణము :—శీతం, మధురం, స్థైర్యం, వీర్యం, పుష్టి, తుష్టి వీనిని కలుగజేయును. వాతపిత్తం, రక్తపిత్తం, క్షతం, క్షయ వీనిని హరించును.

జీవక ఋషభక ద్వయగుణము :—శీతం, పుష్టికరం, వీర్య వర్ధకం, మధురం. వీనిని కలిగించును. వాతం, రక్తపిత్తం, దాహం, క్షయ వీనిని పోగొట్టును.

బుద్ధిగుణము :— త్రిదోష నాశనముచేయును. ప్రాణం, ఐశ్వర్యం నిచ్చును. గురుత్వం చేయును. వీర్యవృద్ధినిచ్చును. మలమును వృద్ధి పొందించును. మూర్ఛ రక్తపిత్తము నశింపజేయును.

వృద్ధిగుణము :—మధురం, గురుత్వం, వృష్యం, గర్భస్థిరత్వం, బల్యం, పౌష్టికం, నైయున్నది. కఫం, రక్తపిత్తం, కాస, మలబంధం మొదలగు దోషహరములైయున్నవి. అష్టవర్గములు కందసారములై యున్నవి. ఇవి హిమవత్పర్వతమున ప్రాప్తించునవియై యున్నవి. కాని, వీని నిజస్వరూపం కనుగొనుట మిక్కిలి దుర్లభముగా నున్నది. భావ ప్రకాశకారుడు యీ మూలికగూర్చి తనగ్రంథమును భావప్రకాశిక

యందు వర్ణించియున్నాడు. కాని ఇది లభించుట దుర్లభమనియెంచి వీనికి ప్రతినిధి వర్గమును నిర్ణయించి వ్రాసియున్నాడు. ఇందువలన 18_17 శతాబ్దములయందు దొరకుటలేదని తెలియబడుచున్నది. అయితే గురుపరంపరా స్వరూపజ్ఞానం లభింపబడియున్నది. చరకసుశ్రుతాది ప్రాచీన గ్రంథములయందు అష్టవర్గప్రయోజనం, చ్యవనప్రాశాది అనేక యోగములయందు ప్రయోగింపబడినది. అప్పట్లో ఈమూలికలు సులభసాధ్యములైవున్నవి. అప్పటిసమయములో ప్రాచీన ఋషులు హిమాలయపర్వత శిఖరములయందు తిరుగుచు వీని ఉపయోగము బాగుగ కనిపెట్టి లోకహితార్థం దీనిని ప్రకటించియుండిరి. ఇప్పుడు కొందరు వైద్యశేఖరులు తత్ప్రాంతములయందు వీనిని సంపాదించి నప్పటికి అందరికి అందజేయుట చాల కఠినమయినపని. ఎందువలన అనిన సర్వోత్తమమైన మూలికల తమ స్వార్థమునకే చాలవు. గాన ఇతరులకు నిచ్చుటకు అంగీకరింపరు. హరిద్వారము, డేరాడూను, మొదలగు ప్రాంతములయందుగూడ వీనిప్రాప్తి చాలకఠినము అయి యున్నది. కావున హిమాద్రి శిఖరములయందు వెతకి కనుగొనవలసి యున్నది.

☞ అంకుడు:—ఇది మధ్యరకం చెట్టు. దీనికి పాలు గలవు, జామి చెట్టు ఆకులను పోలిన ఆకులుండును. పుష్పాలు కూడా తెలుపు. ఇది వేడిచేయు స్వభావం గలది. విపాకమున కారపు రుచిగా మారును. రెండు రెండేసి జంటలుగల కాయలు కాయును. దీని ఆకులు కసివెంద రసంతో నూరి ముద్దచేసి లఘుపుటము పెట్టిన భస్మమగును. ఈ భస్మం కొబ్బరినూనెలో కలిపి పైన పూసినయెడల తామర, చిడుము, గజ్జి, దద్దుర్లు మొదలగు చర్మవ్యాధులు హరించును. దీనిరసముతో కాచిన నేతిని పుచ్చుకొనినను, పైకిరాసినను, కుష్ఠురోగములు పోవును. ఇందులో సుగంధి, పెన్నరుచేర్చి తయారుచేసిన ఘృతం సవాయి



మచ్చలను హరించుటలో చాల ఉత్తమోత్తమమైనది. సంస్కృతమున కృష్ణకుటజ ఇంగ్లీషులో A Spe-cies of Echites Antidysenterieum అందురు.

☞ అంజీరపండు :—ఈ చెట్టు మేడిచెట్టును బోలియుండును. ఆకులు మేడిఆకులను పోలియుండును. కాయలు జీడిమామిడికాయలను పోలి యుండును. మ్రానునందే కాయలు కాయును. దీనిని సీమమేడి అని పిలుతురు. ఇది బాగుగ చలువచేయును. తీపిరుచి కలది. విపాకమున గూడా తీపిరుచినే కలిగియుండును. గురుత్వం గలది. మిక్కిలి మధు కరము. రక్తపిత్తమును బహు త్వరలో హరించును. రక్తపిత్తమువలన ముక్కునుండి కారు ప్రవాహరూపకమైన రక్తమును చక్కగా అది కట్టును. పిత్తసంబంధమైన శిరోవేదనలను హరించును. శ్లేష్మమును, ఆమ్లవాతమును పెంచును. రక్తమును బాగుగా పుట్టించును. మంచి వీర్యవృద్ధి నిచ్చును. క్షయ సంబంధమైన దగ్గులను హరించును. ఈ పండ్లను ఎండబెట్టి నిలవచేయుదురు. బజారులలో ఇవి విశేషముగా దొరకును. ఇవి సమ శీతోష్ణ గుణము కలిగి యుండును. తక్కిన గుణములన్నియు పచ్చిఫలముతో సమాన గుణములే కలిగియుండును. ఇవి శీతవీర్యము, రక్తపిత్తమును వాతరోగములను నాశనము చేయును.

సంస్కృతమున అంజీరఫల, ఇంగ్లీషున Figs fresh, హిందీన అంజీర్, బెంగాలీన పేయారా అని అందురు.

☞ అంతరతామర:_ఇది నీటిపై తేలుచు జీవించు ఒకానొక తామర జాతి తీగ. ఆకులు తామరాకులను బోలియుండును. వ్రేళ్ళు నీటిలో దారములవలె గుజ్జుగా వ్రేలాడుచుండును. గాలికి యిటు నటు కొట్టు కొని పోవుచుండును. తెల్లని పుష్ప లుండును. ఆకుల రసం కొంచె మెత్తగా నుండును. ఇందులో రెండు రకము లున్నట్లు తోచుచున్నది. ఆకుల భేదము మాత్రమే. కాడ కొన్నిటికి పొడవుగా 4—5 అంగుళ

ములు వుండును. ఇది మేహశాంతి చేయును చిన్నరకపు అంతర తామరాకు మద్దలో మైలుతుదము పెట్టి లఘుపుటము వేసిన తెల్లగా భస్మమగును. మరియు తాళకముగూడ నటులే లఘుపుటము పెట్టిన భస్మమగును. అన్నివిధములగు ధాతువులు దీనితో భస్మములగునని చెప్పెదరు. పంచలవణములు గజపుటమున భస్మమగును. ఉబ్బరోగముల హరించును. శుక్రవృద్ధిచేయును. రసాయనము బల్యము. వాతదగ్గులు, పిత్తము, వాతపైత్యములు హరించును. ఆరోగ్యం కలిగించును. చప్పిడిపథ్యం చేయవలెను. మేహకారకమువలన పుట్టిన శరీరపుమంట. దుష్టవ్రణములకు అంతరతామర ఆకు కట్టిన గుణము వెంటనే కనిపించును. మరియు అండవృద్ధికి కొబ్బరినూనె రాచి యీ ఆకు కట్టిన గుణమిచ్చునది. దీని ఆకులక్షారము వైద్యకర్మల కుపయోగించునని వైద్యశేఖరులు వచింతురు.

సంస్కృతమున కుంభికా, ఆకాశవల్లరి, వాలిపల్లి. ఇంగ్లీషులో Cassytha Filiformis.

అందుగుచెట్టు:—ఇది మహావృక్షములలోనిది. దీనిని సల్లకి అని కూడ అందురు. పెద్దమ్రాను చెట్టును బోలిన ఆకులుండును. తెల్లగా కొమ్మలు మ్రాన ఉండును. కొమ్మశిఖరమున ఆకులు గుజ్జుగ గొడుగువలె నుండును. గంటువెట్టిన పాలుకారును. యీ పాలు సువాసన గలిగియుండును. యీ చెట్టునుండి బయలుదేరిన బంకనే ఫిరంగి సాంబ్రాణీ. లోబాన్ అని అందురు. ఇది ఎక్కువ చలువచేయును. వగరు రుచి. ప్రధానము. తీపిచేదులు మిళితములు. విపాకమున తీపిరుచిగ మారును. బలాసరోగము. పిత్తము, అతిసారమును తగ్గించును. శ్లేష్మము పైత్యం హరించును. రక్తపైత్యం వ్రణములు నివారించును. బలకరము, దీని పువ్వునందు కఫ, వాత అర్శ, కుష్టు, అరోచక నాశనశక్తి కలదు. దీని పండ్లుకూడ పువ్వు గుణములనే కలిగియున్నవి. దీని పుల్లలుతో దంత



ధావనం చేసిన పంటిజబ్బులు హరించును. చెక్కకషాయం వ్రణహారి. పంచదార చేర్చి పుచ్చుకొనిన రక్తపిత్తము హరించును ఇది నిర్యాససారము గలది.

సంస్కృతమున కుందురుః. ఇంగ్లీషున Indian Olidanum Boswellia Serrata. హిందీలో సలఈ. బెంగాలీన శలఈ. మరాటీలో దూత్ శలఈ గుజరాతిలో సలఈ. పంజాబులో లోబాన్, నిర్యాన్.

అంబరు:—ఇది యూనానీ వైద్యసాంప్రధాయకమైన సుగంధద్రవ్యము. హకీములు విస్తారముగా నుపయోగింతురు. ఇది తిమింగలముయొక్క వైద్యకోశమని కొందరు చెట్టుబంక అనికొందరు చెప్పెదరు. ఏదిఏటులున్నను కస్తూరివలె నిది వేడిచేయు స్వభావముగలది. వీర్యవృద్ధి సంధనచేయును. మంచిసువాసన నిచ్చును. దీనిపరిమళము మహమ్మదీయులకు మిక్కిలి ప్రియము ఇది గుండెకు మిక్కిలి మేలుచేయును.

అంబలి:—చోళ్ళు చూడుము.

అంబాళము:—ఇది ఫలసారవృక్షము. అటవికము. దక్షిణదేశములో విస్తారము. తోటలలోగూడ పెరుగును. ఇది జంటకాయలు కాయును. దీనిపండ్లు కోతులకు చాలప్రియము. రుచి తీపి పులుపు, వగరు పులుపుగ ఉండును వేడిచేయును. శీత వీర్యము. విపాకమున మధుర రసముగ మారును. అరుచిని హరించును. స్వరమును బాగుచేయును. చక్కగ పండిన పండ్లు కషాయ ఆమ్లమధుర రుచులుగలవు. స్నిగ్ధము, కఫవృద్ధి చేయును. ధాతువృద్ధి చేయును. రక్తదోషమును హరించి క్షయను బోగొట్టును అమ్లరోగం వాయువవలనబుట్టు బాధల నణంచును. విష్టంభ, పుష్టికరం, బల్యము.

సంస్కృతమున ఆమ్రాతక. ఇంగ్లీషున Hogplum Wild Mango హిందీలో అమడా. బెంగాలీన ఆమడా. మరాటీన ఇరసాళ, ఆవా, ఆంహిడే.

అంటురోగములు :—ఒకరినుండి మరియొకరికి సంభవించు రోగములన్నియు అంటురోగములని చెప్పబడును. ఇవి కలరా, కలక, మశూచికము, ప్లేగు, కుష్టు, శగ, సవాయి మొదలగునవి.

అండవృద్ధి :—వృషణములలో నొకటిగాని రెండుగాని వాచి సలుపు, పోటు, జ్వరం మొదలగు బాధలను కలుగజేయు రోగమునకు అండవృద్ధి అనిపేరు. రోగ ఉత్పత్తికి హేతువు. వాతమునుచేయు పదార్థముల నెక్కువగా భుజించుట మలమూత్రనిరోధం, లేక బలాత్కారంగా వెడలించుట, అపసవ్య సంభోగం, విస్తారముగా సైకిలు ప్రయాణము మొదలగునవి గ్రంథము చివర అండవృద్ధి శీర్షికలో చికిత్స వ్రాయబడినది.

అంతర్గత జ్వరము :—అంతర్గత జ్వరమనగా పైకి శరీరవేడిమి కనిపించక లోపల లోపలనే ఆశ్రయించియుండు జ్వరం. ఈ జ్వరం 99 డిగ్రీల వేడిమికన్న నెక్కువయుండదు. నీరసం, అరుచి, విసుగుదల, ఆకలి మందము మొదలగు గుణములు కలిగియుండును. దీనికి వంట బాల సూర్యోదయము గాని చలవ మిరియము గాని అల్లపురసం తేనె అనుపానించి యిచ్చిన హరించును మోతాదు శరీరబలము ననుసరించి నిర్ణయించవలెను. ఇంగ్లీషున Internal Fevers.

## ఆ

ఆకాశగరుడ :—ఇది తీగజాతిలోనిది. దీనికి నాగదొండ, మురుదొండ, రాకాసితీగ అని పలువురు పలువిధముల పలుప్రాంతములలో పిలతురు. దీనికి గబ్బువాసనగల ఎఱ్ఱని పండ్లుపండును. పువ్వుపచ్చన. దుంపచేదు. కొంచెము పులుపురుచిగూడ కలిగియుండును. ఆకాశమున గరుత్మంతుడు ఎట్లు నిలువగల సమర్థుడో అట్లే యీ తీగ నిరాలంభముగా వ్రేలాడుచు బ్రతుకజాలును. ముఖ్యముగా ఈ మూలికయందు



సవాయిని హరించు గుణముకలదు. విషహరణ గుణము కలిగియున్నది. క్రిములను హరించును. విరేచనకారి. పాము విషమునకు దీనిదుంపరసం నరమూత్రములో కలిపియిచ్చిన వెంటనే సర్పవిషము హరించి మనుష్యుని ప్రాణములను కాపాడును. తేలు విషమునకు దీనిదుంప అరగతీసి కాటుపైరాసి గుడ్డపొగ బెట్టవలెను. పాలపశువులు తన్నుచుండిన దీనిఆకు పసరు వెన్నునకు పూసిన ఎదుటపడి పశువులు పాల నిచ్చును. మరియు దీని ఆకుపసరుతో తగరం భస్మమగును. ఇంగ్లీషున Bryonia Epigoea.

ఆకాశవల్లి :—పాచితీగ చూడుము.

ఆకాశమాంసి :—ఇది జలామాంసిని బోలియుండు మూలిక. జంతు విషమును బోగొట్టును. పురికోస, పాలెపురుగు మొదలగువాని విషమును హరించును. నరముల నిసత్తువను తగ్గించును.

ఆకుచెముడుచెట్టు :—ఇది చెముడుజాతిలోనిది. మొదలులగాయతు చెట్టు చిగురువరకు వాడిగల ముండ్లుండును. నాలుగైదు గజముల ఎత్తువరకు గుజ్జుగా బెరుగును తెల్లని పాలు చెట్టు అంతటను గలవు రుచి, చేదు, కారం కలిసియుండును. మిక్కిలి వేడిచేయును. ఆకులు దళసరిగా, కోలదనముగా పెళుసుగా నుండును. నిప్పులపై వెచ్చచేసినగాని దీని రసమురాదు గాఢవిరేచనకారి. శ్లేష్మమును హరించును. వాతమును పోగొట్టును. పిల్లలకు దగ్గు, వగర్పులకు దీని ఆకుల రసము ఆముదములో కలిపి పట్టిన కడుపు పొంగరింపు, దగ్గు, వగర్పు వెంటనే తగ్గును. చనుబాలతోను, తేనెతోను కూడా యివ్వవచ్చును. దీని పాలు కడుపులోని బల్లలను, గుల్మములను, ఉదరములను, బాలపాపచిన్న అను వాత వ్యాధిని హరించి మలమూత్రముల చక్కబరచును. ఊరుస్థంభము, కీళ్ళవాతము మొదలగు వాత వ్యాధులలో దీని రసముతో తయారుచేసిన త్రిగండతైలము మర్దనచేసిన సుఖ

మిచ్చును. వేరు రసముగాని, వేరుముక్కగాని పుప్పిపంటిలో నుంచిన పురుగు చచ్చి పడిపోవును. విశేషముగా దీనిని వాడరాదు. మోతాదు ఎక్కువ అయిన ప్రేగులు భ్రంశచేయును. చెముడు పాలకు వలెనే దీని పాలకును పొక్కెడు గుణము కలదు. ఆకుయొక్క నులివెచ్చని రసం చెవిలో పోసిన కర్ణశూల శమించును. (చక్రదత్త) సంస్కృతమున శోస్నుహి, ఇంగ్లీషున Euphorba Ineriifolta అందురు.

ఆకుపత్రి :—దీనిని లవంగిపత్రి, ఆకుపత్రి అని పిలుతురు. ఇది తీగజాతిలోనిది. లవంగపు ఆకులనే యీ ప్రకారము వాడుచున్నారు. ఆకు సువాసనగలిగి మూడు అంగుళముల వెడల్పు, 7_8 అంగుళముల పొడవుండును. దీనికి తీపి చిరుచేదుగల రుచి గలదు. వేడిచేయును విపాకమున కారపురుచిగ మారును. వాత శ్లేష్మముల తగ్గించును. వాంతి, అరుచి, పీనస రోగముల హరించును. పొత్తికడుపులోని దోషములను, దురదలను, మూలశంఖను, వాత పైత్య శ్లేష్మ రోగముల హరించును. గుండెదడను కట్టును బలమిచ్చును. ఆకుపత్రి, ఏలకులు, దాల్చినచెక్క నాగకేసరములు నాలుగు సమభాగములుగ చూర్ణించి ఆ చూర్ణము తేనెతో సేవించిన పైత్యదోషములు హరించును. ఋతుబద్ధము, ఎక్కిళ్ళు, విషూచి హరించి రక్తశుద్ధి, బలం, వీర్యవృద్ధి చేయును. దీనిని పలావులో వేయు కషాయమున చేర్చుదురు. సంస్కృతమున తేజపత్ర, పాకరంజన, హిందీలో తేజపత్.

ఆగాకర :—ఇది తీగజాతిలోనిది. అడవులలో డొంకలమీద ప్రాకును. ఆకు కాకరాకునుపోలి పువ్వు పచ్చగ నుండును. కాయ కొంచెం కోలగా గుండ్రంగా నుండును కాయపై చర్మముపై పనస కాయకువలె గరుకుండును. లేతకాయలోని గింజ తెలుపు. పండు ఎరుపులో పసిమివర్ణము. గింజ నలుపు. ఆకాకరఆకు చేదు, కారముతో గూడిన రుచి గలిగియుండును. పచ్చికాయ వగరు తీపి రుచి గలిగి



యుండును. పండు తీపిగ నుండును. కాయలు కూరవండి భుజింతురు. ఆషాఢ శ్రావణ మాసములలో యివి బాగుగా దొరకును, పులుసు, బెల్లం చేర్చి వండిన చాలా రుచిగా నుండును. కొందరు వేయించుకొని తిందురు. వేడిని చేయును. అగురు గుణము కలది. బలకరమైనది. వాతం, కఫం హరించును. ఆకలిని వృద్ధిచేయును. పైత్య శమనము చేయును. కాయ కాకర గుణము కలిగి యుండును. పువ్వులు కిలాస కష్టువు, అరుచి పోగొట్టును. కాయ గుండెకు మేలుచేయును. వగరు తీపి రుచులు. గురుగుణం. అగ్నిదీప్తి, పాచనము చేయును. పండు కూరకు కూడా ఈ గుణములే కలవు. మొత్తమున ఈ మూలిక త్రిదోష హరమైనది. దీని దుంప వగరు, తీపి, చేదు రుచులు కలిగియుండును. బుద్ధిని వృద్ధిచేయును. దీని సర్వాంగములతో తయారు చేసిన తైలం వ్రణదోషముల బాధల మాన్పును. ఇందులో గొడ్డు ఆకాకర అనునది యొకటి కలదు. దాని దుంప చూర్ణము స్త్రీల వంధ్యా దోషమును హరించును. వెండిశుద్ధిని గావించును. సంస్కృతమున కర్కోటక్ ఇంగ్లీషున Momordica dioica అందురు.

ఆటగడధాన్యము :—ధాన్యము చూడుము.

ఆడాలు :—ఇది తుప్పజాతిలోనిది. సువాసన ద్రవ్యము. దీని పంచాంగములకు ప్రత్యేకోపయోగములు కలవు. ఉద్యానవనములలో వేసి దీనిని పెంచుదురు. భారతదేశమున, విదేశమునగూడా నిది పెరుగును. దీనిగింజల చమురు ఆవిరి రూపమున హరించును. గింజలు జిగురుగలవి. దీ రసములో ఇనుము అయోడిన్ పోస్ఫేట్సు, ఇతర ఉప్పులు గలవు. మరియు గంధకం విస్తారముగా గలదు. చక్కగ విరేచనము చేయును. మూత్రమును వెడలించును. జఠరదీప్తిని గలిగించును. చిరుచేదుగ నుండును. వేడిచేయు స్వభావముకలది. తిక్క. వాత శ్లేష్మములు, అతిసారము, రక్తప్రదరము వీనిని హరించును బలము, పుష్టి,

వీర్యవృద్ధి నిచ్చును. చనుబాలను వృద్ధిచేయును. కర్రుకుదెబ్బలు మొదలగు దెబ్బలను హరించును. వీనిబాధలను శమింపచేయును. చర్మరోగములను రక్తదోషములను పోగొట్టును. దీనిని చూర్ణముగాను కషాయముగాను వాడవచ్చును. గింజలచూర్ణమునకు ఎనిమిదిరెట్లు నీళ్లుగలిపి చతుర్థావశేషముగా కాచి ప్రతి అరగంటకు పుచ్చుకొనిన ప్రబలమగు ఎక్కిళ్ళు హరించును. లేదా వేడిచూర్ణమైనను యివ్వవచ్చును. బలమిచ్చును. పుష్టికరము. వాతం, కఫం, అతిసారము, ఎక్కిళ్ళు, సమస్త రక్తవికారములు హరించును. దూడలు పారుకొన్నప్పుడు ఆణాలు వెన్న కలిపి పెట్టుదురు. గింజలు పాలతోనూరి పాయసము కాచి బాలింతలకు యిచ్చిన చక్కగ పాలువృద్ధియగును. పురిటిరోజులలో మాత్రమే చేయవలెను. కొబ్బరి పువ్వును, యీ గింజలు పాలలో పరమాన్నము తయారుచేసి సేవించిన మంచి బలము, వీర్యవృద్ధి కలిగించును. ఇది సర్వవిధముల నుపయోగకరమైన మూలిక. ఆకులు నరములకు బలమిచ్చును. దీనిగింజలు ఆవగింజలవలె నెఱ్ఱగనుండును. వీనిని ఆణాలు అని మనవారు చెప్పుదురు.

సంస్కృతమున చంద్రసూర, చంద్రికా. ఇంగ్లీషున Common Cress. హిందీలో చంద్రసుర్. బెంగాలీన హాలిమ్, చందసూర్.

ఆదిత్యభక్తి లేక సూర్యకాంత :—ఈ చెట్టు నిలువు పొడుగువరకు పెరుగును. పువ్వు గుండ్రంగ సూర్యబింబమువలె నుండును. సూర్య ఉదయముతో నీపువ్వు వికసించి సూర్యు డేదిక్కునకు బోయిన ఆదిక్కునకే ఈ పువ్వుకూడ తిరుగుచు అస్తమయమునకు పడమరగా దిరుగును. ఇందు రెండుజాతులు కలవు. విశేషముగ తెలుపురంగును, కొంచెము పసుపురంగుగల పువ్వులుగలదొకటియు నీలిరంగుగల పువ్వులుగల దొకటియు కలవు. పువ్వునందలి కేసరములు ఎరుపురంగుగ నుండును. ఆకు కొనతేరి గుండ్రముగ నుండును. ఆకు గరుకుగలిగి పచ్చగనుండును.



ఇండియా అంతటను యీ మొక్కలు గానిపించుచున్నవి. పువ్వులు చూచుటకు మిక్కిలి అందముగ మనోహరముగ నుండును. ఉప్పు చేదు కారము కలసిన రుచిగలది. చలువచేయును. విపాకమున తీపి రుచిగ మారును. చిక్కని శ్లేష్మమును నీరుగావించును. చర్మరోగములను అన్నిటిని పోగొట్టును. పలువిధములగు గ్రహబాధలను నశింపచేయును. చలిజ్వరములు హరించును. పైత్యముచేయదు. విరేచనకారి. దగ్గు, ఆయాసమును ఖండించును. ఎండించిన సూర్యకాంతము కూరను పెరుగుతో నుడికించి దాడింబ పండ్లరసముపోసి తాలింపుపెట్టి భుజించిన బంకవిరేచనములు కట్టును. ఆనూకుర ఉబ్బుల హరించును. సూర్యకాంతపు ఆకు మెత్తగనూరిగాని నలిపిగాని వాసనచూచినచో తేలువిషం తత్‌క్షణము హరించును. అని వంగసేన అను గ్రంథమునగలదు. గురుత్వముచేయును. శీతము. మూత్రమునుజారీచేయును. కఫవాతములు హరించును. ఇంకొక ఆదిత్యభక్తి కాకచేయును. కుష్టువు మేహము అశ్వరోగము మూత్రకృత్యము జ్వరము హరించును. వేరును బియ్యపు కడుగుతో నూరి రసముతీసి ఆరసం సేవించిన యోనితాపం హరించును. అని భావప్రకాశికలో స్త్రీరోగచికిత్సయందు గలదు.

సంస్కృతమున సువర్చలతు, సూర్యవర్తా హిందీన సూరజ్ ముఖి, ఫూల్, హుల్‌హుల్. బెంగాలీన హుడ్‌హుడె. నన్‌శలపే. మరాటీలో సూర్యఫూల్. గుజరాతీలో సూరజ్ ముఖి. ఇంగ్లీషున Halianthus Vulgare.

ఆదొండ లేక ఆరెదొండ :—ఇది లతజాతిలోనిది. దుంపనుండి ఈ తీగ విస్తరిల్లును. చాలపొడవుగా ప్రాకును. తీగపొడుగున వాడిగల పొట్టి వంకరముండ్లుండును. కాయలు మారేడు లేతకాయలవలె నుండును. గుంజు తెల్లగనుండును. పచ్చికాయలు గబ్బువాసన వేయును. చర్మము దళముగనుండును. పండులోపలి గింజలు నల్లగనుండును.

పండు ఎరుపు. ఈ తీగనిండ విస్తారము నల్లచీమలుండును. చిరుచేదు రుచి. వేడిచేయును. విపాకమున కారపురుచిగ మారును. వాతశ్లేష్మముల హరించును పచ్చికాయకూర గర్భవ్రణములను, క్రిములను హరించును. మలబద్ధమును చేయును. పైత్యమును పెంచును. ఆవపులుసును చేర్చి గాని, బెల్లముపులుసును చేర్చిగాని కూరవండెదరు. అడ్డక్రలు కరుగుటకు దీనివేరు గంధం పట్టువేయవలెను. చిరకాలమంచిన మంటపెట్టును. బియ్యపుకడుగులో వేరు అరగతీసి పట్టువేసిన మూత్రం జారీచేయును. అపక్వవ్రణమును పక్వముచేసి పిగులచేయును. దీనిచిగుళ్ళు మిరియములు నూరి మాత్రలుచేసి సేవించిన అతిమూత్రవ్యాధి కట్టును. దీనిచెక్క చిదుగగొట్టి నాభికివేసి కట్టినను మూత్రము జారీఅగును "అర్జట స్తువర శీతో వ్రణ శోధనరోపణః"

సంస్కృతమున అర్జట. ఇంగ్లీషున Capparis Zeilanica.

☞ అనబ:—దీనిని సొరకాయ అని అందురు. ఇది తీగజాతిలోనిది. చాల దూరము ప్రాకునది. ఆకులు గుండ్రముగా నుండును. నేలమీద ప్రాకినప్పుడు ఆకు మొదటనుండి వేరుపుట్టి భూమిలో వ్యాపించును. పువ్వు తెల్లగానుండి గ్రామోఫోను గొట్టమువలె నుండును. ఆకునకు ఒకవిధమైన నూగుండును. అనబ జాతిలో రెండు రకములు కలవు. తియ్య అనబ, చేదు అనబ. తియ్య అనబ పొలములలోను, ఇంటి పెరళ్ళలోను వృద్ధిపొందును. ఇందులో కోలకాయలు కాయున దొకటియు, గుండ్రకాయలు కాయున దొకటియు గలదు. తెల్లని కాయలు కాయునది, నల్లని కాయలు కాయునదికూడ కలవు. కూరలకు దీని యుపయోగము ఎక్కువ. సాధారణముగా ఆంధ్రదేశమందు వీని ప్రభావము హెచ్చు. లంకభూములలో నివి బాగుగా ఫలించును. అనబలో కాయ భేదమేకాని గుణభేదములేదు. ఇది తీపి రుచి గలది. చలువచేయు స్వభావము. విపాకమునగూడా తీపిరుచిగానే





మారును. వాతకఫముల బెంచును. పైత్య శమనము చేయును. మలమును బంధించును. దీని గింజలు ఆవు నేతితో వేయించుకొని తినిన శమ్మని రుచిగలిగి వీర్యవృద్ధిని కలుగజేయును. వీర్యస్తంభనం చేయును. అనబకాయ లేతగ నున్నప్పుడే కూరకుపయోగించును. ముదిరినకాయ కూరకు పనికిరాదు. బాగుగ పండిన గుండ్రటిఅనపకాయ దొలచి వీణలకు బుఱ్ఱలుగ ఉపయోగింతురు. కొన్ని నాగస్వరముకాయలుగ నుపయోగింతురు. సమూలం కాల్చి తయారుచేసిన క్షారము మంచినీటిలో కలిపి ఇచ్చిన ఎటువంటి మూత్రబద్ధమైనను విడిపోయి సుఖమునిచ్చును. అనబకాయ ఎండించిచేసినచూర్ణం బియ్యపుకడుగుతో నిచ్చిన కుసుమరోగములుహరించును. చేదుఅనబను తిక్తఅలాజుఅందురు. కటుతుంబ్ అనియు, ఇక్ష్వాకు అనియు పేర్లుగలవు. తియ్యఅనబకును చేదుఅనబకును భేదము ఏమియులేదు. చేదుఅనబకాయ గింజ, గుంజు, ఆకు అన్నియు చేదుగ నుండును. అనబ రుచి తీపిగ నుండును. ఇవి అడవులలో విస్తారముగ నుండును. రుచి చేదు. శీతవీర్యము విపాకమున కారపురుచిగ మారును. తీక్ష్ణము. గుండెకాయకు మంచిది. పైత్యమును శాంతింపచేయును. విషమును హరించును. వాతపైత్య జ్వరములను శ్వాసలను హరించును. వాంతిచేయుటకు ఈ మూలిక మిక్కిలి ఉపయోగించును. గింజలనుండి చమురుతీయుదురు. గింజలచూర్ణం తేనెతోకలిపి గొఱ్ఱెపాలు అనుపానయుక్తముగ నిచ్చిన మూత్రాశ్మరి హరించును. అనబపండు రసం పంచదార యిచ్చినను అశ్మరి హరించును. అశ్మరి అనగా మూత్రకోశములో రాళ్ళుపుట్టి మూత్రమును భారీగా కాకుండునట్లు చేసెడు ఒకవిధమగు రోగము. చేదుఅనబ గింజలు చవిటిఉప్పు కలిపి కడుగుతో నూరి కుంకుడుగింజలవలె మాత్రలుచేసి సేవించిన మూలశంఖలు నివర్తించును. చేదుఅనబాకు రసము చెవిలోవేసిన కర్ణరోగములు హరించును. (హారీతసంహిత) తియ్యఅనబకాయతో పలువిధములగు

కూరలు రుచులు రుచులు గలుగునట్లు తయారుచేయుదురు. పులుసు ఆవ చేర్చి కొందరు గరనుపాలా చేర్చి చిల్లిగూర కొందరు పప్పుతో జత చేసి కొందరు నూపొడి చల్లికొని పాలుచేర్చికొని కొందరు కూరలను తయారుచేయుదురు. ఇవన్నియు మనోహరముగ నుండును పదార్థ మిశ్రము ననుసరించి గుణగణములు మారుచుండును. కొందరు పచ్చడి గను కొందరు వడియములుగను కూడ తయారుజేయుదురు. దక్షిణ దేశములో ఆనపకూరకు ఉపయోగింతురు. ఆనపకు తగిన దోహద మిచ్చిన చక్కగ విస్తారము కాయును. సంస్కృతమున అలాబూ, తుంబీ.

ఆబువ్వతీగె లేక చెట్టు:—ఇది తీగజాతిలోనిది. పొదవుగా ప్రాకును. ఆకు నలుపు పచ్చన కలిసిన రంగుగలిగి అరచేతివలె కొనలు గలిగి యుండును. దీని కాయలు మారేడుకాయలవలె నుండి పండిన ఎఱ్ఱగ లక్కరంగు కాయలవలెనుండును. రుచి చేదు గింజలు నల్లగ నుండును. శీతవీర్యము. కటువిపాకి. ఇది చర్మరోగములను, మూర్ఛలను, కుష్టులను మాన్పును. మరియు గ్రహణిరోగములను, త్రిదోషములను, వాతపైత్య శ్లేష్మములను హరించును. గింజలచూర్ణము నస్యంచేసిన మూర్ఛరోగములను హరించును. దీని వేరు గ్రహబాధా నివారకమైనది. దీని సమూలము క్షారము కొబ్బరినూనెలో రంగరించి శరీరమునకు లేపనము చేసిన చర్మరోగములన్నియు హరించును. పుప్పిపంటికి దీని వేరు మంచిది. ఇంగ్లీషులో A Creeping Medicinal Plant.

ఆముదము:—ఇవి మెరక ప్రదేశములలో పెరుగును. బంగాళా దేశముగాక ఇండియా దేశమందంతట నీ వృక్షములు కలవు. ఇందు తెల్ల ఎఱ్ఱ అనునవి కలవు. పెద్దఆముదాలు. చిట్టిఆముదాలు అను భేదము గలదు. పెద్ద ఆముదముచెట్లు పెద్దమొక్కలు. ఆకులు పెద్దవి. కాయలు కూడ పెద్దవిగనే యుండును. చిట్టిఆముదములు మొక్క చిన్న ఆకు, చిన్న కాయ. చిన్నవిగ నుండును. చిట్టిఆముదములే శ్రేష్ఠమైనవి.



పువ్వుల రంగునుబట్టి రకము తెలియబడుచున్నది. ఆకులు పెద్దవిగ ప్రేళ్లవలె కొనలు దేరి చుట్టును కంగోరాయుండును. కాయలో మూడు గింజలుండును. కాయపైన మృదువైన ముండ్లుండును. గట్టి పెంకు లుండును. ఆకు మదనానబ ఆకువలె నుండును. పైకి నిలబడియుండునే కాని క్రిందకు వ్రాలవు. గింజలనుండి చమురు తీయుదురు దీనిని ఏరండ తైలము, లేక ఆముదము అందురు. ఆముదము అనేకవిధముల ఉప యోగకరముగా నున్నది. మధురము, వృష్యము. గురుత్వము కలది. వాతశోధకము. పిత్తహరము, కఫనాశకము, శ్వాస, కాసలవదల్చును మరియు అశ్మరీరోగమును పోగొట్టును. విశేషముగా నిది గుల్మరోగ మును నశింపచేయును జలోదరము, ప్లీహము, ఆమము, కటిశూల, వస్తిశూల, శిరశ్శూల. ప్రమేహము, జ్వరము, ఆమవాతము, రక్త పిత్తము, శూలరోగము, శోథలను హరించును. ఆకు వాతహరము, కఫము, క్రిమిని పోగొట్టును. రక్తపిత్తమును ప్రకోపింప జేయును. ప్రమేహము, మూత్రదోషములను ఖండించును. గుల్మము, వస్తిశూల, అండవృద్ధి వీనినిపోగొట్టును. పువ్వు త్రిదోష శమనము చేయును. మూత్రదోషమును హరించును. రక్తపిత్తమును ప్రకోపింపజేయును. ఆముదము వంటఆముదమనియు, పచ్చి ఆముదమనియు రెండువిధములు నున్నవి. వంటఆముదము ఆముదపుగింజలను వేత్పుచేసి తయారు చేయుదురు. పచ్చిఆముదము యంత్రము మూలమున తయారు చేయుదురు. వంటఆముదము కమ్మనివాసన గలిగియుండును. చంటిపిల్ల లకు దీనిని ఉగ్గుగాపెట్టుదురు. త్రాగినపాలు చక్కగ జీర్ణముచేయుటకు కశ్మలమును మలరూపమున వెడలించుటకు శ్రేష్ఠమైనది. మరియు ఆక లిని వృద్ధిచేయును. బలమునిచ్చును. ఆరోగ్యమును గలుగచేయును. కడుపు పొంగరింపునకు పొత్తికడుపునకు ఆముదము పూసి వేడికాపడం పెట్టిన నయమగును. ఆముదము అల్లపురసము తేనె చేర్చి సేవించిన విరేచనములయి సుఖము శరీరమునకు తేలిక నిచ్చును. జ్వరం, గుల్మం

కఫం, వాతం శమించును. నొప్పులకు అనగా వాతపునొప్పులకు ఆముదము నూనె నెయ్యి కలిపి మర్ధనచేయవలెను కాసశ్వాసలలో ఆముదము సేవించిన మంచిసుఖము కలుగును. పచ్చిఆముదమును శుద్ధిచేసి కొన్నికొన్ని కంపెనీలు కాస్టరుఆయిల్. Castor oil. అనుపేరున వాడుచున్నారు. ఇది తెల్లగ స్వచ్ఛముగనుండును. వేడినీటిలో యీ ఆముదము చేర్చి సేవించిన సుఖవిరేచనము చేయును. గర్భిణీస్త్రీలు బేసిమాసములలో చిట్టాముదము పాలతోగలిపి సేవించుచుండిన సుఖప్రసవమును గాంచెదరు. ఆముదము లేతచిగుళ్ళు కండ్లపై వేసికట్టిన కంటిఎరుపులు తగ్గును. ఈ చిగుళ్ళను 4—5 విడువకుండా భక్షించినచో రేచీకటి హరించును. ఆముదపుఆకులదరికి దోమలు చేరవు. తెల్ల ఆముదము పాలలోగలిపి ఒకనెలరోజులు సేవించిన అంత్రవృద్ధులు యేడు విధములైనవి హరించును ఆముదముతో శరీరమునకు శిరస్సునకు మర్ధనచేసికొని స్నానముచేసిన ఆరోగ్యము చక్కగనుండును. ఆముదము దీపం గృహమునకు శోభనుతెచ్చును. పూర్వం ఈ దీపం సాయంత్రమందు వెలిగించి నమస్కరించు ఆచారముండెడిది. ఇప్పుడది మృగ్యమైనది. తెల్లఆముదము, ఎఱ్ఱాముదము రెండును సమానగుణములనే కలిగియున్నవి. గాని స్వానులో కొంచెం చేదురుచిగలది. మరియు వగరు గుణముకూడ కలదు వాతకఫములతో గూడిన దగ్గు, శ్వాసను హరించును. క్రిమి, శూలరోగము, ఎక్కిళ్ళు హరించును.

సంస్కృతమున ఏరండ. హిందీలో అరండసఫేర్. బెంగాలీలో భేరెండాగాచ్ఛ. మరాటీన ఏదండ. ఇంగ్లీషున Castor oil plant

ఆరికలు:—అళ్ళు చూడుము.

ఆరుద్ర పురుగులు:—వీనిని ఇంద్రగోప పురుగులని ఆరుద్ర పురుగులని చెప్పెదురు ఇవి ఆరుద్రకార్తిలో పుట్టును. ఎఱ్ఱనిరంగుగలిగియుండును. చెత్త చెమ్మగల ప్రదేశములలో ఇవి గుట్టలు గుట్టలుగా



నుండును. ఈ పురుగులు వాదవిద్యకు ఉపయోగించునని చెప్పెదరు. ముదిరిన పురుగురెక్కలపై నల్లనిమచ్చ యుండును. వీనిని భక్షించిన అనగా కొన్నిద్రవ్యమిళితముచేసి భక్షించిన వీర్యవృద్ధి, వీర్యస్థంభన చేయును. ఈ పురుగులు కొన్నినెలలవరకే యుండును. సాంబ్రాణి, గోరోచనం ఈ పురుగులు సమభాగములుగూర్చి నూరి పెసలవలె మాత్రలుచేసి చిన్నపిల్లలకు వాడిన కడుపుబ్బు, పడిశము మొదలగు వ్యాధులు శమించును. వీనిని పాము విషమునకుకూడ వాడుదురు. ఈ పురుగులు యూనానీ వైద్యసాంప్రదాయ ప్రయోగమునందు ఎక్కువగా సహాకరించురు.

ఆరెచెట్టు:—ఇది వృక్షజాతిలోనిది. పర్వతప్రాంతములయందు ఉత్పత్తిఅగును. దీని ఆకులు తుప్పతంగేడు ఆకులవలె జంట జంటలుగానుండును. కాయలు తంగేడు కాయలను బోలియుండును. దీనిపువ్వులు గుత్తులు గుత్తులుగా కొంచెం కోలగ ఎరుపురంగు గలిగియుండును. పువ్వులలో మృదువైన పుప్పొడియుండును. పట్టనుండి నారవచ్చును. దీనిరుచి వగరు. చేదు గలిగియుండును. చలువచేయు స్వభావముగలది. విపాకమున కారపురుచికి మారును. ఆరెపువ్వులకే విశేష ప్రయోగము కలదు. తీక్ష్ణగుణముకలది. కఫవాతముల రెంటిని హరించును. క్రిమిరోగమును కఫమును నిర్మూలించును. పువ్వు ఆసవారిష్టలలో చేయును. వీని కలయికవలన వస్తుగుణము అభివృద్ధి యగునుగాని నిలవయున్నకొలది గుణము చెడిపోవదు. ఎంతకాలం నిలవయున్నను ఆసవారిష్టలు గుణవంతము లగును. ఈ గుణం ఆరెపువ్వులయందు గలదు. జఠరదీప్తి నిచ్చుటకు దీనిఉపయోగం ఎక్కువ. గర్భిణీస్త్రీల స్రావమును మాన్పుటకు ఇది యుపయోగించును. పండు లేఖనకారి. మలబద్ధం గుణత్వము చేయును. పువ్వు కారము శీతలము కొంచెమువేడి వగరురుచి. లఘువు దప్పి, అతిసారం, పిత్తరక్తము విషం క్రిములు, విసర్పము హరించును.

లొద్దుగపువ్వు ఆరెపువ్వును మెత్తగ నూరి శరీరముపై పూసిన కుష్ఠువు హరించును. పై రెంటిమొద్దను కల్కముగాచేసి ఘృతముతో పక్వముచేసి శరీరముపై లేపనముచేసిన దుష్టవ్రణములు హరించును. ఆరెవగరు, మలబద్ధము, శీతోష్ణము కఫవాతము గండమాల రక్తదోషము కంఠరోగం హరించును. పట్టకషాయముకూడ ఉపయోగకారిగ నున్నది.

సంస్కృతమున ధాతకీ,యుగ్మపత్ర, అశ్వయోని, కుశలీపువ్వ, సింధుపుష్పి, ప్రమదిని, తామ్రపుష్పి.

ఆలుదుంపలు :— బంగాళా దుంపలు చూడుము.

ఆలుబకరా :— ఇది పెద్దఫలవృక్ష జాతిలోనిది. చిరకాలము జీవించును. ఈ వృక్షములు సింహళమందు పుట్టి పెరుగును. హిందూ దేశమందు అక్కడక్కడ కలవు. దీని ఆకు పెను వేప లేక పెదమాను చెట్టు ఆకులను బోలియుండును. అరచేయంత యుండును. ఆకు చుట్టు చిన్న కొసలుండును. పువ్వు నిత్యమల్లి పువ్వువలె గుండ్రముగానుండి అయిదు రేకలుండును. దీనిపండు జీడిమామిడిపండును పోలియుండును. పండురుచి పులుపు, తీపి, వగరు రుచులు కలిసి యుండును. చలువ చేయును. మలబద్ధకారి. హృదయమునకు చాలమంచిది. గురుగుణము కలది. జఠరదీప్తిని కలిగించును. నోటిఅరుచిని పోగొట్టును. మేహములు గుల్మములు మూలశంఖలు రక్తవాత బాధలు హరించును. ఈ పండ్లతో కాచిన చారు పథ్యమున కుపయోగించును. నోటిలో వేసుకొని చప్పరించిన నోటికిహితవుగనుండును. దప్పిహరించును. బాగుగాపండినపండు తీపిగానుండును. జ్వరము హరించును. వేడిగుణముకూడ కలదని అందురు.

సంస్కృతమున ఆరుకా. ఇంగ్లీషున The Bokharaplum or Alubokhara or prunes.



ఆవమొక్క :— ఇది మొక్కజాతిలోనిది. ప్రతిసంవత్సరం పైరు చేయుదురు. మెట్టప్రదేశములలో దీనిపంట చాలఎక్కువ. ఈ మొక్కలు రెండుఅడుగుల ఎత్తుకన్న ఎక్కువ పెరగవు. ఆకు కుక్కపొగాకును బోలుయుండును. పువ్వులు పసుపుపచ్చగ గుత్తులు గుత్తులుగ నుండును. కాయ సన్నముగ కోలగనుండును. కాయలో విదారుగింజలుండును. కారంతోగూడిన చేదురుచి. మిక్కిలి వేడిచేయును ఇందులో తెల్లావాలు, ఎర్రావాలు, నల్లావాలు, పచ్చావాలు అని నాలుగురకములుగలవు. తెల్లఆవాలు గ్రహబాధలకు పొగవేయుట కుపయోగించును. మిగిలినవి ఔషధోపయోగములు. నిత్యము భోజనోపయోగములు, అయివున్నవి. కఫవాతముల హరించుశక్తి చాలగలదు. పైత్యముచేయును. కూరలకు ఆవరుబ్బి కూరలలో కలుపుదురు. పులుపుకలసిన కూరలకు మిక్కిలిరుచి నిచ్చును. విదాహపెట్టును. ఆవాలయందు విటమినులు కలవు. జీర్ణశక్తిని వృద్ధిచేయును. దీని ఆకుతో పులుసు తయారుచేయుదురు. నోటికి హితవుగా నుండును. ఆకును చరకుడు నిషేధించినాడు. ఏమనగా అమ్లపిత్తము, దాహము, రక్తదుష్టత మొదలగు బాధలను కలిగించును. గాన నిషేధించినాడు. ఆవతైలం వైద్యమునకు చాలఉపయోగించును. కార్తీకమాసములో ఆవనూనె దీపారాధనచేసిన పుణ్యమని శత్రునాశనమని చెప్పబడియున్నది. ఆవనూనెతో వంటికి నలుగుపెట్టుకొన్న చర్మ వ్యాధులు కలుగవు. ఆవాలపిండి నీళ్ళలోగలిపి యిచ్చిన వాంతిని కల్గించును. మెత్తగా నీళ్ళతో నూరి గుండెకు పట్టువేసిన గుండెబరువు తగ్గి శ్లేష్మము నీరుచేయును. చాలసేపు ఉంచిన మంటపుట్టి పొక్కును. గాన మంటకలుగగానే పట్టుతీసివేయవలెను. కడిగివేసి వెన్నగాని నెయ్యిగాని పూయవలెను. ఈ పట్టువేయుటకు "వర్ణావాలు" అను సన్నని ఆవాలు శ్రేష్టము. వర్ణావాలతోబెట్టిన ఊరుగాయ చాలరోజులవరకు ఘాటుగా నుండును. ఈ ఊరుగాయ విషయము మామిడిచెట్టు అను శీర్షిక క్రింద వ్రాయబడినది. ఆవనూనె గానుగనూనె చేదుబీరనూనె ఈ మూడును

కలిపి కుష్టువులకు వ్రాసిన కుష్టురోగము హరించును. ఆవనూనె ప్రతి రోజును కాలునకురాసియు ఆవాలు భోజనమున కుపయోగించియు కొన్నిరోజులు సేవించిన బోదకాలు రోగము నివర్తించును. ఆవనూనె విశేషముగ సేవించిన ఈ రోగమునకు చాలమంచిది. ఆవాలు పెద్దావాలనియు, వర్ణావాలనియు తూర్పుసన్నాలనియు పలురకములు గలవు. గుణము అన్నిటికి సమానమే. క్రిమిరోగము హరించును. మలమును బంధించును. అరుగని పదార్థముల త్వరగ అరుగునట్లు చేయును. అందువల్లనే "అరుగని మాటికి ఆవయుగ్రము" అని చెప్పినారు. ఆవాలు కూరపోపులలో చాలఅవసరమైనవిగ పరిగణింప బడుచున్నవి.

సంస్కృతమున సర్షప. బెంగాలీన రాయ్, రాజికా. హిందీన సరసోం. గుజరాతిలో సరశన. మరాటీన శిరస్. ఇంగ్లీషున Brassica campestris.

ఆవు:—ఇది కామధేనువు సంతతిలోనిది. ఆవులలో అనేక రంగులు కలవు. ఇందులో ఒకేరంగుగల ఆవు శ్రేష్టము. కపిలఆవు అన్నిటికన్న శ్రేష్టతమము. ఇహపరందుల రెంటికిని ఆవు ముఖ్య సాధనమై యున్నది. ప్రొద్దుటలేచిన తోడనే ఆవును దర్శించుట సుఖప్రదము. మనుజుని సంసారచక్రము నడుపుటకు ఆవు ఒకవిధమైన సాధనమై యున్నది. ఆవుయొక్క ప్రతిఅంగములు మానవుల కుపయోగించునవియై యున్నవి. మూత్రపురీషములు పొలములకు చక్కని ఎరువున కుపయోగించును. పాలు, పెరుగు, మజ్జిగ, వెన్న, నెయ్యి, పంచితము, పేడ ఇవిఅన్నియు మనుజుల కుపయోగకరములే. ఎద్దుయొక్క ప్రయోజనము సర్వదిన విదితమేగాక ఇచ్చట వర్ణింపనవసరంలేదు. పాలయందు A. విటమినులు గలవు. పసిపిల్లలు లగాయతు వృద్ధులవరకు పాలు మిక్కిలి ఉపయోగకరముగనున్నవి. అప్పుడు పుట్టిన పసిపిల్లకు పాలు ఆహారపదార్థము. తీపిరుచి మేహశాంతి చేయును.



విపాకమున తీపిరుచిగా మారును. బాలెంతలకు చనుబాలను వృద్ధి చేయును. సుష్కశరీరులకు బలము చేకూర్చును. వీర్యమును వృద్ధి చేయును. శరీరకాంతిని ప్రసాదించును. ఆవుపాలలో గుమ్మపాలు చాల శ్రేష్టమైనవి. నురివెచ్చగా నున్నప్పుడే వీనిని త్రాగవలెను. బాగుగా చల్లారిన పాలు గుణభేదము కలిగియుండును. పాలయందు క్రొవ్వు పదార్థము, పిండిపదార్థము, జలము, లోహము, బూడిద మొదలగునవి కలవు. మాంసమును వృద్ధిచేయు పదార్థము గండగుటచేతనే బలమును కలుగజేయును. రాత్రులు పాలు సేవించుట చాలామంచిది. "రాత్రౌ క్షీరాన్న భుక్తస్య" అని కలదు. ఆయువు వృద్ధిచేయును. సూర్యనారాయణమూర్తికి మనవారు పాలు పొంగలి మాఘ మాసములో విశేషముగా పెటుదురు. ఆవుపాలతో తయారుకాబడిన నెష్టల్సు, హార్లిక్సు గ్లాసుగో మొదలగునవి జ్వరితులు లగాయతు సమస్త రోగులకు ఆహార పదార్థముగా వాడబడుచున్నవి. మరియు గొల్లభామలు మార్కు ఆగడ్డపాలు ఆవుపాలనుండి తయారుచేసిన ఆహారమే అయి వున్నది. ఇప్పుడు కాఫీ టీలకు పాలు అత్యావసరమైనవిగా నున్నవి. వేడి పాలలో చింతపండుగాని. మజ్జిగగాని కొంచెము కలిపిన పాలు తోడు కొనును. దీనిని పెరుగు అని అందురు. కొన్ని వ్యాధులలో ఆయుర్వేద ఇంజక్షనుగ ఆవుపాలు వాడబడుచున్నవి. పెరుగులో మీగడ వెన్న కలిసి యుండును. ఇది జిడ్డుగలది. తీపి, పులుపు రుచులు గలవు. విపాకమున పులుపు రుచిగా మారును. మేహశాంతి చేయును. గ్రహణీ రోగములకు మంచి గుణము నిచ్చును. వాత పైత్యముల నడంచును. శ్లేష్మమును కొంచెము పెంచును. బలము నొసంగును. జఠరదీప్తిని వృద్ధి పొందించును కొద్దిగా వేడిమిని చేయును.

ఆవుచల్ల:—పెరుగు చిలికి వెన్నతీసినది చల్ల అనబడును. దీనికి నామాంతరము తక్రం. ఇది త్రిదోషహరమైనది. వగరు, పులుపును

గలసిన రుచి గలిగియుండును. శరీర ధాతు పోషణకు గావలసిన పదార్థములన్నియు దీనియందు ఇమిడివున్నవి. విపాకమున పులుపు రుచిగా మారును. జఠరము వృద్ధిచేయును. కఫవాతములను, ఉబ్బు రోగమును, ఉదరవ్యాధులను, మూలశంఖలు, జిగటవిరేచనములు, మూత్రబద్ధము, అరుచి వీనిని శమింపచేయుటకు మజ్జిగ పరమహంస క్రియ. మరియు నెయ్యి ఎక్కువగా సేవించినప్పుడు కలుగు దాహ నివృత్తికి మజ్జిగ చాలా మంచిది. శరీర శ్రమను పోగొట్టుటకై కొంచెం లవణము చేర్చిన మజ్జిగ త్రాగిన బద్ధకం వెంటనే హరించును. మజ్జిగతో చారు, పులుసు మొదలగు ఆహారపదార్థములను తయారు చేయుదురు. దీనిలో B. విటమినులు కలవు.

ఆవువెన్న :—ఇది మిక్కిలి జిడ్డుగల పదార్థము. తీపిరుచి చలువచేయును. విపాకమున తీపిరుచిగానే మారును. వాత పైత్య శమనము చేయును. శ్లేష్మకారి. రక్తదోషములను హరించును. క్షయ రోగులకు, పసిపిల్లలకు ఇది అమృతతుల్యమైనది. వేడివలన బుట్టిన పొడి దగ్గు, నోటివెంట రక్తముపడుట దీని సేవవలన కట్టును. ఆవువెన్నతో చేయు కాటిక యోగములు చాలా గలవు. అవి కండ్లరోగములకు చాలా యుపయోగములుగా నున్నవి. కంటిలోని నలక తీయుటకు కంటిలో వెన్నపెట్టిన నలక సులువుగ వచ్చును. ఎరుపులు తగ్గును. వెన్నను నవనీత మందురు.

ఆవునెయ్యి :—వెన్న కాచిన నెయ్యి అగును. దీనికి ఘృతము అని పేరు కలదు. అన్నిజంతువుల నేతులకన్న ఆవునెయ్యి చాలా శ్రేష్టమైనది. తీపి కొంచెము వగరురుచికలది. చలువచేయును. విపాకమున మధుర రుచికి మారును. బుద్ధిని వికసింపచేసి జ్ఞానమును వృద్ధి పొందించును. ఆయురారోగ్యముల నిచ్చును ఔషధ యోగములలో నెచ్చట నెయ్యి అని వచ్చినను ఆవునేతినే గ్రహించవలెను. ఆవునేతితో దీపారాధన చేయుట పుణ్యప్రదమని మనవారి నమ్మిక. ఆవునెయ్యి జ్ఞాన మోక్షముల నిచ్చును. శరీర శుద్ధికి ఆవునెయ్యి స్నేహపానము చేయవలెను. చాలాకాలము భూమిలో పాతి నిలవయున్న ఆవునెయ్యి వ్రణముల మాన్పుటలో చాలా శ్రేష్టమైనది.

ఆవు పంచితము :—ఇది ఉప్పు వగరు కారము రుచులు కలిసి యుండును. మిక్కిలి వేడిచేయును. తీక్ష్ణగుణము. విపాకమున కారపు రుచిగా మారును. గాఢవిరేచనకారి. ఉబ్బురోగములు దీనిపేరు చెప్పి నంతనే పటాపంచలగును. అవగా సేవించిన చక్కని గుణం నొసంగును. వాత శ్లేష్మముల నదల్చును. మరియు క్రిములు, గుల్మములు. కడుపు ఉబ్బులు, ఉన్మాద రోగములు, మూత్రకృచ్ఛ్రలు, కాస శ్వాస, శరీర సంబంధమగు చర్మరోగములుహరించును. శూలలు వెంటనే శమించును. అభ్రకము, కాంతము ఇనుము దీనితో శుద్ధిపొంది భస్మసింధూరము లగును.

ఆవుపేడ :—ఇది పవిత్ర పదార్థముగా పరిగణింపబడుచున్నది. ఇండ్లు ఆవుపేడతో అలుకుదురు. దీనియందు క్రిములను హరించుశక్తి కలదు. గాలిని శుభ్రపరచగలదు. ప్రతి యింట వాకలి యూడ్చి పేడ నీళ్ళు చల్లుట శ్రేష్టమైన ఆచారము. దీనివలన అంటువ్యాధులు సంభవించవు. మరియు చంటిబిడ్డలకు ప్రతిరోజూ సాయంకాలం ఆవుపేడ మూడు వుండలుచేసి దిగదుడిచి పారవేయుదురు. ఇందువలన దృష్టి దోషము హరించి గ్రహబాధలు కలుగనేరవు. పిల్లలు కింకపోరు పెట్టుట మానుదురు. మనవారు శరీరశుద్ధికై ఆవుపాలు, పెరుగు, నెయ్యి, పంచితము, గోమయము కలిపి పంచగవ్యప్రాశన మొనరింతురు. ఆవు పాలలో కొన్ని పదార్థములు కలిపి భుజింపరాదు. శ్లేష్మప్రధానముగా గల జంతువుల మాంసము, చేపలు, పులుపుగల వస్తువులు, పండ్లు

మొదలగునవి. చిమ్మిలితిని పాలు త్రాగరాదు. అలాగుచేసిన విరుద్ధ గుణము నిచ్చును.

క్షీరమిత్రములు :-పంచదార, మిరియములు, శొంఠి, ఏలకులు. ఆవును దానముచేయుట పుణ్యప్రదమని మనవారు నమ్ముచున్నారు. దశదానములలో గోదానం ఒకటి. శ్రీకృష్ణభగవానుడు జన్మించినప్పుడు వసుదేవుడు కారాగార శిక్ష అనుభవించుచు మనస్సులో పదివేల ఆవులను ధారపోసెనని కలదు. శ్రీరామచంద్రమూర్తి అడవి కేగునపుడు మిక్కిలి దరిద్రుండు అగునొక బ్రాహ్మణోత్తమునకు లెక్కలేనన్ని ఆవులనిచ్చెను. ఇట్లు పురాణప్రసిద్ధముగ నున్నది. ఆవుడెక్కలు క్షయ రోగమున కుపయోగించును. కొమ్ములపొట్టు గ్రహబాధల నణంచును. విశ్వామిత్రుని రాజ్యకాలములో ఆవునిమిత్తమేగదా విశ్వామిత్రునికి రాజ్యచ్యుతి, తపోనష్ట గలిగి బ్రహ్మర్షిత్వ మబ్బుట, నృగమహారాజు ఊసరవెల్లియగుట, గోవునుగురించియేకదా ఇవిఅన్నియు ఆస్తిక మహాశయులకు వేద్యములు. ఇంగ్లీషున Cow అందురు.

అవురుగడ్డి :—పట్టివేళ్ళు చూడుము.

ఆళ్ళు :—ఇవి రేవటి ప్రదేశములో పండు తృణధాన్యము. వీనిని ఆరికలనికూడ చెప్పుదురు. మూరఎత్తువరకు పెరుగును. మొవ్వ తోడనే వెన్నుపుట్టును. గింజ చింతగింజవన్నె కలిగి చిన్నదిగ పలక తేరియుండును. వెన్నుకొట్టినగాని గింజ కనుపడదు. వీనిని విసరి, దంచి బియ్యము చేయుదురు ఈ బియ్యపు అన్నం మిక్కిలి రుచిగ నుండును. గురుత్వముచేయును. తీపిరుచి. పైత్యశ్లేష్మముల హరించును. మలబద్ధం చేయును. దీనికి విరుగుళ్ళు బూడిదగుమ్మడికాయ రసం, పాలు, బెల్లము మొదలగునవి. సంస్కృతమున కోద్రవ. ఇంగ్లీషున A Species of food grain అందురు.



## ఇ

ఇటిక :—ఇటికలు సాధారణముగ గృహనిర్మాణమున కుపయోగింతురు. వైద్యోపయోగమునకు నిది చాలమంచిది భూమిలో చిరకాలము నిలవయున్న ఇటిక అనగా సుమారు 5—6 వందల సంవత్సరములనాటి ప్రాతఇటికలుదెచ్చి మెత్తగచూర్ణించి ఇసుక రాళ్ళు తీసివేసి కలుబంద రసముతోగాని మామిడిచెక్క రసముతోగాని నరమామిడి చెక్క రసముతోగాని మర్ధనచేసి పుటములు 10—12 పెట్టినది మంచి మేహశాంతి చేయును. అభ్రకముతో సమానగుణం కలిగియుండును. నాలుగయిదు గురివెందగింజల ఎత్తు అనుపాన విశేషమున నిచ్చిన తెల్లకుసుమలు హరించును. దుష్టవేడిమిని తగ్గించును. ఇటికకాల్చి కాలి మడమతో త్రొక్కిన మడమశూల హరించును మరుగుచున్న వేడినీళ్ళలో కాల్చిన ఇటిక వేసి ఆవిరిబట్టిన శిరస్సునందలి దుష్టనీరు చెమట రూపమున వెలికివచ్చి శిరోవేదనతగ్గును మరియు మేహనీరు హరించును. ఇటికపొడుము వెచ్చచేసి కాపడముపెట్టిన వాతనొప్పులు వెంటనే శమించును. సంస్కృతమున ఇష్టక అందురు.

ఇడ్డెన :—ఇది మినపపప్పు నానించి రుబ్బి వరినూక చేర్చి ఆవిరిపై ఉడికించి తయారుచేయు భక్ష్యవిశేషము దీనికి వాసెనపోలి అని మారు పేర కలదు. మేహశాంతిచేయును. గురుత్వముచేయును. దీనికి దక్షిణ హిందూదేశమున మద్రాసునుండి దక్షిణదిక్కున చాల ప్రచారము కలదు. ప్రతి కాఫీహోటళ్ళలోను ఫలహార వస్తువులలో నిది ఒకముఖ్యమైన ఫలహారపు వస్తువ. ఇడ్డెన తినినవెంటనే కాఫీత్రాగరాదు. మంచి నీళ్లు పుచ్చుకొనవలెను. లేదా పాలను త్రాగవచ్చును. ఇప్పుడు నాగరికతగల ప్రతిగృహమందును ఇడ్డెనలను తయారు చేసికొనుచున్నారు. ఇందులో అల్లం పచ్చిమిర్చిముక్కలు చేర్చికూడ తయారుచేయుదురు

కాఫీహోటళ్ళలో ఇడ్డెనలను భుజించుటకు పచ్చళ్ళనుగాని సాంబారు అనబడు పప్పుపులుసునుగాని ఉపయోగించుదురు. మినపపప్పు, మిరప కాయలు, జీలకఱ్ఱ, మొదలగు వస్తువులు వేయించికొట్టిన కారము ఉపయోగించెదరు. వీనిని తూర్పుదేశమున పనసఆకు దొప్పలుకుట్టి అందు ఈ పిండిపోసి "కొట్టుంగ" లని తయారుచేయుదురు.

ఇత్తడి:—ఇది మిశ్రలోహము. ఇవి రెండు రకములు. 1 రీతి. 2 కాకతుండీ. ఇత్తడిని కొలములో నెఱ్ఱగకాల్చి కాంజికములో ముంచిన నెఱ్ఱగనున్న రీతి అనియు, నల్లగనుండిన కాకతుండీ అనియు చెప్పుదురు. లోహమారణమునకు రీతి లోహమే శ్రేష్టము. వావిలాకు పసరులో పసుపుచూర్ణం కలిపి ఇత్తడి కొలిమిలో కాల్చి పైరసములో ముంచవలెను ఇట్లు ఏడుపర్యాయములు ముంచిన ఇత్తడి శుద్ధి బొందును. గంధకం, మణిశిల నిమ్మకాయరసముతో నూరి ఇత్తడి రేకులకుబట్టించి పుటము వేసిన భస్మమగును. ౮–10 పుటములు వేయవలెను. వైద్యకర్మల యందుపయోగించును. శ్రేష్టమైన ఇత్తడిభస్మము దగ్గులు ఉబ్బసము, కుష్టువు, క్రిమిరోగముల యందు బాగుగపనిచేయును. మరియు శ్వేతకుష్టము అనబడు బొల్లిరోగమునకు ఇత్తడిభస్మము అనుపాన విశేషమున సేవించిన మంచిగుణం కనిపించును. జఠరదీప్తి నిచ్చును. జీర్ణకారి. ఇత్తడికుండెడి గుణములే ఇత్తడిపాత్రలలో వండిన వంటకములకును గలవు. సంస్కృతములో ఆరకూటము. ఇంగ్లీషులో **Brass** అందురు.

ఇనుము:—ఇనుము మూడురకములుగా నున్నయది. మృదులోహము, కుంతలోహము, కడారలోహము. ఈ మూడును గుణమున సమానములై యున్నవి. స్వభావములనుబట్టి భేదము లేర్పడుచున్నది. ఇనుము చేదురుచి, వేడిచేయు గుణము. విపాకమున కారపు రుచికి మారును. శుద్ధికి ఇనుపరజము తిలతైలములో నుడికించి కడగవలెను.



నేరేడుచెక్క రసమున నుడికించినను శుద్ధియగును. రేకులైననుసరే ఇట్లుచేసిన శుద్ధిని పొందును. శుద్ధి అయిన ఇనుము గోమూత్రముతో గాని, త్రిఫల కషాయముతోగాని నూరి పుటములు వేసిన భస్మమగును. అల్లపు రసముతోడను నూరి పుటము లిడినను భస్మము అగును. భస్మముచేయు ప్రక్రియలు అనేకములుకలవు. శాస్త్రోక్తముగా చక్కగా భస్మము చేయబడిన ఇనుపభస్మము వ్యాధులపై వాడతగినది. వాత కఫములు, శూలలు, పాండురోగములు, కామిలారోగములు హరించును. నజ్జువ్యాధులకు ఇది పెట్టినదిపేరు. రక్తదోషమును హరించి రక్తమును బాగుగా పట్టించును. నరములకును. ఎముకలకును బలము చేయును. లోహభస్మము పెక్కుమందులలో పడును. ఇనుముతో వ్యవసాయ పనిముట్లు, గృహోపకరణములు, గృహనిర్మాణమున కుపయోగించు మేకులు, ఊసలు, బందులు మొదలగునవి ఎన్నియో చేయబడుచున్నవి. బాకులు, కత్తెరలు. సూదులు, ఒకటి అననేల చాలా పనిముట్లకు ఇనుము మూలమైయున్నది. రైలుపట్టాలు, ఇంజనులు, చక్రములు, పెట్టెలు, మొదలగు జనోపయోగ కార్యములకు, వంతెనలకు ఇనుము విస్తారముగా వాడబడుచున్నది. సంస్కృతమున అయఃలోహః, ఇంగ్లీషున **Ferrum Iron.**

ఇప్పచెట్టు:—ఇది పెద్ద వృక్షజాతిలోనిది. అడవులలోను, పర్వతములలోను విస్తారముగా నుండును. భద్రాచలము ప్రాంతారణ్యముల లోను, శ్రీరంగం సమీపమునను ఈ చెట్లు గలవు. ఆకు లోలుగ ఆకును పోలియుండును. పువ్వు పొగడపువ్వు ఆకృతి గలిగి పెద్దదిగను, దళసరిగను ఉండును. కొంచెం మదం వాసన వేయును. తీపిరుచి. చలువ చేయును. విపాకమునగూడ తీపిరుచిగానే మారును. వీర్యవృద్ధిచేయును. చక్కని బలం నిచ్చును. పువ్వు పండుగూడా తీపిరుచిగానే యుండును. గుణముకూడా సమానములే. ఇప్పపట్టు రక్తపిత్తమును హరించును.

వ్రణముల శోధించి మాన్పును. ఇప్పనూనె తియ్యగా నుండును. జిడ్డు ఎక్కువ. కఫం, పైత్యం, జ్వరం, తాపం హరించును. ఇప్పచావ మెత్తగా చూర్ణించి నస్యముచేసిన గ్రహబాధలు హరించును. ఇప్ప క్షారము రక్తపిత్తమును హరించును. ఇప్పపువ్వు రసము, తేనె కలిపి నస్యం చేయించిన ఎక్కిళ్ళు కట్టునని భావప్రకాశికలో నున్నది. ఇప్ప పువ్వు సారా మంచి బలం చేయును. వీర్యవృద్ధిని గలిగించును. ఇప్ప తైలముతో కార్తీకమాసమున దీపారాధన చేయుట పుణ్యప్రదమని కొన్నిచోట్ల కలదు. ఇది రెండు రకములు గలవు. 1 జలమధూక, 2 మధూక. ఇప్ప నూనెతో వంగము శుద్ధియగును. సంస్కృతమున మధుపుష్ప, ఇంగ్లీషున Indian Butter tree అందురు.

ఇరుగుడు చెట్టు:—ఇది మహావృక్షములలోనిది సారము గల వృక్షము. ఆకు గానుగ ఆకునుబోలి పెళుసుగా నుండును. పువ్వులు దివిసెన పువ్వువలె నుండి పుప్పొడితో గూడియుండును. ఇందు రెండు జాతులు కలవు. 1 తెల్లపువ్వులది 2 నల్లపువ్వులది. ఈ మానులో నల్లని లోహమువంటి గట్టి చేవయుండును. దీనిని ఇరుగుడుచేవ యందురు. దీనితో గృహోపకరణములు మంచములు వగైరాలు తయారుచేయుదురు. ఇది వేడిచేయును. చేదు కారముగలిగిన రుచి. విపాకమున కారపు రుచికి మారును. కఫవాతముల పోగొట్టును. జీర్ణకారి. ఉబ్బులు అతిసారములు హరించును. ఇందులో నీలిరంగుకల ఇరుగుడు శీతవీర్యమైనది. వాంతులు ఎక్కిళ్లు మొదలగు పైత్యప్రధాన రోగములను హరించును. శరీరమునకు చక్కనికాంతిని తేజస్సును ప్రసాదించును. దీనియందు గర్భస్రావ శక్తికలదు. ఇరుగుడు వేరుపైచక్క కషాయముపెట్టి సేవించిన సామేహము హరించును. ఇరుగుడుచావ పొట్లములో ఒకపాలు నీళ్ళు. రెండుపాళ్లు ఆవుపాలు కలిపి కషాయం పాలుమిగులువరకు కాచి ఆపాలు పూటకు రెండు డబ్బులయెత్తు పుచ్చుకొనిన సర్వజ్వరములు హరించునని



సుశ్రుతమున గలదు. ఇరుగుడు పట్ట నాలుగు కుంచముల నీటిలోవైచి కషాయముపెట్టి సగము ఇగిరిన తర్వాత వడకట్టి ఆ కషాయముతో అన్నముగాని పాలుచేర్చి పరమాన్నముగాని వండి భుజించిన గృధ్రసీ వాతము హరించునని వంగసేనలో కలదు. సంస్కృతమున శింశుప, కృష్ణసార అని అందురు.

ఇఱ్ఱిమాంసము:—ఇది తీపి వగరు కలసిన రుచిగలిగి యుండును. చలువచేయును. అరుచి, మూలశంఖ, క్షయ, దగ్గు, ఆయాసముగల రోగులకు ఇఱ్ఱిమాంసం పథ్యకరం. త్వరగా జీర్ణమగును. త్రిదోషముల శాంతిపరచును. ఇందులో ఎఱ్ఱ ఇఱ్ఱి మాంసం బలకరమైనది. అజీర్ణం చేయును. మలమును బంధించును. ఇవి అనూపజంతువులు. వీనిని జాంగలములని అందురు. ఇంగ్లీషున Flesh of female deer.

ఇలివెందచెట్టు:—ఇది ఒక గొప్ప వృక్షము. సాధారణముగా దీని పండునకే ఉపయోగము. ఇది తీపి వగరు కలిగిన రుచి యుండును. వేడిచేయును. వాత శ్లేష్మముల పోగొట్టును. మలమూత్రముల బంధించును. ఎక్కువగా భుజించిన పొత్తికడుపులో నులిపురుగులు కలుగ జేయు గుణము గలదు ఇంగ్లీషున A Certain tree.

ఇసుక:—ఇసుకలో పలురకములు కలవు తెల్ల ఇసుక, ఎఱ్ఱ ఇసుక, నల్ల ఇసుక, గంధ ఇసుక. ఇసుక ఔషధములు చేయుటకు పనికి వచ్చును. దీనితోడను తయారుచేయు హోమోపతి ఔషధమును సైలీషియా లేక సిలికా అని అందురు చీమును హరించుటకు దేహము నుండి వెడలించుటకును కూడా మిక్కిలి ఉపయోగించును. ఇసుకతో అద్దములు చేయుదురు. ఇసుక శీత వీర్య ద్రవ్యము. ఇసుక తిన్నెలపై పరుండిన మేహశాంతి చేయును. ఇసుకలోనుండి వచ్చిననీరు పరిశుభ్రముగా నుండును. చెడ్డనీటిని ఇసుక బొగ్గులతో వడకట్టిన పరిశుభ్రత

చెందును. సెలయేరులలో చెలమలు త్రవ్వి గ్రామస్థులు నీటిని త్రాగుదురు. ఇవి తేలికగా నీరుపడి ఉపయోగించును ఇసుకయందు దుర్వాసనను హరించు శక్తి కలదు. మరియు విషక్రిములను జేరనీయదు. ఇసుక వేయించి అందు నీళ్ళుపోసి సగమిగులువరకుకాచి నీటిని తేర్చి ఆ నీటిని దాహమిచ్చిన జ్వరములలో బుట్టిన విదాహము హరించును. ఇసుక కాచి కాపడము పెట్టిన వాతనొప్పులు శమించును. కుండలో సగము వరకు ఇసుకపోసి అందు గాజు కుప్పె ఔషధము పోసినది వుంచి క్రమాగ్నుల వండుదురు. దీనిని వాలుకా యంత్ర మందురు. ఇసుక తెరనుండి ఊరిననీరు ఆరోగ్యమైనది. సంస్కృతమున వాలుకా, ఇంగ్లీషున Sand.

ఇసుకదాసరికూర :—దీనికి సంస్కృత శబ్దం కనుపించదు. ఆంధ్ర దేశములో మాత్రము సకృతుగ వాడుదురు ఇది తీపి వగరు కలసిన రుచిగలది. కూర సమశీతోష్ణము. మూత్రసంబంధమైన వ్యాధుల కుపయోగము. ఇది ఊర్ధ్వగత వాతమును క్రిందికి దింపును. దీనిరసము ఎలిక పాముల జంపును. ఔన్సురసము ఇవ్వవచ్చును.

ఇసుపగోలు గింజలు :—ఈ గింజలు యూనానీ వైద్య సాంప్రదాయములైనను దేశీయ వైద్యులు కూడా వాడుచున్నారు. ఇవి వగరు తీపిరుచి కలిగి చలువచేయు స్వభావం కలవి. ఇవి నానవేచిన జిగురుగా నుండును. రక్తపైత్యము, రక్తాతిసారము, శ్లేష్మ పైత్యముల పోగొట్టును. కొంచెం వాతము చేయును. వీర్యవృద్ధిని చేయును. శగ రోగములలో గలిగెడు మంటలను చల్లార్చును. అనగా గింజలు కషాయంపెట్టి అందు తాటిపంచదారచేర్చి ఇచ్చిన పైబాధ హరించును. మూత్రం జారీచేయును. ఉమ్మెత్త రసములో నీగింజ లుడికించి వ్రణములకు గట్టిన వ్రణములు హరించును. కశ్మలమును పోగొట్టును. దీని వేరు కషాయముగాని, ఆకుకషాయముగాని క్షయజ్వరము, పాలిజ్వరము



హరించును. స్వప్నములు దీని వేరు గంధము రాసి గుహ్యపాగ వేసిన శమించును సంస్కృతమున ఈషద్గోల, ఇంగ్లీషున Spogel seeds.

ఇక్షుదర్భ :—దీని రుచి తీపి వగరు కలిగియుండును. మేహశాంతి చేయును. మధుర రసము. దీని వేళ్ళ రసము కఫము, పిత్తము హరించి తృప్తినిచ్చును.

ఇంగిలీకము :—ఇది పాదరసముతో పూరింపబడిన ఘన ద్రవ్యము. ఇందులో రెండురకములు కలవు. 1 వలాందు ఇంగిలీకము, లేక సూదులకట్ట ఇంగిలీకము. 2 పిట్ట ఇంగిలీకము, వలాందు ఇంగిలీకములో రసభాగమెక్కువగా గలదు. తులమునకు మూడువంతులు రసముండును. పిట్టఇంగిలీకములో రసభాగము తక్కువ. తులమునకు అరతులము రమారమీ ఉండును ఇంగిలీకమునుండి రసమును ఊర్ధ్వపాతన యంత్రముద్వారా తీయుదురు. ఇంగిలీకము చనుబాలలోగాని, నిమ్మకాయరసములోగాని, అల్లపురసములోగాని, 7 భావనలుచేసిన శుద్ధియగును. ఇంగిలీకము యోగవాహి. ఇది ఏఔషధములో చేరునో దానిగుణమును వృద్ధిచేయును. ఇంగిలీకమునుండి తీసిన రసమును బాలరసమందురు. ఈ రసం పరిశుభ్రమైనది. ఇంగిలీకము మిక్కిలి వీర్యవృద్ధిని చేయును. మరియు రసాయనద్రవ్యము. శుద్ధిచేయబడిన ఇంగిలీకము సవాయిరోగముల హరించును. కుష్ఠురోగముల నివారించును. ఘనీభవించిన శ్లేష్మమును హరించి విరేచనము చేయును. దీనిని తేనెతో కలిపి లింగమునకు బూసిన లేపనశక్తి వృద్ధిచేయును. ముద్దహారతికర్పూరము గన్నసాంబ్రాణి, సమము కల్వమున మెత్తగనూరి ముద్దచేసి ఆ ముద్ద మధ్యన ఇంగిలీకము ఏకముక్క కర్పూర సమముగల ముక్క ఉంచి వెలిగించిన ఇంగిలీకముకట్టును. ఇది సవాయిలకు వాడవలెను. కఠినపథ్యము. సాంబ్రాణి, హారతికర్పూరము, గంధకము సమము ఈ మూటిని కలిపి నూరి ముద్దచేసి ఇంగిలీకము ముక్క ముద్ద మధ్యనువుంచి వెలిగించ

వలెను. ఇంగిలీకము కట్టును. దీనిని లింగ సిందూరమందురు. ఇది చంటి పిల్లలపాలికి కల్పవృక్షమువంటిది. జ్వరము, దగ్గు, ఆయాసము, కడుపు పొంగరింపు. విరేచనములు, మలబద్ధము, వాంతి, మొదలగు పెక్కు రోగములు అనుపాన విశేషముల హరించును. మరియు జీడిగింజలు రెండుముక్కలుగ కొట్టి మూకుడులోపోసి ఆమధ్యను ఇంగిలీకము పెట్టి మంటబెట్టిన ఇంగిలీకము కట్టును. దీనిని ఆవునేతిలో మూటకట్టి వెలిగించవలెను. పరిశుద్ధియగును. దీనిని ఇంగిలీక సత్వమందురు. కాంత వల్లభ రసము మొదలగు ఓషధములతో చేర్చివాడవచ్చును. మిక్కిలి గుణకారి. బొమ్మచెముడు పండ్ల రసముతోను, చనుబాలతోను, కామంచిఆకు రసముతోను మునగపువ్వుల రసముతోను, చురకా యిచ్చిన కట్టును. వైద్యుని తెలివితేటలబట్టి పలువిధము తయారుచేసి వాడకొనవచ్చును. ఇది ప్రతిగృహస్థునింట నుండిన పసిపిల్లల జబ్బులనుగూర్చి వైద్యునికటకేగు నవసరముండదు. ఇంగిలీకము కట్టి మేక బుజ్జ మొదటిలోనుంచి చీలమన్నువిచ్చి పుటముబెట్టి తీసి ఆముక్క నిమ్మపండ్లరసముతో నూరి కందిగింజలవలె మాత్రలుచేసి అనుపాన యుక్తముగ నిచ్చిన శరీరమంతయు ముద్దగట్టిన వాతము హరించి యథా ప్రకారము సంచరించునటుల జేయుటయేగాక ఏనుగంత బలవంతునిగ గూడ చేయును. ఈ మందు సేవించునంతకాలము పులుసు, నూనె, ఆవ, గుమ్మడి, వగైరా అపథ్యవస్తువులు తినరాదు. ఇంగిలీకము వాదవిద్యకు గూడ నుపయోగించును. సంస్కృతమున దరదహింగుళి. ఇంగ్లీషులో Cinnadar or Vermilion అందురు.

ఇంగువ:—ఇది రెండుగజముల ఎత్తువరకు పెరుగుమొక్క జాతిలోనిచెట్టు. ఇది అడవులలో పెరుగును పంజాబు, కాశ్మీరము, పెర్సియా, ఆఫ్గనిస్తానములలో దీనిని పైరుచేయుదురు. దీనిజిగురు, ఆకులు, వేరుగూడ వైద్యమున నుపయోగించును. ఆకులు కోలవాటి



వావిలాకులవలె నుండును. పువ్వులుగూడ వావిలిపువ్వులవలె రెండేసి యుండును. ఈ మొక్క పాలునకే ఇంగువ అనిపేరు. ఇది మెత్తగ నుండును. దీనిలో కొన్నికొన్ని వస్తువులజేర్చి వంటవండుదురు. దానిని ఇంగువ అని అమ్ముచున్నారు. ఇందులో పలురకములు గలవు. చక్క ఇంగువ అనునది ఒకటికలదు. ఇంగువ మూర్ఛలకు ముఖ్యమైనమందు. పొత్తికడుపులోను, హృదయములోను, పనిచేయును. మిక్కిలి వేడి చేయును. ఇంగువ విస్తారము కారము, కొద్దిచేదుగల రుచికలది. విరేచనము చేయించును. నీళ్ళ విరేచనముల కట్టును. వాతము, శ్లేష్మము, క్రిములు, హరించును. గుల్మములు, ఉదరరోగములు, కడుపు ఉబ్బు, గొడ్డుమోతు గుణము, శూలలు, గుండెరోగము, నిర్మూలించును. నయనరోగములకు మంచి గుణముచేయును. రుచినిబుట్టించును. తిన్న అన్నమును బాగుగ జీర్ణము చేయును. పిత్తమును పెంచును. స్త్రీల ఋతుదోషములను హరించి ఋతువును సక్రమపరచును. తెల్లజిల్లేడు పువ్వు రేకలు, మిరియములు, వేపుచేసిన ఇంగువ మూడు మూడు బేడల ఎత్తు చక్కగ నూరి ఆమాత్రలుచేసి పూటకు రెండుమాత్రలు చొప్పున బాలెంతలకు యిచ్చిన మైలరక్తమును చక్కగ వెడలించును. ఇది అనుభవము. ఇంగువ 1 భాగం, పిప్పళ్ళు 1 భాగం, ముద్దహారతి కర్పూరము 1 భాగము, తుంగముంపల చూర్ణం 2 భాగములు. కలిపి నీళ్ళతో మెత్తగ చూర్ణించి నూరి కందిగింజలవలె మాత్రలుచేసి జీలకఱ్ఱరసముతో నిచ్చిన కలరా విరేచనములు కట్టును. అజీర్ణవిరేచనములు కూడకట్టును. మరియు ఇంగువ, ముసాంబ్రం, సమముగా నూరి శనగగింజలంత మాత్రలుచేసి కురంజివాము రసముతో నిచ్చినను, మోదుగమాడలు రసముతో నిచ్చినను ఏటికపాములు హరించును. ఇంగువ సాధారణముగా చారుపోపులలోను, మసాలా చారుపొడిలోను కారపూరగాయ మామిడిఊరగాయలలోను, మాగాయలోను ఉపయో

గింతురు. సీతాఫలపు ఆకు రసములో ఇంగువ అరగదీసి నారికురుపులపై వేసిన క్రిమిచచ్చి శమించును. కొన్ని తత్వములవారికి విస్తారం బాధ చేయును. ప్రసవించినవెంటనే ఇంగువ అరతులం వెత్సచేసి పాతబెల్లంలో కలిపినూరి ఇచ్చి ఆతరువాత రెండురోజులవరకు పూటకి పావుతులం ఎత్తు చొప్పున పై ప్రకారం ఇచ్చిన ఏవిధమైన బాధలు లేకుండ బాలెంతలు సుఖముగ ఆరోగ్యవంతులుగ నుందురు. ఆ తరువాత పథ్యం పెట్టవలెను. ఋతుదోషం ఎంతమాత్రము ఉండదు. ఇంగువ పుచ్చి పంటిలో పెట్టిన పురుగు చచ్చి బాధశమించును. శూలనొప్పులకు ఇంగువ చాలప్రశస్తమైనది. తేలువిషమునకు ఇంగువ అరగతీసి కాటుపై వేసి పొగపట్టవలెను.

సంస్కృతమున తామఠ. హింగు. హిందీన హాంగ్. కర్ణాటమున ఇంగు, హింగు. అరవంలో పెరుంకాయం. ఇంగ్లీషున Assafoetida.

ఇంగుపత్రి :—ఇది మిక్కిలి వేడిచేయును. కారపురుచి, జీర్ణశక్తిని వృద్ధిచేయును. రుచిని కలుగజేయును. గుండెకు మంచిది. కఫవాతములు ఆమదోషము, ఉదరవ్యాధులు హరించి మలబద్ధము చేయును. మూలశంఖలు, గుల్మములు, మేదోరోగములు హరించును. ఆకులను వెత్సచేసి చెవిలోపిండిన కర్ణశూలలు హరించును. ఆకు రసం ఆముదములో కలిపి పిల్లలకు పెట్టిన వాతములు, కడుపుఉబ్బు, అజీర్ణం క్రిములు మొదలగు వ్యాధులు హరించును. ఇంగువచెట్టు ఆకులకే ఇంగుపత్రి అనిపేరు.

ఇందుపగింజలు :—వీనిని చిల్లచెట్టనియు, గింజలను చిల్లగింజలనియు శేవకబీజములనియు చెప్పుదురు. ఇది సాధారణముగా మన్యప్రాంతములలోగల వృక్షము. ఇందుపకాయలు గుండ్రముగా నుండును. మడ్డి నీటిని శుభ్రపరచుశక్తి కాయలకు కలదు. మడ్డిఅంతయు క్రిందికి పోవుటకై గింజల గంధము నీటిలో కలుపుదురు. తేటనీటిని ఉపయో



గింతురు. ఇందుపగంధము కంటిచుట్టు పట్టివేసిన కంటిజబ్బులు పోవును. ఇందులో కొంచెం పటిక చేర్చవలెను. ఇందుపకాయలు మిక్కిలి గట్టిగలిగి జిగురుగా సాగుచుండును. దీనిని చూర్ణముచేయుట చాలా కష్టము. ఈ చూర్ణము వీర్యవృద్ధి చేయును. ఇందుపపండు చేదుగా నుండును. పిత్తకరము. మూత్రాశ్మరిని కట్టును. ఇందుపగింజల గంధములో పచ్చకర్పూరముచేర్చి కంటికి బెట్టిన నేత్రరోగములు హరించునని భావప్రకాశికయందు కలదు. ఇది బీజసార వృక్షము. సంస్కృతమున కతక, హిందీలో నిర్మలీ. అరవంలో తేత్రాంకొట్టై అందురు.

ఇందుప్పు :—సైంధవ లవణము చూడుము.

## ఈ

ఈదెపండు :—వీనిని ఈలుపండ్లని కొందరు చెప్పుదురు. ఇందు రెండుజాతులు కలవు పెద్ద చిన్న జాతులు. ఇవి కమలాఫలము జాతికి పోలిన చిన్నపండ్లుకల చెట్లు పండ్లు నిమ్మకాయలంత యుండును. పండులో 8—9 తొనలుండును, పెద్ద ఈదెపండ్లు చలువచేయును. రుచినిచ్చును. అగ్నిమాంద్యము చేయును. వాతహరము. చిన్నపండ్లు పులుపు తీపి రుచి కలసి యుండును. కొంచెం వేడిచేయును. వీర్యపుష్టియు, మేహశాంతియు చేయును. దప్పిని పోగొట్టును. సంస్కృతమున పారేవత, ఇంగ్లీషున A Soit of orange,

ఈతచెట్టు :—ఈతచెట్లలో రెండు భేదములు గలవు. పెద్దఈత, చిన్నఈత లేక చిట్టీత. ఇది తృణరాజ వృక్షములలో నొకటి. పెద్దఈత 30 అడుగుల ఎత్తువరకు పెరుగును. చిన్నఈత 5—6 అడుగుల ఎత్తు కన్న పెరుగదు. పెద్దఈతకు పొడుగుగల కాములో గూడి వాడి ముండ్లు గల ఆకులు కాము కిరువంకల నుండును పువ్వు కారపు గొట్టికొనును.

కాయలు పచ్చివి ఆనుపచ్చగా బాగుగా ముదిరిన బంగారువర్ణముగా పండిపోయిన తేనెరంగుగా మారును. చిట్టీతపండ్లు ఎరుపురంగు గలిగి పండిన నల్లగ నుండును. తీపిరుచి గలిగియుండును. కలకరం. మలమును బంధించును. ఈతవేళ్ళ కషాయములో ఆవుపాలు కలిపి పంచదారచేర్చి సేవించిన స్త్రీల ప్రదరరోగములు హరించును. చప్పిడిపథ్యము. మొవ్వు మేహశాంతి చేయును. తీపి రుచిగలిగి యుండును. పశువులకాపరి కుర్ర వాండ్రు ఈతమొవ్వును తిందురు. నోటిపూతలు పోవును. ఈతచెట్టు నుండి కల్లుతీయుదురు. తాటిచెట్టునకు గెలకలనబడు వెన్నులు నుండియు ఈతచెట్టునకు ప్రమానునుండియు కల్లుతీయుదురు. అప్పుడు తీసినకల్లు తియ్యగనుండును. మేహశాంతిని చేయును. బలమునిచ్చును. శగరోగ ములో పుట్టిన మంటను తగ్గించును. క్షయరోగులకు సుఖమిచ్చును. ఆకలిని బుట్టించును. బుద్ధిని వికసింపచేయును. మూత్రమును జారీ చేయును. దేహకృశతను తగ్గించి మంచి పుష్టినొసంగును. మితంతప్పి సేవించిన బుద్ధిక్షీణించును. వాంతి కలుగును. ప్రలాపన హెచ్చును. బల క్షీణం చేయును. అనేకవికారములు పుట్టించును. ఈతకల్లు నిలవయున్న పులిసి అనేక దుర్గుణములు పుట్టును. ఈతకల్లుతో కర్పూరారిష్టము చేయుదురు. కలరాకు మంచిమందు. ఈతసారాయి కల్లు పులియబెట్టి అర్కయంత్రముతో వండినది సారాయనబడును. ఇది నాలుగైదు పర్యాయములు కాచిన చిగురుసారా అనబడును. దీనిగుణము మితముగ పుచ్చుకొన్న వాతము, కఫము, నీరసము, మూలశంఖ, దెబ్బలవలన గలిగిన శరీరనొప్పులు హరించును. దీనియందు రెండుగుణములు కలవు. శరీరము కృసించిన బలమొసంగును. మిక్కిలి బలసిన సమస్థితికిదెచ్చును. మితముదప్పి త్రాగిన విషమువలె ప్రాణముల హరించును. కావున శరీలబలాబలములు దేశకాలపాత్రములు చక్కగ ఆలోచించి మద్యము సేవించవలెను. ఈతఆకులతో చాపలు మొదలగునవి అల్లి దానితో జీవించు కొన్ని జాతులుగలవు. ఈతమట్టలతో ఉప్పరితట్టలు బుట్టలు



మొదలగు గృహోపకరణములు, తయారుచేయుదురు. తాటిచెట్టునకువలె ఈతచెట్లునకు చేవయుండదు. చెరకు, జీలకఱ్ఱ విరుగుడుగ నుపయోగింతురు సంస్కృతమున పరూషక. ఇంగ్లీషున Grewia Asiatica.

ఈశ్వరి :—ఇది పాములవిషమును హరించుటలో శ్రేష్ఠమైనది. ఇందులో తెల్లఈశ్వరి, నల్లఈశ్వరి అని రెండుభేధములు కలవు. కొండ వాండ్రు తెచ్చి బజారులలో అమ్ముచుందురు. ఈ మూలిక కాశ్మీరము హిమాలయము మొదలగు చోట్లను వింధ్య పర్వతములయందును, ఆంధ్రదేశమున మన్యములలోను దొరకును. లాటును భాషలో "నాగదాన్" అనిగలదు. పంజాబు బజారులలో "అఫసంతీన్" అను పేరున ఇది అమ్మబడుచున్నది. అది ప్రసిద్ధమైన యూనానీమూలిక అయివున్నది. ఎండిన ఆకులు, పువ్వులు చూర్ణముతో లభించుచున్నది. స్వాదులో తిక్తరుచి. దీనికషాయం పరిమళయుక్తం. తిక్తము జ్వర హరము, శ్వాసశమనము, రక్తశోధకము అయియున్నది. విషమ జ్వరములయందు మంచిలాభకారిగ నున్నది. ఇది కడుపునందలి పురుగులను వెడలించును. మందాగ్నిని బోగొట్టును. అఫసంతీన్ అను మూలిక అరబ్బీ పారసీ దేశములనుండి కూడ వచ్చుచున్నది. Artemesia Persica అనుపేరున వచ్చుచున్నది. ఈ చెప్పబడిన గుణములు అఫసంతీన్ నుండి కలుగుచున్నవి. ఉత్తర హిందూస్థానమున ఈశ్వరిని ఈ విధముగ వాడుచున్నారు. దక్షిణ భారతదేశమున ఈశ్వరి అనియే వాడుకకలదు. సర్పజాతి ఈశ్వరియొక్క వాసన తగులగనే పడగ ఎత్త లేదు. ఈశ్వరిలో తెల్లఈశ్వరి చాలశ్రేష్ఠమైనది. దీని ఆకు పువ్వు పాముతలను బోలియుండును. వేరు మధ్యను చక్రముండును. కొందరు తిప్పతీగనే ఈశ్వరి అనిచెప్పి భ్రమింప చేయుచున్నారు. ఎట్టి సర్పము కరచినను ఈశ్వరిరసము సేవించుటచేతను విషం హరించి ప్రాణభయం నుండి కాపాడును. కాపాడబడుచున్నాడు. చేదురుచి. మిక్కిలి వేడి

చేయును. విపాకమున కారపురుచిగ మారును. త్రిదోషముల శమింప చేయును. మరియు ప్రదరరోగములు, మూత్రరోగములు, వ్రణములు హరించును. బుతురక్తమును జారీచేయును. గర్భిణీస్త్రీలు సేవించిన గర్భపాతముచేయును. గాన ఎంతమాత్రం దీనిని సేవింపరాదు. వేరు గంధం పైపలేపనముచేసిన శ్వేతకుష్టువులు హరించును. కషాయము లోనికిచ్చినను సరే.

సంస్కృతమున నాగదమని. ఇంగ్లీషున Indian Birthwort. హిందీన నాగదానా, నాగదవన్. బెంగాలీన నాగదోనా, నాగదమనీ. మరాటీన నాగదవణా, సర్‌బందు. గుజరాతిలో నాగదమణ. పంజాబీన అఫసంతీన.

# ఉ

ఉక్కు :—ఇది ఖనిజము. ఘనపదార్థం. దీనిలో ఆరుజాతులు రంగునుబట్టియు, మృదుకఠినతలను బట్టియు విభజింపబడి యున్నది. 1 ఖర, 2 సార, 3 హృన్నాళ, 4 తారాపట్ట, 5 వాజిర, 6 పాలలోహము లనునవి. ఇవన్నియు తీపి, వగరు, చేదు రుచులుగలవి. శీతవీర్యం విపాకమున తీపిరుచికి మారును. గురురూక్ష ఉష్ణగుణములు కలిగియుండును. శ్లేష్మం, పైత్యం, కుష్ఠు, ఉబ్బు, శూల, మూలశంఖ, విషం, ప్లీహోదరం, పాండువు, వింశతిమేహములు, మేదోరోగం, మొదలగు రోగములు శమించును. దీనిని క్రమప్రకారం శుద్ధి భస్మములుచేసి, ఆయా రోగములయందు వాడుకొనవలెను. ఇనుమునకు చెప్పిన ప్రకారమే శుద్ధులు భస్మములు చేయవలెను. ఉక్కు రసగంధకముల ఖజ్జలితో జిల్లేడుపాలతో నూరి 20—25 పుటములుపెట్టిన చక్కగ సిందూరించును. గోమూత్రము త్రిఫలములతోగూడ గుణాధిక్యమునకై పది పుటములు పెట్టవలెను. వారితరమైన చాలమంచిది. ఇట్టి భస్మమును



రెండు మూడు గింజలఎత్తు అనుపానవిశేషముల శరీరరోగ బలాదుల నిర్ణయించి యివ్వవలెను. ఆవునెయ్యిగాని తేనెగాని అనుపానించి యివ్వవచ్చును. ఇది రక్తమును శుభ్రపరచి రక్తాభివృద్ధి నిచ్చును. ఆయురారోగ్యములను బలమును ప్రసాదించును. దీనిని సేవించునప్పుడు పులుసు, నూనె, ఆవ, గుమ్మడి మొదలగునవి వదలవలెను. అనగా తినరాదు. సంస్కృతమున తీక్ష్ణలోహ ఇంగ్లీషున Ferrum Steel.

ఉక్కెర :—ఇది ఒకవిధమగు అవలేహము. శొంఠి, బియ్యము రాత్రి నీళ్ళలో నానవేసి ఉదయమున మెత్తగానూరి నేతిలో ఉడికించి బెల్లముగాని, పంచదారగాని వేయుదురు. లేహ్యమువలె నుండును. ఇది శొంఠి ఉక్కెరి. ఇది చంటిపిల్లలకు అజీర్ణము హరించి ఆకలిని బుట్టించును. కడుపు ఉబ్బరము, ప్రేవులలో ధ్వనిహరించును. అజీర్ణ విరేచనములు, ఆమ విరేచనములు అరుగుచున్నప్పుడు బొడ్డుక్రింది భాగమందుపుట్టి శూలకు దీనిని వాడిన శూల వెంటనే తగ్గిపోవును. అన్నమును పచనము చేయును. వేడిచేయును. ఇటులనే మిరియపు ఉక్కెరిగూడా [illegible]. వాతశమనము చేయును. అజీర్ణమును హరించును. బియ్యము, గోధుమలు నూరి తయారుచేసిన ఉక్కెరి మిక్కిలి బలము చేయును. వీర్యవృద్ధి చేయును. బాదము పప్పుతో తయారుచేసిన ఉక్కెరి శరీర బలము నిచ్చును. నరముల నీరసము తగ్గించును. తుమ్మజిగురు చూర్ణం నేతిలో వేయించి పంచదార గలిపి పుచ్చుకొని ఆవుపాలు త్రాగిన విశేషముగా వీర్యమును ఊరించును. ఇంకను అనేక విధములగు ఉక్కెరలు గలవు.

ఉచ్చింతతీగ :—దీనినే ఉస్తి అని చెప్పుదురు. ఇది డొంకలమీద ప్రాకును. ఆకు తొడిమ తీగ అంతయు చిన్నముండ్లతో గూడియుండును. ఆకు వావిలాకు ఆకువలెనుండి పరిమాణమున కొంచెము తక్కువగా నుండును. పచ్చికాయలు పసుపువర్ణముగను, పండ్లు ఎఱ్ఱగను, కాకర

కాయలవలె గుండ్రముగా నుండును. ఈ మూలిక ప్రతిభాగమును చేదుగనే యుండును. వేడిచేయు స్వభావము. విపాకమున కారపురుచిగా మారును. శ్లేష్మము, వాతము హరించును. దగ్గులను పోగొట్టును. ఉచ్చింతకాయలను ఎండబెట్టి వరుగు చేయుదురు. ఈ వరుగు పథ్యమున కుపయోగించును. నేతిలోగాని, నూనెలోగాని వేయించి ఉప్పుకారము చల్లి అన్నముతో భుజించిన అన్నంహితవుగానుండును. తేలికగా జీర్ణం చేయును. ఆకుకూర బాలెంతలకు పథ్యముగా వండిపెట్టుదురు. కాయలు కూరవండుకొని తిందురు. కాయలలోగల గింజలు పోవుటకై కాయల నలగకొట్టి నీళ్ళతో కడిగి పులుసు బెల్లముపెట్టి వండవలెను. పులుసు గూడ ఇదేవిధముగా కాచుదురు. శ్లేష్మమును హరించును నోటికి హితవు గూర్చును. వాతము హరించును. విరేచనము చేయును. ఆముదములో ఈ పండ్లు వేసికాచి ఆ ఆముదము ఉగ్గుబెట్టిన పిల్లలకు దగ్గులు హరించును. శ్లేష్మమును క్రిందికి దింపును. వేరు కషాయం శ్లేష్మమును తగ్గించును.

ఉస్తికాశీ:—దీనిని కాశీఉస్తి అని కూశిర, అందురు. ఇది మొక్కజాతి. దీనిపువ్వులు తెల్లగా నుండును. కాయ గుండ్రన. దీనికి ముండ్లు వుండవు. ఉస్తికాయకన్న దీనికాయ పెద్దది. దీనికూర బాగుగ నుండును. దీనియందు చేదురుచిలేదు. ఉస్తికిగల గుణములకంటె కాశీ ఉస్తికి గుణములు ఎక్కువగా నుండును. మొక్క వంగమొక్కను బోలియుండును. సంస్కృతమున క్షుద్రబృహతి ఇంగ్లీషున Prickly.

ఉడుత:—ఇది ఒక చిన్న జంతువు. తోక జల్లిగ నుండును. సుమారొక అడుగుపొడుగుండును. వీపుపైన తెలుపు నలుపు రంగులుగల మూడు చారలుండును. ఇది శాకాహారి. దీనిమాంసము మంచి బలమును కలుగజేయును శ్వాసరోగులకు, శరీరము కృశించినవారికి మంచిది. మలమూత్రముల జారీచేయును.



ఉడుము:—ఇది సాధారణముగా బిలములలో నుండును. మొసలిని బోలియుండును. చర్మం చాలా జిగికలిగి యుండును. చర్మంపైన నల్లని మచ్చలుండును. ఈ చర్మముతో కంజరీ అనబడు వాయిద్యవిశేషములను చేయుదురు. దీని మాంసము మధురరుచిగలది. కొంచెము వెగటుగాగూడా నుండును. నోటి అరుచిని బోగొట్టును. త్రిదోషశమనము చేయును. దేహమునకు బలమిచ్చి మంచి వీర్యవృద్ధిని కలిగించును. వాతముచే నడుము పడిపోయినవారికి దీనిమాంసము లాభకారిగా నుండును. చచ్చువాతముచే బాధపడువారికి దీని చమురు మర్దనచేసిన గుణము కనిపించును. నరములకు బలమిచ్చును. సుఖవ్యాధులను హరించును. రక్తమును శుభ్రపరచును. ఆరోగ్యమును కలిగించును. సంస్కృతమున గోధా అందురు.

ఉత్తరేణి:—ఇది గజమెత్తువరకు పెరుగు మొక్కజాతిలో చేరినది. దీనిఆకులు గుండ్రముగా అర్ధణాకాసులవలె నుండును. ఇందు రెండురకములు కలవు. తెల్ల ఉత్తరేణి, ఎఱ్ఱ ఉత్తరేణి. దీని వేరు తియ్యగ నుండును. తక్కిన భాగము చేదుగా కారముగా నుండును. ఎఱ్ఱ ఉత్తరేణికన్న తెల్లనిది శ్రేష్టమైనది. ఒక జానెడు పొడుగుగల వెన్ను బయలుదేరి వెన్నుపొడుగున ముండ్లవలెనుండు పువ్వులు విత్తనములుండును విత్తనములలో జీలకఱ్ఱవంటి బియ్యముండును. ఉత్తరేణివేరు, ఆకు, కాడమొదలు అన్నియు ఉపయోగకరములై యున్నవి. ఇందు క్షారము కలదు. ఉత్తరేణి సమూలము నలగకొట్టి శుద్ధిచేసిన తగరము ఇనుప బాణలిలో కరిగించి ఈ గుండ వేయుచు ఇనపగరిటతో త్రిప్పుచుండిన తగరము భస్మమగును. ఉత్తరేణిఆకు, తంగేడాకు కలిసి గోనెపట్టాలో పరచి తగరము చింతాకులవలె సాగించి ముక్కలుచేసి ఈ ఆకుపై పరచి చుట్టచుట్టి సీలుచేసి గోపి పుటము పెట్టినను తగరము భస్మమగును. ఉత్తరేణి బియ్యము వీర్య

వృద్ధికై పాలలో పాయసము వండుకొని తినవలెను. ఉత్తరేణి వేరుతో ప్రతిరోజూ దంతధావనముచేసిన బుద్ధి వికసించును. పంటిజబ్బులుండవు. ఉత్తరేణి ఆకు రసము సరుకు గాయములపై వేసిన రక్తము కట్టును. ఆకు నూరి కట్టినను రక్తముకట్టి గాయం మానును. ఉత్తరేణి వేరు గర్భిణీ స్త్రీల మొలకు సుఖప్రసవమునకై కట్టిన వెంటనే ప్రసవింతురు. ఉత్తరేణిగింజలు బియ్యపు కడుగులోనూరి రసముపిండి ఆ రసము త్రాగిన రక్తముకట్టి రక్తమూలములు హరించునని శార్ఙ్గధర సంహితలో కలదు. ముత్తవపులగము, ఉత్తరేణి సమముగా కలిపి నూరి మంచినూనెలో కాచి ఆ నూనె రాసిన అకస్మాత్తుగా కలిగిన వ్రణములు పగిలి మానును. కాకిదొండ, ఉత్తరేణు కషాయము పెట్టి సేవించిన మంచి నిద్రవచ్చును. ఉత్తరేణి ఆకు రసము, జొన్నకలి కలిపి త్రాగిన మూత్రబంధము విడును. అపామార్గమును పంజాబు దేశంలో "పుఠకండా" అను పేరుతో వ్యవహరింతురు. ఇది దాని ప్రక్కల నుండు మొక్క. డాక్టర్ ఖోరీగారు దీనికి ఈ విధముగా అర్థము చెప్పినారు, అపా = జలము, మార్గ = రజక-చాకలి. Washer man అనగా దీని క్షారముతో చాకలి వస్త్రముల నుతుకునని అర్థము. ఇది సమంజసముగాదు. ఇది స్వకల్పితము. విచిత్రమునైయున్నది. మార్గ శబ్దమునకు ఎచ్చటను రజక అర్థములేదు. మార్గశబ్దమునకు శోధించుట అను అర్థముకూడా న్యాయముగా లేదు. డాక్టరు డిమకుగారు వ్రాసిన అధశ్శల్యః అను అర్థమును సరికాదు. Roadside rice అనినారు శల్యశబ్దమునకు శాలిః అర్థముకాదు. ఇది చేతితో ముట్టుకొనినగాని, వస్త్రము తగిలినగాని ముండ్లవలె గ్రుచ్చుకొని అంటివచ్చు పుష్ప బీజములుగల మూలిక. గింజలను మెత్తగా చూర్ణించి నస్యముచేసిన శిరస్సునందలి శ్లేష్మము నీటివలె ముక్కునుండి స్రవించి శిరస్సు తేలిక నిచ్చును. "ప్రత్యక్పుష్పీ శిరోవిచనానాం"—(చ. సూ. అ. 25)



బీజములనుగాని, పత్రములనుగాని చూర్ణించి కషాయముపెట్టి ఆ కషాయము 5—10 తులములవరకు నిచ్చిన వాంతిని కలిగించును. లేక చూర్ణము అయినను యివ్వవచ్చును. ఉత్తరేణి ఆకు రసము దంతశూలలను కట్టును. మరియు నేత్రములయందు బోయుచున్న శుక్రదోషము, రక్తార్శ్యదోషములు బోవును. ఉత్తరేణివేరును తావీజుగా కట్టిన మోహాపస్మారం Hysteria హరించును. తెల్ల ఉత్తరేణికే ఈ గుణములు కలవు. ఎఱ్ఱ ఉత్తరేణియందు శీతవీర్యం కలదు. జలఉత్తరేణినిగూర్చి ఎచ్చటను వ్రాయలేదు. సంస్కృతమున అపామార్గ ఖరమంజరీ, శిఖరీ హిందీలో చిరచిరా, లట్‌జీరా, పంజాబులో పుఠకంఠా, బెంగాలీలో ఆపాంగ, మరాఠీలో ఆఘాడా, గుజరాతీలో ఆఘేడో, ఇంగ్లీషులో Prickly Chaff Flower.

ఉదకము:—ఇది పంచభూతములలో నొకటి. ఉదకమునకు నీరమనియు, క్షీరమనియు, అమృతమనియు, విషమనియు, పెక్కు పేర్లు కలవు. మానవునకు ఉదకము లేనిదే ఏపనియుకాదు. మనశరీరమందు ప్రవహించు రక్తం నీటితో కూడియున్నది. ఆకాశమునుండి భూమిపయి పడకుండ పాత్రలలో పట్టిననీరు గంగోదకమనబడును. ఇది అవ్యక్తరసం కలది. ఉదకం హృదయమునకు మేలుచేకూర్చును. బుద్ధిని వికసింపజేయును. తృష్ణం హరించును. ఎట్టికాంతి రుచి, వాసన, లేనినీరు పరిశుద్ధమైనది. పానయోగ్యమైనది. పవిత్రత దీనికిగలదు. అమృతమున కెన్ని గుణములుకలవో అన్నిగుణములు ఉదకమునకు గలవు. గనుకనే అమృత శబ్దం సార్థకమగుచున్నది. ఆకాశమునుండి భూమిపై పడిన నీటికి భూమియొక్క గుణం రుచి మొదలగునవి కలుగుచున్నవి. ఇసుక తెరలలో నుండి పుట్టిననీరు పానయోగ్యమైనది. వర్షఋతువునందు నదీతటాకాదులయందలి నీరు విరుచుకొని త్రాగవలెను. నీటియందలి దోషము విరుగుటకు ఇండుపకాయ గంధం చేర్చవలెను. ఉదకం తృప్తినిచ్చును.

దాహమును శమింపచేయును. బలమును, పుష్టిని, కలుగచేయును. మల మూత్రముల జారీచేయును. రక్తదోషములను హరించి శుభ్రపరచును. నూతినీరు సదా పరిశుభ్రమైనది. భోజనమధ్యమందు కొంచెం కొంచెం జలపానం చేయుచుండవలెను. అట్లుచేసిన జఠరాగ్ని వృద్ధిపొందును. తినినఅన్నం బాగుగ పచనమగును. భోజనమునకు ముందుగ నీళ్ళు త్రాగరాదు. "భుక్త్వాకాలే నపిచేత్తోయం" అని చెప్పినారు. భోజనమునకు ముందు నీరుత్రాగిన శరీరం శుష్కించును. భోజనానంతరం నీరుత్రాగిన శరీరస్థూలత కలుగును. ఉదకం శీతవీర్యం చలువచేయును. మానవునకు ఆరోగ్యం నిచ్చుటకు నీరు గాలి ముఖ్యమైనవి. ఉదకపానం చేయకూడనివారు పాండురోగులు, గుల్మరోగులు, ఉదరరోగులు, గ్రహణీరోగులు, అర్శోరోగులు నీటిని త్రాగరాదు. మరియు విరేచనములకు మందు పుచ్చుకొన్నప్పుడు వాంతులకు మందు పుచ్చుకొన్నప్పుడు నీటిని త్రాగకూడదు. జఠరాగ్ని మందముగనుండువారు ఈ నియమును పాటించవలసి యున్నది. ఆరోగ్యవంతులెప్పుడును చల్లనినీటినే త్రాగవలెను. రాగి, వెండి కంచు పాత్రలలో దేనిలోనైనను రాత్రిపూట నీరుపోసి తెల్లవారుగట్ల మూడుపుడిసెల్ల నీరుత్రాగిన చక్కగ విరేచనముచేయును. ఇటుల మంతలముచేసిన సకలరుజలు హరించి చిరాయుష్మంతుల జేయును. ఈ పద్ధతి వారివారి శరీరప్రకృతుల ననుసరించి చేయవలెను. చన్నీటితో ముఖం, కండ్లు, శిరస్సు, చేతులు, కాళ్ళు ముప్పొద్దుల కడుగుకొనుచుండిన కండ్లకు మంచి దృష్టియు రక్తమునకు నిర్మలత్వం, బుద్ధికి వికాసం, కాలుచేతులకు శ్రమమును పోగొట్టును. మరియు అంటురోగములు సంభవింపజాలవు. విశేషముగా శ్రమపడినప్పుడు వెంటనే నీటిని త్రాగరాదు. నిశామధ్యమున, నిద్రామధ్యమున, సంభోగం చేసినవెంటనే నీటిని త్రాగరాదు. "సంభోగాంతే విషంతోయం" అనియున్నది. ఆకలివిస్తారముగా నున్నప్పుడు చన్నీటిని త్రాగరాదు. తాంబూలము వేసికొనినవెంటనే నీటిని



త్రాగరాదు. పాలు త్రాగినతోడనే నీరు త్రాగరాదు. ఇటుల చేసిన యెడల ఆరోగ్యమును పాడుచేసి అనేక అవ్యక్త రోగములను బుట్టించును. గోధుమాన్నముగాని, వరిఅన్నముగాని, పెరుగుతోగాని, తేనెతోగాని భుజించునప్పుడు చన్నీటిని త్రాగవచ్చును.

వేడినీరు :—ఇది దీపన పాచనముల కలిగించును. కంఠమునందలి శ్లేష్మజీరను హరించును. మూత్రమును జారీచేయును. తరుణ జ్వరములలో ఆమమును పచనము చేయుటకై వేడినీటిని త్రాగించవలెను. కడుపు పొంగరించినప్పుడు ఉబ్బు తగ్గుటకై వేడినీటిని పానము చేయవలెను. వేడినీరు వాత కఫములను, పార్శ్వశూలలు, శూలలు, శ్వాసకాశలు, అజీర్ణములు హరించును. విరేచన వాంతులకు మందు పుచ్చుకొన్నప్పుడు వేడినీటిని త్రాగుట ఉత్తమము. కాచి చల్లారిన నీరు లఘుగుణముకలదై యుండును. త్రిదోషముల శమింపచేయును. విశేషముగా పైత్యమును శమింపజేయును. ఏపూటకాపూట కాచిననీరు ఉత్తమమైనది. చాలాకాలము నిలవయున్న దోషముల బుట్టించును. తన శరీర ప్రకృతికి సరిపోయిన నీటిని ఎన్నడును మార్చి త్రాగరాదు. హంసోదకము చాల మంచిది. మన్యప్రాంతములయందలి నీరు చలిజ్వరమును పుట్టించును. మరియు గుల్మము. ఉదరరోగములను పుట్టించును. దేహకాంతిని మార్పుచేయును. జఠరమును మందగించును. హంసోదకము శీతలము, తేలిక, తీపి. బలకరము. లఘుపాకి. అభిష్యంతి అయియున్నది. ఈ జలము శరదృతువులో పానముచేయుట ఉత్తమం.

సంస్కృతమున జలం ఆపః, హిందీలో పానీ, ఇంగ్లీషులో Water, అరవంలో తన్ని.

☞ ఉద్వర్తనము :—అనగా శరీరమునకు నలుగు పెట్టుకొనుట. మినుములు బియ్యముగాని, పెసలు బియ్యముగాని, ఉలవలుగాని,

మెత్తగా పిండి విసరి శరీరమునకు చమురు పట్టించి దానిపై నీపిండిని నీటితో గలిపిన పిండిని వంటికి పూసికొని నలుగు పెట్టుదురు. దీనికి ఉద్వర్తనమని పేరు. ఇందువలన శరీరమందలి మురికిపోవును. రోమ కూపములు శుభ్రపడును. కూపములనాశ్రయించిన క్రిమినశించును. దేహమునకు కాంతినిచ్చును. నరములకు బలమిచ్చును. ఆరోగ్యప్రదమైనది. ఇట్లు నెలకు మూడు నాలుగు సారులు చేయుచుండవలెను. ఇది ఆరోగ్యవిధులలో నొకటి. మేధస్సును ఒకచోటనే నిలవయుంచక శరీరమంతట వ్యాపింపచేయును చమ్మటవలన బుట్టిన దుర్గంధము హరించును.

ఉప్పిచెట్టు :—ఇది ముండ్లతో గూడిన డొంక. ఇందు నల్ల ఉప్పి, తెల్ల ఉప్పి అని రెండు జాతులు కలవు. నల్ల ఉప్పి చాలా శ్రేష్ఠమైనది. నల్ల ఉప్పికి ముండ్లు వంకరగా చిన్నవిగా నుండును, తెల్ల ఉప్పికి వాడియైన పొడుగగు ముండ్లుండును. ఆకు కొనకుగూడా ముండ్లుండును. చేదు రుచి మిక్కిలి వేడిచేయును. విపాకమున కారపు రుచిగా మారును. వాతమును, వాతమువలన గలిగిన ఉబ్బసపుదగ్గులను హరించును. దీని వేరు తేనెతో అరుగతీసి సేవించవలెను. ప్రసవించిన స్త్రీలకు మైలరక్తము సరిగా పోకుండిన నల్ల ఉప్పి చిగుళ్లు మిరియాలు సూతికాభరణము లేక వాతవిధ్వంసి మొదలగు సూతికమందులుచేర్చి మర్ధనాచేసి మాత్రలుకట్టి ఇచ్చిన వెంటనే పొట్టకు వేడిచేసి మైలరక్తమును వెడలించును. ఏవిధమైన సూతికాబాధయు లేకుండా ఆరోగ్యమును చెందును. గాయములకు నల్ల ఉప్పివేరు సన్నగబాకుతో పొట్టిగీసి ఆ పొట్టి నూనెలోవేసి వెచ్చజేసి గాయముపై సుఖోష్ణముగా కాచి ఆ పిప్పి వెచ్చచేసి కట్టిన గాయము వెంటనే మానును. నీరు పట్టదు. తెల్ల ఉప్పి నల్ల ఉప్పికన్న కొంచెం గుణహీనమైనది. సంస్కృతమున లవణా కుండలీ, ఇంగ్లీషున Volkameria Inermis.



ఉమ్మెత్త :—దీనిని సాధారణముగా తెలియనివా రుండరు. ఒక గజమెత్తువరకు పెరుగు మొక్కజాతి. ఇందు తెల్ల, నల్ల, ఊదు రంగులుగల ఉమ్మెత్త హిందూదేశములో అన్నిభాగములయందును గనిపించుచున్నది. వీనిలో నల్ల ఉమ్మెత్త శ్రేష్ఠమైనది. దీని పువ్వులు బాకావలె నుండును. నల్ల ఉమ్మెత్తలో దొంతర పువ్వులుపూయు ఉమ్మెత్త గలదు. ఏడు దొంతరలుగల పువ్వులుపూయు నల్లఉమ్మెత్త శ్రేష్ఠతమమైనది. దీని కాయలు నిమ్మకాయలంత ఉరవు గలిగి ముండ్లతో గూడి గుండ్రముగా నుండును. లోపల బీజము లుండును. ఆకులు నీటివంగ ఆకులను బోలియుండును. ఇది సర్వాంగసారమైనది. హిందూ దేశమునం దంతటను పాడుపడిన గుళ్ళలోను, పాటిపెరళ్ళలోను గనుపించుచున్నది. వగరు, చేదు, కొంచెము తీపిరుచులు గలది. వేడి చేయును. విపాకమున కారపు రుచిగా మారును. ఉమ్మెత్తవేరు గంధం, తెల్లగలిజేరువేరు గంధం బియ్యపు కడుగుతో తీసి పట్టువేసి లోపలకు గూడా నిచ్చిన సాలెపురుగు, పురికోస విషము దిగును. ఉమ్మెత్త ఉప విషములలో నొకటి. మత్తుచేయును. కాస శ్వాసల నడంచును. వ్రణముల పిగులచేసి మానుపును. చర్మరోగముల హరించును. దేహమునకు కాంతినిచ్చును. గాయములకు ఉమ్మెత్తవేరు నీరుల్లి, వాము మెత్తగానూరి నూనెలోవేసి వేచి గాయముపై కాచి మవలవేచి గాయముపై కట్టుకట్టిన గాయము మానును. సీసము శుద్ధిచేసినది ఇనపమూకుడులో కలిపి కరిగించి నల్ల ఉమ్మెత్త సమూలం ముక్కలు ముక్కలుగా తరిగి ఆ గుండ వేయుచు ఇనప గరిటలో కలుపుచుండిన సీసభస్మము బంగారు ఛాయగా నగును. తర్వాత మర్రిచెక్కరసంతో ఉడికించి పుటం పెట్టవలెను. సకల ఔషధములలోను చేర్చవచ్చును. నల్లఉమ్మెత్త సమూలము చిలుము గొట్టములోవేసి పొగపీల్చిన కఠినమైన ఉబ్బసము, ఎగరొప్పు, గుండెబరువు, ఆయాసము వెంటనే శమించును. శ్లేష్మము పలచన అగును. రసము, గంధకము రెండు కలిపి

మెత్తగానూరి ఉమ్మెత్తకాయ దొలచి అందులో కజ్జలివుంచి పైన మూతమూసి గుడ్డచుట్టి మట్టిపొదిగి కుమ్ములో ఉడికించి తీసి కల్వమున కాయవేసి మెత్తగానూరి కొబ్బరినూనెలోగాని, నువ్వులనూనెలోగాని కలిపి వంటికి రాసిన చిడుము, గజ్జి, దురదలు, తామర మొదలగు చర్మరోగములన్నియు వెంటనే తగ్గిపోవును. నల్లఉమ్మెత్తతో కనకాసవమను మద్యము తయారు చేయుదురు. ఇది శ్వాసకాసలకు మంచిమందు. ఉమ్మెత్తగింజలు పిప్పళ్ళు దినదిన క్రమాభివృద్ధిగా మజ్జిగతేటతో గాని, చన్నీటితోగాని నూరి త్రాగిన కఠినములగు బోదకాలురోగము (శ్లీపదము) నిస్సంశయముగా హరించునని వంగసేనలో గలదు. ఉమ్మెత్త గింజల తైలము నరములకు సత్తువ నిచ్చును. లింగమునకు బూసిన స్తంభించును. ఆకు రసముతో రాతిసున్నము కలిపి గవద బిళ్ళలకు రాసిన బాధలు శమించును. ఉమ్మెత్త వేరుతో పిచ్చికుక్క కరచినవారికి చికిత్స చేయుదురు. ఉమ్మెత్తగింజలు మెత్తగానూరి ఆవనూనెతో గలిపి కాచి రాసిన కాలి పగుళ్ళు హరించును. సంస్కృతమున కాంచన దుత్తూర, హిందీలో దత్తూర్, ఇంగ్లీషున Datura.

ఉలవలు:—ఇది మెట్టపైరులలో నొకటి. ఒక గజమువరకు తీగగా ప్రాకును. ఉలవలు తెల్ల, ఎఱ్ఱ, నల్ల అను మూడు రకములు గలవు. ఇందులో నల్లఉలవలు శ్రేష్ఠమైనవి. మిక్కిలి వేడిచేయును. వైక్రాంతముకాచి నల్ల ఉలవ కషాయములో ముంచిన శుద్ధి అగును. పశువుల వాతరోగమునకు నల్ల ఉలవలు కాచిన నీళ్ళు త్రాగింతురు. గుఱ్ఱములకు, ఎడ్లకు ఉలవ గుగ్గిళ్ళు దానాగా పెట్టుదురు. అందువలన పగటిపూట పడిన శ్రమము, నొప్పులు హరించి బలమును. ఆరోగ్యమును చెందును. పాడిపశువులకు ఉలవలు నానవైచి రుబ్బి దానా పెట్టుదురు. పాలు వృద్ధియగును. ఉలవ బొత్తు వేడిచేయక పశువులకు బలము చేకూర్చును. ఇందులో అడవి యులవ అనునది ఒకటి కలదు.



ఇది అడవులలో పుట్టిపెరుగును. దానికిగూడా ఉలవ గుణములే కలవు. ఉలవలు వగరు రుచి కలవి, వేడిచేయును. విపాకమున కారపురుచిగా మారును. వెఱ్ఱికుక్క కరచినవారికి ఉలవచేనులో తిరుగుట, ఉలవగాలి తగులుట, ఉలవపిండిగాని, ఉలవనీరు తినుట పనికిరాదని చెప్పుదురు. మిక్కిలి అపాయ స్థితిలో శరీరమంతయు చెమ్మటలు పట్టినప్పుడు ఉలవలు వేయించి పిండివిసరి నలుగుబెట్టిన చెమ్మటలు హరించి శరీరమునకు వేడిచేయును. ఉలవలు వేయించి పిండివిసరి ఆ పిండిలో కారంచేర్చి భోజనం చేయుదురు. కొందరు కట్టు అనబడు పిండి అంబలి కాచెదరు. ఉలవలు వాతహరమైనది. రుచికరము. కాస శ్వాసహరము, బలబద్ధకం చేయును. ఋతుబద్ధకమును పోగొట్టును. ఉలవకట్టు ఊర్ధ్వవాతమును అధోముఖమునకు త్రిప్పును. మూత్రాశ్మరిని కరగించుశక్తి ఉలవకు కలదు. చరక, శుశ్రుత, బాహట, భావప్రకాశకారుల మతము ఈక్రింద పొందుపరుపబడుచున్నది.

చరకమతమున—ఉలవలు వేడిచేయును. ఆమ్లమును హరించును. కఫహరము, వీర్యనాశనము, అర్శోహరము.

సుశ్రుత మతమున—ఉలవలు కటివిపాకి. రక్తపిత్తమును పుట్టించును.

వాగ్భటమతమున—ఉలవలు మధురరసముకూడా కలవనియు, రూక్షగుణము కలదనియు విశేషించినాడు.

భావప్రకాశిక మతమున—ఉలవలు కటివిపాకముకలవి. లఘుగుణము కలవి స్వేదహరము, మేదోహరము, క్రిమిహరము అని విశేష గుణముల దెలిపినాడు.

శూలలకు ఉలవ కషాయములో కొంచెము పులుపు, సైంధవ లవణము, మిరియముల చూర్ణము చేర్చి త్రాగిన వాతశూలలు హరించునని సుశ్రుతమునందు గలదు.

ఉలవ అప్పడములు నూనెలో వేయించి తినిన అన్నద్రవశూల హరించునని వంగసేనయందు గలదు.

సంస్కృతమున కుళుద్ధ, తామ్రబీజ, ఇంగ్లీషున Horse-gram, Dolichos Biflorus.

☞ ఉలిమిలిచెట్టు :—ఉలిమిలి పెద్ద వృక్షము. దీని ఆకులు మారేడు ఆకులవలెనుండి చేదుగా నుండును. దీని పువ్వులు తెల్లగానుండి తంగేడు పువ్వులవలె గుత్తులు గుత్తులు పూయును. కాయ మారేడుకాయవలె నుండును. మ్రాను తెల్లగ నుండును. పండు ఎఱ్ఱగ నుండును. గింజలు పోకకాయలోని గింజలవలె నుండును. ఇది వగరు, తీపి, చేదు కలసిన రుచి గలిగియుండును. వేడిచేయును. విపాకమున కారపురుచిగా మారును. తేలిక, రూక్షగుణములు కలిగి వుండును. మలమును వెడలించును. పిత్తమును ప్రకోపింపచేయును. వాతకఫముల హరించును. వాతరక్తమును, గుల్మమును, రక్తపుపోటునును, క్రిములను హరించును. శిరోరోగములు, గుండెరోగములు, రక్తదోషములు హరించును. ఆమ్లవాతమును బోగొట్టును. ఉలిమిరిపండు విరేచనకారి. వాతమును హరించును. ఉలిమిలి ఆకులు కషాయముపెట్టి సలుపు పోటుగల మూలశంఖరోగులు వంటికి ఆసనమునకు చమురు రాసుకొని ఆ నీటితో స్నానము చేసిన మూలశంఖరోగము హరించునని చరకమున గలదు. ఉలిమిలి పిత్తము చేయును. దోషశమనముచేయును. కఫము, మూత్రకృచ్ఛము, రక్తదోషము, వాతము, గుల్మము, వాతరక్తము, క్రిములువాపు వీనిని పోగొట్టును. అగ్నిమాంద్యము చేయును. ఉలిమిరివేరు మెత్తగా నలియగొట్టి కషాయముకాచి సేవించిన అశ్మరీరోగము హరించును. ఉలిమిలి చెక్క మేకపాలతో గంధముతీసి ముఖమునకు బూసిన పోతర బొటిమలను వ్యంగ్యరోగము హరించును. సెగరోగములకు చెక్కరసము మంచిది.



సంస్కృతమున వరుణ, అశ్మరిఘ్ను, అరవంలో మాలిలింగై, హిందీలో వరను, బంగాలీలో వరుణభాభ, మరటీలో బాయవరణా, గుజరాత్ లో బరణో, ఇంగ్లీషున Crataeva raligiosa.

☞ ఉర్లదుంపలు :—బంగాళాదుంపలు చూడుము.

☞ ఉల్లిపాయలు :—నీరుల్లి వెల్లుల్లి చూడుము.

☞ ఉవ్వకాయ :—ఇది పులుపు, వగరు, కొంచెము తీపిగల రుచులతో గూడియుండును. కఫమును హరించును. నోటిని శుభ్రపరచును. మేహశాంతి చేయును. విరేచనమును బంధించును. ధాతుపుష్టి చేయును.

☞ ఉసిరికచెట్టు :—ఇది భారతదేశమునం దంతటను గలదు. తోటలలోను, దొడ్లలోను సామాన్యముగా కనిపించును. ఆకులు చిన్నవి. కొంచెము కోలగా నుండును. కాయలు ఆకులక్రింద నుండును. వగరులో తీపు. ఇది పెద్దవృక్షము. కాయ గుండ్రము. కాయలో గట్టిబీజముండును లోన గింజఉండును. కాయపై బెరడు ఔషధోపయోగం. కరక, తాడి, ఉసిరికల కూటమికి త్రిఫలములనిపేరు. ఉసిరికాయరసము మూత్రమును జారీచేయును. కాయయందు ఆరురుచులలో ఉప్పు రుచి తప్ప తక్కిన అయిదు రుచులు గలవు. ఉసిరిక పండ్లను పచ్చడిగా పెట్టుదురు. సంవత్సరము పొడుగునను నిలవయుండును. పైత్యశాంతి చేయును. మలబద్ధము చేయును. నోటికి రుచిని కలుగచేయును. పచ్చికాయ నోటిలో వేసుకొని రసము మ్రింగుచున్న దాహశాంతి చేయును. నీరు త్రాగిన తియ్యగ నుండును. మాండూరము, ఉసిరిక రసముతో నిచ్చిన ఉబ్బురోగం హరించును. ఉసిరికచెక్క, మిరియాలు నూరి కుంకుడుగింజలవలె మాత్రలుచేసి పూటకు రెండుమాత్రలు చొప్పున సేవించి పొంగునీళ్లు, అన్నము తినుచు కఠినపథ్యముచేసిన సెగరోగము నిస్సంశయముగా హరించును. ఇది అనుభవము. త్రిఫల కషాయముతో అభ్రకము, లోహము, కాంతము పుటములుపెట్టిన

చక్కని భస్మములగును. ఉసిరికాయలతో పెక్కు ఔషధయోగములు కలవు. చైత్రమాసములో దొరకిన ఉసిరికపండ్లు చైత్రామలకలలందురు. ఇవి చాలా శ్రేష్ఠమైనవి. వీనితో చవనప్రాశాన లేహ్యములనబడు లేహ్యము చేయుదురు. ఈ లేహ్యము సేవించి చ్యవన మహర్షి నవ యవ్వనము పొందినట్లు తెలియబడుచున్నది. ఈ లేహ్యము క్షయ, హృద్రోగము, శరీర కృశత్వము, ధాతునష్టము, బలహీనత మొదలగు రోగముల హరించుటలో శ్రేష్ఠమైనది. చైత్రామలకలు లేనిచో ఉసిరిక వరుగుతోగూడా తయారు చేయుదురు. పుంస్త్వమును వృద్ధిచేయును. వీర్యవృద్ధికి ఉసిరికపండ్లను ఉసిరిక రసములో 21 రోజులు ఊరించి పిదప తేనెతో ఊరించి ప్రతిరోజూ ఒక కాయచొప్పున పుచ్చుకొనవలెను. లేదా ఉసిరిక వలుపును చెరకు రసములో 21 రోజులు ఊరించి పిదప తేనెలో ఊరించి అరతులం సేవించవలెను. ఉసిరికపండ్ల రసం, గుంటకలగర రసం మొదలగువానితో భృంగామలక తైలము, అమృతామలక తైలము మొదలగు తైలమును, ఆమా హేరాయిల్ మొదలగు తలనూనెలు పెక్కు రకములు తయారు చేయుదురు. ఉసిరికపప్పు నీటితోగాని, పన్నీటితోగాని నూరి శిరస్సునకు పట్టువేసిన శిరస్సుపోటు, మంట మొదలగు బాధలు శమించును. గాని తత్వము ననుసరించి చేయవలెను. హెచ్చుగవాడిన జలుబుచేయును. ఉసిరిక మ్రానుతో నూతి చట్రములు తయారుచేసి నూతులకు గోడలు కట్టుదురు. ఉసిరిక మ్రాను చెక్క వగరుగ నుండును. నీళ్ళవిరేచనములకు, వ్రణములు కడుగుటకు ఉపయోగించును. ఈ రసములో కవిరి చూర్ణముచేర్చి యిచ్చిన స్త్రీల ప్రదర వ్యాధులు శమించును. కార్తీక మాసములో ఉసిరిచెట్టుక్రింద వండుకొని భుజించిన ఆయురారోగ్యములు కలుగునని చెప్పెదరు. కార్తీక శుద్ధ ద్వాదశిరోజున సాయంత్రము ఉసిరికొమ్మను తులసికోటలో తులసిమొక్కదగ్గర పాతి పూజచేసి దీపారాధన చేయుదురు. ఉసిరిక పండ్లు రసాయన ద్రవ్యము. పండ్లరసము, వెలగపండ్లరసము, పిప్పలి



చూర్ణము, తేనె కలిపి సేవించిన హిక్కావ్యాధి ఎక్కిళ్లు హరించును. ఉసిరికగింజలు నీళ్ళతోనూరి తేనె పంచదార కలిపియిచ్చిన స్త్రీల తెల చీరవ్యాధులు శమించును. లేదా పప్పు చూర్ణమైనను పంచదారతో సేవించవచ్చునని చరకసుశ్రుతమున కలదు. ఉసిరికపండ్ల రసములో ప్రాతనెయ్యికలిపి నెయ్యిమరుగునట్లుకాచి ఆ నేతిని సేవించిన వాతరక్త వ్యాధి నయమగును. శరకాయకువలెనే ఉసిరిక కలుపుచూర్ణము పాలతో కాచి నెయ్యిచేర్చి పుచ్చుకొనిన దగ్గులు శమించును. ఇందు వగరు, రూక్ష గుణముండుటచే కఫమును హరించును. ఉసిరికపండ్ల రసములో పంచదారకలిపి సేవించిన పైత్యశూలలు వెంటనే శమించును. మూత్రము పట్టుపట్టిన ఉసిరికపండు మెత్తగానూరి పొత్తికడుపునకు పట్టు వేయవలెను. వెంటనే మూత్రము జారీచేయును. స్త్రీల యోనిదోషము నకు పండ్లరసములో పంచదారకలిపి త్రాగిన మంటలు శమించునని భావప్రకాశికలో కలదు. ఉసిరికపప్పు, చెంగల్వకోష్టు, తామరపువ్వులు, మట్టిఊడలకొనలు, వరిపేలాలు సమానంగా ఇవి మెత్తగనూరి మాత్రలుచేసి బుగ్గను ఉంచుకొని ద్రవము మ్రింగుచుండిన దగ్గులు కట్టును. శ్లేష్మము హరించును. నోటి ఆర్పుడు తగ్గును.

సంస్కృతమున ఆమలకీ, ధాత్రీ. హిందీలో ఆమ్లా. బెంగాలీన ఆమ్లదా. ఇంగ్లీషున Phyllanthus Emobhica.

ఉండ్రాళ్ళు:—ఇది భక్ష్య విశేషము. వరిపిండి ఉడికించి ఆ ముద్ద నీటిఆవిరిపై నిమ్మకాయలవలె ముద్దలుచేసి తిరిగి ఉడికింతురు. ఇందు పెసరపప్పుగాని శనగపప్పుగాని చేర్చుదురు. కొందరు కొబ్బరిలస్కోరా చేర్చి వండుదురు. వీనిని జిల్లేడుకాయలందురు. కొందరు శనగపూర్ణము చేర్చి వండుదురు. గురుత్వము చేయును. మేహశాంతి చేయును. బలప్రదము.

**ఉంగరములు** :—సువర్ణ రజిత తామ్రలోహములతో ఉంగరములు చేయింతురు. సువర్ణముద్రిక శరీరమునకు శోభనిచ్చును. ఆరోగ్యప్రదము. రజితముద్రిక ఆరోగ్యప్రదమైనది. తామ్రముద్రిక రోగహరమైనది. సూర్య చంద్ర గ్రహణ సమయములలో పంచలోహములతో ఉంగరములు చేయించి ధరించిన గ్రహబాధలు తొలగును. నవగ్రహములకు నవరత్నములు ప్రీతికలవి. నవరత్నములు పొదిగిన ఉంగరముల ధరించుట ఆరోగ్య భాగ్య హేతువు. వీనిని నియమానుసారము బంగారమునందున పొదిగి చేయించిన మహదానంద ఆరోగ్య భాగ్య సంతాన హేతువు వెండితర్జని ఉంగరములతో పితృదేవతలకు తిలోదకములిచ్చిన పితృదేవతలు తృప్తిజెందుదురు. పూర్వము గాంధర్వ వివాహములకు నాయకీ నాయకులు ఉంగరములు మార్పుచేసికొను నాచారముండెడిది. ఈ వివాహము శాస్త్రసమ్మతమైనది. సీతాదేవికి నాంజనేయునిపై నమ్మకము కలుగజేసినదీ ఉంగరము ప్రభావమేకదా?

**ఉయ్యెల** :—ఇది మనోల్లాసమును గలుగజేయును. శ్రమను పోగొట్టును. బాలకులకు క్రీడలలో నిదియొక అంగము. పేరంటాండ్రు అట్లతద్దికి నోములు నోచుకొని చేతులకు తోరణముల గట్టుకొని శృంగారవతులై ఉయ్యెలల నూగుదురు. పూర్వము రాచకన్యకలు పువ్వు డోలికలు నూగుచుండెడివారని కవులు వర్ణించియున్నారు. పసిపిల్లలను ఉయ్యెలలో బెట్టి ఊపిన సుఖముగ నిద్రించెదరు. సంస్కృతమున డోలిక అందురు.

**ఉప్పరిగె** :—ఉప్పరిగె లనగా మేడలు. ఇవి విభవానుసారము నిర్మించుదురు. వీనియందు వసించుట రాజసమును తెలియజేయును. మేడలపై సంచరించుట సంతోషదాయకము. పూర్వము పండువెన్నెలలలో మేడలపై నివసించి సరస సంగీత సల్లాప సుఖంబు లందుచుండెడివారని పెక్కుచోట్ల వర్ణింపబడియున్నది. లంకాపట్నము వర్ణించు



నప్పుడు నవరత్న ఖచితములగు ఏడు, ఎనిమిది అంతస్తుల భవనములున్నట్లు గన్పించుచున్నది. ఇప్పుడు ప్రస్తుతముగూడా "రేడియో" యను సంగీత యంత్రముల ద్వారా సౌధోపభాగంబుల వివిధ వినోదంబుల ప్రొద్దుబుచ్చుట కనుచునే యున్నాము. ఈ సౌధము లనేక విధంబులుగ నిర్మించుదురు. వేసంగికాలమందలి గాడ్పులు ఎత్తైన మేడలయందు వసించిన బాధాకరములుగా నుండవు. మరియు మశకబాధకూడా నుండదు. సంస్కృతమున సౌధము, ఇంగ్లీషున Palace.

## ఊ

**ఊరుబిండి** :—నానిన మినపప్పు రుబ్బి అందు కారముచేర్చి నిమ్మరసము కలుపుదురు. ఇది తినుటకు రుచిగా నుండును. గురుత్వము చేయును. ఇది పచ్చడులలో నొక భేదము. కొంచెము జిగురుగ నుండును. మలమును బంధించు గుణము కలదు. బలమును చేయును.

**ఊక** :—ధాన్యము దంపునపుడు చిట్టుగాక మిగులు పదార్థము విడదీయుదురు. దీనిని ఊక అందురు. ఊక నీళ్ళలో వైచి కాచి ఆవిరిపట్టిన కర్పూరము వేసికొన్నప్పుడు చేసిన మోటిగాబు (పుండు) హరించును. ఊక ఇటుక కాల్చుటకు ఉపయోగించును. ఊకమసితో పండ్లుతోమ కొనిన పండ్లు శుభ్రపడును. ఇందు ఉప్పుగాని, సైంధవలవణముగాని, పటికగాని చేర్చవలెను. పండ్లపొడులు చేయువిధానములు పలువిధములుగనున్నవి. అందులో కొన్ని ఇందుదహరింపబడుచున్నవి.

ఊకమసి, సీమసున్నము, చాలినంత శొంఠి, పిప్పలి, మిరియాలు, కరకపొడి, తాడి, ఉసిరికలు, అతిమధురము, ముద్దహారతికర్పూరము, ఏలకులు, లవంగములు, దాల్చినచెక్క, నాగకేసరములు వీనిని యుక్తిగా చేర్చి పుదినాపువ్వు గులాబి అత్తరువుచేర్చునది. ఇది చాల ప్రశస్తముగా నుండును.

ఊకమసి చాలినంత కరక, తాడి, ఉసిరికలు, అతిమధురము, పటిక, యూక్లిప్టసుఆయిలు చుక్కలుమాత్రము పుదీనా అరఖుచుక్కలు మాత్రము కలదు. ఇది ఒక పద్ధతి.

ఊకమసి చాలినంత, వేపచెక్క, గానుగచెక్క, తుమ్మచెక్క, రావిచెక్క, ఉత్తరేణివేరు, పటిక కలదు. ఇది ఒక పద్ధతి.

ఊకమసి చాలినంత, పటిక, సైంధవలవణము చేర్చి దంతధావనము చేయునది, సలుపు, పోటు, నోటిఅరుచి, పూత, పండ్లుకదలుట, మొదలగు బాధలు హరించును.

ఊకమసి రెండుభాగములు, పటిక ఒకభాగము, కలిపి దంతధావనము చేయునది సలుపు పోటు మానును.

ఊకమసి రెండుభాగములు, ఉప్పు ఒకభాగము లేక అరభాగము కలిపి దంతధావనము చేయవలెను.

ఊకమసి చాలినంత అతిమధురము లేక శాక్రేను యూక్లిప్టస చుక్కలు మాత్రము దాల్చినఅరఖు, లవంగఅరఖు చుక్కలుమాత్రం కలదు. సువాసనగ నుండును. నోటికి హితవుగ నుండును.

ఊకమసి చాలినంత ఏలకుఅరఖు, లవంగఅరఖు, దాల్చినఅరఖు యీ మూడుచుక్కలుమాత్రము కార్బాలిక్ ఆసిడ్ చుక్కలుమాత్రం కలదు. ఇగుళ్ళసలుపు పోటు మానును. ఇటులనే యుక్తి కొలది తయారు చేసికొనవలెను.

☞ ఊడుగచెట్టు:—ఇది మహావృక్షముల తరగతిలో చేరదు. గుల్మములలో చేరదు. నడిపిజాతివృక్షము. ఆకులు అంగులమువెడల్పు నాలుగంగుళములు పొడవుండును. తెల్లనిపువ్వులు పూయును. పాల కాయలబోలు కాయలు కాయును. పచ్చికాయలు నల్లగను పండిన ఎరుపురంగుగ నుండును. ఊడుగచెట్టునకు గట్టిముండ్లుండును. ఇది ఏటి గట్లయందును. చలువప్రదేశపు అడవులయందును పెరుగును. ఊడుగ



విరేచనకారి. ఊడుగకర్రతో మంచములు తయారుచేయుదురు. పండుకొనుటకు ఊడుగకర్ర మంచము చాలప్రశస్తమనియు దుస్స్వప్నములు రానీయదనియు చెప్పుదురు. గ్రహబాధలుకూడ నుండవు. ఇది విషహారమైనది. వేరు కారము రుచిలో కొంచెం చేదుగలదు. మిక్కిలి వేడి చేయును. వాతమును హరించును. ఎలుకవిషము, కోడికాటువిషము హరించును. పాదరసము శుద్ధిచేయుట కుపయోగించును. "అంకోల జంబీర రామానుజం లేతసు విష్కళంకం" అని కలదు. బాగుగా విరేచనముచేయును. ఉబ్బులు, శూలలు, విసర్పిరోగములు హరించును. పండ్లు చలువచేయును. మధురరుచిగలది. కఫమును హరించును. శరీరమునకు బలమొసంగును. వాతము, పైత్యము, తాపము, క్షయ మొదలగురోగములు హరించును. గింజలయందు చమురుకలదు. ఊడుగ గింజలు మెత్తగానూరి కాంజికములో కలిపికాచిన తైలం పైకితేలును. ఊడుగగింజలు మెత్తగనూరి తాటిమట్టల రసముతోనూరి వెన్నకూడ చేర్చి కంచుకంచములో ఉంచి ఎండలోపెట్టిన క్రిందకు చమురు దిగును. ఊడుగతైలముతో ఇంద్రజాలవిద్యలు చేయుదురు. వాదవిద్యకు ఉపయోగించును. ఈ చమురుతో పసుపుచూర్ణముకలిపి పూసిన తామర, గజ్జి, కుష్ఠు మొదలగు చర్మరోగములు హరించును. ఈ చమురులో విత్తనములు నానబెట్టి భూమిలోపాతిన వెంటనే మొలచునని చెప్పుదురు. అంకోలము, తిక్తము, స్నిగ్ధము, తీక్ష్ణము, తువరము, కటుకమునకారి, విరేచనకారి. శూలశోఫ, గ్రహ, క్రిమిబాధల నణచును. కోడి ఎలుక మొదలగు వానివిషము హరించును. ఊడుగవేరు గోమూత్రముతో బాగుగనూరి రసముపిండి ఆ రసము లోనికిపుచ్చుకొన్నను లేక పైన రాసినను ఎలుకవిషము హరించును. పెట్టుమందు విరుగుటకు వంటినిండ తైలమును మర్దనచేసికొని వేరురసము బెల్లపుపానకము నెయ్యి కలిపి లోనికితాగిన పెట్టుమందులు విరిగిపోవును. సవాయిమచ్చలకు వేరు చూర్ణము మహిసాక్షి, గుగ్గిలము సమభాగములు బాగుగ మర్దించి

కుంకుడుగింజలవలె మాత్రలుచేసి ఇచ్చిన సవాయిమచ్చలు మానును. పుండ్లుహరించును. ఊడుగవేరులో రాగిడబ్బుగాని రేకుగాని పెట్టి పుటముబెట్టిన తెల్లగ భస్మమగునని చెప్పుదురు.

సంస్కృతమున అంకోల. హిందీన అంకోటడేరా. బెంగాలీలో ఆంకోడ్. మరాటీన అకానీవృక్షు. గుజరాతీన అంకోల్య. ఇంగ్లీషులో Alangium Lamarkii.

ఊరపిచ్చుక :—ఇది ఒకచిన్నపక్షి జాతిలోనిది, దీనిమాంసము తేలికనిచ్చును. మధురరుచి కలది. వేడిచేయును. ఇందు రెండుజాతులు. ఊరపిచ్చుక, అడవిపిచ్చుక. గుణములు రెంటివి సమానమే. మాంసము స్వాదు, శీతలము. స్నిగ్ధము, లఘువు, పథ్యము, బలకారకము, మిక్కిలి శుక్రవర్ధకము, రతిశక్తిని వృద్ధిచేయును. విపాకమున మధురరుచిగ మారును. మిక్కిలి వీర్యవృద్ధిచేసి సంభోగశక్తి నిచ్చును. కఫవృద్ధి చేయును. వాతమును హరించును. ఊరపిచ్చుక లేహ్యము నరములకు బలమిచ్చును. కామోత్తేజమును కలిగించును. పదిపిచ్చుకల మాంసం ఆవునేతిని దోరగవేయించి 5 తులముల శనగపిండినికూడ వేయించి యుంచుకొనవలెను. అందు జాజికాయ, జాపత్రి, నేలతాడి, పెన్నేరు, గసగసాలు, కుంకుమపువ్వు, నేలగుమ్మడు, మరాటీమొగ్గలు ఇవి దినుసు ఒక్కంటికి తులముచొప్పున బాగుగచూర్ణించి వస్త్రఘాళితముచేసి, కోడిగ్రుడ్లలోని తెల్లసొన మూడుతులములు, ఆవునెయ్యి 20 తులములు, పంచదార :0 తులములు, పట్టుతేనె 15 తులములు, కస్తూరి పావలా ఎత్తు ఇవిఅన్నియు లేహ్యపాకవిధిని వండి తయారుచేసి బంగారపువరకు మూషము, వెండివరకు పావుతులముచేర్చి గాజు లేక పింగాణి బరిణలో జాగ్రత్తపరచి పూటకు పావుతులము లగాయతు అరతులమువరకు శరీరబలానుసారము సేవించి ఆవుపాలు పంచదార చేర్చిసేవించిన నపుంసకుడైనను సంభోగశక్తిని అమితముగ పొందును. నూరుగురు



స్త్రీలతోనైనను రమించి వారికండము అడంచును. ఇది చాలప్రశస్తమైన లేహ్యము. దీనిగుణము అనుభవనీయమేకాని వర్ణింప శక్తిజాలదు.

సంస్కృతమున కలవింక. ఇంగ్లీషున Sparrow. బెంగాలీన చడాయిహాఝి. హిందీన బగడా. మరాటీన చిమాణ.

ఊరపంది :—దీనిమాంసము మిక్కిలి బలమునొసంగును. క్రొవ్వుగలది. విరేచనము చేయించును. పైత్యశమనము చేయును. అగ్నిమాంద్యము బుద్ధిమాంద్యము గలిగించును. కఫమును వృద్ధిపొందించును. పందిరెట్ట పొలములకు ఎరువుగ వేయుదురు. రెట్టఎండించి కాల్చి బూడిదచేసి ఆ బూడిద వేపనూనెలోగాని నువ్వులనూనెలోగాని కలిపి రాసిన గజ్జి, చిడుము, మొదలగు చర్మదోషములు హరించును. సంస్కృతమున గ్రామసూకర. ఇంగ్లీషున Country Hog అందురు.

ఊసరవెల్లి :—తొండముదిరిన ఊసరవెల్లి అగును. ఇది శరీర రంగులను ప్రతిక్షణము మార్చుకొనుచుండును. దీనిమాంసము కారపు రుచిగలిగి వగరుగ నుండును. మాంసముడికించి కట్టుకట్టిన దుష్ట్రవణములు హరించును. దీనిబుఱ్ఱను నూనెలో వేసికాచి ఆ నూనె లింగమునకు బూసిన మంచి సంభోగశక్తి కలుగును.

## ఋ

ఋద్ధి ;—అష్టకవర్గ చూడుము.

ఋషభకము :—అష్టకవర్గ చూడుము.

## ఎ

ఎండ :—సూర్యకిరణ ప్రసారమునందలి కాంతికి ఎండఅని పేరు. ఉదయపు ఎండను బాలాతపమనియు, మధ్యాహ్నపుఎండ తీక్ష్ణ

తపమనియు, సాయంకాలపు టెండకు నీరెండఅనియు కూడ చెప్పుదురు. సాయంకాలపుటెండ ఆరోగ్యము నిచ్చును. బాలాతపము బలమును హరించును. సూర్యకాంతియందు ఏడురంగులుకలవు. జీవధారియగు ప్రతిప్రాణియు సూర్యకిరణ ప్రసారములేనిదే సంచలన పోషకశక్తుల పొందనేరవు. నీటికి ఆకర్షణశక్తి కలదు. ఏడురంగుల గాజుసీసాలలో నీటిని నింపి బిరడాలువేసి ఎండలోనుంచిన ఆ యా రంగుల సీసాలలోని నీరు సూర్యాతపమందలి రంగుకిరణముల సారమును ఆకర్షించుకొనును ఆ నీటిని నియమానుసారము త్రాగిన సూర్యకిరణశక్తి లోపమునగలిగిన వ్యాధులు హరించును. ఈ వైద్యమునకు వర్ణవైద్యమని పేరు. ఆ యా రంగుఅద్దములనీడ నిలిచి సూర్యకిరణ కాంతిని శరీరమునకు పట్టించుట కూడ కలదు. ఈ విధానమువలన అనేకరోగములు కుదర్చవచ్చును సూర్యనమస్కారములుకూడ ఆరోగ్యహేతువు. సూర్యుని కభిముఖముగ నిలిచి నమస్కరించుచున్న కిరణములకాంతి శరీరముపై ప్రసరించి దేహమునందలి దుష్టపదార్థములు స్వేదరూపమున బయటకి వెడలించి రక్తమును పరిశుభ్రపరచును. కొందరు ప్రొద్దుచూడకుండ భుజింపరు. తీక్ష్ణాతపమునందు దిరిగిన విదాహము బడలిక కలుగును. కొందరికి వడగొట్టుటయు కలదు. గాన మానవులు ఆరోగ్యమునకై యుక్తముగ నెండను సేవింపవలెను. సంస్కృతములో ఆతపము. ఇంగ్లీషున **Sunshine** అందురు.

☞ ఎద్దునాలుకచెట్టు :—ఇది మొక్కజాతికి చెందిన శాకము. గజం ఎత్తువరకు బెరుగును. ఆకు నాలుగంగుళముల వెడల్పును, అయిదారు అంగుళముల పొడవు నుండును. ఆకుచుట్టు కంగోరాకలిగి ఎద్దునాలుకవలె నుండును. ఆకు గరుకుదనము కలిగియుండును. మొవ్వునుండి సన్నపాటి కాడలు బయలుదేరి చక్రాకారముగా నుండును. పువ్వులు బంగారమువలె మెరయుచు చిన్నవిగ నుండును. దీనిని హిందూస్తానీ



భాషలో గాజుమార్ అని అందురు. ఇది చేదు వగరు కలసిన రుచికలిగి యుండును. మేహశాంతి చేయును. విపాకమున కారపురుచిగా మారును. శ్లేష్మపైత్యముల హరించును. శీతలము, వాతమును పెంచును. గ్రాహి, హృద్యము, లఘువు, దగ్గులను, ప్రమేహమును హరించును. వ్రణశోధనకారి. మూత్రమును జారీచేయును. గుండెకు బలము నిచ్చును. కాస, అరుచి, శ్వాస, రక్తదోషం, వ్రణములు జ్వరములు హరించును. విరేచనము చేయించును. జ్వరమును, విషమును హరించుశక్తి కలదు.

సంస్కృతమున గోజిహ్వా, హిందీలో గోభీగోజియా, బంగాలీలో దుడిశాల్ గోజియా, మరాటీలో హాధరీ హస్తిపతా. గుజరాత్ న మోపాథరీ, ఇంగ్లీషున Elephuntopus Seabar.

☞ ఎరడాపుధాన్యము :—ధాన్య విశేషములో నిదియొకజాతి. గింజలు నల్లగ నుండును. దంపిన బియ్యము ఎఱ్ఱగ నుండును. అన్నము త్రిదోషముల శమింపజేయును. విరేచనబద్ధముచేయు గుణముకూడా కలదు. వీర్యమును వృద్ధిపొందించును. బలప్రదము. రోగులకు పథ్యకరము. ఎఱ్ఱకుసుమ వ్యాధికలవారికి ఈ అన్నము ఆరోగ్యము నిచ్చును. అతిమూత్ర రోగులనుకూడ పథ్యకరము. ఇంగ్లీషున Black paddy.

☞ ఎఱ్ఱాముదపుచెట్టు :—ఆముదపుచెట్టు చూడుము.

☞ ఎఱ్ఱచిత్రమూలము :—చిత్రమూలము చూడుము.

☞ ఎఱ్ఱకలువ :—ఇది కొలనులలోను, చెరువులలోను యుండును. ఇది లతగాదు. మొక్కయును కాదు. మధ్యస్థితిలో నున్నది. దీని ఆకులు తామరాకులవలె నుండును. పువ్వులు ఎఱ్ఱగ నుండును. దుంపకూడా కొంచెం మెరుపుదనము కలిగియుండును. తామరతీగవలె దీనికి గరుకుదనముండదు. పువ్వులు దుంపకూడా వైద్యమున నుపయోగించును. కుముద బాంధవరసమనబడు ఔషధము ఈ కలువపువ్వుల

రసముతో తయారుచేయుదురు. మేహశాంతిని చేయును. దుంపరసము చిరుచేదుగ నుండును. చలువచేయును. విపాకమున కారపురుచిగ మారును. శ్లేష్మ పైత్యముల హరించును. రక్తగ్రహణి, తాపము, ఎఱ్ఱ కుసుమరోగము, ఎఱ్ఱశగరోగము మొదలగువ్యాధులు హరించును. తల త్రిప్పును కట్టును. ఈ దుంపలు ఉడుకబెట్టి కొందరుతిందురు. ఈ దుంప రసముతో తయారుచేసిన కర్పూరశిలాజిత్తు మేహశాంతిని చేయును. మూత్రమును జారీచేయును. మూత్రవ్యాధులయందు దీని ఉపయోగము హెచ్చు. పువ్వులకుగూడ దుంపగుణమే కలదు. శిరోతాపమునకు పువ్వులు ధరించిన తాపము శమించును.

సంస్కృతమున రక్తోత్పల. హిందీలో లాల్ఉప్పల్. కర్ణాటమున కెన్నైదిలె. అరవంలో శన్నీయల్. ఇంగ్లీషున Eng Red Water lily. అందురు

ఎఱ్ఱగుమ్మడికాయ :—గుమ్మడికాయ చూడుము.

ఎఱ్ఱగురివెంద :—ఇది తీగజాతికి చెందినది. కాడ సన్నముగ నుండును. ఆకులు చింతాకులవలె నుండును. 'ఇది సర్వాంగసారముకల మూలిక. పువ్వులు తెల్లనిరంగుగలిగి గుత్తులుగుత్తులుగ పూయును. కాయలు జాబరాకాయలవలెనుంగి పండి ఎండి పిగులును. అందు ఎర్రని గింజలుండును. ముచ్చికదగ్గర నల్లనిమచ్చయుండును. గింజ రంగును బట్టి గురివెంద భేదమేర్పరుపబడుచున్నది. తెల్ల ఎఱ్ఱ గురివెంద జాతులు కలవు. ఇవి చేదు వగరు రుచిగలది. వేడిచేయును. విపాకమున కారపు రుచిగ మారును. రూక్షగుణము కలది. విషరోగమును క్రిమిదోషమును హరించును. గింజలు వాంతిని కలుగజేయును. వేరు శూలలను విష దోషమును హరించును. తలవెండ్రుకలకు చాల హితమైనది. శీతపైత్య జ్వరమును హరించును. నేత్రరోగములయందు హితకరమైనది. వీర్య వృద్ధినిచ్చును. బల్యము, శ్వాస, దప్పి, మదము, వీనిని పోగొట్టును.



మరియు దురదలు, వ్రణములు హరించును. కుష్ఠువ్యాధి హరించును. విశేషముగా దీనియాకు విషహరమైనది. గురివెందఆకు మెత్తగనూరి బట్టతలపై రాయుచున్న ఇంద్రలుప్తవ్యాధి హరించి చక్కనివెండ్రుకలు మొలచును. గురివెంద గింజలు పాలలోవేసికాచి ఆపాలుత్రాగిన మిక్కిలి వీర్యవృద్ధి కలుగును. కొందరికి వాంతులు కలుగును. గురివెంద గింజలు నీళ్ళలోనానవేసి మెత్తగరుబ్బి చిన్నచిన్న వడియములువలె పెట్టి, ఎండించి ఆవడియములు కొబ్బరినూనెలో ఊరవైచి ఆనూనె తలకు రాయుచున్న కేశములు మృదుత్వముజెంది కుదుళ్ళు గట్టిపడును. పాతబెల్లముముక్కకు గురివెంద ఆకు పసరుపోడిచి భక్షించిన చలి జ్వరము హరించునని చెప్పుదురు. బలమునిచ్చును. తీవ్రమైనది. విషములలోనొకటి. మదం, మేహము కలిగించును. దక్షస్సులను గ్రహములను పారద్రోలును. గురివెంద గింజలుతో బంతులుకట్టి పిల్లలకు ఆడుకొనుటకు ఉయ్యేలలో వ్రేలవైతురు. స్వర్ణకారులకు గురివెంద గుంజ మిక్కిలి ఉపయోగము. ఇది ఉపవిషములలోనిది. జాగ్రత్తగ వాడకున్న ప్రాణములను దీయును.

సంస్కృతమున రక్తికా, గుంజా. హిందీన రత్తీ, ఘుంఘచీ, చిరమిటీ. బెంగాలీన కుంచీ. మరాటీన గుంజ. గుజరాతీలో గుమచీ, చణోఠీ. ఇంగ్లీషున Abrus Precatarius.

ఎఱ్ఱతెగడ :—తెగడ చూడుము.

ఎఱ్ఱకాంచనము :—కాంచనము చూడుము.

ఎఱ్ఱగన్నేరు :—గన్నేరు చూడుము.

ఎఱ్ఱగలిజేరు :—గలిజేరు చూడుము.

ఎఱ్ఱమునగ :—ఇది పెద్దవృక్షజాతికి చెందినది. దీనిఆకులు మునగఆకులవలె నుండును. గాని విస్తారముగను దట్టముగ నుండును. పువ్వులు మునగపువ్వులను బోలియుండును. కేసరములు సువాసన

గలిగియుండును. పశువులు దీనిని తినవు. ఇది తీపి కారము కలిసిన రుచి కలిగి యుండును. తీక్ష్ణగుణము. ఎక్కువ వేడిచేయును. విపాకమున కారపురుచికి మారును. ఇది మిక్కిలి వీర్యవంతమైనది. రసాయనము, ఉబ్బులు, కడుపుబ్బరములు, త్రిదోషములు హరించును. ఎఱ్ఱమునగ ఆకు కూర జఠరదీప్తి నిచ్చును విద్రధులను హరించును. ఆకు నూరి పైనకట్టినను గుణమిచ్చును. మిగిలిన గుణములు మునగతో సమానములే. సంస్కృతములో రక్తశిగ్రు. ఇంగ్లీషులో Red Harseradish Tree అందురు.

☞ఎఱ్ఱజొన్నలు :—జొన్నలు చూడుము.

☞ఎలుక చెవికూర :—దీనిని ఎలుక జీడికూర అనిచెప్పుదురు. ఇది నేలనంటి ప్రాకు తీగజాతిలోనిది. దీనిఆకులు ఎలుక చెవిని బోలియుండును. గాన దీనికీ పేరుగలిగినది. దీనికాడ మిక్కిలిసన్నముగా నుండును. ఆకులుముదిరిన కొంచెము ఎరుపురంగుగ నుండును. తీగకొనను పచ్చని పువ్వులుండును. ఇది చేదు వగరు రుచులు కలది. విపాకమున కారపు రుచికి మారును. మేహశాంతిచేయును. తేలిక గుణముగలది. ఇది రసాయన ద్రవ్యము. రసమును బంధించును. ఆకుకూర పథ్యకరమైనది. కఫము, పైత్యము, శూల, జ్వరం, క్రిమి, గ్రంధులు, మూత్రకృచ్ఛ్రం, ప్రమేహము, హృద్రోహము, పాండురోగము. భగంధరము, కుష్ఠువు, విషదోషము మొదలగు రోగముల నన్నిటిని పారదోలును. కళ్ళరోగమును హరించును. ఎలుకవిషమునకు దీనికూర విరుగుడు వస్తువ.

సంస్కృతమున మూషకపర్ణి. హిందీన మూసాకానీ, బెంగాలీన ఉందర్ కనీపానా. మరాటీన ఉందల్ కానీ. ఇంగ్లీషున Ipomoea Remiformis. అందురు.

☞ఎలుక మాంసము :—దీని మాంసము కారపురుచిగ నుండును. వేడిచేయును. విపాకమునగూడ కారపు రుచినే కలిగియుండును. గురు



త్వము చేయును. శ్లేష్మహరము. పైత్యశమనము. బలప్రదము. ఎలుకి పెంటికలు ఆవుపాలలో వేసి కాచి వడకట్టి పుచ్చుకొనిన స్త్రీల ఎఱ్ఱ కుసుమవ్యాధులు హరించును. సంస్కృతమున ఆఖుమాంస.

☞ఎలుగుబంటి మాంసము :—ఇది వీర్యప్రదమైనది. బల్యము. నేత్రరోగహారి. మలమూత్రముల జారీచేయును. ఉబ్బురోగము హరించును. గ్రహణీరోగమునందు పథ్యకరమైనది.

☞ఎండ్రకాయ :—ఇది ఇసుక పఱ్ఱలలోను, నీటి కలుగులలోను నివసించును. దీనికాళ్ళు వంకరగనుండును. అడ్డముగ నడచును. వెన్నుపై పెంకుండును. దీనిమాంసము తీపిరుచిగలది. వేడిచేయును. మధురవిపాకి. వీర్యవృద్ధిని చేయును. శ్లేష్మమును పెంచును. హిక్కారోగమునందు తీత కలుగులలోని నీరు గుణకరముగ నుండును. ఇందులో సముద్రతీతలను నొకజాతి తీతలుగలవు. పొడుగుకాళ్ళుండును. మాంసాహారాదులకు వీనికూర ఇష్టముగ నుండును. సంస్కృతమున కర్కాటక. ఇంగ్లీషున Crabs అందురు.

## ఏ

☞ఏకభుక్తము :—ఏకభుక్తమనగా దినమున కొకసూరు భుజించు నియమము. లేక భోజనకాలమందు తప్ప తదితర సమయములలో నేమియు భుజింపకుండుట ఈ రెండును ఏకభుక్తములోనే చేరును. ఇందువలన మనస్సునకు దృఢత్వము ఏర్పడును. ఏరోగములు చెందకుండ చిరకాలము జీవించుశక్తి కలుగును. అజీర్ణముండదు.

☞ఏడాకుల అరటి :—ఇది మహావృక్షము. రెమ్మరెమ్మకు ఏడేసి ఆకులుండుటచే దీనికి సప్తపర్ణ అని పేరు వచ్చినది. సుశ్రుతుడు కూడా తన సుశ్రుతమందు సప్తపర్ణ అని వాడియున్నాడు. ఏడాకుల అరటి

అనునది వామనకేళీ అయివుండవచ్చును. కాని దీనికిని దానికిని ఎచ్చటను పోలిక గాన్పించదు దీనికాయలు చిన్నినిమ్మకాయలవలె నుండి కొంచెం వంపుగలిగి యుండును దీనిఆకులు బూరుగుచెట్టు ఆకృతినిబోలి గొడుగువలె యుండును. సువాసన గలిగియుండును. గుత్తులు గుత్తులు పైకి కనపడని పూలు పూయును. ఏనుగుమదం వాసన గలిగియుండును. చర్మం దళసరిగా నుండును. ఈ చెట్లు ఎచ్చటనున్న అచ్చట పావుక్రోసువరకు వాసనగల వాయువు ప్రసరించుచుండును. దీని సర్వాంగములు వైద్యమున కుపయోగించును. ఇది త్రిదోషహార మైనది. గుండెకు మిక్కిలి హితవు గలిగించును. దీనిరుచి చేదు. వేడి చేయును. విపాకమున కారపు రుచిగా మారును. జఠరదీప్తి నిచ్చును సుఖవిరేచనము చేయును. శూలలు, గుల్మములు, క్రిములు, కుష్ఠురోగ ములు, రక్తదోషములు, వ్రణములు, జీర్ణజ్వరములు, శ్వాసరోగములు, అజీర్ణరోగములు, అసాధనగ్రహణులు, ప్రవాహికలు, వాతరక్తం మొద లగు అనేక రోగములు హరించుశక్తి కలదు. చెట్టునకు గంటిపెట్టిన పాలుకారును. సపపర్ణ ఆకులు చెక్క కషాయముపెట్టి ఆ కషాయము త్రాగుచు, స్నానముచేయుచు, పైన కడుగుచుండిన కుష్ఠువు హరిం చును. సప్తపర్ణ పువ్వులు, పిప్పళ్ళు, పెరుగుమీది నీటిలో కలిపి త్రాగిన శ్వాసకాసలు హరించునని సుశ్రుతమున గలదు. ఆకులరసం, జిల్లేడు పాలు కలిపి పుప్పిపంటిలో వేసిన పురుగుచచ్చి బాధ తగ్గునని వాగ్భట మున గలదు. దీనియాకులు మెత్తగానూరి దుష్టవ్రణములపై వేసికట్టిన వ్రణములు మానునని చక్రదత్తమున గలదు నవీన పరిశోధనలనుగూర్చి కొన్ని గ్రంథములయందిట్లు కలదు. దీని పట్టచూర్ణము 15 గ్రెయినులు గాని, కషాయముగాని రాత్రి పరుండబోవునప్పుడు పుచ్చుకొనిన జీర్ణించిన అజీర్ణము హరించును. యకృత్ వృద్ధి హరించునని డాక్టరు రంఫియన్‌గారు వచించిరి. సప్తపర్ణ పట్టచూర్ణము ఉదయ సాయంత్ర ములయందు సేవించిన జనరల్ టానిక్కుగా పనిచేయునని డాక్టరు



నిమ్మగారు వచించిరి. సప్తపర్ణముయొక్క కషాయము చిరకాలము వాడిన క్వైనైన్ సల్ఫేటుతో సమానముగా పనిచేయును. ఈ సంగతి గొప్ప గొప్ప వైద్యులు తమ అనుభవమును స్థిరపరచిరి. క్వైనైన్ సల్ఫేటునందు చెముడు, నిద్రపట్టకపోవుట మొదలగు దుర్గుణములు కలవు. దీనియందు యీ దుర్గుణములు లేవని డాక్టరు గిప్సనుగారు తెలియజేసారు.

సంస్కృతమున సప్తపర్ణ, హిందీలో సతోను ఛతివన్, సత్ వన్, బంగాలీలో ఛిమ్‌గాఛ, మరాటీలో సాంత్వీన్. గుజరాతీలో సప్తపర్ణ, ఇంగ్లీషున Alstonia schdaris.

☞ ఏనుగ:—ఇది గొప్ప జంతువు. సమస్త జంతువుల పాదములు ఏనుగుపాదమునం దిమిడిపోవును. మిక్కిలి బలముగలది. ఏనుగ రంగు నలుపు. తెల్ల ఏనుగులుకూడా కలవు. రాజులకుగల చతురంగ బలంలో ఏనుగ ఒక అంగం. గొప్ప గొప్ప ఉత్సవములకు ఏనుగ అంబారీపై రాజులు ఊరేగు ఆచారము కలదు. ఏనుగయొక్క సర్వాంగములు ఉపయోగకారులై యున్నవి. విఘ్నముల కధిపతియగు విఘ్నేశ్వరుడు గజముఖము గలవాడై పూజలందుచున్నాడు. పూర్వం సంగ్రామము లలో శత్రుసైన్యముల నురుమాడుటకు ఏనుగలు పురికొల్పబడెడివి. ఏనుగమాంసం స్థిరత్వం గలిగించును. వేడిచేయును. బల్యము. అజీర్ణం చేయును. వాతం, శ్లేష్మం వృద్ధిచేయును. దీనిమాంసమునకీ గుణములు గలవని చెప్పుటయేకాని సాధారణముగా దీని మాంసం తినరు. ఏనుగ మూత్రము చేదు, ఉప్పు గలిసిన రుచి గలిగి యుండును. మలబద్ధము విప్పును. వాతమును హరించును. శ్లేష్మమును పెంచును. మండలకుష్ఠు వును హరించును. వాతపుపోట్లు, ఉబ్బు శమించును. ఏనుగలద్దె వగరు, చేదు, కారము రుచులు గలిగి యుండును. విపాకమున కారపురుచికి మారును. వేడిచేయును. ఈ లద్దె ఎండబెట్టి మెత్తగా నలగకొట్టి వస్త్ర

ఖాళీతముచేసి ఈ చూర్ణము రెండు గురిగింజలఎత్తు తాళిసాదిచూర్ణం రెండుగింజలఎత్తు ఉదయ సాయంకాలములు తేనెతో పుచ్చుకొన్నసిన కఠినమైన ఉబ్బసములు హరించును. ఏనుగలద్దె గానుగనూనెతో ఉడికించి ఆ నూనె కాళ్ళకు చేతులకు మర్ధనచేసిన శ్లీపదరోగం (బోధకాలురోగం) హరించును. ఏనుగ దంతమును సన్నగా ఆకురాతిత్లో గజముకోసి మాడ్చి ఆ మసి నూనెతో గలిపి తలకు రాసిన వెంట్రుకలు గుజ్జుగ నల్లగా పెరుగును. అకాల నెరపులు పోవును. మరియు ఆ మసి నీలియాకు రసములో కలిపి రాసిన శ్వేతము హరించును. ఏనుగ దంతముతో మిక్కిలి సున్నితములగు శిల్పములు విశాఖపట్టణమున చేసెడివారు. ఏనుగపాలు తీపిరుచిగ నుండును. గురుత్వము చేయును. చలువచేయును. విపాకమున మధురరుచిగ మారును. యవ్వనమును స్థిరపరచును. నేత్రహితమైనది. ఏనుగపెరుగు రుచివగరు. వేడిగుణము, వాత శ్లేష్మ నొప్పులు హరించును. వీర్యవర్ధకము, బల్యము, జఠరదీప్తి నిచ్చును. పెరుగుగుణమే చల్లకునుగలదు. వెన్న నెయ్యి రక్తవికృతులను శమింపచేయును. మలమును బంధించును. పైవాని గుణములే దీనికినిగలవు. ఏనుగచర్మము ఆసనమునకు పొగవేసిన మూలశంఖ బాధలు శమించును. మరియు గ్రహబాధలు హరించును. మాడ్చిన చర్మముమసి నూనెతోగలిపి రాసిన శ్వేతకుష్ఠువు శమించును. చర్మరోగములు పోవును. గానుగనూనెలోగలిపి రాసిన వ్రణములు హరించును.

సంస్కృతమున గజము, హస్తి. ఇంగ్లీషున Elaphant. హిందీన హాథీ అందురు.

☞ఏనుగుతుమ్మ :—ఇది చిన్న మొక్క జాతి. దీనిఆకు పసుపు, ఆకుపచ్చ, కలిసిన రంగుగలిగి రెండంగుళములుపొడవు, అంగుళము వెడల్పు ఉండును. ఆకునకు ఒకవిధమైన సువాసనగలదు. ఆకుకొంచెం కోలవాటి గరుకుదనముగలది. ఈ మొక్కలకు చిన్న ఊలుబంతివంటి కాయలు



వుండును. కాయలలోనె పువ్వులుండును. పువ్వులు తెల్లగానుండును. పువ్వుల ఆకృతి కుంచమువలె గుండ్రదన. ఈ పువ్వులతో ఈశ్వరునిపూజ చేయుదురు. కార్తీకమాసములో పూజించిన ఈశ్వరునకు ప్రీతి కలిగించును. ఇవి గరువునేలలలో విస్తారముగా బయలుదేరును. దీని రుచి కారము. ఉష్ణవీర్యము, రూక్షగుణము, వాతకఫముల హరించును. అగ్నిమాంధ్యమును పోగొట్టి జఠరదీప్తినిచ్చును. బుద్ధిని వికసింపచేయును. గ్రహబాధలను హరించును. పాదరసమును శుద్ధిచేయును. మలమును వెడలించును. కామల, ఉబ్బు, తమకశ్వాస మొదలగు రోగములు హరించును. ఆకు మధురరుచిగలది. పైత్యమును చేయును. మేహమును విషమజ్వరమును హరించును. మూలశంఖలు శమించును. ఆకురసం కంటికి కాటుకబెట్టిన కామెర్లు హరించునని భావప్రకాశికయందు గలదు. పువ్వులు కంటిపైకట్టిన ఎరుపులుతగ్గును. హోమోపతిరీతిలో దీనిని తేలువిషమునకు విరుగుడుగ వాడుదురు. సంస్కృతమున ద్రోణపుష్పి. ఇంగ్లీషున Linifolia Leucas అందురు.

☞ఏనుగుతుండపుచెట్టు :—ఇది కారపురుచిగలది. వేడిచేయును. సన్నిపాతజ్వరములు హరించును. జంతువిషం హరించును. ఆకురసము ఆముదమున వేసికాచి తైలపాకముగా కాచి పైనరాసిన తేలువిషము హరించును. దానివాపులు హరించును. పిచ్చికుక్క విషం శమించును. సంస్కృతమున హస్తితుండీ. ఇంగ్లీషున R. N. Khary.

☞ఏనుగ పల్లేరు :—పల్లేరు చూడుము.

☞ఏనుగచెవిచెట్టు :—దీనిని ఏనుగచెవి చేమచెట్టు అని కూడా అంటారు. వీటిని బంగాళాల తోటలలోను. భవనముల ముందుగల కుండ్లలోను, ఉద్యానవనములలోను పెంచుదురు. ఇది గజము ఎత్తువరకు పెరుగును. దీని ఆకులు చేటలంత ఉరవు గలిగి చేమ ఆకులవలె

నుండును. మట్టలు గూడా చేమమట్టలవలెనే యుండును. ఏనుగ చెవికిని ఈ ఆకులకును పోలిక ఒక్క విధముగా నుండుటచేతను చేమదుంపవంటి కోలదనముగల దుంపనుండి ఈ చెట్టు పుట్టుటచేతను దీనికి ఏనుగ చెవి చెట్టు లేక ఏనుగచెవి చేమ చెట్టు అని పిలుచుదురు. ఆకులు దళసరిగా నుండును. ఇందులో రెండు జాతులు కలవు. తెలుపు, నలుపు. ఇది వేడిచేయును. రుచి చేదు వగరు, తీపి. దుంప కొంచెం మధురముగా నుండును. పాండు, శోథ, క్రిమి, ప్లీహ, గుల్మ, అనాహ, ఉదర, గ్రహణి, అర్శోజ్వరము హరించును. దుంప మెత్తగానూరి చమురుతో వేసి కాచి ఆ నూనె తలకు మర్ధనాచేసిన పాలిజ్వరములు హరించును. దీని ఆకు మెత్తగాదంచి ఆముదమున వెచ్చజేసి హస్తికడుపునకు గట్టిన బాలింతల మైలరక్తము వెడలును. కట్టి గాఢమగుటచే చాలకాల ముంచరాదు. దుంప ఉడికించి గట్టిన గడ్డలు పిగులును. సంస్కృతమున హస్తికర్ణి అందురు.

☞ ఏనుగచెవి పలాశచెట్టు :— ఇది అడవులలో తీగగా ప్రాకు లత జాతికి చెందినది. దీనిని తీగ మోదుగ అని పిలుతురు. దీని ఆకు చాలా పెద్దవిగా ఏనుగ చెవులవలె నుండును. ఒక్కొక్క ఆకులో చక్కగా భోజనము చేయుటకు వీలుకలుగును. మిక్కిలి వీర్యవృద్ధి చేయును. మేహశాంతి చేయును. బుద్ధిని వికసింపచేయును. బలమును, ఆయువును కలుగచేయును. సంస్కృతమున హస్తిపలాశ.

☞ ఏపిచెట్టు :— ఇది ఒక మహావృక్షము. దీని ఆకులుగూడా చాల పెద్దవి. హిందూదేశమంతటను అరణ్యములలో నీచెట్లు గలవు. ఆకునకు బలిష్టమైన తొడిమ యుండును. ఆకుపై యీనెచార లుండును. దీని మొగ్గ కనకసంపెంగ మొగ్గను పోలియుండును. ఆకులమధ్యనుండి జటలు వ్రేలబడును. దీనిలో రెండు మూడు జాతులున్నట్లు తెలియుచున్నది. అశ్వకర్ణి, అజాకర్ణి పైన వర్ణించినదొకటి. మొత్తమున గుణములన్నిటికి



సమానములే. ఇది ఎగరు రుచి గలది. అశ్వకర్ణి జాతికి కారము, చేదు రుచులు గలవు. వేడిచేయును. విపాకమున కారపు రుచికి మారును. గురుగుణము, వ్రణహారి, స్వేదమును పోగొట్టును. కఫమును, క్రిములను, అండవృద్ధులను, నిద్రధిని, బధిరరోగమును, యోనిదోషములను, కర్ణ రోగములను, రక్తపిత్తమును, ఉరోరోగములను, స్ఫోటకం, దురదలు మొదలగు రోగములు హరించును. మలబద్ధమును చేయును. ఏపిపండు మధురరుచి, మేహశాంతి, రూక్షగుణము, విపాకమునగూడ మధుర రుచియే. శూలలు, కడుపుబ్బరము, పైత్యం, తాపం, క్షితం, క్షయ మొదలగు రోగములు హరించును. రామ రావణ యుద్ధమందు సర్జ వృక్షముతో పోరాడినట్లు యుద్ధకాండమున వర్ణించబడినది. సంస్కృత మున సాలవృక్షః, సర్జవృక్షః, ఇంగ్లీషున The Sal Tree.

☞ ఏపిబంక :— ఇది ఏపిచెట్టునుండి బయలుదేరిన బంక. దీనిని సర్ధరస మందురు. ఇది సువాసన ద్రవ్యము. ఇది తీపి వగరు చేదు రుచులు గలది. వేడిచేయునని కొందరు, చలువ చేయునని కొందరు వ్రాసిరి. వీర్యమును స్థంభించును. వ్రణముల శోధించి మాన్పును. విషమును హరించును. గ్రహబాధ లడంచును. శరీరమందలి ఎముకలు గాని, అంగములుగాని బ్రద్దలయినవానిని అతుకును. వాత పైత్యము లను, స్ఫోటకమును హరించును. మందాగ్నిని పోజేయును. దీని తైలము నకు గూడా ఈ గుణములే అధికముగా గలవు. సంస్కృతమున రాలః.

☞ ఏరకాతృణము :— ఇది ఒక గడ్డిజాతి. నీటిలోననే బెరుగును. ఆకులు పొడవుగా నుండును. శీతవీర్యము, చలువచేయును. వీర్యమును వృద్ధినొందించును. రక్తం, పిత్తం, తాపం అణచును. వాత ప్రకోపము చేయును.

☞ ఏలకులు :— ఇది లతజాతి. దీనిపంట మలబారులో విస్తారముగా నుండును. చలువగల పర్వత ప్రాంతములయందు ఇవి విస్తారముగా

పైరగును. సింహాళమునందుకూడా కొద్దిగా పైరుచేయబడుచున్నది. ఏలకులు రెండు రకములు. చిన్నఏలకులు, పెద్దఏలకులు. చిన్నఏలకులు పాలకాయలంత యుండును. పెద్దవి ఆల్బకరా కాయలంత యుండును. ఏలకికాయ చర్మం తెల్లగా నుండును. గింజలు నల్లగ నుండును. చూర్ణించిన తెల్లగ నుండును. ఆకులు, తీగ, పువ్వు, కాయ పరిమాణములలో హెచ్చుతగ్గులేకాని గుణభేదములు రెంటికిని వ్యత్యాసములేదు. ఇది బీజసారముగల మూలిక. గింజలు సువాసన గలిగి యుండును. ఇందులో చిన్న ఏలకు గింజలు సువాసన హెచ్చు. కారపురుచి. ఉష్ణవీర్యము. విపాకమున కారపురుచికి మారును రక్తపైత్యమును హరించును. వాంతులను శమింపచేయును. శుక్రకాశ్మరీ రోగమును పోగొట్టును. ఇది చలువచేయునని ఋషుల మతం. దప్పి, హృచ్చలనం, దురదలు, పైత్యం, కఫం హరించును. ఆమ్లమును పచనము చేయును దగ్గు వగర్పులను కట్టును. చిన్న ఏలకులు తీక్ష్ణగుణము కలిగియుండును. పెద్ద ఏలకులు కర్జూరాగాగింజలునూరి త్రాగిన మూత్రకృచ్ఛ్రము హరించును. సంస్కృతమున ఏలా అందురు.

## ఒ

ఒద్దిచెట్టు :—ఇది ఒకపెద్దచెట్టు. పర్వతారణ్య ప్రాంతములలో విస్తారముగా పెరుగును. మేగశృంగి లతగనున్నది. మేషశృంగి వామావర్తము వృశ్చికాలి దక్షిణావర్తము దీని ఆకులు 1—2 నమలిన దాని మధురపికశక్తులు 24 గంటలవరకు వ్యక్తములగుచుండును. ఎఱ్ఱని పువ్వులతోను మేకకొమ్మువలె గుండ్రదనము కలిగి పొడనగు కాయలతోను మోదుగ ఆకులనుబోలు ఆకులతోను చూచుటకు సుందరముగ నుండును. ఆకులు గుండ్రము, సాపుగలిగి 4—5 అంగుళములు పొడవు దోసరి, పచ్చనివర్ణము గలిగియుండును. ఆకుపైభాగము జిగిగను అడుగు



భాగము చప్పగనుండును. ఇందులో గుత్తులుగుత్తులుగ పూయు తెల్లని పూలుగల నొక లతజాతికలదు. దానికి నూగుఉండును. దీనిని వృశ్చి కాని అనిఅందురు. ఒద్దిచెట్టునను గంటుపెట్టిన పాలుకారును. కొంచెము చేదుగ నుండును. పువ్వులు చిన్నవి. పచ్చనిరంగుగాగాని, తెల్లగాగాని యుండును. దీని వేరు చూర్ణము ఆముదములో కలిపి పాముకాటుపయిన పూయుదురు. వేరుచూర్ణము వాంతిని చేయును. శ్లేష్మనివారకమునై యున్నది. వగరు, చేదు రుచులుగలది. దాహమును హరించును. పిత్తం కఫము, రక్తదోషమును నాశనముచేయును. తిమ్మిర, కాస, శ్వాసలను పోగొట్టును. వ్రణములను క్రిములను నాశనముచేయును. దీనికాయలు చేదురుచి. కుష్ఠువు, మేహము, శ్లేష్మములను నశింపచేయును. అగ్నిదీప్తి చేయును. మలబద్ధమును హరించును. కన్నులకు మేలుచూర్చును.

సంస్కృతమున మేషశృంగీ. హిందీన గుడమార్. మేషశృంగీ. బెంగాలీన మేఢాసింగి మరాటీన మేంఢశింగీ. గుజరాతీన మఢాసింగీ. ఇంగ్లీషున Gymnema Sylvestre, A Stout Woody Climber.

ఒంటె :—ఇది అడవులలోనుండు సాధువైన మృగము. దీని మెడ చాలపొడవు. నడుముఎత్తు. కాళ్ళుపొడవు. శాకాహారి. ఇది పెద్ద పెద్ద ఎడారులలో చాలదూరము చాలకాలము ప్రయాణము చేయగలదు. దాహమునకు నీళ్ళు దొరకకున్నను 4—5 రోజులుండగలదు. దీనిపాలు, వెన్న, మాంసము, మలమూత్రములుగూడ వైద్యమున నుపయోగించును. ఒంటెపాలు మధురరుచిగనుండును. కొంచెం ఉప్పదనమున్నట్లుగూడ కన్పించును. మిక్కిలి వేడిచేయును. విపాకమున మధురరసముగ మారును. వాతం, శ్లేష్మం హరించును. అగ్నిదీప్తినొసంగును. క్రిములను, ఉదరవ్యాధులను, కడుపుఉబ్బును, కుష్ఠురోగమును హరించును. ఒంటెపెరుగు చిరుచేదుగను కారముగ నుండును. ఉష్ణవీర్యం. విపాకమున కారపురుచికి మారును. పిత్తమును పెంచును.

మూలశంఖ, వాతం, క్రిమిరోగం, కుష్ఠురోగం హరించును. చల్లచిరుచేదు. దగ్గు, ఒగర్పుల బోగొట్టును. ఒంటెవెన్న శీతవీర్యమైనది. క్రిములనుజంపును. వ్రణములనార్చును. ఆకలిని వృద్ధిపొందించును. ఒంటెనెయ్యి చిరుచేదు, కారమురుచి, ఉష్ణవీర్యం, విపాకమున కారపురుచిగ మారును. వమనమును గలుగజేయు గుణముకలదు. ఉదరవ్యాధులను, గుల్మ, వ్రణ, విషముల హరించును. శ్లేష్మమును తగ్గించును. మూత్రదోషమును శమింపజేయును. బుద్ధిబలము నిచ్చును. అలసటను గలిగించును. దీనిమాంసం తీపి, వగరు రుచి. ఉష్ణవీర్యం గురుత్వం చేయును. విపాకమున కారపురుచికి మారును. మలమును బంధించును. వాతవృద్ధి చేయును. అగ్నిమాంద్యం చేయును. ఒంటెమూత్రం కారపురుచి. ఉన్మాదరోగమున బాగుగ పనిచేయును. ఒంటెలద్దెరసం మిక్కిలి వేడి చేయును. వాతవ్యాధులకు పచ్చిలద్దె రసము లోనికిచ్చి లద్దెను ఆముదమున వెచ్చచేసికట్టిన విశేష గుణకారిగనుండును. ఒంటెచేదుకట్టనే జున్ను అని చెప్పుదురు. ఇది చక్కని వేడిచేసి వంటినొప్పుల హరించును. పథ్యకరమైనది. సంస్కృతమున ఉష్ట్రః. ఇంగ్లీషున Camel అందురు.

## ఓ

ఓకచెట్టు :—ఇది వృక్షజాతికిని, తీగజాతికిని చెందదు. పొదజాతికి చేరును. దీని ఆకు గుండ్రదనము, పెళుసును గలిగి యుండును. కొమ్మలకు గట్టిముండ్లుండును. రెండు గజముల ఎత్తువరకు బెరుగును. కాయలు కొంచెము కోలవాటుగానుండి పైన మచ్చలుండును. పండు నల్లగా నుండును. లోనిరసము ఎఱ్ఱగ నుండును. దీనిని వాకచెట్టని చెప్పుదురు. కాయ పుల్లగా నుండును. పండు తీపిగ నుండును. కొంచెం పులుపు రుచి కూడా కలిగి యుండును. ఇది ఫలసారముగల మూలిక. వేరు చేదుగను, అగ్నిపాచకముగ నుండును. ఇది వేడిచేయును. విపాక



మున పులుపు రుచిగా మారును. పచ్చికాయ దాహమును కట్టును. నోటికి రుచిని పుట్టించును. రక్తదోషమును, పైత్యమును., కఫమును చేయును. పండు రుచికరమైనది. తేలికనిచ్చును. పైత్యమును వాతమును శమించును. దీని వేరు క్రిములను నశింపుచేయును. పచ్చికాయలు పచ్చడి బద్దలు చేయుదురు. పప్పులో వేసి వండుదురు. కొబ్బరికాయలోను, పెసరపప్పులో వేసి పచ్చడి చేయుదురు. ఈ ముక్కలు కొంచెం వెచ్చచేసి వాడవలెను. లేనియెడల గొట్టుగా నుండును. దీనివేరు నిమ్మకాయ రసములో అరుగదీసి రాసిన చర్మరోగములు హరించును. వేరు హారతికర్పూరము కొబ్బరి నూనెలోను కలిపి రాయవచ్చును.

సంస్కృతమున కరమర్ద, హిందీలో కరుందా, కరాందీ. బెంగాలీలో కరమచా, బైంచీ, మరాటీలో కరవంద్, గుజరాతీలో కరమదీ. ఇంగ్లీషున Carrssa carandas.

ఓమము :—దీనినిఓమము లేక వాము అని అందురు. ఇది భారతదేశమందంతటను పైరగును. గజమెత్తువరకు పెరుగును. ఈ మొక్క గుజ్జుగా నుండును. పెళుసు, బూడిదరంగు. ఆకులకు కంగోలా యుండును. పువ్వులు గుత్తులు గుత్తులు పూయును. పువ్వులనుండి బీజములు వెలువడును. చెట్టంతయు సువాసనతో గూడి యుండును. వాము కారంగా నుండును. మిక్కిలి వేడిచేయును. విపాకమున కారపు రుచిగా మారును. ఇది లఘు తీక్ష్ణ గుణములు కలది. శుక్రధాతువును హరించును. వాతమును, శ్లేష్మమును, శూలలు, ఉదరరోగములు, కడుపుఉబ్బులు హరించును. క్రిములను వెదకివెదకి చంపును. ప్లీహవృద్ధిని తగ్గించును. మంచి ఆకలిని కలిగించును. పిత్తమును ప్రకోపింప చేయును. వాతసంబంధములగు మూలశంఖలు కట్టును. వాంతులకుగూడ పనిచేయును. హృదయమునకు మంచిది. ఆమవాతం ముఖ్యముగా తగ్గును. వాము చూర్ణం శీధుమద్యములోగలిపి త్రాగిన మూలశంఖరోగం నివర్తించునని చరకమున గలదు.

వాము నోటనుంచుకొని ఎల్లప్పుడు దానిరసమును మ్రింగుచుండిన గొంతులో కొల్లుగానుండుట తగ్గునని హారీతసంహితమున గలదు.

వాము, బెల్లం మెత్తగ నలగగొట్టి యుండలుచేసి ఆ ఉండలు సేవించుచు పథ్యముగానుండిన శీతపైత్త్యం హరించును. దేశీయవైద్య ప్రయోగమున వాము చిదుగగొట్టి దబ్బఆకులో చుట్టి ఆపొగపీల్చిన శైత్యభారములు గొంతునొప్పులు వసనముకట్టును. వామురసం పంచదారకలిపి త్రాగిన తాంబూలతిక్క హరించుటయేకాక గుండెబరువు కూడ తగ్గును, శొంఠి, వాము, సైంధవలవణం మెత్తగచూర్ణించి వేడినీళ్ళతోగాని బెల్లపునీటితోగాని సేవించిన ప్రబలమైన అజీర్ణములు అజీర్ణమువలన బుట్టిన విరేచనములు తగ్గిపోవును. వాము ప్రత్యేకముగాగాని, మిరియములుచేర్చిగాని వేత్సచేసి అనగా నల్లనగువరకు మాడ్చి అందులో నీళ్ళుపోసి ఆ నీళ్ళు సగమగునువరకు కాచి ఆ నీళ్ళు ఒకగిద్దెడు పుచ్చుకొన్న నీళ్ళవిరేచనములు, కలరావిరేచనములు, ఆమ విరేచనములు కూడకట్టును. ఇది నుసిపురుగులకుకూడ మంచిమందు. పొత్తికడుపునందలి దోషములను హరించును. ఋతుబద్ధమును పోగొట్టును. దీనిని వాముఘాటు అందురు. వాము మూకుడులోవేసి సన్నపుసెగను మంటబెట్టిన నది మెత్తగ ముద్దవలెనగును. ఆ పాకములో దింపి మెత్తగనూరి కందిగింజలవలె మాత్రలుచేసి అనుపాన విశేషముల వాడిన గ్రహణులు, అతిసారములు, కడుపునొప్పులు, అజీర్ణములు, ఉబ్బరములు మొదలగు ఉదరవ్యాధులు హరించును. వాము సైంధవలవణము నిమ్మకాయ రసములోగాని మాదీఫలరసములోగాని ఊరబెట్టి ఎండబెట్టి ప్రతిదినము ఉదయమున సేవించిన మంచి అన్నహితవుగలుగును. అజీర్ణం హరించును. ఆమపైత్త్యం పోవును. దీనిని భావనవాము అందురు. వాము దోరగావేచినది 10 తులములు ఇరువదితులముల తాటిబెల్లం లేక



కలకండ మెత్తగనూరి పదితులముల దిగుదాయనూనెకూడా చేర్చి ఉండలుచేసి రెండుసంవత్సరముల మొదలు 10 సంవత్సరముల వరకు ఈడుగల పిల్లలకు ప్రతిరోజు తినిపించినచో అజీర్ణదోషములు పుట్టవు. కడుపులో బల్లలుకరుగును. ఆకలి వృద్ధిచేయును. ఇది పిల్లలపాలిటి సంజీవివంటిది. గర్భిణీస్త్రీల నడుమునొప్పులకు వాముచూర్ణము 4—5 గ్రాములు ఇచ్చిన నయమగును. తగరము, సత్తు వాముతో భస్మములగును. కలరా, మొదలగు తీవ్రవ్యాధులలో వాము అర్కము బాగుగ పనిచేయును. దానివిధాన మీక్రింద పొందుపరుపబడినది. ఒక కుంచెడు వాము రెండుకుంచముల నీటిలో రాత్రినానవేసి ఉదయమున మెత్తగ రుబ్బి అర్కయంత్రమున వండిన అర్కుదిగును. ఇది మరల గాచిన విశేషగుణకారి. అజీర్ణములను, నీళ్ళవిరేచనములను, కడుపునొప్పులను కట్టును. వాముఆకుకూర శ్లేష్మహరము, పిత్తప్రదము. గింజలనూనెకు గూడ వాముగుణములే విస్తారముగా కలిగియుండును. వాముల గూర్చి ముందు వ్రాయబడియున్నది. సంస్కృతమున యవానీ, దీపనీ, కురంజీ, కురాసాని అందురు

## క

కక్కపాల:—వాతదల్ల. అనినటకర్ణి, గాలిమెటోరియా, మెడికాల్లో మాత్రము గలదు. సంస్కృతమున దీనికి నామములేదు. ఇది తీగజాతికి చెందినది. గిల్లిన పాలుకారును. ఇది తూర్పుబంగాళము బెలూచిస్థానం నీలగిరిలో నున్నట్లు తెలియుచున్నది. ఇది జీర్ణించిన సెగసవాయిలకు పనిచేయును. సమూల కషాయములో శుద్ధిమహిషాక్షీ గుగ్గిలం చేర్చి త్రాగవలెను. దీనిరసం చర్మరోగముల హరించును.

కచోరము:—ఇది కందసారము. దీనిదుంపయే వైద్యమునకు ఉపయోగించును. అల్లముమొక్కవలె దీనియాకులుండును ఆకులు

కూడ సువాసనకలవైయుండును. ఇది చేదు కారం కలిసిన రుచిగ నుండును. వేడిచేయును. విపాకమున కారపురుచిగ మారును. జఠరాగ్నిని వృద్ధిచేయును. లఘువుగ నుండును. దగ్గు, ఒగర్పుల నరికట్టును వాతకఫముల నణంచును. వ్రణములు గుల్మములు, క్రిములు, సన్నిపాతజ్వరములు, పార్శ్వశూలలు, పాండురోగములు, గొంతునొప్పులు హరించును. కచ్చూర చూర్ణము తేనెతోతినిన దగ్గులు శమించును. శ్లేష్మము హరించును. వీర్యవృద్ధిచేయును. వీర్యము స్థంభించును. శగరోగములు నశించును. తామ్రము శుద్ధిచేసినది, వంగము రెండుకలిపి పచ్చికచ్చూరపు ముద్దలోపెట్టి పుటమువేసిన తెల్లగ భస్మమగును. దీనిని తామ్రవంగ మందురు. ఈ భస్మం కాసశ్వాసలను, శ్లేష్మమును, శూలలను, అనుపానయుక్తముగ సేవించిన కట్టును, శుక్లనష్టముసుగూడ కట్టును. దీనిరసం కంఠస్వరమును బాగుపరచును.

సంస్కృతములో కచూర, కఠి. ఇంగ్లీషులో The Round Zedoary. హిందీన కచూర్. బెంగాలీన ఏకాంగీ. గుజరాతీన కచూరీ. మరాటీన కచేదు.

☞ **కటికరోహిణి** :—ఇది గుల్మజాతిమొక్క. ఆకులు కుక్కపొగాకు ఆకులువలె కొంచెం పొడవుగలిగి కంగోరా గలిగియుండును. దీనిపువ్వులు నీలిరంగుగ నుండును. గుత్తులు గుత్తులుగ పూయును. ఇది హిమాలయ ప్రాంతమందు విశేషముగా దొరకును. ఇందు రెండు జాతులుకలవు. నీలిరంగుగల దొకటియు, పచ్చరంగుగల దొకటియు కలవు. దీనివ్రేళ్ళకే ఔషధోపయోగము. ఇది మూలసారం గలది. దీనిరుచి చేదు. వేడిచేయును. విపాకమున కారపురుచిగ మారును. రూక్ష, లఘుగుణములు కలది. జాడించి విరేచనము చేయును. ఆకలిని బాగుగ బుట్టించును. గుండెకు మేలుచేయును. కఫ పిత్త జ్వరములను ప్రమేహములను, కాసశ్వాసలు, రక్తతాపం, కుష్ఠురోగం, క్రిములు



విషమజ్వరములు హరించును. కటికరోహిణి, మిరియాలు, రససింధూరం చనుబాలతో ఎనిమిదిరోజులు మర్ధించి, మినపగింజలవలె మాత్రలుచేసి అనుపాన యుక్తముగ నిచ్చిన జ్వరములు హరించును.

కటికరోహిణి, అతిమధురము మెత్తగా చూర్ణించి పంచదార నీళ్ళతో త్రాగిన గుండెలలో బరువు మొదలగు రోగములు హరించును. కటికరోహిణీయు. శుద్ధిగైరికమును సమముగా చూర్ణించి తేనెతో కలిపి యిచ్చిన ఎక్కిళ్ళు హరించును. కటికరోహిణి రసము త్రాగిన విరేచనము చేయును. క్రిములు పడిపోవును. కటికరోహిణి కషాయంలో సరాపాకు చూర్ణము కలిపి మూడు రోజులు ఉదయముపూట త్రాగిన ఋతురక్తము జారీచేయును. చిట్టిరార మట్టల రసముతో కటికరోహిణి నూరి గుండెలకు పట్టువేసిన గుండెలపీకు నొప్పి తగ్గిపోవును. శ్లేష్మము కరగిపోయి ఆయాసము తగ్గును. ఆకు పులుపు. వాతము, కఫము, దురద, దద్రు. కాస, శ్వాస, క్రిమి, కుష్టము, మశము చేయును. గింజలు చేదు, ఉష్ణవీర్యము. వాతం, కుష్టము, కండూ శ్వాసకాసలు, గుల్మం, క్రిమి విషదోషాలు హరించును. కటికరోహిణిలో నల్లదానికంటె తెల్లనిది ఘాటైనదిగాన మోతాదు జాగ్రత్తగా తక్కువగానే వాడవలయును. మోతాదు ఎక్కువ అయిన వికారము గలిగించును. నవీన వైద్యకమతమున ఇది రసాయన వస్తువ. చేదు, రుచి. పాచనకారి. పిత్తమును హరించును. అజీర్ణము, గ్రహణి, ఒగర్పు, దగ్గు, పైత్య వికృతులయందు ఇవి బాగుగా పనిచేయును. యకృద్వృద్ధిలో చేదు పుచ్చతో సమానముగా పనిచేయును. గాని చేదుపుచ్చకన్న మృదువుగా నిది పనిచేయును. విషమ జ్వరములు హరించుటలో నిది మంచి యౌషధి. పిల్లల క్రిమిరోగములయందు ఈ మూలిక చాలా గుణకారి అని మెటీరియా మెడికు ఆఫ్ ఇండియా—R. N Khory లో నున్నది.

సంస్కృతమున చక్రాంగి, శతపర్వా కుందరుహా, హిందీలో పమండ్, చకబడ్, బంగాలీలో చాకందుబాట కాటాపడాంచీ, మరాటీలో పరబటా, కర్నాటమున చగసే, ఇంగ్లీషున Cassia Tora.

కట్ఫలము :—ఇది చెట్టుజాతికి చెందినది. కాయలు ఖర్జూరపు కాయలవలె నుండును. నున్నదనము గలిగియుండును. కాయలు కొంచెముగ నుండును. ఈ చెట్లు సింలా, సోలన్, నేపాళము. ఆసాము, చీనా, జపాను దేశములలో పుట్టును. మ్రానుచెక్క దళముగ నుండును. దీనిని కాయఫలమని కొందరు, గుమ్మడికేగని కొందరు చెప్పుదురు. దీనికాయలను అచ్చటకొండవాండ్రు తిందురు. దీనిచెక్క ఎరుపు. దీని కాయలు, చెక్క ముఖ్యఉపయోగములైనవి. ఇది వగరు. చేదు. కారం రుచులుగలది. వేడిచేయును. విపాకమున కారపురుచిగ మారును తేలిక గుణముకలది. ఇది శ్లేష్మవాతముల రెంటిని పోగొట్టును. మరియు గుల్మం, మేహం, అగ్నిమాంద్యం, మొదలగు రోగముల హరించును. అరుచిని హరించును. జ్వరం, మూలశంఖ, గ్రహణి, పాండువు, శమింపజేయును. గుండెరోగములకు హితమైనది. తృష్ణను శమించును. దగ్గులు ఒగర్పులు తగ్గును. తుమ్ములు గలిగించును. కట్ఫల చూర్ణంగాని, కషాయంగాని తేనెతో కలిపి సేవించిన గ్రహణులు హరించును. కాయ కారం, చేదు రుచి. వగరుగూడ మిశ్రము. కఫవాతహరము. మేహ గుల్మాది శ్వాసకాస అరుచి జ్వరముల నివారించును. ఈ చూర్ణం నస్యముచేసిన శిరోరోగములు పోవును. గ్రామ్యప్రయోగములు—

కట్ఫలచూర్ణం. శొంఠిచూర్ణం. పసుపుచూర్ణం ఈ మూడుకలిపి దేహమునకురాసిన కలరావ్యాధిలో చల్లబడిన దేహం వేడిఎక్కును.

సంస్కృతమున కట్ఫల—కుంభీ, ఉగ్రగంధః. రంజనకః హిందీన కాయఫల. బెంగాలీన కటిఫల, కాయభాల్. మరాటీన కంభ్యాచీసాల్. గుజరాతీన కాయఫల్. ఇంగ్లీషున Myrica Sapida



కట్లవిత్తులు :—వీనిని కాటుకగింజలందురు. ఇవి లతజాతికి చెందినవి. ఒక్కొక్క తొడిమకు మూడుమూడు ఆకులుండును. దీని పువ్వున కయిదురేఖలుండును. పువ్వుమధ్యను పుప్పొడియుండును. గింజలు నల్లగనుండును. రుచి వెగటు. ఉష్ణవీర్యం, శ్లేష్మహరము, శిరోవ్యాధుల శమింపచేయును. కడుపుబ్బరం, జ్వరం, ఉదావర్తము హరించును. ఈ గింజలు దోరగా వేయించి గుండకొట్టి బెల్లముచేర్చి ఉండలుచేసిన మినపసున్నివలె కమ్మగానుండును. చక్కగ విరేచనము చేయును. సంస్కృతమున కృష్ణబీజః.

కదంబ :—ఇది వృక్షజాతిలోనిది. ఇందు అయిదురకములు కలవు. ఛాయావృక్షము. 1 కదంబము, 2 ధారాకదంబము, 3 భూమి కదంబము, 4 రాజకదంబము, 5 ధూళికదంబము. రాజకదంబము పెద్ద వృక్షము. దీనిని కడిమిచెట్టు అందురు. దీని ఆకు జీడిమామిడిఆకువలెను గుజ్జుగాను ఉండును. మ్రానిచెక్క దళసరిగానుండును. చెట్టునకు సన్నని యూడలవంటి కాడలుండును. పువ్వులు సువాసన గలిగి గుండ్రముగా నుండును. చిన్నపువ్వులుండును. పలకలుగల కాయలు కోలగ నుండును. వర్షకాలమున పూవులు పూయును. ఇందు ధారాకబందము పెద్దవృక్షము. దీనిపువ్వులుకూడ సువాసన గలిగియుండును. ధూళికబందము దీనిపువ్వులు పోకపువ్వులవలె నుండును. ఇది వసంతకాలములో పూయును. భూమికదంబము చాలచిన్నచెట్టు. ఆకులు పువ్వులగూడ చాలచిన్నవి. మొత్తంమీద కడిమి రకములన్నియు సమానరూపమునే పొందియున్నవి. వగరురుచిగలది. శీతవీర్యం, గురుగుణం. ముట్టుకొనిన గూడా రసం చల్లగనుండును. వ్రణములు మాన్పుటకు దీనికన్న విశేషమైన మూలికలేదు. ఇది విషమును హరించును. మదరోగముల హరించును. కాయ మధురం. శీతము, గురువు, పిత్తవాత రోగహరము. వాతమును దగ్గును హరించును. కడిమియందు పులుపురుచితప్ప మిగిలిన

అయిదురుచులు గలవు. త్రిదోషముల హరించి వీర్యవృద్ధిని కలుగ చేయును కడిమిచిగురు వగరురుచి కలది. శీతవీర్యమైనది. విపాకమున తీపిరుచిగలిగి యుండును. అతిసారమును పోగొట్టును. కాయలు శ్లేష్మమును తెంచును. వేడిచేయును. వీర్యమును వృద్ధిపరచును. పండు త్రిదోషహరము. కాయ కుమ్ములో పెట్టి రసంపిండి చెవిలో బోసిన చెముడుతగ్గును. ఆకులు వెచ్చజేసి వ్రణములపై కట్టిన వ్రణములు మాన్పుటయేకాక, గాలిలోని క్రిములను వ్రణములను చేరనీకుండ కాపాడును. ధారాకదంబమునకు కేళికదంబమని పేరుగలదు. కదంబ వృక్షం పార్వతీ దేవికి మిక్కిలి ప్రేమాస్పదమైనది. కావుననే పార్వతిని "కదంబ వనవాసినీ" అని స్తుతించిరి. దీనిరసములో జీలకఱ్ఱచూర్ణం చేర్చి యిచ్చిన పిల్లలవాంతులు కట్టును.

సంస్కృతమున కదంబ, నీప. హిందీన కదమ్, కదంబ. బెంగాలీన కదమ్‌గాఛ. గుజరాతీన కలమ్. మరాటీన కలంబ, నీప. ఇంగ్లీషున Anthocephalus Cadamba Bitter Tonic అందురు.

☞ కడుగు :—కడుగు అనగా బియ్యమును కడిగిన నీళ్ళనిఅర్థం. కడుగు తీపి, వగరు రుచులుగలిగియుండును. మేహశాంతిచేయును. విపాకమున తీపిరుచిగ మారును. సాధారణముగా నిది మూత్రకోశవ్యాధులలో నుపయోగించును. దీనియందు (బి) విటమినులు గలవు. పులిసినది లక్ష్మీచారు కాచుకొందురు. ఇది చలువచేయును. కర్పూరశిలాజిత్తు కడుగుతో శుద్ధిచేయుదురు. కడుగుతో శిలాజిత్తు భస్మముయిచ్చిన ప్రదరరోగముయందు గుణకారి. మూత్రబంధమును విప్పును. సెగరోగములయందు నీటిచురుకును తగ్గించును. ఇందు కొంచెం పంచదార చేర్చవలెను. పంచదార చేర్చియిచ్చిన అంతరదాహం బాహ్యదాహం రెండునుకట్టును. అనగా తాపం హరించును కడుగు బలమునిచ్చును. పశువులకు కడుగు పెట్టిన పాలు వృద్ధియగును. కడుగునకు విశేషముగా



పంచదార అనుపానమే శ్రేష్టము. రక్తపిత్తము మిక్కిలి వేడిమి తగ్గును. మంచిగంధం ముద్దచేర్చి పుచ్చుకొన్న కుసుమలు, మూర్ఛలు, రక్తపిత్తము కట్టును. పసికడుగు వగరుగ, మధురముగ, చులకనగ నుండును. మలమును గట్టిపరచును. విషం, వాంతి, వ్రణము, తాపము, వీనిని బోగొట్టును. పులిసినకడుగు అగ్నిదీప్తిని చేయును. తియ్యగ, పుల్లగ నుండును. దాహమునణచును. తృప్తినిచ్చును. తేలికగ నుండును. సంస్కృతమున తండుల, దావనోదకము. అందురు.

☞ కత్తిమందుచెట్టు :—కత్తిమందుచెట్టు క్షీరవృక్షము. ఈ చెట్టు యొక్క కొమ్మలన్నియు మూడుపలకలురీతి యుండును. చెట్టుమొదట నుండి తుదివరకు వాడియైన ముండ్లుండును. ముండ్లమొదట కొంచెం నూగుండును. ముండ్లు మూడు నాలుగు చొప్పున కలిసి యుండును. పలకల అంచుననే ముండ్లు పుట్టి వృద్ధియగును. ఈచెట్టునకు ఆకులులేవు. ఇది గుజ్జుగా శాఖోపశాఖలుగా నుండును. దీని వేరులగాయతు తుది వరకు అన్నిచోట్ల పాలుండును. దీనికి విత్తనంలేదు. కొమ్మనరికి పాతిన బ్రతుకును. సాధారణంగా దీనిని త్రిధారి అని కూడా చెప్పుదురు. ఇది చేదురుచిగలది. వేడిచేయును. గురుగుణముగలదు. వాతశ్లేష్మముల హరించును. దుష్టవ్రణములదునుమాడును. పొత్తికడుపును శోషించును. తీవ్రమైన విరేచనము చేయును. కత్తెమందుపాలు విషమును, కడుపు ఉబ్బరమును హరించును. గుల్మములు ఉదరములు చక్కగ శమించును. శ్లేష్మమును, వాతమును నశింపుచేయును. శూలలు హరించును. కుష్టురోగములు, మేహరోగములు, అర్శోరోగములు, గజ్జులు, వ్రణములు హరించును. జ్వరబిళ్ళలు కరగించును. విరేచనకారులలో నిది గాఢ విరేచనకారి. మృదుకోష్టముగల మనుజులు దీనిని వాడరాదు. స్వల్ప దోషములలో దీనిని వాడకూడదు. ప్రబలదోషములలో నిది వెంటనే పనిచేయును. దీనిపాలతో తయారుచేసిన మందునే కత్తిమందని వాడు

దురు. ఇది కత్తికాములను దృఢముగను, బలిష్టముగా నుంచును. అందు చేతనే ఈ చెట్టునకు "కత్తిమందు చెట్టు" అని పేరు ప్రసిద్ధికెక్కినది. కత్తిమందు పాలలో బియ్యపు పిండి భావనచేసి ఆ పిండితో అప్పములు వండి పెట్టిన జలోదరము హరించును. దీని చిగుళ్ళు కూరవండుకొని తినిన మిక్కిలి మలబద్ధముగల తత్త్వముల ఉదరరోగము హరించును. బాగుగా విరేచనము చేయును. కత్తిమందు వెచ్చచేసి గవదబిళ్ళలకు అంటించినచో బిళ్ళలు కరిగిపోవును. కత్తిమందు ఆముదములో వేసి కాచి ఆ ఆముదము ఉగ్గుపెట్టిన కఫంహరించి, దగువెంటనే శమించును. రోగబలం గుర్తింపవలెను. కత్తిమందు తేనెతో అరగదీసి నాకించిన దగ్గులు శమించును. సంస్కృతమున త్రిధారి, వజ్రక్షీరి, వజ్రకంటక.

☞ కత్తిరివావిలిచెట్టు :—ఇది వావిలిలోనొకజాతి. దీని ఆకులన్నియు కత్తిరించినట్లుండును. దీనిరుచి చేదుగను కారముగ నుండును. వాతం, కఫం, శమించును. శూలలు నశించును. మరియు కుష్ఠము, క్షయ, చర్మ వ్యాధులు హరించును.

☞ కతిరాగోదు :—కొందరు బాదముచెట్టు జిగురును మరికొందరు మోకచెట్టు జిగురును. ఈ పేరున వాడుచున్నట్లు తెలియుచున్నది. కతిరాగోదు అనునది యూనానీద్రవ్యము. గోదుఅనగా జిగురు, కతిరాగోదు స్థానమున బాదము జిగురునే మనదేశీయులు వాడుచున్నారు. పోలిక బాదము జిగురునకే సరిపోవుచున్నది. గాన కతిరాగోదనగా బాబంజిగురే వాడవలెను. ఇది తెల్లగా నుండును. దీనిరుచి చేదు. మేహశాంతిచేయును. విపాకమున కారపురుచిగ మారును. ఇది మంచిశుక్ర వృద్ధిని చేయును. రక్తమును శుభ్రపరచును. వ్రణముల నార్చును. పొడిదగ్గును తగ్గించును. శ్వాసకాసల వదల్చును. ఇది త్వరగ జీర్ణం కాదు. అందువలన ఇతరవస్తువులతో గలిపి నీయవలెను. సుగంధాది లేహ్యములో కతిరాగోదు ఒక భాగముగ నున్నది. ఇంగ్లీషులో Gum Tragacanth అందురు.



☞ కన్యకోమలి :—దీనికి సంస్కృతమున పేరెచ్చటను గాన్పింపదు. ఇది ఆంధ్రదేశీయపదం అయిఉండనోపు. దీనిని వైద్యులు తరుచు వాడుచుందురు. ఇది మొక్కజాతిలోనిది. ఒక మూరఎత్తువరకు బెరుగును. దీనికి మూడుదళములుగల ఆకులుండును. గరపనేలలో నిది ప్రాయకముగా కాన్పించుచున్నది. రామచంద్రపురం తాలూకా పులుగుర్త మాచవరంవద్ద ఈ మూలిక విస్తారం లభించుచున్నది. దీనికి దుంపయే ప్రధానం. కొందరు తీగజాతి కలదని చెప్పెదరు. దుంప చేదు, వగరు రుచులుకలిగి యుండును. కాకచేయును. విపాకమున కారపురుచిగ మారును. స్నిగ్ధగుణము గలది. త్రిదోష శమనమైనది. తాపమును, దప్పిని హరించును. వీర్యనష్టం కట్టును. దుంపరసం మేకపాలతో గలిపి యేడురోజులు పుచ్చుకొన్న శుక్లనష్టం నివరించును. ఆకురసం కొబ్బరి నూనెలో కలిపి రాసిన కాలినపుండ్లు హరించును. ఆకుమెత్తగనూరి వ్రణముపై వేసిన వ్రణములు ఎదిగిపిగులును. ఇంగ్లీషున A medicinal Plant అందురు.

☞ కఫరి :—ఇది ఖనిజములలో నొకవిధమగు ఉపధాతు ద్రవ్యము. దీనినిగూర్చి రెండుమూడు మతములున్నట్లు తెలియుచున్నది. ఒకమతమున ఇది కారవేల్లక దర్దురమనియు, నింకొకమతమున కఫరి, గుడ కఫరి, పాషాణకఫరి అనియు చెప్పబడియున్నది. దీనిలో పొరలుగలది దర్దురమనియు. పొరలులేనిది కారవేల్లకమనియు, గ్రహించవలెను. పసుపుపచ్చ రంగుగలది మృత్తికా కఫరి అనియు, బెల్లమువలె నుండునది గుడకఫరి అనియు, రాయివలెనుండునది పాషాణ కఫరి అనియు తెలియవలెను. ఔషధములలో దర్దురమును, కారవేల్లకమును వాడుచుందురు. వాదవిద్యలో మృత్తికా కఫరి ఉపయోగమెక్కువ. కఫరిని ముక్కలుగా కొట్టినచో పొరలుగలిగి కాంతిగలిగి యుండును. మరియు

కొబ్బరిముక్కనుపోలి యుండును. ఈ లక్షణములుగల కఫరి శ్రేష్ఠమైనదిగ తెలియవలెను. దద్దురములో సత్వముగలదు. కారవెల్లకములో సత్వములేదు. కఫరి శ్లేష్మమును, పైత్యమును హరించును. మేహవ్యాధులను ఖండించును. నేత్రరోగములను, జీర్ణజ్వరమును, క్షయరోగమును నశింపజేయును. దీనిని భస్మవిధానమున పరిశుభ్రముగ భస్మం చేసి వాడినచో చాలరోగములు పోవుటకు సందేహములేదు. కాని శుద్ధులుసరిగ చేయకున్న ప్రాణాంతకము చేయును. అనగా చాలరోగములను వాంతి, భ్రాంతి, శోష మొదలగు రోగముల బుట్టించును. చేదు ఆనబఅకు రసంతో చురకాయిచ్చిన శుద్ధిఅగును. గోమూత్రములో ఏడురోజులు డోలాయంత్రమున వండిన శుద్ధిఅగును. లోహం మూకుడులో కఫరినుంచి మంటబెట్టుచు కొంచెం కొంచెం సైంధవ లవణం వేయుచు గరిటతో త్రిప్పుచున్న కఫరిభస్మమగును. ఈ భస్మం, కటికషాయరసము, క్షారగుణయుక్తము, తేలిక, శీతలము, ధీరకము, నేత్రహితకాం, వాంతికారి అయియున్నది. రక్తపిత్తం, విషరోగం, అశ్మరి, కుష్ఠము నశింపుచేయును. సున్నపునీళ్ళతోగూడ డోలాయంత్రమున వండిన శుద్ధిచెందును. ప్రయోగములు. కఫరిభస్మం 2 గులిగింజల యెత్తు, కాంతభస్మం 2 గింజలయెత్తు కలిపి త్రిఫలా కషాయముతో నిచ్చిన మేహములు హరించును. రక్తక్షీణం తగ్గును. శుద్ధిచేసిన కఫరి భాగము, మిరియాలు రెండుభాగములు వేపచెక్కరసంతో ఎనిమిది దినములు మర్దనచేసి గురుగింజలవలె మాత్రలుచేసి తగిన అనుపానముతో వాడిన ఆహికజ్వరములు, జీర్ణజ్వరములు కట్టును.

సంస్కృతమున కర్పర, రసక. ఇంగ్లీషున A sort of vitriol. హిందీన ఖపరియా. బెంగాలీన ఖాఫర్. మరాటీన కల్ ఖాపరి.

కప్ప :—దీనిమాంసమునుండి చమురుదీయుదురు. ఆ చమురునకే ఉపయోగమున్నది. కప్పలలో నొకజాతికప్ప మాత్రం శరీరమున



బసీన పొక్కను. దానిని "కప్పపొక్క" అందురు. ఇది శతధౌత ఘృతము రాసిన శమించును. దీనిమాంసం వెంటనే బలమిచ్చును. కఫకరం, కొంచెం పైత్యంచేయును. శ్రమ, తృష్ణ, దాహం, ప్రమేహం, క్షయ, కుష్టము, వమనము శాంతించును. కప్పచమురు అంగమునకు మర్దించిన అంగం బిగుసును. నరములకు బలం కలుగును.

సంస్కృతమున భేక. ఇంగ్లీషున Frag. హిందీన మేఢకీ. బెంగాలీన బేంగ్ అందురు.

కమలాఫలము :—ఇది నిమ్మజాతిని బోలియున్నది. సాలగ్రామ నిఘంటునందు కూడ నిమ్మజాతికి చేరినదని వ్రాసియుండెను. నారింజచెట్టునకును దీనికిని సమానపోలిక గలదు. పండుగూడ నారింజపండు పోలికనే గలిగియుండును. చక్కగపండినపండు తీపిగనుండును. చలవచేయును. గురుగుణంగలది. విపాకమున మధురరుచిగనే మారును. పైత్యం, తాపం, వాంతి, దప్పి, కట్టును. పచ్చికాయ పులుపురుచి శైత్యమును చేయును, కఫమును గలిగించును. ఇది మన్యప్రాంతములలో విస్తారంగా దొరకును. సంస్కృతమున కురుంబ, కులపాలిక. ఇంగ్లీషులో Sweet Ornge అందురు.

కమ్మరేగు :—ఇది చెట్టుజాతిలోనిది. ఆకు జువ్విఆకు పోలికగా నుండును. కాయలు పోకకాయలవలె నుండును. గింజ తెలుపు. పచ్చికాయ పులుపుగా నుండును. ఉష్ణవీర్యము. గురుగుణము. మలమును బంధించును. వాత పైత్య కఫముల మూటిని పెంచును. రక్తమును నుద్రిక్తపరచును. వీర్యమును జఠరాగ్నిని నశింపచేయును. కండ్లకు చెరుపు చేయును. పండ్లు మధురముగను. కొంచెం పుల్లగా నుండును. వాత పైత్య శమనము చేయును. కఫమును పెంచును. జఠరమును బాగుచేయును. వీర్యవృద్ధిని గలిగించును. మలబద్ధమును చేయును. సంస్కృతమున లకుచ-వికుచ, ఇంగ్లీషున Atio c rpus Lakoocha.

కమ్మిరాకు:—ఇది తమలపాకు జాతిలో నొకటి. దీనియాకు నల్లగ నుండును. దీనిని అరవములో "కలికివెత్తిని" అని అందురు. బంగాళా దేశములో దీని ప్రచారము విస్తారము గలదు. దీనియందు పెళుసు గుణము కలదు. మిక్కిలి వేడిచేయు స్వభావము. కారం రుచి. కటువిపాకి. నిత్యము అలవాటున్నవారికితప్ప ఇతరులువాడిన వికారం, వాంతిభ్రాంతి, పైత్యం మొదలగు దుర్గుణము లెన్నో పుట్టును. ఇది వాతకఫముల శమింపచేయును. ఆకలిని పెంచును. క్రిములను గొట్టును.

కరక్కాయ:—కరక వృక్షజాతిలోనిది. ఇది శంకరగిరి, భద్రాచలం, గొలుగొండ తాలూకా మొదలగు మన్యప్రాంతములలోను, మరియు కాబూలు, పంజాబు దేశములలోను విస్తారముగా లభించును. దీని కాయ, పువ్వు, పండు, పిందె చాలా ఉపయోగమైనది. కరక్కాయయందు ఉప్పుదనంతప్ప మిగిలిన అయిదు రుచులు గలవు. ఉష్ణవీర్యం. మధురవిపాకి. లఘుపాకి. తీక్ష్ణగుణం. అగ్నిదీపనము, విరేచనము చేయును. పుష్టికరమైనది. బుద్ధిని, ఆయువును బెంచును. నేత్రములకు హితవైనది. రసాయనము త్రిదోషముల శమించును. శ్వాస, కాస, శోథ, ఉదరరోగం, అర్శరోగం, క్రిమిరోగం, బద్ధకోష్టం, గుల్మం, ఆధ్మానం, అనాహం, ప్లీహ, యకృతు, హిక్కా, శూల, హృద్రోగ, గ్రహణి, వమన, విషమజ్వర, కామిల, పాండు, ప్రమేహ, అశ్మరి, మూత్రకృచ్ఛ, మూత్రాఘాత, అరుచి మొదలగు పెక్కురోగముల హరించును. కరక్కాయను నోటనుంచుకొని ద్రవం మ్రింగుచుండిన అగ్నిని వృద్ధిచేయును. చూర్ణంచేసి సేవించిన విరేచనము చేయును. నానబెట్టి లేక పక్వంచేసి సేవించిన త్రిదోషముల హరించును. ఆహారముతో భక్షించిన బలవృద్ధి. ఇంద్రియములకు వికాసం. త్రిదోష శమనం చేయును. విరేచనం చేయును. మూత్రమును విప్పును, ఆహారం తినిన తర్వాత సేవించిన వాతం. పిత్తం, కఫములను నశింపుచేసి



పులుపు సేవించిన బాధలను నశింపచేయును. ఉప్పుతో కరక్కాయ సేవించిన కఫం, పంచదారతో సేవించిన పిత్తం, నేతిలో సేవించిన వాతం, దానివికారములు. బెల్లంలో సేవించిన నానావిధములగు రోగములు హరించును. ఆకలిచేతను, రక్తమోక్షణచేతను గలిగిన నిస్సత్తువ క్షీణత. గమన ఆయాసమువలన గలిగిన గ్లాని హరించును. పిత్తశరీరులు గర్భిణీస్త్రీలు కరక్కాయ సేవించుట మంచిదికాదు. కరక్కాయయొక్క భేదములు ఆయుర్వేదమునందు యేడు విధములుగా చెప్పంబడినది. 1 విజయ, 2 రోహిణీ, 3 పూతను, 4 అమృతా, 5 అభయా, 6 జీవంతీ, 7 తేతకీ.

విజయ అను కరక్కాయ చర్మం ఆనబకాయవంటి గుండ్రదనం దళసరియగు చర్మం గలిగియుండును. రోహిణిగూడా గుండ్రంగానే యుండును. పూతన యనునది కాయ చిన్నది. గింజకూడా చిన్నదిగా నుండును. అమృత యనునది చర్మం దళసరి, గింజ చిన్నదిగా నుండును. అభయకు 5 రేఖలుండును. జీవంతి బంగారువర్ణం గలిగియుండును. చేతకీ కరక్కాయ మూడు రేఖలుండును. వీనిలో విజయ అను కరక్కాయ ప్రశస్తమైనది.

1 విజయ:—సర్వరోగములయందు ఉపయోగించును.

2 రోహిణి:—సర్వవ్రణములను శుభ్రపరచును. చీము నెత్తురు హరించుటకును, క్రిములను చంపుటకును, పుండ్లను మాన్పుటకును సమర్థమైనది.

3 పూతన:—పైపూతలకు, పట్లువేయుటకు ఉపయోగించును.

4 అమృత:—వ్రణముల శోధించుటలో కడుఉత్తమమైనది.

5 అభయ:—నేత్రరోగ శమనకారిగా నున్నది.

6 రోహిణీ:—సర్వరోగములయందు సామాన్యముగా వాడదగియున్నది.

7 చేతకీ :_ఇది రెండు విధములుగా నున్నది. ఇందులో తెలుపు కరక్కాయ ఆరు అంగుళముల పొడవుండును. నల్లకరక్కాయ ఒక అంగుళం మాత్రం పొడవుండును. చేతకి కరక్కాయ ముట్టుకొనినను, చూచినను, వాసనగొనినను విరేచనము చేయును. ఇట్టి ప్రభావము దీనికి మాత్రం కలదు. కరక చెట్టునీడను వసించినను, చేతితో ముట్టుకొనినను విరేచనము చేయును. విజయ కరక్కాయ సర్వరోగముల యందు, సర్వయోగములయందు ప్రయోగింప బడుచున్నది.

కరక్కాయకు యేడు విధములగు పేర్లు వచ్చుటకు కారణము-

శ్లో. జీవంతీ జీవనోద్యోగా త్పావనా త్పూతనా స్మృతా
సుధా పదమృతా జ్ఞేయా విజయా విజయప్రదా
నృణామ భయదా యస్మా దభయా తత్ప్రకీర్తితా
రోహిణీ తు గుణారోహా చ్చేతనా చ్చేతకీమతా.

కరక్కాయ మనుజులకు ఆయువు వృద్ధిచేయుటచేత జీవంతి అనియు, శరీరమును పరిశుద్ధ పరచుటవలన పూతనఅనియు అమృత ప్రాయముగ నుండుటవలన అమృతఅనియు, జయం నిచ్చుటవలన విజయఅనియు, భయమును పోగొట్టుటవలన అభయఅనియు, మంచి గుణం నిచ్చుటవలన రోహిణిఅనియు, జ్ఞానమును కలుగచేయుటవలన చేతకిఅనియు, నేడువిధములగు సవ్యర్ధనామములు పొందినది.

ఏడువిధములగు కరక్కాయలు పుట్టుచోట్లుఇవి :_ విజయకరక్కాయ వింధ్యదేశమందును, రోహిణి కన్యాకుబ్జమందును, పూతన సౌరాష్ట్రదేశమందును, అమృత గంగాతీరమందును, జీవంతి కాశ్మీరమునందును, చేతకి హిమవత్పర్వతమునందును, అభయ వింధ్యపర్వతమునందును, జన్మించినవి.



శ్రేష్టమైన కరక్కాయ లక్షణము :—శ్రేష్టమైన కరక్కాయ పుప్పిలేనట్టిదియు, అంచి చర్మం గలదియు, బరువు గలదియు, నీటిలో వైచిన మునుగునదియు నైయున్నది.

కరక్కాయ, తాడికాయ, ఉసిరికకాయల మూడింటి పేరుమికి త్రిఫలములనిపేరు. వీని కషాయం మాత్రమును జారీచేయును. శూలలను పోగొట్టును. విరేచనముచేయును. కరక్కాయ తేనెతో అరగదీసి నాకించిన శ్లేష్మం హరించును. త్రేనుపువచ్చినప్పుడు కక్కుకొనుట కట్టును. దగ్గుహరించును. కంఠస్వరమును బాగుపరచును. కరక్కాయ అన్నంతో ఉడికించితీసి కడిగి, నూరి, మాత్రచేసి సేవించిన గర్భిణీస్త్రీల చీము జిగట విరేచనములు కట్టును. కొంచెం నల్లమందుకూడ యుక్తిని బట్టి చేర్చవలెను. కరక్కాయతో వ్రాసుకొను సిరా తయారుచేయుదురు. కరక్కాయను గురించి ఈ శ్లోకం ప్రసిద్ధిచెందినది.

శ్లో. దశవైద్య సమోవహ్నిః దశవహ్ని సమోరవిః
దశరవి సమోమాతా దశమాతా హారీతకి.

రెండు కరక్కాయల చూర్ణము సోలెడు ఆవు పంచితములో వైచి త్రాగిన అసాధ్యములగు ఉబ్బులు, గుల్మములు నెమ్మదించును.

ఇందుకు పథ్యము :—గోంగూర మంగలమున మాడ్చి ఉప్పు కాల్చిన మిరపకాయ వెల్లుల్లిచేర్చి చేసిన పచ్చడి, పాలు, తెలకపిండికూర. మరియు బోదకాలురోగంకూడా హరించును. కరక్కాయ నేతితో వేయించి దీనిని భుజించి ఆ నేతిని త్రాగిన మంచిబలం కలుగునని వాగ్భటమున గలదు.

కరకపిందెలు :___వీనికి జంగిసీహరడాలనిపేరు. వీనికి సూది గ్రుచ్చి ఆముదమురాసి ఆముదపు దీపముపై పొంగించిన లవంగమొగ్గల వలె పొంగును. మాడినమసి తుడిచి నోటనుంచుకొని ఆ రసం మ్రింగుచున్న శ్వాసకాసలు హరించును. జఠరదీప్తి నిచ్చును. విరేచనము చేయును.

కరకపువ్వు :—గోధుమరంగు గలిగి మోదుగమాడలవలె దళసరిగా నుండును. ఇది వగరు రుచి కలది. గ్రహణి, అతిసారం కట్టును. కోరింత దగ్గులకు నిది అమోఘమైన మందు. పువ్వుభాగం, వేచ్చజేసిన పిప్పళ్లు అరభాగం, ఉసిరిపండ్లు ఎండించి చూర్ణించినది పాతికభాగము మెత్తగా చూర్ణించి తేనెతో నాకించిన కోరింతదగ్గు శమించును. రెండు గంటల కొకసారి యివ్వవచ్చును. కేవలం కరకపువ్వు చూర్ణము ఇచ్చినను సరే.

సంస్కృతమున అభయా, హారీతకీ, వయస్థా, పథ్యా, అమృతా, కాయస్థా, హేమవతీ, శివా. జీవంతీ, హిందీలో హడ్, హర్రె, బంగాలీలో హారీతకీ, మరాటీలో హిరడా, కర్నాటమున అణిలే, ఉత్కలలో హాలిడా. దక్షిణ ప్రాంతమందు కలరా, తమిళంలో కడకే. ఇంగ్లీషున Chebulic myrobulam.

కజ్జికాయలు :—ఇది భక్ష్యవిశేషము. నువ్వులపప్పు చిమ్మిలితో గాని, కొబ్బరి లసకోరాతోగాని గోధుమపిండి డొప్పలలోబెట్టి మూతులు అతికి నేతిలోగాని, నూనెలోగాని వేయించుదురు. తినుటకు చాలా హితవుగా నుండును. తియ్యగా నుండును. బలము చేయును. గురుత్వంగలది. మలమును బంధించును. శుక్రమును వృద్ధిచేయును. ఆమమును పెంచును. అజీర్ణం చేయును. శ్లేష్మమును చేయును.

కరిధూపము :—అగార ధూపం. ఇది వంటచేయు స్థలములలో ఇంటివాసములకు, కప్పునకు పట్టును. నల్లగా నుండును. పొయ్యిలో మంటబెట్టు కట్టెల సారం గలిగి యుండును. ఇది తీసి పాదరసములో వైచి మర్దన గావించిన రసం శుద్ధిని పొందును. మరియు స్త్రీల ఋతువు సరిగా కాకున్న నువ్వులు, కరిధూపం కషాయం పెట్టియిచ్చిన స్త్రీల ఋతుబద్ధమును పోగొట్టి సకాలమందు ఋతుమతులను జేయును.



కరివేపచెట్టు :—ఇది మధ్యరకం చెట్టుజాతిలోనిది. ఇది భూసారమును బట్టి పెద్దచెట్టుగా పెరుగును. అడవులలోనుండును. సాధారణంగా ప్రతి ఇంటిదొడ్లలోను దీని యుపయోగ మెక్కువగుటచే పెంచుదురు. దీనిఆకు మంచి సువాసగ గలిగియుండును. వేపఆకుకంటె కొంచెం చిన్నది. ఆకుచుట్టు కంగోరాలేవు. పండ్లు నల్లగ గుండ్రముగ నుండును. చెట్టుబెరడు నల్లగనుండును. లోన తెల్లగనుండును. ఇది కారం, వగరు చేదు కలిసిన రుచిగలిగి యున్నది. లఘుగుణ విశిష్టం, శీతవీర్యం విపాకమున కారపురుచిగ మారును. ఇది తాపం అడంచును. దురదల హరించును. ఉబ్బులు, విషములు, క్రిములు, శూలలు పోవును. మూలవ్యాధులు పోవును, గ్రహబాధలకు పనికివచ్చును, కరివేపాకు మెత్తగ దంచి శిరస్సుపై కట్టిన తల తిరుగుట ఒకకట్టునకే గుణమిచ్చును. కరివేపాకు. మిర్చి, జీలకర్ర, ధనియాలు దోరగవేయించి కొంచెండుప్పు చింతపండు చేర్చి పొడిగొట్టినది భోజనములో మొట్టమొదట వాడిన నీటిపల్లడి హరించును. పథ్యకరమైనది. కరివేపచిగుళ్ళు, పొట్టుతీసిన మిరియములు. ఉప్పు సమభాగములు మెత్తగనూరి యిండుపగింజలవలె మాత్రలుచేసి సేవించిన అజీర్ణవిరేచనములు కట్టును. క్రిములు, శూలలు హరించును. కరివేపాకు 4 భాగములు తుంగముస్తలు, మిరియాలు, హారతికర్పూరం. వేచినయుప్పు, ఒక్కొంటికి ఒక్కొక్కభాగం ఇవి అన్నియు మెత్తగనూరి మాత్రలుకట్టి గంటకొక మాత్రచొప్పున వాడిన. కలరావిరేచనములు వాంతులు కట్టును. మ్రానుయొక్కగాని వేరుయొక్కగాని గంధంతీసి రాసిన పొక్కులు, చిడుము, దురద, కట్టును. వేరుకొంచెం విరేచనం చేయును. ఆకుకషాయం వమనములు తగ్గించును. విరేచనములుకూడా కట్టును. ఆకు సువాసన గలదగుటచే ప్రతి పచ్చడులలోను, కూరలలోను, ఉప్మా మొదలగు ఫలహారపు సరుకులలోను, పులిహోరలోను విరివిగావాడుదురు. విషం, దోషం

హరించును. జీర్ణశక్తినిచ్చును కరివేపపండ్లు తియ్యగనుండును దాహమును కట్టును. దీనిఆకు, చెక్క, వేరు బలంకలిగించుటకు సాధనములై యున్నవి.

శ్లో॥ కైడర్యపత్రం కఫవాతహారి. పదంపాతం దీపనముష్ణవీర్యం
రుచ్యంకషాయం కటికంస తిక్తం మనోజ్ఞగంధం గ్రహణీవినాశం॥

సంస్కృతమున కైడర్య, మహానింబ, సురభినింబ, కృష్ణనింబ. అరవమున కరివేప్పుయ్. ఇంగ్లీషున Curry Leaf Tree.

☞ కర్బూజాపండు :—ఇది పుచ్చజాతిలో నొకటి. తీగగప్రాకును. కాయలు కొబ్బరిబొండములవలెను అంతకన్న ఉరవుగనుండును. గుండ్రదనము, కోలదనముగలిగి పండ్లుండును. పైన నల్లగ కసటివర్ణముగ నుండినను లోన నెఱ్ఱగనుండును. సువాసనగలిగి యుండును. గింజలు నల్లగనుండును. కర్బూజ మూత్రమును వృద్ధిచేయును. బలమునిచ్చును. కోష్టమును శుద్ధిచేయును. గురుత్వంచేయును. జిగటగ నుండును. రుచి నిచ్చును. శీతలముగ నుండును. శుక్రమును వృద్ధిచేయును. పిత్తమును వాతమునుహరించును. ఇందులో పులుపుగతీపిగ ఉప్పగనుండుపండు రక్తపిత్తమును మూత్రకృచ్ఛ్రమును బుట్టించును. ఇది తీపిరుచిగలది. మిక్కిలి చలువచేయును. విపాకమున తీపిరుచియే కలిగియుండును. దీనిని భోజనమైనతర్వాత వాడవలెను. గింజలనువేయించి చూర్ణంచేసిన కాఫీవలె వాడవచ్చును. బలప్రదం, వీర్యవృద్ధి, మేహశాంతి చేయును. గింజల కషాయం పురాణ జ్వరముల తగ్గించును. అంతర్గత వ్రణముల మాన్పు గుణం గింజల కషాయమునకు గలదు. గింజలు మెత్తగానూరి పిల్లల కడుపునకు పట్టువేసిన కడుపుబ్బరం తగ్గును. ఇది ఫలసారమైనది.

సంస్కృతములో పద్బుజా. ఇంగ్లీషులో Musk or Sweet Melon అందురు.



☞ కర్కాటకశృంగి :—ఇది చిన్నచెట్టు. ఆకులు ఊడుగ ఆకులవలె నుండును. రెమ్మరెమ్మకు ఆకులు యీవలావల వ్రేలాడుచుండును. సంధిభాగములో పువ్వులు పూయును. ఈ పువ్వులు బాగుగా ముదిరిన పీతడెక్కలు ఆకృతిని బోలియుండును. అందువలననే దీనిని కర్కాటకశృంగి అని చెప్పుదురు. కర్కాటకశృంగి వగరు, చేదుగనుండును. వేడిచేయును. శుక్రవృద్ధిని చేయును. ఎక్కిళ్లు, వాంతి, జ్వరం, శ్లేష్మం, శ్వాస, క్షయ, కాస ఊర్ధ్వవాతము అనువానినిహరించును. అతిసారమును హరించును. రక్తమువలన గల్గుదోషములు శమించును. ఇది విషహారం. అరుచిని పోగొట్టును దాహమును తగ్గించును. కర్కాటకశృంగి చూర్ణం తేనెతో కలిపి యిచ్చిన కఫదోషంవలనబుట్టిన వాంతులు హరించునని చరకమునగలదు. కర్కాటకశృంగి మెత్తగానూరి పాలలోగలిపి త్రాగి పంచదార, నెయ్యి, పాలు, విస్తారముగాగల భోజనంచేసిన మిక్కిలి వీర్యవృద్ధి గలుగును. సంభోగశక్తియు వృద్ధిగలుగునని వాగ్భటమునగలదు. కర్కాటకశృంగి చూర్ణం, ముల్లంగిపండ్ల చూర్ణం తేనెతో గలిపి యిచ్చిన చంటిబిడ్డల శ్వాసకాసలు తగ్గును. కొందరు దీనిని "కరకపువ్వు" అని వాడుచున్నారు.

సంస్కృతమున శృంగి, కర్కటశృంగి. ఇంగ్లీషున Galls. హిందీన కకడాశింగీ, కకరంసీ. బెంగాలీన కాంకడాశృంగీ. మరాటీన కాకడాసింగీ. కరాచీన కర్కటసింగీ.

☞ కర్పూరము :—కర్పూరం హారతికర్పూర మనియు పచ్చకర్పూరమనియు రెండువిధములు. పచ్చకర్పూరం అనుశీర్షికక్రింద పచ్చకర్పూరమును గురించి వ్రాయబడినది. ఇట హారతికర్పూరమును గూర్చియే వ్రాయబడుచున్నది. హారతికర్పూరం రెండువిధములు. అపక్వ కర్పూరము, పక్వకర్పూరం. అపక్వకర్పూరం ఒకచెట్టు పాలనుండి కలుగుచున్నది. చీనా, జపాను, ఫార్మోజా, బోర్నియో దీవులలో నీ చెట్లు

విస్తారంగా పైరుచేయుదురు. అక్కడ గొప్పగొప్ప తోటలుకలవు. ఇది దాల్చినచెట్టునుచేరి, ఇంగువచెట్టును బోలియుండును. ఈ చెట్టు శాఖల పైనుండు పట్ట దళసరిగనుండును. పైన గంటుబెట్టినచో చిక్కనిరసం వచ్చును. చెక్కనుండియు రసం వచ్చును. చెట్టునకు పైన మొవ్వుండును. దీనికాయలు శెనగకాయలవలె నుండును. పండ్లలోనుండు గింజలకుగూడ కర్పూరం వాసనగలిగి యుండును. చెట్టునకు గంటువెట్టి కారినపాల నుండియే కర్పూరం తయారగును. చీనాదేశంనుండియు, జపాను నుండియు విశేషంగా మనకు లభ్యమగుచున్నది. కర్పూరం చేదురుచి గలిగియుండును. కొన్నినిఘంటువులలో మధురరుచి గలదనికూడ వ్రాయబడియున్నది. శీతవీర్యమైనది. వీర్యవృద్ధిని కలిగించును. కన్నులకు పెట్టుకొను కాటుకలలో కర్పూరంచేరును. కన్నులకు హితమైనది. దుర్మాంసమును కోయుశక్తికలదు. శేలికగుణం. మంచిసువాసన గలదు. కఫపైత్యములను విషము, తాపము, దాహము, నోటిఅరుచిని, మేదోరోగమును, దుర్వాసనను హరించును. ఎక్కువతాపమును హరించును. నిద్రను కలిగించును. చెమటను బుట్టించును. ఆవేదనను తగ్గించును. కామశాంతిని కలిగించును. శుక్రమేహమును బుట్టించును. రాజనిఘంటువునందు "శిరోమధ్యం తలశ్చేపి కర్పూరస్త్రి విధస్స్మృతః" అని వ్రాయబడియున్నది.

అపక్వ కర్పూరలక్షణము :— కర్పూరము మూడురకములు. తలము, మధ్యము, శిరము. కొందరిమతమున శిరము ఉత్తమము. మధ్యము మధ్యమము, తలము అధమము. అరిగలను ఆకులనుండి తీయు కర్పూరము తలమనియు, చెట్టుమధ్యనుండి తీయునది మధ్యమనియు, కొమ్మలచిగురునుండి తీయునది శిరమనియు చెప్పబడును. ఇందులో మధ్యమను కర్పూరము శ్రేష్టమైనది. స్వచ్ఛమై కొంచెం పసుపుపచ్చ రంగుకలిగి యుండును.



కర్పూర ప్రయోగములు :—కత్తి నరుకులకు గాయములో మెత్తగనూరిన కర్పూర చూర్ణము కూరి నేతిలో కర్పూరముకలిపి పైనరాసిన గాయములు త్వరలో మానును. గాయం కుళ్ళుట రసి కారుట మొదలగు దుర్గుణములు హరించునని చక్రదత్తమునకలదు. కర్ణపాలి అను రోగమునకు కర్ణపాలిఅనగా చెవుల వెనుకభాగమందు చర్మంపుండయి చెవిసంతను ఆక్రమించుటగాని, తమ్మెలువద్ద బయలుదేరి ఆక్రమించు పుండుగాని, కర్ణపాలి అని చెప్పుదురు. దీనికి కర్పూరం మేక పంచితములోకలిపి రాసిన కర్ణపాలి నివర్తించును. పంచితం ఆడమేక పంచితం ఉపయోగించవలెను. లేదా ఆవుపేడ రసంలో కర్పూరంకలిపి రాసినను హరించును. ముద్దహారతి కర్పూరం మంచిగంధంలో కలిపి దేహమునకు బూసికొనిన దేహవాతము చల్లారుటయేకాక ఎండతీక్ష్ణము చేతగలిగిన శరీరంపేలుటసహా నివర్తించును. దేహమందలి దుష్టవేడిమిని తగ్గించును. తినినఅన్నం త్వరగ జీర్ణమగును. హారతికర్పూరం రెండు భాగములు, అక్కలకఱ్ఱ లవంగములు ఒక్కొక్క భాగం, మెత్తగనూరి మాత్రలుచేసి చన్నీళ్ళతో సేవించిన దాహముకట్టును. కర్పూరం, జాజికాయ, కొడిశపాలగింజలు, పిప్పళ్ళు, ఇంగిలీకం, నల్లమందు సమభాగములు నీళ్ళతో బాగుగమర్ధించి, చిరికందులవలె మాత్రలుచేసి అనుపాన విశేషమున వాడిన కలరాకట్టును. అజీర్ణవిరేచనములు, అతిసారములు, కట్టును. గ్రహణులు, రక్తగ్రహణులు కట్టునని భైషజ్యరత్నావళిలో కలదు. హారతికర్పూరం, రసకర్పూరం, నల్లమందు సమభాగములు కుమ్ములో ఉడికించిన వెల్లుల్లిరేకలు ముప్పాతికభాగము, మెత్తగ చూర్ణించి శనగలవలె మాత్రలుచేసి వాముమాడ్చి తయారుచేసిన నీళ్ళతో అనగా వాముఘాటుతోగాని, వాము వాటరుతోగాని, వాము వాటరు రెండుఔన్సులు, బ్రాందీ రెండుఔన్సులు చేర్చిగాని, ఈ అనుపానములతో నిచ్చిన కలరా విరేచనములు తప్పకకట్టును. ఇది అనుభవ యోగము. కర్పూరం, గవ్వపలుకు, సాంబ్రాణి రెండు సమభాగములు

కల్వమున మెత్తగనూరి పాలాస్త్రీవలె మెత్తగ ముద్దయగును. అది గుడ్డకురాసి అడ్డగట్టులపైనగాని, బిళ్ళలపైనగాని, దుష్టవ్రణములు, మేహవ్రణములపైనగాని పట్టువేసిన సలుపు, పోటు, మంట మొదలగు బాధలు శమించి కరుగచేయును. లేదా పిగులజేయును. ఇది అనుభవ యోగము. ఇందులో అరభాగం కవిరికలిపిన పిగిలినపుండ్లు, సవాయి పుండ్లు వెంటనే మానిపోవును. పైప్రకారమే ఉపయోగించవలెను. మరియు ఇంగిలీకం, హారతికర్పూరం, గవ్వసాంబ్రాణి సమభాగములు కల్వమున మెత్తగనూరి పాకంవచ్చిన పిదప కరాటమునవుంచి పుండ్లకు పట్టీవేసిన దుష్టవ్రణములు మానిపోవును. పలువిధములగు పలాస్త్రి పట్టీలలో హారతికర్పూరం చేయుచున్నది. ఇది వ్రణములలోని కుళ్ళును వెడలించి పుండుమానుటకు సహాయంచేయును. ప్రశస్తివహించిన కర్పూరాద్యరిష్టయోగం చిగురుసారాయి 400 తులములు, హారతి కర్పూరం 32 తులములు, ఏలకులు, శొంఠి, తుంగముస్తలు, వాయు విళంగములు, వాము ఇవి దినుసుఒక్కంటికి 4 తులములు చొప్పున ఇవన్నియు పింగాణీజాడీలో ఒకటిగాచేర్చి మూతబిగించి గాలివోరకుండ శీలుచేసి నెలరోజులు పోయినతర్వాత శీలువిప్పి బాగుగ వడియగట్టి సీసాలోచేర్చి జాగ్రత్తపరచునది. ఇది కర్పూరారిష్టమని పేరుచెందినది. దీనిని వాడిన కలరాతగ్గుటయేగాక సమస్తవిరేచనములు అమోఘముగా కట్టును. అభ్రకభస్మము అనగా కృష్ణాభ్రక సింధూరం, శతపుట కర్పూరం సమభాగములుకలిపి చలవమిరియములు అనుపానముతో నిచ్చిన సెగరోగములు తప్పక తగ్గును.

కర్పూరతైలము :—ఇది కర్పూరమునుండియు, చెట్టునుండియు తయారుచేయుదురు. కర్పూరతైలం వాతనొప్పులను హరించుటలో చాలమంచిది. మరియు వాతశ్లేష్మములను, వ్రణములను, క్రిములను, కుష్ఠువు, విషం వీనినిపోజేయును. హృదయమునకు మేలుజేయును.



కాంతి, రుచి వీనిని కలుగజేయును. లఘువుగ నుండును. శ్లేష్మపు పట్లను కరిగించును. గుండెలపైన కర్పూరతైలం మర్ధనచేసి ఆవిరి కాపడంపెట్టిన గుండెపట్లువిడి సుఖంకలుగచేయును. ఆయాసం, ఒగర్పులకుకూడా మర్ధన చాలయుపయోగం. నవీన వైద్యమతం. నరముల బలహీనత తగ్గించును. క్రిములను హరించును. సాంక్రామికరోగములు రాకుండా కాపాడును. విరేచనములకట్టును. వ్రణహారం—వ్రణరోపణమనినటకర్ణిలో కలదు. హారతికర్పూరం, మిరియపుపొడి, గుడ్డను మూటకట్టి, నస్యంచేసిన పడ్లసలుపు, తీనసపోవును. మరియు చందనాదితైలం, భృంగామలకతైలం మొదలగు కొన్ని తైలములలో హారతికర్పూర ముపయోగింప బడుచున్నది. సంస్కృతమున కర్పూరః, హిందీలో మాంసు, ఘనసార.

కర్పూరశిలాజిత్తు :—కర్పూరశిలాజిత్తు పటికముక్కవలె తెల్లగ నుండును. దీనిలో కొంచెం పసుపువర్ణంగలదికూడా నుండును. ఇది ఖనిజద్రవ్యము. కర్పూరంయొక్క రంగు గలిగియుండుటచే దీనిని కర్పూరశిలాజిత్తు అని చెప్పుదురు. దీనియందు సత్వములేదుగాన దీనిని భస్మం చేయనవసరంలేదు. శుద్ధులు, భావనలుచేసిన చాలును. గాని కొందరు పుటములుకూడా వేయుచున్నారు. శిలాజిత్తు కడుగుతోడను, కలబందరసంతోడను, ఎఱ్ఱకలువదుంప రసంతోడను, అరటిదుంప రసం తోడను భావనలుచేసిన అనగా నూరి ఎండలోబెట్టిన సరిపోవును. కొందరు సున్నపునీటిలో శిలాజిత్తును ముంచి మూకుళ్ళలోనుంచి శీలు చేసి పుటంవైతురు. కొందరు విడిముక్క ఒక్కదానినే పుటమువైతురు. ఏది ఎట్లున్నను గుణము మాత్రము ఒక్కటే. భస్మము తెల్లగ మృదువుగా నుండును. భస్మప్రక్రియ లనేకములు కలవు. ఇది చలువ చేయును. తీపి వగరు గలసిన రుచి గలది. గురుగుణము. మూత్రకృచ్ఛములు, మూత్రాఘాతములు, అశ్మరీరోగములు హరించును. మేహములు శమించును. కామల, పాండువు, నేత్రరోగములు హరించును.

దేహమునకు పుష్టి తుష్టి నొసంగును. వీర్యవృద్ధి జేయును. వంగభస్మం. శిలాజితు, ద్రాక్ష, రససింధూరము సమభాగములు తేనెతో మర్ధించి కంకుడుగింజలవలె మాత్రలుచేసి యిచ్చిన సెగరోగములు హరించును. ఇది అనుభవము. శిలాజితు బజారులో దొరకునది కృత్రిమమైనది. సరియైన శిలాజితు లభ్యమగుటలేదు. గుణములో సమానముగా నుండుటచే ఏదివాడినను లోటులేదు. సంస్కృతమున శైలజ అందురు.

కణ్జునూనె :—దీని పేరువలననే దారుసంభవమని తెలియును. నీటికంటె పలచగా నుండును. గోధుమరంగు గలిగియుండును. ఇది సమస్త చర్మవ్యాధులకును వాడనగును. కుసుమలు, సెగరోగముల యందు సున్నపుతేట నీటితో సేవించవలెను. పెద్దపులి వేషములు వేయునప్పుడు కణ్జునూనె కలిపి శరీరమునకు రంగులు వేయుదురు. ఈ రంగు వేసినప్పుడు శరీరం బిగబట్టుట సంభవించుటచే ప్రతినిముషమునకును చన్నీళ్ళ స్నానంచేయవలసి యుండును. సంస్కృతమున ఇంధనతైల. ఇంగ్లీషున Wood Oil అందురు.

కలబంద :—కలబందలో రెండుజాతులుకలవు. 1 పచ్చకలబంద, 2 ఎఱ్ఱకలబంద. రూపంలో భేదమేమియులేదు. కలబంద రెండుమూడు అంగుళముల వెడల్పు, అడుగు అంతకుపైగా పొడవు, అరంగుళము దళంగల మట్టలుతో గుజ్జుగా మనోహరంగా నుండును. దీనికి పువ్వులు, కాయలులేవు. మట్టలలో తెల్లని గుజ్జుండును. గుజ్జు జిగురుగ నుండును. మట్టఅంచున మందములగు ముండ్లుండును. గుజ్జునకొక విధమైన మదపు వాసన గలిగియుండును. ఈ మూలిక అంతయు సారవంతమైనదే. దీని రుచి చేదుగనుండును. చలువచేయును. విపాకమున కారపురుచిగ మారును. గురుగుణముగలది వీర్యవృద్ధిచేసి బలంకలిగించును. మూత్రకృచ్ఛ్రములు పోవును. మేహశాంతి చేయును. విషమును హరించును. వాతమును పోగొట్టును. జ్వరములను హరించును. కాస, శ్వాసల



నడంచును. శ్లేష్మ, పైత్యముల శమింపచేయును. రసాయనద్రవ్యము. విరేచనము చేయును. వ్రణముల నార్చును. గుల్మములను, యకృతు ప్లీహాల నడంచును. కాలిన పుండ్లు మాన్పును. చర్మరోగములను బోగొట్టును. కామల హరించును. కలబంద రసం అయిదారుచుక్కలు నస్యము చేయించిన కామల రోగం హరించునని భావప్రకాశికలో గలదు. కలబందరసములో పసుపు చూర్ణం కలిపి లోనికిచ్చిన ప్లీహరోగం శమించునని నవీన వైద్యకమతమున గలదు. ఇది బలము నిచ్చును. మృదువిరేచనం చేయును. ఋతురక్తం జారీచేయును. క్రిములను వెడలించును. పాలతో గలిపి సేవించిన అంగము వెంబడి స్రవించు రక్తం కట్టును. దీనిని ఎక్కువ మోతాదులు యిచ్చిన ఋతురక్తం జారీచేయును. విరేచనముచేయును. కలబంద మట్టలలోని గుజ్జు నీళ్ళలో వేసి కడిగి పటికచూర్ణం కొంచెం నల్లమందుచేర్చి గుడ్డను మూటకట్టి ఆ పొట్లం కళ్ళకు అద్దుచుండిన కండ్లకలక, ఎరుపు, దురద, మంట, సలుపు, పోటు నయమగును. కండ్ల ఎరుపు రెండు మూడు పొట్లములు అద్దిన పూర్తిగా శమించును. ఇది అనుభవము. కలబంద మట్టలు కుమ్ములో ఉడికించితీసి ఆ గుంజులో పంచదార కలుపుకొని భక్షించిన సెగరోగములు శమించును. నీటిచురుకు హరించును. ఉడికించిన కలబంద మట్టలను మధ్యకుచీరి దెబ్బలపై వేసికట్టిన నయమగును. కలబంద రసముతో సీసం భస్మమగును. వేరు, రాతిసున్నపు పచ్చిరాళ్లు సమభాగములుగా మెత్తగానూరి వెలగకాయలవలె ముద్దలుచేసి శుద్ధిచేసిన తగరము బలపమువలె సాగించి చిన్నముక్కలుచేసి ఒక్కొక్క ముక్క ఒక్కొక్క జాడీలోబెట్టి శీలుచేసి ఆరించి పుటముబెట్టిన వంగం వీర్యవంతముగా భస్మమగును. కలబంద రసం పాదరసమందలి దోషమును హరించును. కలబంద మిత్రపంచకములో నొకటి.

సంస్కృతమున కన్యాకుమారి, హిందీలో ఘికుబార్, అరవంలో కోత్తుక్కత్తురై, ఇంగ్లీషున Aloes Indica A. Vera.

☞ కలువ :—కలువ మూడుజాతులుగలవు. తెలుపు, ఎరుపు, నలుపు. పువ్వులరంగునుబట్టి జాతిని తెలియనగును. కలువయాకులు గుండ్రముగ నుండును. ఇది దుంపనుండి పుట్టుచున్నది. నీటికొలది తామరఅనుట సత్యము. పువ్వులు, ఆకులు, నీళ్ళపైననే గన్పించును. తెల్లకలువ శ్వేతోత్పలమనియు, ఎఱ్ఱకలువ రక్తోత్పలమనియు, నల్లకలువ నీలోత్పలమనియు వ్యవహరింపబడును. పువ్వునకు అయిదారు రేకులుండును. పుష్పాడికూడ కొంచెముండును. కాయలలో చిన్న ఆవాలవలె గింజలుండును. నల్లకలువ తీపిరుచిగలది. మిక్కిలి మేహశాంతి చేయును. కలువలన్నిటిలో నిది శ్రేష్ఠమైనది. మంచి సువాసన గలిగియుండును. విపాకమున పిత్తరుచిగనే మారును దీనికి మాత్రమే ఈ పిత్తగుణము కలదు. తక్కినవానికి పిత్తగుణములేదు. ఇది రక్తపైత్య వ్యాధిని శమించును. తెల్లకలువ శీతవీర్యము, చలువ చేయును. వీర్యనష్టమును కట్టును. ప్రదరరోగముల నన్నిటిని కట్టును. తీపియును కొంచెము వగరును కలిసిన రుచిగలిగి యుండును. తీయలను హరించును. కన్నులకు చాలహితవు కూర్చును. శ్లేష్మమును శమింపచేయును. దప్పి, తాపము హరించును. దీనిపువ్వులు తాపజ్వరములో శిరస్సునకు గట్టిన వెనువలె తాపము శమించును. పూవులరసము నస్యము చేయించిన ముక్కువెంబడినికారు రక్తము కట్టును. దీనిరసములో తేనె కలుపుకొని త్రాగిన గొంతుకలోని తాపము, కఫము ఉండవలె నుండుట, రక్తముపడుట మొదలగు రోగములు కట్టును. మూడువిధములగు కలువలకు నీ గుణములు కలవు. కలువలకు సంబంధించిన రంగులనుబట్టి ఆ యా రోగములపైన వాడనగును. అనగా తెల్లకలువ బొల్లి, శుక్లనష్టము, తెల్లకుసుమలకును, ఎఱ్ఱకలువ, ఎఱ్ఱకుసుమ, రక్తపైత్యము,



ఎఱ్ఱసెగ మొదలగువ్యాధులకును, నల్లకలువ అన్నివిధములగు వ్యాధులకును, వాడవచ్చును. మూడుజాతుల కలువ దుంపలు సమానగుణములనే కలిగియున్నవి. శీతవీర్యము, తీపిరుచి, కొంచెంవగరు. దుంపలు పువ్వురంగు ననుసరించియే యుండును. ఇది వేడిమిని తగ్గించుటలో ముఖ్యమైనది. మూడు నాలుగుమాసములలో గలుగు గర్భస్రావమును కట్టును. శిరోరోగముల నన్నిటిని కట్టును. కలువ సామాన్యగుణములన్నియు దుంపలకు గలవు. దుంపలనుచూర్ణముగాను, రసముగాను ఉపయోగించుకొనవచ్చును.

నవీనవైద్యమతము :—దుంప, గేలిక్ ఆసిడ్డు, టానిక్ యాసిడ్డు, పిండిపదార్థము, జిగురుపదార్థములు దుంపలోగలవు. జీర్ణకారి. సమదోషత్వము గలదిగ నుండును. పువ్వుల నుత్పలమందురు. మొత్తపు లతకు ఉత్పలినీ అనిపేరు. ఇది సువాసన గలిగియుండును. దగ్గు, శరీరతాపము, పైత్యము, వాంతి, మందత్వము పోగొట్టును. అయిదుఔన్సుల కలువపువ్వులరసం, ఔన్సుపంచదార కలిపి పానకం తయారుచేసి లోనికిచ్చిన తీవ్రజ్వరములు, శిరోవాతములు తగ్గును. దీనిపువ్వు రసము దగ్గులను కట్టును. శరీరములో వేడిమి ఎక్కువగానున్నచో లోనికి దీని రసమిచ్చినను పైనపూసినను తగ్గును. తాపము శమించును. మూలశంఖలో రక్తముపడుట కట్టును. గింజలచూర్ణము, పెరుగు, తేనెకలిపి యివ్వవలెను. మధుమేహము కట్టును. పువ్వులకషాయము లోనికిచ్చిన గుండెదడకట్టునని నటకర్ణిలో కలదు. సంస్కృతమున ఉత్పలః. ఇంగ్లీషున Sweet Smelling Water Lily అందురు.

☞ కలిగొట్టుచెట్టు :—ఇది పెద్దవృక్షజాతిలోనిది. దీనికాయలు రేలకాయలనుబోలి వానికంటె పెద్దవిగనుండును. లావుగూడ నుండును. దీనిఆకులు మఱ్ఱిఆకులనుబోలి చిన్నవిగ నుండును. తొడిమ పొడవుగ నుండి కాయకాయును. ఇందు తెలుపు, ఎరుపు, అను రెండువిధములగు

చెట్లుకలవు. పూవులయొక్క రంగునుబట్టియే జాతిని గ్రహించవలెను. దీని అంగములలో వేరునకు మిక్కిలి ప్రాధాన్యముకలదు. గాన దీనిని మూలసారమని చెప్పవచ్చును. పూవులు, ఆకులుకూడా కొంత ఉపయోగకారులైయున్నవి. ఇది దశమూల మూలములలో నొకటి. దీనినే పాదిరిచెట్టని కూడా చెప్పుదురు. కలిగొట్టుయొక్క వేరు చేదురుచిగలది. కాకచేయు స్వభావము. కటివిపాకి. దోషత్రయమును హరించును. గురుగుణముగలది. శ్లేష్మ వాతముల రెంటిని హరించును. ఉబ్బులను కడుపు ఉబ్బరములను పోగొట్టును. వాంతులు, శ్వాస, సన్నిపాతం మొదలగు వ్యాధులు హరించుటలో సమర్థమైనది.

కలిగొట్టు పువ్వుల గుణము :—ఇది తీపిరుచి గలిగి యుండును, కొంచెం వగరురుచికూడా కలిగి యుండును. చలువ చేయును. గుండెకు మంచి మేలు చేకూర్చును. రక్తమండలి దోషముల హరించును. తాపం, శ్లేష్మం, పైత్యం, పైత్యాతిసారం మొదలగురోగంలుహరించును.

కలిగొట్టు పండ్లు గుణము : ఇవి చలువచేయును గురుత్వము చేయును. కొంచెం వగరు, చేదు రుచులు గలది. కొంచెం తీపిరుచికూడ కలిగియుండును. మొత్తమున మూడు రుచులు కలిగి యుండును. బలమును, వీర్యవృద్ధిని కలిగించును. రక్తదోషం, శ్లేష్మ పైత్యముల హరించును. రక్తపిత్తం, వాతం హరించునని యొక మతము ప్రదరములగూడ పోగొట్టునని కొందరి మునుల మతమై యున్నది.

తెల్లకలిగొట్టు :—ఇది చేదురుచి గలది. ఉష్ణవీర్యము, వేడి చేయును వాతం, శ్లేష్మముల హరించును. ఎక్కిళ్ళు, క్రమకోష మొదలగు వ్యాధులు హరించును. దీనియందు కొంచెం సువాసన గలదు. కలిగొట్టు విత్తనములలో తేగకలిగొట్టు అనునది యొకజాతి నేలను ప్రాకు తీగజాతి కలదు. దీనిని అడవి ఉలవ యందురు. అడవి ఉలవకంటె ఆకులు చిన్నవి. దీని గింజలను కలిగొట్టు గింజలనికూడా



అందురు. ఈ గింజలు నల్లగ నుండును. చేదు కారం కలిసిన రుచిగా నుండును. గుణగతులు అడవి ఉలవతో సమానములే. కారుకొల్లి అని కూడా పేరు గలదు. అరుచి, వాపు, మూలము, శ్వాస, దప్పి, వాంతి వీనిని బోగొట్టును.

సంస్కృతమున పాటలా, కాలవృంతా, అంబువాసినీ, హిందీన పాఢక్, బెంగాలీన కారుల్, మరాటీన కాడాల్. ఇంగ్లీషున Stereaspermum suavcolens Alarge high tree.

☞ కలి :—అనగా అన్నం వార్చిన గంజి. మంచినీళ్లు ఒక కుండలో బోసి అందు అటుకులుగాని, కందిపప్పుగాని గుడ్డను మూటకట్టి మూడు దినములుంచిన నది పులిసి కలి యగును. దీనినే "తరవాణి" అని అందురు. ఇది పులుపు రుచి. వేడిచేయును. ఇందు బి. విటమినులు గలవు. విరేచనము చేయును విపాకమున పులుపు రుచిగానే మారును. అరోచకమును బోగొట్టును. మత్తును కలుగచేయును. నిద్రను బాగుగా బట్టించును. దప్పిని నడంచును. సోలలు, అజీర్ణములు హరించును పార్శ్వశూలలు, క్రిములు పోగొట్టును. వడతాపం శమించును. అన్న హితవు కానివారికి అన్నహితవు గలుగజేయును. ఇది మామూలు చారునవలె కాచి పోపు పెట్టిన మిక్కిలి రుచికరంగా నుండును. దీనిని తరవాణి చారు అందురు. ఇది వేడిచేసి జఠరదీప్తి నిచ్చును. వీర్యమును స్తంభింపచేయును. ధాతూపధాతువుల శుద్ధిపరచును సంస్కృతమున కాంజిక, అరవమున కాళి, ఇంగ్లీషున Acid washings of rawriee

☞ కళింగరాష్ట్రము :—కళింగరాష్ట్రం దుంప ప్రధానముగాగల గుల్మజాతికి చెందినది. దుంప ప్రధానమగుటచే కందసారమని చెప్పవచ్చును. దుంప ఆకులుకూడా సువాసన గలిగియుండును. ఇది పసుపు మొక్కతో సర్వసమాన సామ్యము గలదిగానున్న తమలపాకు తీగను కొందరు కళింగరాష్ట్రమని చెప్పుదురు. ఇది సరికాదు. దీనినిగూర్చి

దేశ దేశములయందు అనేక విధములుగ వైద్యశేఖరుల మతమైవున్నది. వాని వివరణము ఇట అనవసరం. చెట్టు ముదిరిన తర్వాత చెట్టు మధ్యమునుండి యొక పూవుపూయును. ఈ పూవునుండి అనాసకాయను బోలిన కాయ కాయును. ఇది ఎరుపురంగు గలిగి గుండ్రంగా నుండును. వేరుకూడా ఎరుపు రంగుగనే వుండును. ఇది కారపురుచిగలది. కొంచెం చేదురుచికూడా కలిగి యుండును. మిక్కిలి వేడిచేయును. ఆకలిని బాగుగా గలిగించును. విరేచనము చేయును. విపాకమున కారపు రుచిగానే మారును. గురువిపాకి. ఆమదోషమును హరించును. రుచిని బుట్టించును. కంఠమందలి జీరను తగ్గించును. స్వరమును బాగుపరచును. గుండెలకు చాలామంచిది. ముఖమును. కంఠమునుగూడా శోధించును. కఫమును, ప్రబలమగు దగ్గును హరించును. వాతహరము. జ్వరం, కాస, శోథ. శ్వాస, శూల, ఉదరరోగం. రక్తవికారం, విషదోషం, వాతవ్యాధులను హరించును. దీని గంధ మరుగదీసి పైనపూసిన వేడిని గలిగించును. కాళ్లు చేతులు చల్లబడినప్పుడు కళింగరాస్నం, పసుపు మెత్తగానూరి శరీరమునకు లేపన మర్ధనములచేసిన దేహం వేడి యెక్కును. కళింగరాస్నము. శొంఠి. అక్కలకఱ్ఱ మూడు కలిపి రసం తీసి పొంగించి యిచ్చిన విషమ జ్వరములలో ధాతువ సమగతికి వచ్చును. కళింగరాస్నము, కరక్కాయ, పొంగించిన లవంగములు తమలపాకుల రసంతో నరుగదీసి కొంచెం తేనెకలిపి యిచ్చిన దగ్గులు, ఆయాసము తక్షణము హరించుటయేకాక శ్లేష్మమును నీటివలెచేసి కళ్లెను వెడలించును. కళింగరాస్నము పాలతోనూరి ముక్కులో మూడుచుక్కలు నస్యముచేసిన పార్శ్వశూలలు హరించును. కళింగ రాస్నము కషాయం అరఔన్సుయిచ్చిన శ్లేష్మహరము.

సంస్కృతమున కులంజ, గంధమూల, తీక్ష్ణమూల. ఇంగ్లీషున Greater Galangal అందురు.



కలిపెచెట్టు :—దీనిని కలిటిచెట్టు అందురు. ఓకచెట్టు చూడుము.

కలుగ్రానుగు :—దీని యాకులు ఎద్దునాలుకచెట్టు ఆకులవలె నుండును. ఇది భూమిమీద మొలచినవెంటనే ఒకకఱ్ఱవలె పైకిలేచి కొంత కాలమునకు రెండుశాఖలుగాచీలి పెరుగును. దీని విత్తనములకే త్రాయమాన అనిపేరు. ఇది లతయని కొందరు వ్రాసియున్నారు. ఆంధ్రనిఘంటుకారుడు పెద్దవృక్షమని వ్రాసియున్నాడు. కొన్నినిఘంటువులలో నిది లతయని వ్రాయబడియున్నది. ఇది అనిశ్చితమైనదిగాన నిది లతఅనియే నా అభిప్రాయము. ఇది తీపి, చేదు, వగరు రుచులుగలిగియున్నది. దీని సర్వాంగములుకూడా నివియే రుచులుగలిగి యుండును. కలుగ్రానుగ వేగముకలది. పిత్తజ్వరము, శ్లేష్మము, రక్తదోషం, శూలగుల్మం, జ్వరం, వాంతి, క్షయ, బడలిక, దప్పి, విషరోగము, హృద్రోగం, రక్తపిత్తం, మూలశంఖ వీనిని హరించును. ఇది హిమవత్పర్వతమున దొరకు మూలిక. శీతవీర్యం. విపాకమున మధురరుచిగ మారును. ఇది పైత్యహారం, శ్లేష్మవాతహారం. విశేష పైత్యంవలన బుట్టిన వాంతులు, జ్వరం, శూలలు, భ్రమలు శమించును. గుండెరోగం, రక్తపైత్యం, మూలశంఖ హరించును. ఇది త్రిదోషహరం. క్షయనుపోగొట్టును. ఆయాసం, దప్పి యడంచునని నవీన వైద్యకమతమునగలదు. వేరు చేదు, బల్యము. కామలారోగమున కిదిపనిచేయును. కండ్లకలక రోగములో దీని కషాయము కన్నులు కడుగుట కుపయోగించును. మరియు పొలిజ్వరం హరించుటలో సమర్ధమైనది. మూత్రమును జారీచేయును. వేరు చూర్ణంగాని, కషాయంతో తయారుచేసిన తైలంగాని నస్యముచేసిన తలలోని వికారములన్నియు నశించును. బుద్ధిభ్రంశమును పోగొట్టును. దీని వేరు చూర్ణముతో పండ్లుతోమిన దంతవ్యాధులు హరించును.

సంస్కృతములో త్రాయమాన, సుభద్రాణీ. అరవముతో కొత్తుప్పుంగం.

కల్లు :— కల్లు అనునది తాటి, ఈత, కొబ్బరి, జీలుగు చెట్ల నుండి పుట్టుచున్నది. చెట్టుయొక్క లేతగెలనుండి కల్లు పుట్టుచున్నది. కత్తితో గోసి యొక కుండలోనికి గెలను జొనుపుదురు. గెలనుండి యూరు ద్రవము "కల్లు" అని చెప్పుదురు. ఈతచెట్టునకు గెలనుండి కల్లు గీయరు. చెట్టునుండియే కల్లు గీయుదురు. చెట్టుయొక్క గుణమును బట్టి కల్లు గుణముండును. సాధారణముగా ఆడచెట్టునుండి కల్లు గీయుదురు. ఒక్కొక్కప్పుడు పోతుచెట్ల గెలలనుండియు కల్లుగీయుట కలదు. కల్లు తీపిగను కొంచెం పులుపుగాను వుండును. చెట్టునుండి దింపిన కల్లు పులియక తీపిగా నుండును. ఇది చలువచేయును. నిలవయుండి పులిసిన కల్లు వేడిచేయును. గురుత్వం చేయును. విపాకమున పులుపు రుచిగా మారును. మేహశాంతి నిచ్చును. జఠరదీప్తి నిచ్చును. బలము, ఉత్సాహం కలిగించును. మలమూత్రముల జారీచేయును. శరీరమునకు కాంతినిచ్చును. మత్తును గలిగించును. ఈ గుణములన్నియు చెట్టునుండి దింపినవెంటనే పుచ్చుకొన్నపుడు కలిగెడుగుణములు. మితముగ సేవించునప్పుడు కలిగెడు గుణములు. మితముదప్పి త్రాగినను పులిసిపోయిన కల్లు ద్రాగినను సుగుణములకు బదులుగ దుర్గుణములుగ మారిపోయి అనేక వికారముల బుట్టించును. కల్లుద్రావుట సప్తవ్యసనములలో నొకటి. విషమునకుండెడు గుణములన్నియు మద్యమునకు గలవు. మితందప్పి కల్లుద్రాగినచో విషమువలె ప్రాణసంకటము కలుగజేయును. నిద్రలేనివారికిని, అతినిద్రకలవారలకును కల్లు హితకరమైనది. ఇది పైత్యమును వృద్ధిచేసి రక్తమును పాడుచేయును. సద్యోనీతమైన మద్యము త్రిదోష శమనమును, నిలవమద్యము త్రిదోషకరమును నైయున్నది. వేడిచేయు వస్తువులతోను, వేడిగనుండు వస్తువులతోను కలిపిగాని మద్యసేవకూడదు. విరేచనమునకు మందుపుచ్చుకొన్నవారు కల్లు త్రాగరాదు. ఆకలియెక్కువగా నున్నపుడును, కలుషమైనప్పుడును, వేసవి



కాలమందును కల్లు త్రాగరాదు. ఒకవేళ త్రాగినను నీళ్ళనెక్కువగ కలిపి స్వల్పముగ కల్లును సేవించవచ్చును. లేకున్న నజ్జులు, శిథిలత్వము, తాపము, మోహము, మొదలగు దుర్గుణములు కలుగజేయును.

సంస్కృతమున మద్యః. ఇంగ్లీషున Toddy Generally.

కవిరి :— ఇవి చంద్రచెట్టు కషాయముతో తయారుచేయబడు గ్రంథివస్తువు. దీనినే కాచుఅని అందురు. చంద్రచావ పొట్టుతోను కూడా తయారుచేయుదురు. కవిరి బజారులో సర్వత్ర దొరకును. ఇది రెండురకములు, తెల్లకవిరి, నల్లకవిరి. ఇది యూనానీ పాశ్చాత్యవైద్యములలో గూడా ఉపయోగి. ఇది వగరురుచిగలది. శీతవీర్యము, రూక్షగుణము, విపాకమున కారపురుచిగ మారును. అతిసారము, ప్రవాహికా, స్వరభేదము, కాస, కంఠరోగము, దంతరోగము, శ్వేతప్రదరము, కుష్ఠువు, వ్రణములు హరించును. చర్మరోగములు హరించుటలో నిది శ్రేష్టమైనది. కుష్ఠువులపై గూడా పనిచేయును. గ్రహణులు నేత్రరోగములు హరించును. సెగరోగములకు మంచిమందు. దగ్గులు, శూలలు పోగొట్టును. విరేచనముల కట్టును. పండ్లకు మంచిబల మొసంగును. గాయముల మాన్పును. రక్తమును కట్టును. కవిరి అరతులము, చాయపసుపు తులం, రెండును మెత్తగానూరి ఆరు పొట్లములుకట్టి తేనె అనుపానించి యిచ్చిన రక్తకసురు అమోఘముగా కట్టును. పథ్యము చప్పిడి. కవిరిచూర్ణం, తెల్లగుగ్గిలం మెత్తగానూరి, గాయములమీద వేసికట్టినను కవిరిచూర్ణం నీటిలో వేసి మరగించి ఆనీళ్ళతో పుండ్లు కడిగినను, రక్తముకట్టి పుండ్లు మానును. మోదుగజిగురు, జాజికాయ, లవంగములు నల్లమందు చూర్ణించి, కందిగింజలవలె మాత్రలు చేసి అతిసారములయందు ఇవ్వవలెను. ముద్దహారతికర్పూరం, గవ్వపలుకు, సాంబ్రాణి సమభాగములు, హారతికర్పూరములో సగభాగము కవిరి

ఈ మూడును మెత్తగ చూర్ణించినూరిన పలాస్త్రీవలె ముద్దఅగును. అది గుడ్డను పట్టివేసిన సవాయిపుండ్లు తప్పక మానును. మరియు మేహామువలన బుట్టిన వ్రణములుకూడా హరించును. దంతముల దృఢత్వమునకు కవిరి, దాల్చినచెక్క, పొగడచెక్క, ఏలకాయలలోని గింజలు, తుమ్మచెక్క, సమభాగములు చూర్ణించి పండ్లుతోమిన ఇగుళ్ళుబ్బుట, పండ్లవెంబడి రక్తముకారుట, పండ్లసలుపు, దంతచలనము మొదలగుబాధలు పోవును. ఋతుబద్ధమునకు నల్లకవిరి, మహిసాక్షి, పొంగించిన వెలిగారము, కాశీసభస్మము సమభాగములు, తేనెతో నూరి, మాత్రలుచేసి అనగా యిండుపగింజలంత మాత్రలుచేసి ప్రతి రోజు ఉదయమున సేవించిన ఋతుబద్ధము పోవును. చంద్రచేవ ఆకు రాతినికోసి, ఒకరోజు నీళ్ళలోనాననిచ్చి, మరునాడు కషాయముకాచి, అది వడకట్టి దానిని తిరిగి మృదుఅగ్నిపై ఇరగకాచిన కవిరిఅగును. బజారుసరుకునందు పిండిమొదలగు ద్రవ్యములు చేరును. సంస్కృతమున ఖదిరసార, ఖాదిర. ఇంగ్లీషున Catechu అందురు.

☞ కసివెంద :—కసివెందచెట్టు రమారమి గజమెత్తువరకు బెరుగు మొక్కజాతి. ఆకులు మిరపఆకులను పోలియుండును. దీనికాయలు కోలగా పొడవుగా నుండును. లోనగింజలు బద్దవాటిగా నుండును. దీనిపువ్వులు పసుపుపచ్చగ నుండును. ఇది ఆంధ్రదేశమంతటను పెరుగును. ఒకొక్కచోట విస్తారముగా నుండును. దీనిఆకు, వేరు, గింజలు, కాయలుగూడా ఉపయుక్తములు. దీని రుచిచేదు, కొంచెంతీపి మిశ్రమము. శ్లేష్మము, వాతము, హరించును. ఎక్కువగా పైత్యశాంతి చేయును. పాచనకారి. కంఠమును శోధించును. ఉష్ణవీర్యము. విపాకమున కారపురుచికి మారును. అజీర్ణం దగ్గులు హరించును. మొత్తంమీద నిది త్రిదోషశమనమైన మూలిక. కసివెందవేరు, హరిదళము నిమ్మకాయరసమున మెత్తగనూరి తామరపై లేపనముచేసిన ఎట్టితామర



అయినను మానిపోవును. కసివెందఆకు మెత్తగానూరి నూనెలో వెచ్చజేసి కవుకుదెబ్బలకు కాపడముపెట్టిన గడ్డకట్టిన రక్తం కరిగిపోవును. కసివెందఆకు రసముతో అభ్రకమునూరి పుటములు ఇరువదిఅయిదువరకు పెట్టిన నిశ్చంద్రిక అయి అభ్రకము సింధూరించును. నేత్రరోగములకు కసివిందఆకు ఆముదమున వెచ్చచేసి కంటికి కట్టిన కంటిబాధలు శమించును. ఆకులరసం కంటిలో వేసిన కొంచెం మండును. కండ్లకలక, దురద పోవును. లేతకసివెందకాయల కూరవండుకొని తినిన శ్వాసకాసలు హరించును. వాతము నశించును. ఆకు కూరవండుకొని తినినను ఈగుణమే కలిగియుండునని నవీన వైద్యకమతమునకలదు. ఈచెట్టుయొక్క అన్నిభాగములు Cathartic గాఢవిరేచనము చేయును. ఇది రసాయన ద్రవ్యము. కఫమును పోగొట్టును. కోరింతదగ్గులను, మూర్ఛలనుగూడా బాగుపరచును. కసివెందగింజలు విరేచనము చేయును. దీనిగింజల చూర్ణం చనుబాలతోనూరి చంటిబిడ్డలకు పట్టిన బాలపాపచిన్నెలు అను ఈడ్పురోగము హరించును. దీనివేరు రసం విషమజ్వరములు హరించును. మెటీరియా మెడికా ఆఫ్ ఇండియాలో గలదు. ఎఱ్ఱకసివెందవేరు చాలా ఘాటైనమూలిక. దీనిరసం సన్నిపాత జ్వరముల యందును విషమజ్వరములయందును మిక్కిలి ఉపయోగకరము. పత్రస్వరసము సమభాగం తేనెతో కలిపియిచ్చిన ఎక్కిళ్ళు, కాసశ్వాసలు హరించును. దీనివేరు నోటిలోఉంచిన తేలువిషమునకు నివారించును.

సంస్కృతమున కాసమర్దః. హిందీన కసౌంధీ. బెంగాలీన కాల్కాసుంధా. గుజరాతీన కసందీ. మరాటీన కానకుసవిందు. ఇంగ్లీషున Cassia Sophera అందురు.

☞ కస్తూరి :—ఇది కస్తూరిమృగముయొక్క మదము. కస్తూరిమృగము లేడివలెనుండును యీ మృగములు కామరూపము కాశ్మీరం, నేపాళం, మొదలగు నుత్తరదేశమందు గలవు. కామరూప కస్తూరి

చాలమేలైనది. నేపాళదేశీయ కస్తూరి మధ్యమం. కాశ్మీరకస్తూరి అధమం. అచ్చట కిరాతులు యీ మృగముల వేటాడి కస్తూరిని సంగ్రహింతురు. కస్తూరికి మృగమదమని పేరుగలదు. కస్తూరిమృగమునకు ఋతుసమయమున నాభినుండి కస్తూరి స్రవించుననియు అప్పుడు మృగములు రాళ్ళను చెట్లను రాచుకొనుననియు రాళ్ళకు, చెట్లకు అంటుకొనిన కస్తూరిని కొండవాండ్రు తెచ్చెదరనియు చెప్పుదురు. ఏదిఎట్లున్నను, కస్తూరి మృగమదసారం. ఈ కస్తూరి అయిదువిధములుగ నున్నది. 1 పిండ, 2 నాయక, 3 కుభుద్ధ, 4 తిలక, 5 ఖారిక. ఈ అయిదింటికి ఆకారభేదములు కలవు. పిండఅనుకస్తూరి ఉలవగింజలకంటె కొంచెం పెద్దదిగా నుండును. నాయక చాల పెద్దపెద్ద రవలుకట్టి యుండును. కుభుద్ధ ఉలవగింజలవలెనుండి దానిరంగును కలిగియుండును. తిలక నువ్వుగింజలవలె పూసలుకట్టి యుండును. ఖారికమనునది చూర్ణమువలె పొడిపొడిగ నుండును. కస్తూరి మిక్కిలి ఘాటైన వాసనగలది. కొంచెం పసుపును విస్తారం నలుపును కలిసినరంగు గలిగియుండును. కపిలవర్ణం, పింగళవర్ణం, కృష్ణవర్ణం గలమూఁడురకముల కస్తూరి సాధారణముగా జూడబడుచున్నది.

నిజమైన కస్తూరిపరీక్ష:—కస్తూరిని పరీక్షించు విధానములు చాలయున్నవి. నోటిలో వేసికొనిన చేదుగా నుండవలెను. పచ్చని రంగు గలిగియుండవలెను. మొగలిపువ్వుతో సమానమైన సువాసన గలిగియుండవలెను. తూనికలో తేలిక యుండవలెను. నీటిలోవేసిన రంగుమారకుండ నుండవలెను. చేతిలో కొంచెం నీళ్ళుపోసుకొని కస్తూరివేసిన కొంతసేపటికి నీళ్ళు ఎఱ్ఱగాగాని, పచ్చగాగాని రంగుగలిగిన కస్తూరి ప్రశస్తమైనది కాదనియు కృత్రిమమైనదనియు గ్రహించవలెను. ఒక దారమునకు వెల్లుల్లిరసం రాసి, కస్తూరిపలుకులో నీదారమును రాసిన వెల్లుల్లివాసన హరించి కస్తూరివాసన నిలబడియుండ



వలెను. ఇది ప్రశస్తమైన కస్తూరిఅని చెప్పుదురు. శ్రీమహావిష్ణుకూడా కస్తూరిబొట్టు ధరించినట్లు వర్ణింపబడినది. "కస్తూరీ తిలకం లలాటఫలకే వక్షస్థలే కౌస్తుభం గోపాల చూడామణిః" అనికలదు. పరమేశ్వరునికి కూడా కస్తూరి ప్రేమాస్పదమైనది. కస్తూరి శుక్రమును వృద్ధిచేయును. గురుత్వంచేయును. కారముగ, చేదుగ, ఉష్ణముగనుండును. కఫము, శీతము, విషము, వాంతి, శోకము, దుర్గంధము, వాతము వీనిని హరించును. కస్తూరి చేదు కారము కలిగిన రుచిగనుండును. మిక్కిలి వేడిచేయును. విపాకమున కారపురుచిగ మారును. కఫవాతముల హరించును. రక్తపైత్యమును పోగొట్టును. నేత్రములకు చాలహితమైనది. వీర్యవృద్ధి చేయును. వీర్యమును స్థంభించును. రసాయన ద్రవ్యము. ఆరోగ్యము నిచ్చును. నీరసం, ముఖదోషం, కిలాసకుష్టము, చెమటలోని దుర్వాసన హరించును. దీనిని మితముగ సేవించవలెను. మితం దప్పిన పైత్యమును పెంచును. మలబద్ధముల జేయును. అజీర్ణ విరేచనములు విస్తారంగా నగుచున్నప్పుడు చిన్నము కస్తూరి సేవించిన మంచి సుగుణం వెంటనే కనిపించును.

ప్రయోగములు:-కస్తూరిచిన్నం, గోరోచనంచిన్నం, జున్నుచిన్నం, పావుదారుచిన్నం, రోపీతచిన్నం, సన్నిపాతభైరవి అణాఎత్తు, బాలసూర్యోదయం బేడెత్తు, (ఖచిలీ) ఇవి తమలపాకులరసంతో మర్దనచేసి చిన్నవిగా మాత్రలుచేసి బాలెంతలకువాడిన అనగా ఉదయం 1 మాత్ర సాయంత్రం 1 మాత్ర చొప్పున సేవించిన మైలరక్తమును వెడలించి శరీరమునకు తగిన వేడిచేసి ఆరోగ్యమునిచ్చును. కొందరు నల్లఉప్పి చిగుళ్ళుకూడా చేర్చుదురు. కొందరు లోహరసరాట్టి బాలసూర్యోదయముగాని, ప్రళయాగ్ని సన్నిపాతముగాని, సూతికాభరణముగాని చేర్చి మాత్రలు చేయుదురు. ఇవిఅన్నియు వేడిచేసి ఆరోగ్యమును కలిగించునవిగ నున్నవి. చంటిబిడ్డలకు కస్తూరిమాత్రలు చాలగుణకారులై

యున్నవి. కొందరు కస్తూరిచిన్నము, నల్లబియ్యం పిండి అరసోలెడు కలిపి మెత్తగనూరి, చిన్నచిన్న పెసరబద్దలవలె మాత్రలుచేసి కస్తూరి మాత్రలని అమ్ముదురు. ఇవికూడా చాలబాగుగా పనిచేయుచున్నవి. కస్తూరిలో లతాకస్తూరి అని యొక మూలికకలదు. ఇది నేత్రములకు హితకారి. శీతలముగ, లఘువుగ నుండును. సంస్కృతమున కస్తూరికః. మృగమదః. ఇంగ్లీషున Musk. హిందీన కస్తూరీ. అందురు.

కస్తూరిమృగము :—దీనిమాంసము మధురముగ, తేలికగ నుండును. దీపనకారి. మలమును బంధించును.

కస్తూరిపసుపు :—ఇది పసుపుజాతిలో చేరినది. మొక్కజాతి. మామిడిచెట్టుయొక్క వాసనగలిగి కస్తూరివాసనతో మిశ్రితమైయుండును, దీనిదుంపకే ప్రాశస్త్యమెక్కుడుగ నున్నది. గానదీని కందసారమని చెప్ప వచ్చును. దుంప పసుపుపచ్చగ నుండును. మంచివాసన గలిగియుండును. ఇది చేదు. తీపి కలిసిన రుచికలిగి యుండును. చలువచేయును. విరేచనమును చేయును. విపాకమున కారపురుచిగ మారును. ఎక్కిళ్లు, దగ్గు, దురదలు, తగ్గించును. జ్వరం, శ్వాస హరించును. పైత్యశమనము చేయును. వ్రణముల మాన్పును. దీనిచూర్ణం చర్మమునకు నలుగుబెట్టిన చర్మరోగములు రాకుండుటయేగాక దేహమునకు కాంతియు, పుష్టియు నిచ్చును. దీనిగంధం దెబ్బలకు పట్టువేసిన వాపులు హరించును. పాము కరచినవాడు కస్తూరిపసుపు గుండ అరతులం మనిషిమూత్రంలో కలిపి త్రాగిన పామువిషం హరించుటయేకాక ఆరోగ్యం కలుగును. మరియు తెల్లగరిక రసంలో కలిపి త్రాగినను పామువిషం హరించును. కస్తూరి పసుపు చూర్ణం నిమ్మరసంలో నానించి కొంచెం వెలిగారం కలిపిన కుంకమువలె నెఱ్ఱగనగును. ఇది రెండు గింజలఎత్తు తేనె మొదలగు అనుపాన విశేషముల పిల్లలకు వాడిన చంటిబిడ్డల దగ్గులు తగ్గును. చక్కగ విరేచనం చేయును. దీనిలో కొంచెం నల్లమందు కలిపి చిన్న



మాత్రలుచేసి యిచ్చిన పిల్లలకు విరేచనములు కట్టును. మంచిగంధం, కస్తూరిపసుపు కలిపి గంధముతీసి వంటికి రాసుకొనిన శరీరతాపం హరించును. చర్మమునకు రంగుకలుగును. సంస్కృతమున దార్వీ, మేద. ఇంగ్లీషున Cwrnc Wma Asomatica అందురు.

కస్తూరిబెండ :— ఇదియొక మధ్యరకము చెట్టు. ఇది దక్షిణ దేశంలో నున్నట్లు నిఘంటువులలో వర్ణింపబడినది. దక్షిణ దేశములో దీనినే కాకే కస్తూరి అని పిలుతురు. దీనికాయ పొడుగు. ముండ్లుకలిగి యుండును. దీనిలోనుండి నల్లని పలచని గింజలుండును. ఇది తీపి చేదు గలిసిన రుచిగలది. శీతవీర్యము. విపాకమున కారపు రుచిగా మారును. మిక్కిలి వీర్యవృద్ధి చేయును. తేలికగుణము. మిక్కిలి తీక్ష్ణమైనది. నేత్రహితమైనది. ప్రొత్తికడుపును శోధించును. ప్రొత్తికడుపులోని రోగములను, శ్లేష్మమును, దాహమును పోగొట్టును. ముఖరోగముల హరించును. లాలాజలమూరుట తగ్గును. వాంతులు కట్టును. వాతము హరించును. దుర్గంధం పోగొట్టును. మదమును హరించును. లక్ష్మీప్రదమైనది. హృదయమునకు మంచిది.

సంస్కృతమున లతాకస్తూరీ. హిందీలో-ఫారసీలో ముష్కదానా, గుజరాతీలో-బంగాలీలో లతాకస్తూరీ. మరాటీలో ముసకదాణా ఇంగ్లీషున Hibiscus Abclmoschus.

కంకుష్ఠము :—ఇది భూమియందుబుట్టు ఒక ధాతువు. ఖనిజము. ఇది హిమవత్పర్వతప్రాంత ప్రదేశములలో విస్తారంగా దొరకును. ఇది రెండు విధములు. 1 వాళిక, 2 రేణుక.

1 వాళిక కంకుష్టము :—పసుపుపచ్చరంగు గలిగి భారముగా నుండును. నునుపుగా నుండును. ఇందు సత్వము కలదు.

2 రేణుక కంకుష్టము :—శ్యామపీతవర్ణంకలిగి తేలికగా సత్వహీనముగా నుండును. కొన్నిచోట్ల అప్పుడు పుట్టిన ఏనుగపిల్ల రేణమే కంకుష్టమని చెప్పుదురు.

ఇది చేదు కారము కలిసిన రుచిగలది. ఎక్కువ వేడిచేయును. గాఢవిరేచనకారి. విపాకమున కారపురుచికి మారును. తేలిక గుణము కలది. శరీరమునకు మంచి కాంతినిచ్చును. క్రిములు, ఉబ్బులు, ఉదర వ్యాధులు, కడుపుబ్బులు, గుల్మములు హరించును. శ్లేష్మహరము. శూలలు హరించును. వ్రణములను పోగొట్టును. విరేచనము చేయించుటకు దీనిని యవ ప్రమాణమిచ్చిన చాలును. సేవించిన వెంటనే విరేచనము చేయును. ఆమదోషమును పోజేయును. దీనిని తాంబూలముతో సేవించరాదు. అట్లు సేవించిన గాఢముగా విరేచనముచేసి చంపును. దీనికి విరుగుడు తుమ్మచెక్క కషాయములో జీలకఱ్ఱ చూర్ణమును, పొంగించిన వెలిగారమును కలిపి సేవించవలెను. కొన్ని కొన్ని గ్రంథములలో మతభేదములు కలవు. రసప్రకాశ సుధాకరము, వైద్యక శబ్దసింధు, రసతంత్రం, భావప్రకాశిక, ఆయుర్వేదప్రకాశికలోను చూడుడు.

సంస్కృతమున కంకుష్ట, వాలకాష్ట హిందీలో రేవంద్ శారా, అసురా రేవంద్, మరాటీలో రేవాచీనీ, ఇంగ్లీషున Cleome Felena.

కంచు :—ఇది మిశ్రమ లోహం. నాలుగు భాగములు రాగి, ఒక భాగం తగరం కలిపి కరిగించిన కంచు అగును. మ్రోగించిన గణగణ మని మ్రోగును. మృదువు, నునుపుగలదియు కొంచెం పసుపు వర్ణం, మిక్కిలి తెలుపు కలసిన రంగుగలదియు కాల్చిన నెఱ్ఱగ నుండునది శ్రేష్టమైన లోహముగ పరిగణింపఁబడును.

కంచుశుద్ధి :—కంచు కొలిమిలో నెఱ్ఱగా కాల్చి గోమూత్రములో నేడుసారులు ముంచిన శుద్ధియగును.

భస్మం :—కంచు, గంధకం, తాళకం మూడును చేర్చి అయిదు పుటములు బెట్టినచో భస్మమగును.

కంచులో త్రామవంగములు చేరియుండుటచే నీ రెండు లోహములు యొక్క గుణమేగాక విశేష గుణములుకూడ గలిగియుండును.





ఇది చేదు, వగరు రుచులు గలది. లఘువుగా నుండును. అగ్నిదీపనము చేయును. పాచనం చేయును. గురుగుణము గలది. ఉష్ణముగ నుండును. నేత్రహితకారి. వేగంగలది. కఫం, పిత్తం వీనిని పోగొట్టును. రూక్ష గుణము గలది. క్రిములు, కుష్ఠరోగము పోజేయును. కంచుభస్మము సేవించునప్పుడు నేతిని కలిపి తినరాదు. అట్లు తినిన విరుద్ధ గుణము కలిగించును.

కంచుగిన్నె లేక కంచము :—కంచు కంచములో భోజనము చాలా శ్రేష్ఠమైనది. కొన్ని కంచుపాత్రలు కిలుముపట్టుచుండును. అట్టివానిలో భోజనం సేయరాదు. నిర్దుష్టమైనదానిలో భోజనం చేయుట ఉత్తమము చాలా ఆరోగ్యము నిచ్చును. శుభప్రదమైనది. దేహమునకు చాలా హితవు గూర్చును. కంచు గిన్నెలో నేయిపోసి నిలవయుంచరాదు. నిలవయుంచిన నేయి దూషితమగును. అపక్వ భస్మం సేవించిన వివిధ రోగములు సంభవించును. కంచుపాత్రలో భోజనము రక్తపిత్తం, నేత్రరోగములను హరించును. గుండెలకు హితవుగూర్చును. మధురముగ నుండును. ఆయువు, యశస్సు, బుద్ధిబలము వీనిని గలుగజేయును. సంస్కృతమున కాంస్య, ఇంగ్లీసున Bell Metal

కంద :—ఇది పాటిపెరళ్ళలోను పొలములలోను పైరగు దుంపజాతిమొక్క. దీనిదుంపకే ప్రాధాన్యం ఎక్కువ. ఇది కందసారంగలది. పాటిపెరళ్ళలో పెరుచేయుబడిన కందను పాటికంద అందురు. కందలో తెలుపు, ఎరుపు రంగులుండును. దీనికి కందపిలకలే విత్తనము. కందలో తియ్యకంద అనునది ఒకజాతికలదు. కందచెట్టు గజము ఎత్తువరకు పెరుగును. కొమ్మలుండవు. కాండముచివరనే ఆకులుండును. నీటికంద అనుదానికి నీరుపెట్టుట అవసరం. నీటికంద చాలరోజులు నిలవయుండదు. తెల్లకంద కందలో శ్రేష్ఠమైనది. కందకు దురదగుణం కలదు. అడవి

కందకు విశేషముగా దురదగుణం కలదు. ఊరకందకు దురదతక్కువ గుణం సమానమే. కందజాతి కంతటికిని గుణము సమానమే ఇది కారపు రుచి, వగరురుచికూడా కొంచెం కలియును. వేడిచేయును. విపాకమున కారపురుచికి మారును. జఠరదీప్తి కలిగించును. పాచనముచేయును. కఫ వాతముల తగ్గించును. క్రిములను పోగొట్టును. మూలవ్యాధులకు దీనిని మించిన మందు మరొద్దియునులేదు. వాతశూలలు, శ్వాసకాసలు, వమనము, ప్లీహా, గుల్మము హరించును. ఇది దద్రురోగులకును, కుష్ఠురోగులకును, పనికిరాదు. అగ్నిదీప్తిచేయును. వేడిచేయును. మలమును బంధించును. శోధించును రుచినిబుట్టించును. కామమును వృద్ధిచేయును. అడవికంద అగ్నిదీపనము చేయును. పిత్తరక్తమును కలుగజేయును. తియ్యకంద స్వాదుగ నుండును. మేహశాంతి చేయును. కందతో తయారుచేయు కూరలు అనేకవిధములు కలవు. కందముక్కలు ఉడికించి నూనెలో వేయించి గరమసాలాపెట్టిన చాలరుచిగ నుండును. గురుత్వం చేయును. వేడిచేయును. కందకూరలో కొందరు బెల్లం, కొందరు నిమ్మరసంచేర్చి వండుదురు. కంద, బచ్చలి, కలిపి కలగలుపుకూర కొందరు వండుదురు. కందకూరలో ఆవపెట్టి కొందరు, కంద, వంకాయ కంద అరటిదూట, కంద గోరుచిక్కుడు, కంద తోటకూర కలిపి వండుదురు. ఇవి వానిలో పడెడు ద్రవ్యగుణములను కలిగియుండును. కొందరు కందను చిన్నచిన్నముక్కలుగ తరిగి రోటిలో నలగకొట్టి నీళ్ళతో బాగుగకడిగి అందు పెసలుగాని, బియ్యంగాని చేర్చి మెత్తగరుబ్బి కారముకూడాచేర్చి మెత్తగరుబ్బి పెనంమీద నేతితోగాని, నూనెతోగాని పెసరట్టువలె వేసివేయించి బాలెంతలకు బెట్టుదురు. ఇది చక్కని వేడిచేయును. ఆరోగ్యము నిచ్చును. మూలవ్యాధికి కందదుంపకు మట్టి రాసి కుమ్ములో ఉడికిండి ఉడికిన తర్వాతదీసి ఉప్పు, నూనె కలిపి సేవించిన మూలశంఖరోగం నివర్తించును.



సంస్కృతమున సూరణ, అర్శోఘ్నః. హిందీన జమీకంద్. కర్ణాటమున కందగడ్డ. అరవంలో కరుణైక్కిళం. ఇంగ్లీషున Arum Campanulatum అందురు.

కందులు:—ఇది నడిమిరకం చెట్టు. చెట్టుజాతికి చెందినది. పాటిపొలములలోను, గరపభూములలోను పెరగును. మెరకభూములు కందిపంటకు అనువగు ప్రదేశములు. కందులలో గుత్తికంది, చిరుకంది అని రెండుజాతులుకలవు. మరియు బిళ్ళకంది అనియు, కంది అనియు కూడాకలదు. కందిచెట్టు దృఢమైనది. నిలువువరకు పెరుగును. కొన్ని కందులు తెల్లగను, కొన్ని ఎఱ్ఱగనుండును. కందులనుగూర్చి తెలియని వారు సాధారణముగా నుండరు. గాన దీనిగూర్చి వర్ణించుట నిష్ఫలం. కందులు వగరుగనుండును. కొంచెం మధురరుచికూడ కలిసియుండును. మిక్కిలి గురుత్వంచేయును. విపాకమున మధురరుచిగ మారును. శ్లేష్మమును, పైత్యమును హరించును. రక్తవికారమును పోగొట్టును. మంచి బలమును ప్రసాదించును. విషమును, గుల్మమును హరించును. వీర్యవృద్ధిని కలుగజేయును. కాంతిని, మాంసమును పెంచును. మలబద్ధమును చేయును. వేచినకందిపప్పులో నెయ్యివేసికొని భుజించిన గుణమధికముగానుండును. (వేచినకందిపప్పు అనగా కందులువేచి పప్పువిసరి ఉడికించిన పప్పు లవణయుక్తమైనది.) వాతహరము, కందికట్టు పప్పుకంటె తేలికగా నుండును. చాల పథ్యకరము. వేడిచేయును. రోగులకు కందికట్టు చాలహితవుగనుండును. కందిపప్పు పులుసు మిక్కిలి రుచిగ నుండును. మిక్కిలి గురుత్వముచేయును. శ్లేష్మమును పెంచును. కడుపును పొంగరింపచేయును. వేచినకందిపప్పు పచ్చడి చాలరుచిగనుండును. తేలికగ జీర్ణంకాదు. కందిగుండ మిక్కిలి అజీర్ణకారి. విదాహమును బుట్టించును. కందిఅప్పడములు చాలరుచిగనుండును. మిక్కిలి బలకరములు. వేడిచేయును. కందిపప్పుతో తయారుచేయు సాంబారు ప్రతిశాఖీ

హోటళ్ళలోను విరివిగ వాడబడుచున్నది. చేదురుచి. భేదంకూడా కలుగుచున్నది. కందిపప్పుతో కలగలుపు కూరలు ఎన్నియో ఎన్నివిధములనో తయారుచేయుదురు. ముఖ్యంగా పొట్ల, బీర, ఆనప, తోటకూర, పొన్నగంటికూర, మెంతికూర, బచ్చలి, కొబ్బరి మొదలగు కూరలు పెక్కులుకలవు. పచ్చడులలోను, మామిడి, రాచఉసిరిక, వాక, మొదలగువికూడా పచ్చడి చేయుటకలదు. గుండెలో పెసర, శనగకూడా చేర్చి కందిపొడుం తయారుచేయుట కలదు. వారివారి అభిరుచుల ననుసరించి తయారుచేయుదురు. కందిపులగం మధురముగ నుండును. రుచినిబుట్టించును. కఫ పిత్తముల హరించును. గురుత్వం, రూక్ష, శీతలము, వాతము, వీనిని జేయును. కందిపొట్టు, కందికాయల బొత్తు పశువులకు మేతగ నుపయోగింతురు. కందికంప వంటచెరకుగ నుపయోగించును. కంపకాల్చిన బొగ్గులో తారముకలదు. టపాకాయలు, సిసింద్రీలు, కాకరపువ్వొత్తులు, చక్రకాయలు, చిచ్చుబుడ్లు మొదలగు బాణసంచాలు ఈబొగ్గుతో తయారుచేయుదురు. కంది ఆకుతో తాళకము భస్మమగును. పాదరసము కట్టును. కందిచెట్టు సర్వవిధముల మానవులకు ఉపయోగించు ననుటలో నతిశయోక్తి యెంత మాత్రములేదు.

సంస్కృతమున ఆఢకీ. మవరీ. ఇంగ్లీషున PigeonPea or Red Granu. హిందీన తువర్, పహర్. కర్ణాటమున తొగరి. అరవమున తువర్రై అందురు.

☞ కంపిల్లకము:- ఇది వృక్షజాతిలోనిది. ఇది శింబధాన్యజాతికి చెందినది. ఇది పర్వతప్రదేశములయందు బుట్టును. దీనియాకులు వేడిచెట్టు ఆకులవలె నుండును. దీనికాయలు రేగుకాయలకంటె చిన్నవిగ నుండును. ఇది చేదురుచిగలది. వేడిచేయును. కంపిల్లకము కఫము, పిత్తము హరించును. రక్తదోషము, క్రిములు, గుల్మము పోగొట్టును.



ఉదరరోగములు, అవాహము, విషము, కడుపుబ్బరము మొదలగు రోగముల నడంచును. మూత్రరోగము, ప్రమేహము హరించును. విరేచనకారి. కారముగనుండును. లఘుగుణముకలది. వ్రణముల శోధించి మాన్పును. దీనికషాయముచే వ్రణములుకడిగినను, ఆకునూరి గాయములపై వేసికట్టినను వ్రణములు మానును. మూత్రఘాతము హరించును. ఆకుకూడా మలబద్ధము చేయును. శీతలముగ నుండును.

విశేషములు :—కొన్ని రసగ్రంథములలో నిది ఖనిజముగ వర్ణింపబడినది. ఇటికపొడుముతో సమానముగ నుండుననియు, చంద్రిక (తళుకు) యుండుననియు సౌరాష్ట్ర దేశములో పుట్టుచున్నదనియు వ్రాయబడియున్నది. గుణములలోగూడా కొంచెం భేదంకలదు. ఏది ఎట్లున్నను, విరేచనకారి అనియు, వ్రణహారి అనియు గుణములు వ్రాయబడియున్నవి. రసశాస్త్రములో నిది సాధారణ రసముగా పరిగణింపబడినది. కంపిల్ల కషాయములో తేనె కలిపి త్రాగిన గుల్మములు హరించును. విరేచనములు చేయును కంపిల్ల కషాయం నూనె కలిపి తైలపక్వముగా కాచి వ్రణములకు బూసిన మానును. కంపిల్ల చూర్ణం $1\frac{1}{4}$ కర్షం బెల్లంతో కలిపి తినిన క్రిములు నశించును. ఉదరములోని సర్వవిధములగు క్రిములు తప్పక హరించును. సంస్కృతమున కంపిల్లక, కర్కశ. ఇంగ్లీషున Kameladye.

## కా

☞ కాకర :—ఇది తీగజాతిలోనిది. దీని యాకులరచేతివలె వ్రేళ్లు కలిగి యుండును. కాయలు కొన్ని పొడవుగను, కొన్ని పొట్టిగను, కొన్ని తెల్లగను, కొన్ని ఆకుపచ్చగను ఉండును. పువ్వులు పసుపుపచ్చగా నుండును. కాయలకు గొగ్గులుండును. ఇది చేదు, కారం గలిసిన రుచి కలిగి యుండును. వేడిచేయును. విరేచనము చేయును.

దుష్టవ్రణముల మాన్పును. పాలెపురుగు విషమున కిది మంచి పని చేయును. గుల్మం, ప్లీహోదరం, శూల, మందాగ్ని హరించును. కాయలు చేదుగా నుండును. జఠరదీప్తి చేయును. లఘుగుణం గలది. చలవచేయును. విరేచనము చేయును. ఇందులో తీపిగానుండు కాయ కూడా పథ్యకరమైనది. అరుచిని గొట్టును. కఫవాతముల హరించును. రక్తదోషం, జ్వరం, క్రిములు హరించును. పైత్యమును, పాండురోగమును, కుష్టువును హరించును. వీర్యనష్టమును గలిగించును. కుక్క కరచిన గాయముపై కాకరాకు పసరు వేసి రాగిడబ్బు కాకరాకు వేసి కట్టిన గాయము మానిపోవును. కాకరాకు పసరుతో ఇంగిలీకం మర్ధించి శుద్ధిచేసిన రాగిరేకులకు పట్టించి పుటమువేసిన తామ్రం భస్మమగును. 10 పుటములు కాకరాకుతో నూరి పుటములు వేయవలెను. కాకర కాయల కూరలో పిండి బెల్లంపెట్టి వండిన రుచికరంగా నుండును. కాకరకాయ సన్నగా ముక్కలు తరిగి ఉప్పువేసి నలిపి పిడిచి పసరు వంచివేసి నూనెలో వేచి కారం జల్లిన కూర నోటికి హితవుగా నుండును. కాకరకాయ పులుసు చాలా రుచికరంగా నుండును. కాకరాకు పసరులో నూనెకలిపి యిచ్చిన కలరా తగ్గునని భావప్రకాశికలో గలదు. కాకరాకు ఎండబెట్టిన గుండ పులుసు కాచుకొనిన క్రిములు నశించును. పిత్తం హరించును. కాకరాకు రసం కంటిలో పిండిన రోగజ్వరములు హరించునని నవీన వైద్యకమతమున గలదు. కాకర రసాయన ద్రవ్యం. దీని తీగ, ఆకులు, పండు, బీజములు కూడా క్రిమిహరములు. పండు బలకరమైనది. రసాయనము. వివిధ వాతములయందు యకృతు ప్లీహ వ్యాధులయందు పనిచేయును. దీని సమూలచూర్ణం కుష్టరోగహారం. ఇండియన్ మెటీరియా మెడికా—R. N. Khory.

సంస్కృతమున కారవేల్లక, హిందీలో కరేలా, బంగాలీలో కరలా ఉచ్ఛే మరాటీలో కారవేం, గుజరాతీలో కారేలా ఇంగ్లీషున Momordica eharantia the weli knoun creopers.



కాకిచంపు :—దీని ఆకు మునగ ఆకువలె నుండును. దీనికాయలు త్రివర్ణములు, మొదట తెల్లగను, తరువాత నెఱ్ఱగను, ఆఖరున నల్లగ నుండును. కాయల చూర్ణం ఆముదంతో కలిపి రాసిన చర్మరోగములు హరించును.

కాకిచెరకు :—చెరకు చూడుము.

కాకిమాంసం :—ఉప్పగా నుండును. వేడిచేయును. గురుగుణము కలది. విపాకమున మధుర రసముగా మారును. త్రిదోషకారి. నేత్రహితకారి. దీపనకారి. చులకనగ నుండును. ఆయువు, శరీరపుష్టి, బలం వీనిని వృద్ధిచేయును, వ్రణదోషముల పోగొట్టును. క్షయను హరించును.

కాకిమారేడు :—మారేడు గుణము లన్నియు దీనికి గలవు.

కాకిదొండ :—కాకిదొండ తీగజాతికి చెందినది. తియ్యదొండ వలెనే కాకిదొండ తీగ, ఆకులు, పువ్వులు కూడా నుండును. కాయలు చేదుగ నుండును కాయ ఔషధోపయోగమైనది. ఇది క్షుపమనియు, నల్లనికాయలు కాయుననియు, కాకిముక్కువలె నలుపును, తీక్ష్ణము కలదనియు వ్రాయబడియున్నది. ఇవి హరిద్వారం ఆ ప్రాంతమందు దొరకును. ఇది మిక్కిలి చేదురుచి కలది. ఉష్ణవీర్యం కలది. విపాకమున కారపు రుచిగా మారును. కఫమును, అనేకములగు మూలరోగములను హరించును. రక్తపైత్యం, జ్వరం హరించును. క్రిమినాశనం, దేహమునకు కాంతి నిచ్చును. విషదోషముల శమింపజేయును. వ్రణహారి. కాకిదొండగింజలు వగరుగ నుండును. శీతవీర్యము. విపాకమున మధురరుచిగా మారును. పైత్యం, వాంతి, అరుచి, అజీర్ణం, అపస్మారం, విషం మొదలగు వానిని హరించును. గింజలు ఎండబెట్టి మెత్తగా చూర్ణంచేసి ఆ చూర్ణం తేనెతో నిచ్చిన వాంతులు ఎక్కిళ్లు కట్టును. గింజలు సూర్యావర్తి అను ఔషధములలో నుపయోగించును. కాకి

దొండకాయ రసం విషజ్వరములో బుట్టు విదాహం కట్టుట కుపయోగించును. ఆకు పసరు దేహమునకు బూసిన చర్మరోగములు తగ్గును. వ్రణములకు ఆకు నూరి కట్టిన మానును. కుళ్ళిన వ్రణములు సహా మానును. కాకిదొండఆకు, హంసపాదిఆకు, నేపాళపు చిగుళ్ళు, గాడిద గడపఆకు మెత్తగానూరి వ్రణములకు గట్టిన మానును.

సంస్కృతమున కాకవాసా, కాకాంగి, హిందీలో కౌవాఢోడీ, బంగాలీలో కేడువాటుట్ ఇంగ్లీషున Leea Hirta. L. gymbrima sylvestris.

కాకోళి :—ఇది అష్టకవర్గులోనిది. దీనికే జీవనీయ గణమందురు. సరియైన కాకోళి దొరకుటలేదు. ఇది తీపి చేదు రుచులు గలిగివుండును. దీని అభావమున అశ్వగంధిగాని, శతావరిగాని చేర్చవలెనని శాస్త్రములయందు వ్రాయబడియున్నది. శీతవీర్యమైనది. గురుగుణము గలది, విపాకమున తీపిరుచికి మారును. రక్తపిత్తవ్యాధిని హరించును. రక్తదోషమును బోగొట్టును. క్షయ, పిత్తం పోగొట్టును. తాపజ్వరమును హరించును. వీర్యమును వృద్ధిచేయును. కఫమును వృద్ధిచేయును. బలం నిచ్చును. శరీరకాంతి నిచ్చును. సంస్కృతమున కాకోళి, ఇంగ్లీషున A medicinal plant.

కాచలవణము :—ఇది పంచలవణములలో నొకటి. గాజుముక్క వలె గట్టిగా నుండును. లవణముగుటచేత రుచి ఉప్పన. వేడిచేయును. విపాకమున తీపిరుచికి మారును. గురుత్వం చేయును. ఆకలిని వృద్ధి చేయును. రక్తపిత్తమును బుట్టించును. సంస్కృతమున కాచ, త్రికూట, పాక్య. ఇంగ్లీషున The salt of which glasses of bracelets are made.

కాటుకగింజలు :—ఇది ఒకానొక తీగయొక్క కాయనుండి పుట్టుగింజలు. ఆకు మినప ఆకువలె మూడు దళములుగా నుండును.



పువ్వు గుండ్రంగా నుండును. ఆకు కేసవేరుగా నుండును. దీనిగింజలనే గొలివిత్తులు అనియు, జెరికివిత్తులనియు చెప్పుదురు. గింజలు విరేచనకారి. గింజలకే ఉపయోగము హెచ్చు. ఇది బీజసారము. ఇంగ్లీషున Kalladana.

కానుగచెట్టు :—కానుగ పెద్ద వృక్షజాతిలోనిది. దీని ఆకు ఆకారము గుండ్రన. తొడిమకు 5—6 ఆకులుండును. ఇది గుత్తులు గుత్తులుగా పువ్వులు పూయును. పూవులు నలుపు, తెలుపు రంగుకలిసి యుండును. దీనికాయలు సీమబాదంకాయలు ఆకారమునుపొంది ఒకింత వంకరదిరిగి యుండును. గింజ చమ్మగింజవలె నుండును. కాయపై పెంకు గట్టిగా నుండును. ఇది సాధారణంగా వేసవికాలములో పూయును. పువ్వులకు ఝుం ఝుం అని ఈగలు ముసరుచుండును. కానుగలో అనేక జాతులు కలవు. కానుగ, గుత్తినపులదుగు గానుగ, నిప్పునన్న కానుగ, ఆనుగాయపుల కానుగ, నేతి కానుగ మొదలగునవి. ఇంచుమించుగ నివి అన్నియు సమాన గుణములు కలవియే. ఇది చేదు కారం కలిసిన రుచి కలిగియుండును. వేడిచేయును. విపాకమున కారపు రుచిగా మారును. గ్రాహిగుణముగలది. కఫపైత్యముల హరించును. రక్తదోషమును పోగొట్టును. వ్రణముల మాన్పును. క్రిముల నశింపచేయును. ప్లీహం అణచును. ఘాతబాధల నదల్చును. యోనిరోగముల హరించును, విషములను, నేత్రరోగములను హరించును. వాతహారము. సమస్త చర్మరోగములను పోజేయును. కుష్టురోగముల హరించును. గానుగగింజలనూనె నేత్రరోగములకు హితవైనది. వాతబాధల నడంచును. మిక్కిలి వేడిచేయును. తీక్ష్ణగుణము గలది. పైనవ్రాసిన చర్మరోగముల నన్నిటిని పోజేయును. కానుగ ఆకు కారముగను, చేదుగ నుండును. శ్లేష్మం, వాతం, మూలశంఖ, క్రిములు, ఉబ్బు శమింపజేయును. విపాకమున కారపురుచిగా మారును. పిత్తమును వృద్ధి

చేయును. విరేచనకారి. కాయలుగూడా నీగుణములనే కలిగియుండును. గ్రహబాధలకు కానుగకాయకు రంధ్రము పొడిచి కట్టుదురు. స్ఫోటక ములో కఫ పైత్య ప్రధాన రోగమునకు గానుగరసం, ఉసిరికరసం, పంచదార, తేనె కలిపి త్రాగిన నివర్తించునని వంగసేనలో గలదు. మహాచికం అనుమానం కలిగిన వెంటనే పైప్రయోగం ప్రయోగించిన మిక్కిలి ఉపకారిగా నుండును. గానుగపుల్లతో దంతధావనం చేయు చున్న పండ్ల బాధలు నశించును. కుదుళ్ళు గట్టిపడును. గానుగనూనె వంటికి రాసిన చిడుము, గజ్జి, పామా వ్యాధులు నశించును. ఇందులో వేపనూనె, హారతికర్పూరం చేర్చిన మిక్కిలి గుణకారిగా నుండును. కానుగాకురసం శరీర బలానుసారంగా పానముచేసిన శ్లీపదరోగము హరించును. పసరు పైన మర్దన చేయవలెను.

గ్రామ్య ప్రయోగములు:—కానుగుచెక్క కాల్చిన మసి, తెల్లజిల్లేడుపాలతో నూరి బిళ్ళచేసి ఆరించి మూకుళ్ళలో బెట్టి సీలుచేసి పుటముపెట్టిన భస్మమగును. ఆ భస్మం రెండు గురివెందపూసలయెత్తు తమలపాకులో నుంచుకొని లవంగాల రసముతోగాని, తేనెతోగాని, అనుపానించి యిచ్చిన శ్లేష్మము తెగి పడి బాధలు శమించును. లవంగాలు, గానుగపువ్వులు సమభాగాలుగా నూరి యింసుప్రకాయల వలె మాత్రలుచేసి నేరేడుచక్కరసంతో నిచ్చిన అతిమూత్రరోగం శమించును. గానుగగింజ నిమ్మరసంతో నరుగదీసి పట్టించిన తామర పోవును. సంస్కృతమున కరంజ, నక్తమాలా అందురు.

అన్యమతమున కానుగు గుణము:—కానుగు కారంగా, తీక్ష్ణంగా వుండును. ఉష్ణవీర్యం, యోనిదోషం, కుష్టువు, ఉదావర్తం, గుల్మం, అర్శస్సు, వ్రణం, నులిపురుగులు, శ్లేష్మం వీనిని హరించును. గుత్తి నెమలడుగుగానుగ చేదు, కారం రుచి జిగటగనుండును. వేడిచేయును. వాతం, కఫం. కుష్టువు, దురదవిషం, విషమస్ఫోటకం హరించును.



నిప్పువన్నె కానుగు ఉష్ణవాతం, మూలశంఖ, క్రిములు, కుష్టువు, ప్రమేహం వీనిని హరించును. ఆరుకణుపుల కానుగు శ్లేష్మం, మూల శంఖ, క్రిములు. ప్రమేహం హరించును. నేలకానుగ కారముగా, చేదుగా నుండును. కాకచేయును. విషం, వాతం, దురద. గజ్జి, కుష్టువు, స్పర్శదోషం, చర్మరోగముల హరించును.

ఇంగ్లీషున Pongamia giabra, అరవంన పుంగమరం, హిందీన కరంజసుఖచైన్, బంగాలీన డహర్‌కరంజ, మరాటీన బాపడీకరంజ, గుజరాతీన చలేక్కణసే కరంజ అందురు.

కాఫీ:—ఇది దేశీయము కాదు. విదేశీయులు భారత దేశమునకు వచ్చిన తర్వాత దీని వ్యాపకం చాలా హెచ్చిపోయినది. ఇప్పుడు కాఫీ నెరుంగని పసిపిల్లసహా లేదు. పూర్వం కాఫీ అనిన నెక్కడు గౌరవముగా చూచుచుండెడివారు. నాగరికులు మాత్రమే వాడు చుండెడివారు. నేను ఎచ్చట గాంచినను కాఫీలేని స్థలం లేనేలేదు. కాఫీ ఉత్తేజక పదార్థం. ఈ చెట్లు అస్సాం కొండలలోను, నీలగిరి కొండలలోను, మన్యప్రదేశములలోను పెరుగును. దీనిగింజలకే ఎక్కుడు ఉపయోగం ఇది బీజసారమైనది. ఈ గింజలను మూకుడులో వేసి వేచి నల్లగామాడ్చి గుండకొట్టుదురు. గింజలయందు సువాసన కలదు. నీళ్ళను బాగుగా పొంగి పొరలునట్లు కాచి అందు నీగుండ వేసి పైన మూతపెట్టుదురు. కొంతసేపటికి నీళ్ళయందు కషాయం దిగును. దానిని వడకట్టి పాలు, పంచదారచేర్చి వాడుదురు. ఇది కాఫీ అని చెప్పబడుచున్నది. ఇది త్రాగిన ఆకలి మందగించును. చురుకును గలిగించును మాంద్యమును హరించును. ఉష్ణవీర్యము, చేదు, వగరు, కొద్ది తీపిగల రుచులు గలది. గింజలలో చమురుండును. ఈ చమురు హరించువరకు వేచి మాడ్చకున్న పైత్యవృద్ధిచేసి వాంతిని గలిగించును. గాన చమురు బాగుగా హరించువరకు వేచవలయును. ఆమమును వృద్ధి

చేయును. కాఫీ హృదయ చలనమును వృద్ధిచేయును. ఇది మద్యము వలెను, నల్లమందువలెను యుక్తముగా సేవించిన మంచి గుణం నిచ్చును. చురుకును గలిగించును. బడలికను నడంచును. దీని యందు ఆసినియందలి విషమువంటి విషం కలదు. నల్లమందు లేనిరోజున అలవాటు పడినవారెట్లు బాధనొందుదురో అట్లులే కాఫీ అలవాటు పడిన వ్యాడుగూడా కాఫీలేనిరోజున అంత బాధ చెందును. మొత్తముమీద నిది వ్యసనముల క్రోవిది. శీతల ప్రదేశముల నుండువారికి శరీరాయాసం పోగొట్టుటకు నిది మిక్కిలి యుపయోగకారి. గాని ఉష్ణప్రధానమగు భారత దేశీయులకిది సేవాయోగ్యంకాదు. దీనియందు రక్తమున కుత్తేజమొసరించు గుణముండుటచే శీతలవాసులకు ఉపయోగమధికంగా నుండును. దీనిసేవవలన నిరూపించుటకు వీలులేని రోగము లెన్నియో బుట్టుచున్నవని పరిశోధకోక్తి కాదు. ఈ పానీయము ఆమమును జెంది మూత్రాశయముయొక్క శక్తిని తగ్గించును. అందువలన అతిమూత్ర వ్యాధి పుట్టుటకు కారణమగుచున్నది. గాన మన దేశీయులకు నిత్యసేవ కిది ప్రకృతి విరుద్ధముగా నున్నది. కేవలం ఔషధోపయోగముగా వాడిన కొన్ని సుగుణములు కాఫీయందు లేకపోలేదు. కాఫీ మెదడును ఉడికించును. మూత్రకోశమున కుత్తేజం కలిగించును. హృదుత్తేజనం చేయును. అశ్మరీరోగమును హరించును. ప్రేగులలోని క్రిమిగణిని వృద్ధి పరచి దేహక్షయమునకు మూలముగా మూత్రంతో యూరిక్ ఆసిడ్డును వెలపరచి శరీరమును క్షీణత పరచును. ఆయాసము లేకున్నను నిద్రను కలిగించును. అధికముగా కాఫీని సేవించుటవలన జీర్ణశక్తి పాడగును. తలనొప్పి పుట్టును. కోకోకంటె నిది ఉత్తేజకమైనది. కాని పురాణమగు దాత్యయ రోగమునకు కాఫీ గుణకారిగా నున్నది. వమనములు కట్టుటకును, ఆయాసం తగ్గుటకును, విరేచనములు కట్టుటకును కాఫీ ఉపయోగకారిగా నున్నది.—R N. Khory. సంస్కృతమున అటంత్రి, మ్లేచ్ఛఫల, ఇంగ్లీషున Coffea Arabica.



కాబేజిపువ్వు:—ఇందు విటమినులుగలవు. ఇది కూరగ నుపయోగపడు పువ్వం. దీని ప్రచారము విస్తారంగా దక్షిణదేశమునందు గలదు. ఇది మూరయెత్తువరకు పెరుగును. ఆకులు తెలుపు, ఆకుపచ్చరంగు కలసిన రంగుగా నుండును. దీని పువ్వు ఆకులు దొంతరలు దొంతరలుగా చుట్టుచు అందముగా ఏర్పడుచున్నది. పువ్వు గట్టిగా నుండును. సూరె గుమ్మడికాయంత పువ్వుండును. కొద్దిగా మదం వాసన యుండును. ఇందు మూడు జాతులు గలవు. పుష్పగోభి, పత్రగోభి, గ్రంథిగోభి. పుష్పగోభి తీపిరుచి, శీతగుణం, గురుత్వం, విపాకమున తీపిరుచి. మిక్కిలి మేహశాంతి చేయును. మూత్రమును జారీచేయును. పిత్తమును హరించును. వీర్యమును వృద్ధిచేయును. బలప్రదం మలమును బంధించును. ఆకలిని హరించును. కఫమును కొద్దిగా పెంచును. గడ్డలుకట్టిన గుణము కరిగించును.

సంస్కృతమున పుష్పగోభి, మధ్యపుష్ప, కాబేజీ, ఇంగ్లీషున Cabbage.

కామంచిచెట్టు:—దీనిని కాసరిచెట్టు అని కూడా అంటారు. దీనికి బహుఫలా, గుచ్ఛఫలా అని పరిచయ పదములు గలవు. ఎక్కువ పండ్లు కాయునది, గుత్తులు గుత్తులు కాయునది. రసాయనకరం. రసాయనశ్రేష్ఠం. ఇది భూమిపై గజమెత్తువరకు పెరుగును. గుండ్రంగా ముత్యములవలె గుత్తులు గుత్తులుగ నుండును. కాయనిండ చిన్నగింజ లుండును. పచ్చికాయ ఆకుపచ్చరంగుగా నుండును. పండు ఎఱ్ఱరంగు గను, కొన్ని నల్లరంగుగా నుండును. పండు రంగునుబట్టి కాసర రెండు విధములుగా నున్నది. రెంటికీ కూడా పువ్వులు తెలుపుగానే యుండును. ఆకు మిరప ఆకును బోలియుండును. దీని సర్వాంగములుకూడా కొంచెం చేదు కారం రుచిగా నుండును. ఉష్ణవీర్యం గలది. విపాకమున కారపు రుచిగా మారును. ఇది విరేచనకారి. లఘు సూక్ష్మ గుణములు

గల వస్తువు. త్రిదోషముల శమింపజేయును. కంఠమునందలి జీరను హరించును. కుష్ఠురోగమును హరించును. వీర్యమును వృద్ధిపరచును. ఇది రసాయన ద్రవ్యం. శూలలు, మూలశంఖలు, ఉబ్బు, విషదోషములు, మేహవ్యాధులు, నేత్రవ్యాధులు, ఎక్కిళ్లు, వాంతులు, హృద్రోగములు హరించును. ఊరుస్తంభవాతమునకు కామంచి ఆకు నీళ్ళతో ఉడికించి నూనెతో వేయించి తినిన హరించునని చరకమతమున గలదు. కామంచి ఆకు పైపపూసినను, లేక ఆకురసము రెండు తులములు లోనికిచ్చినను ఎలుక విషము హరించునని సుశ్రుతమున గలదు.

గ్రామ్యప్రయోగములు :—ఆకు పసరు చెవిలో పిండిన చెవి పోటు హరించును చీముకారుట కట్టును. పురుగులు చచ్చును. మరియు నది గర్భోత్పత్తిని కలిగించును. పిల్లమను నేత్రరోగమునకు కామంచి పండ్లు నేతితో నూరి కంటికి పూతమువేసిన నేత్రరోగం హరించును. పురుగులు కూడా పడును. కామంచికాయలగింజలు మెత్తగా చూర్ణించి కషాయం కాచి ఆ కషాయములో తేనె కలిపి త్రాగిన అతిమూత్రం, మధుమేహం తగ్గును. కాచి త్రిదోషహరి. జిగటగ నుండును. కంఠ నాదము బాగుచేయును. శుక్రమును వృద్ధిచేయును. హృదయమునకు మేలుచేయును. ఆయురారోగ్యముల వృద్ధిపరచును. వాపు, కష్టవు, అర్శస్సు, మేహం వీనిని హరించును.

సంస్కృతమున కాకమాచి, ఇంగ్లీషున Solanum Nigrum, అరవంలో మణిత్తక్కాళి, హిందీన మకోయకలైయా, బంగాలీలో గుడకామాయా, కుకమాచి. మరాటీన కమోనీ, గుజరాతీన పీలుడీ, పంజాబీన కాంపీలు మకో అందురు.

☞ కామంచికసవు :—ఇది తృణ విశేషము. ఇది ఇంచుమించుగ గంగగడ్డివలె నుండును. దీని ఆకులు పరిమళము గలిగి వుండును. ఆకు నలిపిన నోరంతయు పరిమళించును. ఇది చేదు, వగరు కలిసిన రుచి



కలది. వేడిచేయును. విపాకమున కారపు రుచికి మారును. రూక్షగుణం కలది. శ్లేష్మహారం, పిత్తరక్తం, కంఠవ్యాధులు, శూలలు, శ్లేష్మజ్వరములు హరించును. దగ్గులు తగ్గును. శస్త్రములు, శల్యములు మొదలగు వానివలన గలుగు దోషములను శమింపచేయును. బాలగ్రహముల పారదోలును. పండ్లబాధల తగ్గించును. స్వేదమును కలిగించును. దీని కషాయం బాగుగ నిద్రను బుట్టించును. ఇది సమూలము కషాయంపెట్టి పాలు పంచదార కలిపి కాఫీవలె తీసికొనిన సువాసన, రుచి గలిగి యుండుటేగాక, చెమటను బుట్టించి ఆయాసం హరించును. కలరా వాంతులను కట్టును. కషాయం 2 మొదలు 4 తులములు వరకు నీయ వచ్చును, కామంచిగడ్డి కషాయంలో నూనెవేసి మరుగువరకు కాచి ఆ నూనె ఇరువది చుక్కలు పాలలో కలిపి సేవించిన పొత్తికడుపులో నుండు మూఢవాతం హరించుటయేగాక చాలా బలమును కలుగ జేయును. సంస్కృతమున కత్తృణ, ఇంగ్లీషున Roosa grass.

☞ కాయఫలము :—కట్ఫలం చూడుము.

☞ కాయము :—ఇది బాలెంతలకు నిచ్చు ముఖ్యమైనమందు. శొంఠి, పిప్పళ్ళు, మిరియాలు, పిప్పలిమోడి లేక కట్టె, కటికరోహిణి, తెల్ల జీలకఱ్ఱ, వాము, చాయపసుపుకొమ్ము, దుంపరాష్ట్రం లేక కళింగ రాష్ట్రము ఇవి దోరగా వేయించి వేడినీళ్ళతో మెత్తగానూరి ఆముద్ద ఆవునేతిలో వేయించి పాతబెల్లముకూడా వేసి లేహ్యమువలె తయారు చేతురు. దానికి కాయం అని పేరు ఇది బాలెంతరాలికిచ్చిన గర్భ మందలి వాతమును హరించి దేహమందలి నీటిని హరించును. దేహమును తేలిక పరచును. పాలను వృద్ధిపరచును. ప్రసవమువలన గలిగిన నొప్పు లను శమింపజేయును. బలమును, ఆరోగ్యమును గలిగించును.

☞ కారము రుచి :—కారపురుచి అనగా నాలుకకు చురుకును బుట్టించి కన్నులు, ముక్కు, నోటినుండి నీటిని స్రవింపజేసి దాహము

మంటలు పుట్టించు రుచికి కారపురుచి అని పేరు. కారపురుచికి గళ రోగమును, ఉదర్దమును, కుష్ఠును, అలసక రోగమును, ఉబ్బును హరించు శక్తికలదు. వ్రణములను మెత్తపరచును. దేహమందలి చెమురు పదార్థములను, మేదస్సును శోషింపజేయును. జఠరదీప్తిని గలిగించును. పచనము చేయును. రుచికరమైనది. విరేచనకారి. నోరు ఇగుర్చును. బంధములను విప్పును. స్రోతస్సులను విశాలపరచును. శ్లేష్మహరం. ఇది ఎక్కువగా వాడినచో వీర్యమును, బలమును క్షీణింపజేయును. దాహమును గలిగించును మూర్ఛను గలుగజేయును. కంపం గలుగును. నడుము, ముడ్డిపూసలలోను పోటు గలుగును.

కారుకోడిమాంసం :—కారుకోడికి అడవికోడి అని కూడా పేరు కలదు. దీనినిగూర్చి వెనుక చెప్పబడియున్నవి. గాన అందు చూడనగును.

కారుచిక్కుడు :—ఇది తీపిరుచి గలది. వేడిచేయును. విపాకమున మధురరుచిగా మారును బలమునిచ్చును. పైత్యమును, శ్లేష్మమును చేయును త్వరగా జీర్ణముకాదు. వీర్యవృద్ధిని గలిగించును. అగ్నిమాంద్యమును గలిగించును. రుచినిచ్చును. సంస్కృతమున కోలశింబి అందురు.

కారుపెసర :—ఇది పెసరచెట్టును ఇంచుమించుగ బోలియుండును. తుప్పమాదిరిగా పెరుగును చెట్టునకు కొంచెం నూగుకలిగియుండును. దీనికాయలు, గింజలు పెసరకాయల గింజలను బోలియుండును గాని కొంచెం చిన్నవిగా నుండును. చిరుచేదుగా నుండును. చెట్టు బూడిద వర్ణముగా నుండును. దీని సర్వాంగములు కూడా వైద్యమున కుపయోగించినవిగా నున్నవి. పర్ణి చతుష్టయములో నిది యొకటి. మధుపిక్తరసము గలది. వేడిచేయును. గురుగుణము గలది. శీతవీర్యము. విపాకమున తీపిరుచికి మారును. దాహజ్వరమును, క్రిములను హరించును.



వీర్యవృద్ధిని కలుగజేయును. శ్లేష్మమును పెంచును. అతిసారం, మూలవ్యాధి, గ్రహణి రోగముల పోగొట్టును. సంస్కృతమున ముద్గపర్ణి అందురు.

కారుమినుము :—ఇది చిన్న చెట్టుజాతిలోనిది. చెట్టునిండా తెల్లని నూగుండును. చెట్టు పోలిక అంతయు మినపమొక్కను బోలియుండును. కాయలు గింజలు మినపకాయల గింజలకన్న చిన్నవిగా నుండును. ఇదికూడా పర్ణీచతుష్టయములోనిది దీని సర్వాంగములు కూడా ప్రయోగార్హములే. ఇది చిరుచేదురుచికలది. శీతవీర్యముకలది. విపాకమున కారపురుచికి మారును. రూక్షగుణముకలది. శరీరమునకు తాపము కలిగించును. శుక్రమును, కఫమును వృద్ధిచేయును. మలమును బంధించును. శోష, వాతజ్వరము, పిత్తజ్వరము, రక్తదోషము వీనిని హరింపజేయును. వెంద్రుకలను వృద్ధిచేయును. నజ్జురోగమును పోగొట్టును. పాలను వృద్ధిచేయును. దీనిలో నన్నిగుణములకన్న వీర్యవృద్ధిని చేయుగుణము హెచ్చుగాగలదు. వీర్యవృద్ధికి, ఒకే వర్ణముగల ఆవును కారుమినుముతో మేపి, దాని పాలను మద్దికఱ్ఱ తొట్టిలో పితికి, అవికాచి, దానిలో నెయ్యి, తేనె, పంచదార కలిపి త్రాగిన మిక్కిలి వీర్యవృద్ధి కలుగునని చరకమునకలదు. ఎలుకవిషమునకు కారుమినుములు, తెల్లవావిలియును కలిపి రసంపిండి, ఆ రసంలో తేనెకలిపి త్రాగిన ఎలుకవిషం హరించుననని సుశ్రుతమునగలదు. వాతసంబంధమైన రక్తకుసుమునకు కారుమినుము కషాయముతో నండిననూనెలో దూదిపింజతడిపి, యోనియందు ధరించిన వాతసంబంధమైనరక్తకుసుమకట్టుననివంగసేనలోకలదు.

సంస్కృతమున మాషపర్ణి. అరవమున పెరుఎడుకోళ్, కృష్ణవృందా, హయపుచ్ఛికా, బహుఫలా, మాషపత్రికా. హిందీన మహావన్, వన్ఉరద్, జంగిలీహ. బెంగాలీన మాషాల్లి. గుజరాతీన అడరాడ్, రసాయనము.

కారుమునగచెట్టు :—ఇది మామూలు మునగచెట్టును పోలి యుండును. దీనిరుచి కారము. చెక్క మిక్కిలి వేడిచేయును. తీక్ష్ణగుణం కలది, విపాకమున కారపురుచికి మారును. ఎనిమిదిరకములైన శూలలు హరించును. గుల్మ, ప్లీహాల నణంచును. శ్వాసకాసలు, వాపులు తగ్గును. శీనసవ్యాధి హరించును. గర్భస్రావమును చేయును. అడవిమునగకాయ చేదుగనుండును. వీర్యమును కలిగించును. మూలవ్యాధిని ఖండించును. పువ్వులు కొంచెంచేదు, తీపి రుచికలిగియుండును. దీనిని కూరగావండుకొని తినినచో శ్లేష్మ ప్రకోపము శమించును. వేడిచేయును. పిత్తమును పెంచును. ముఖంశిరుగును. పువ్వులరసం నస్యం చేయించిన మూర్ఛలు తగ్గును. సంస్కృతమున వనశిగ్రు, మురంగి. ఇంగ్లీషున Wild Horse Rabish అందురు.

కావిరాయి :—గైరికం రెండువిధములుగనున్నది. 1 స్వర్ణగైరికం. 2 పాషాణగైరికం. 1 స్వర్ణగైరికం ఎఱ్ఱగా, దళసరిగా, స్నిగ్ధంగానుండును పాషాణగైరికము కఠినముగా రాయివలె నుండును. రంగు రాయివర్ణముగా నుండును. ఇది భూప్రదేశములయందు పుట్టు ఒకజాతిరాయి. ఇందు స్వర్ణగైరికము శ్రేష్టం. ఇది వగరు రుచికలది. శీతవీర్యము, తీపి రసముకూడా నిండుకలదు. స్నిగ్ధగుణము నేత్రములకు మిక్కిలిమేలు చేయును. రక్తపిత్తమును హరించును. ఎక్కిళ్లు, వాంతులు, విషము హరించును. స్వర్ణగైరికము రక్తప్రదరము మొదలగు రక్తవ్యాధులను శమింపజేయును. గైరికము గోమూత్రముతో భావనచేసినచో శుద్ధిని పొందును. నిమ్మరసంలో 7 రోజులు గైరికమునానించి 8 వ రోజున వేడినీళ్లతో కడిగిన శుద్ధియగును. ఆవునేతిని వేయించినను శుద్ధిని పొందును. దీనియందు సత్వముకలదని నంది చెప్పియున్నాడు. క్షార వర్ణముచేతను, అమ్లవర్గముచేతను స్వేదకర్మచేసినచో గైరికము సత్వము వదలును. శుద్ధగైరికము పంచదారతో కలిపి యిచ్చిన మూత్రముతో



పడు శుద్ధహరించును. ఈతవేళ్ళ కషాయముతో నిచ్చిన రక్తకుసుమ కట్టును. మోతాదు ఎక్కువఅయినచో మలబద్ధముచేయును. గైరికము మధుర కషాయరసములు. శీతలము, స్నిగ్ధము, దృష్టిశక్తిని వృద్ధి చేయును. దాహము, పిత్తము, కఫము, ఎక్కిళ్ళు, రక్తస్రావము, విష దోషము హరించును. ఆకలిని మందగించును. ఇది పాదరసముతో గలిసిన గుణకారిగ నుండును. దీనిని జేగురురాయి అనికూడా చెప్పుదురు. వేడినీళ్ళలో కొంచెంనెయ్యి పంచదార గైరికముకలిపి త్రాగినచో వెంటనే వేడిమితగ్గి సుఖము నిచ్చును. శ్లేష్మఉడుకులకు ఇది మంచిమందు. రంపకారీలు జేగురురాతిని నీళ్ళతో అరగదీసి కర్రలకు నూళ్ళు వేయుదురు.

సంస్కృతమున గైరిక, రక్తధాతు. ఇంగ్లీషున Bole Armenic. హిందీన గేరూ. బెంగాలీన గిరిమాంటీ.

కహరోబా :—ఇది యూనాని సాంప్రదాయమునందిది. సముద్ర ప్రాంతములయందు దొరకు వెలగలఖనిజము. మహమ్మదీయులు దీనితో స్ఫటికపూసలవలె పూసలుచేసి జపమాలికలుగా వాడుదురు. దీనిరంగు కొంచెమించుమించుగా అరపూసవలె నుండును గట్టిగను తళుకుగ నుండును. దీనిలో చాలావిలువగలదికూడా కలదు. దీనియందు వగరు, తీపి, కొంచెంచేదు రుచులుగలిగియుండును. విపాకమున కారపురుచిగ మారును. మేహఉబ్బులకిది చాలమంచిది. గుండెదడకు బాగుగ పని చేయును. దీనినివాడిన ఎక్కువగ కొట్టుకొనుచున్న గుండె సమస్థితికి వచ్చును దీనిని పన్నీటితో 10 రోజులు నూరిన చక్కగా శుద్ధిఅగును. కొందరు దీనిని గులాబీపువ్వులరసంతోడను, కలువపుంప రసంతోడను, చనుబాలతోను నూరి బిళ్ళకట్టి పుటంవేయుదురు. దీనికి పుటం అవసరం లేదని కొందరిమతం. గొప్పగొప్ప ఆయుర్వేద డాక్టరులు దీనిని ప్రయోగించి చాలహృద్రోగముల కుదిర్చినట్లు వినికిడి. సాధారణంగా దీని

అనుపానం తేనె. వైద్యుడు రోగియొక్క బలాబలములు యుక్తినిబట్టి అనుపాన నిర్ణయం చేయవలసియున్నది. భస్మం 6_8 గ్రైనులు యివ్వవచ్చును. ఇది రసాయనము. బలమునిచ్చును. దీనినుండి కొందరు వైద్యులు ద్రావకం తీయుదురు. కొందరు తైలముకాచుదురు. తైలము లోనికి సేవించిన మూర్ఛ, అపస్మారం మొదలగు రోగములు తగ్గును. తైలద్రావకం మోతాదు 10__5 చుక్కలు, అనుపానం నీళ్లుగాని, పాలుగాని, అనవారిష్టములలో ఏదేనిగాని అనుపానించి యివ్వవచ్చును. నరములకు సత్తువ నిచ్చును. ఇంగ్లీషున Caruba అందురు.

కాంచనపుచెట్టు :—ఇది చెట్టుజాతి లోనిది. దీనిపుష్పములు దేవతా పూజల కుపయోగించును. దీనిఆకులు అడ్డాకులువలె జంటగా నుండును. గుండ్రంగా నుండును కాయలు చిమ్మకాయలవలె బద్దవాటుగా నుండును. ఇది ఎరుపు, తెలుపు, పసుపుపచ్చన రంగులచే మూడు భేదములుగా గన్పించుచున్నది. దీనికి దేవకాంచనమనిపేరు. ఇందులో సువాసనకలవి, లేనివి గలవు. వీని పుష్పములు యించుమించుగా చెట్టు సంపెంగపుష్పములవలె నుండును. ఇది వగరురుచికలది. శీతవీర్యము, విపాకమున మధురరుచిగా మారును. చలవచేయును. రూక్షగుణము, శ్లేష్మము హరించును. మలబద్ధమును చేయును. వ్రణముల శోధించి మాన్పును. గండమాలలు, గుదభ్రంశము హరించును. కుష్ఠురోగమును హరించును. కేశముల వశింపచేయును. వాతము. మూత్రకృచ్ఛ్రము, క్రిములు హరించును. పుష్పము లఘుగుణం కలది. పైత్యరక్తమును హరించును. ప్రదరరోగము, క్షయ, కాస మొదలగు రోగములు హరించును. విరేచనము చేయును. చలువచేయును. గురు కషాయం. మధురపాకి. రూక్షం. దేవకాంచనపువేరు మజ్జిగలో కలుపుకొని త్రాగిన మూలశంఖలు హరించును. నెయ్యి, కలువ, దేవకాంచనపు ఆకులు మూడు కలిపి సేవించిన బుద్ధి వికసించును. దేవకాంచనపుచెక్క,



బియ్యపు కడుగుతోనూరి శొంఠిచూర్ణం కలిపి త్రాగిన గండమాల రోగములు హరించునని చక్రదత్తలో గలదు. కాంచవాత గుగ్గులు, దేవకాంచనం పట్టచూర్ణం పదిభాగములు, త్రిఫలములు ఆరుభాగములు. త్రికటికములు మూడుభాగములు, ఉలిమిరిచెక్క ఒకభాగం ఏలకులు, లవంగాలు, జాపత్రి ఇవి ప్రత్యేకం 1/3 వంతు భాగం. దీనికంతకును సమానం శుద్ధిచేసిన మహిషాక్షి గుగ్గిలం వీటినన్నిటిని పాకంపట్టి కుంకుడుగింజలవలె మాత్రలుచేసి సేవించవలెను. బోడతరకషాయం, చండ్రభావకషాయం, కరక్కాయకషాయం వేడినీళ్ళు వీనిలో దేనితో నైనను సేవించవలెను. గండమాలలు. అర్బుదము, అపచి, గ్రంథులు, వ్రణములు, భగంధరము, కుష్ఠువు మొదలగు రోగములు హరించునని శార్ఙ్గధర సంహితలో గలదు.

సంస్కృతమున కాంచనార, కోవిదార, హిందీన లాల్ కచనార్, కచనార్, బంగాలీన కాంచన్ ఫ్లానేర్ గాఛ, మరాటీన కాంచన్, గుజరాతీన చంపాకాటీ, ఇంగ్లీషున Bauhinia puipurea.

కాండ్రేగుచెట్టు :—ఇది పెద్ద గుల్మజాతికి చెందినది. ఈ పొదలు విస్తారంగా అడవులలోను. పొలముల కట్టవలలో నుండును. దీనిఆకులు బలుసుఆకులవలె నుండును. చెట్టు అంతయుగూడా ముండ్లుండును. కాయలు ఎఱ్ఱగను, పండ్లు నల్లగా నుండును. ఇది సుమారు నిలువు వరకు పెరుగును పండ్లు తీపి వగరు కలిసి యుండును: శీతవీర్యం. విపాకమున మధురరుచిగా మారును. తేలిక గుణము కలది. ఆకలిని వృద్ధి చేయును, జీర్ణశక్తికి బలంనిచ్చును. తాపం శోష హరించును. కామల, పైత్య ప్రకోపము హరించును. దీని ఆకు రసములోగాని. చెక్క రసంలోగాని శొంఠి చూర్ణము చేర్చి సేవించిన జిగట విరేచనములు కట్టును. ఆకులో మిరియములు కలిపి మెత్తగా నూరి మాత్రలు

ఇండుపకాయలవలె చేసి తొమ్మిది పూటలు సేవించిన ఎటువంటి రక్త ప్రదర రోగమైనను శాంతించును. ఇది అనుభవయోగం.

సంస్కృతమున వికంకత, పృహివృక్ష, హిందీన కంటాయీ, బంగాలీన బయించి, కేశిఫల్, మరాటీన గాలఘోంటా, ఉడియాలో బఊచకుడీ, కర్ణాటకంలో కులసానికా, పంజాబీలో కుకవా, ఇంగ్లీషున **Var Sapida.**

కాంతలోహము :—ఇది ఖనిజజాతిలో చేరినది. దీనిలో భామకం, చుంబరకం, కర్షకం, ద్రావకం, రోమకం అను భేదములు కలవు. ఈ అయిదు జాతుల కాంతమునకు పసుపు, నలుపు, ఎరుపు రంగులున్నవి. కొన్ని రాళ్ళలో నీలోహము కలిసియుండును, వీనిని కాంతపు రాళ్లు అని అందురు. సూదినిగాని, ఇనపమేకునుగాని కాంతపురాయి ఆకర్షించును. అట్లు ఆకర్షించుదానికి ముఖం అని పేరు. అన్నివైపుల నుండి ఆకర్షించు రాతిని సర్వతోముఖమని చెప్పుదురు. పరిశుద్ధులు చక్కగా చేసి పుటము లిడిన లోహభస్మము చేదురుచి గలిగియుండును. శీతవీర్యం. విపాకమున మధుర రుచిగా మారును రూక్షోష్ణములు దీని గుణములు. ఇది త్రిదోషజ త వికారముల నడంచును. ఈలోహములు శాస్త్రపద్ధతిగ శుద్ధులు భస్మంచేసి వాడిన ఆయురారోగ్యముల వృద్ధి నొందించును. దీనితో కాంతవల్లభరసం. కాంతరసాయనం మొదలగు ఔషధముల వండుదురు. బంగాళాకాంతమను లోహముకూడా కాంతం గుణములే కలిగియుండును.

## కి

కికిసగడ్డి :—ఇది నదులు చెరువులు మొదలగువాని యొడ్డుయందు బయలుదేరును. ఇది వెదురుపొదవలె మూడు నాలుగు నిలువులు ఎత్తువరకు పెరుగును. దీని యాకు చెరకుయాకును బోలి



యుండును. దీని వెన్నుకూడా చెరకు వెన్నును బోలియుండును. దీని కజ్జలో వెదురుకణువలె బోలుండును. ఇది తీపి, వగరు, చేదు రుచులు కలిసియుండును వేడిచేయును. శీతవీర్యము, గురుగుణము. విపాకమున మధుర రసముగా మారును. ఇది మిక్కిలి వీర్యవృద్ధియు, బలమును గలిగించును. మూత్రబద్ధమును విప్పును. పైత్యశూలలను పోగొట్టును. నీటిమీద నాచు, కిక్కిసగడ్డివేళ్ళు మెత్తగా నూరి పైన పూసిన విసర్పరోగములు హరించును. నూరిన ముద్దలో కొంచెం ఆవు నెయ్యి కూడా కలుపవలెను. సంస్కృతమున నల - పోటగల ఇంగ్లీషున **Burgrass**.

కింకిరాత పుష్పము :—ఇది గుల్మజాతికి చెందిన బంగారు రంగు పువ్వులు పూయు మొక్క. ఇది చేదు వగరు రుచులు గలది. చలువ చేయును. విపాకమున కారపు రుచిగా మారును. లఘుగుణము. విష హరము. క్రిములు, ఉబ్బులు, కఫం, పిత్తం, దాహం, రక్తదోషం. వమనం, జ్వరం, శోష, కుష్టం, కర్ణరోగములు శమించును. దీని ఆకు పువ్వులు మెత్తగ పసుపు కలిపి నూరి శరీరముపైన రాసిన చర్మరోగములు హరించును. దీని అన్ని భాగములయందు టన్నిన్ ఆసిడ్ ఉండుటచే గ్రాహిగ నున్నది. పువ్వులయందుకూడా నీగుణం కలదు. పువ్వులు అతిసారమును కట్టును. కూర రక్తసంభకము. సంస్కృతమున కింకిరాతి, పీతభద్ర అని అందురు.

కిసిమిసిపండ్లు :—ఇది ద్రాక్షజాతికి చెందినది. ఆకు పువ్వు కాయ అన్నియు ద్రాక్షను పోలియుండును. కిసిమిసి ఆకులు పండ్లు ద్రాక్షకన్న కొంచెం చిన్నవి. కిస్మిస్ పండ్లలో గింజలు లేవు. ఇవి తీపిరుచిగలవి. శీతవీర్యము. విపాకమున మధురరుచిగా మారును. ఉష్ణగుణం కలది. ద్రాక్షపండుకంటె కిసిమిసిపండ్లు పథ్యకారి. మూల శంఖను హరించును. మేహవ్యాధులు హరించును. దగ్గులు శమించును.

బలంనిచ్చును. వీర్యవృద్ధి చేయును. ఇంచుమించుగా ద్రాక్షపండ్ల గుణములన్నియు కిస్‌మిస్ పండ్లకు గలవు. లేహ్యములలోను, పరమాన్నములోను, సత్యనారాయణ ప్రసాదములోను, కేసరీభాత్ మొదలగు వానిలోను కిస్‌మిస్ వాడుదురు. సంస్కృతమున క్షుద్ర ద్రాక్ష అని అందురు.

## కు

కుక్కతులసి :— తులసి చూడుము.

కుక్కపుగాకు :— ఇది తేమగల ప్రదేశములలో విస్తారంగా పెరుగును. దీని యాకులు పుగాకును బోలియుండి జిడ్డుగలిగి బోడతరం వాసన వేయును. వెన్నన తెల్లని పువ్వులు పూయును. దీని రుచి కారంగాను, చేదుగా నుండును. వేడిచేయును. విపాకమున కారపు రుచిగా మారును. కఫమును తగ్గించును. జ్వరముల బోగొట్టును. జీర్ణశక్తిని వృద్ధిచేయును. కుక్కపుగాకు కషాయంలో మిరియపుపొడి కలిపి త్రాగిన పాలిజ్వరములు హరించును. దీని సమూలం మెత్తగా నూరి క్రిములుగల వ్రణములపై కట్టిన క్రిములు నశించి వ్రణములు మానును. కుక్కపుగాకు రసములో మాండూర భస్మం నిచ్చిన వాతనజ్జులు హరించును. కుక్కపుగాకు రసంతో అన్నభేదినూరి ఇరువది పుటములు చేసిన చక్కగా సింధూరించి వీర్యవంతమైన భస్మమగును. అజీర్ణ వ్యాధులకు, శ్లేష్మములకు చక్కగా పనిచేయును. మరియు మృత్పాండువు త్రిఫలకటుకచూర్ణంతో నిచ్చిన కట్టును. అభ్రకం కూడా ఇరువది పుటములువేసిన చక్కగా సింధూరించి గుణకారి యగును. ఇంగ్లీషున Wild tabacco అందురు.

కుక్కవాయింట :— వాయింట చూడుము.



కుకుందరము :— ఇది తులసిజాతిలోనిది. నిట్టనిలువుగా పెరుగును. ఆకులు తమలపాకులవలె నుండును. దీని చిగురునందు కోడిజుట్టువలె జడయుండును. దీనిని సీతాదేవి జడ యందురు. కోడిజుట్టు చెట్టు అనియు చెప్పుదురు. ఇది కారం చేదు రుచి గలది. ఉష్ణవీర్యం గలది. విపాకమున కారపు రుచిగా మారును. శ్లేష్మమును హరించును. దాహమును కట్టును. రక్తదోషమును పోగొట్టును. దీని వేరు నోటనుంచుకొని చప్పరించిన ముఖదోషములు హరించును. సంస్కృతమున తామ్రచూత, కుకుందర.

కుచందనము :— చందనం చూడుము.

కుప్పింటచెట్టు :— ఇది పాటిపెరళ్ళలో పుట్టు నొకానొక మొక్కజాతికి చెందినది. దీనిఆకులు మూర్కొండ ఆకువలె కొంచెం కోలదనము గలిగియుండును. ఆకు మృదువుగానుండును. కొన్ని చోట్ల కుప్పిచెట్టనియు, పుప్పింటిచెట్టనియు పిలుచుదురు. ద్రావిడ దేశంలో కుప్పాణి అనిపిలుతురు. దీనిరుచి కారం, చేదు రుచులు గలిగి యుండును. వేడిచేయును. విపాకమున కారపురుచిగ మారును. విరేచనకారి. శ్లేష్మమును హరించును. చర్మరోగములు, దగ్గులు శమించును. వాంతిని కలిగించును. క్రిమిని చంపును. వేరుకషాయం నాలుగుతులములు త్రాగిన చక్కగ విరేచనం చేయును. ఆకురసంగాని, కషాయంగాని విరేచనముచేయును. ఆకురసం, వేపనూనె కలిపి నాలుకకు రాసిన కఫమును కరిగించి వమనముచేయును. సంస్కృతమున హరితమంజరి, ఇంగ్లీషున Indian Acalypha.

కురంజివాము :— ఇది వాముజాతిలో నొకరకం. భూమికి జాన ఎత్తు పెరుగుచున్న చెట్టు. చెట్టంతయు సువాసన గలిగియుండును. గుత్తులు గుత్తులుగా తెల్లనిపూవులు పూయును. పువ్వులనుంచి గింజలు

పుట్టును. కారం, చేదు రుచులు కలిగియుండును. ఉష్ణవీర్యము కలది. విపాకమున కారపురుచికి మారును. పొత్తికడుపులోని నులిపురుగుల జంపుట కిది చాల శ్రేష్ఠమైనది. సకల అజీర్ణములను తగ్గించును. ఆమదోషం, శూలలు పోగొట్టును. దీనిగుణములు వాములో సమానగుణగణములే కలిగియుండును. సంస్కృతమున పారశీకయవానీ, ఖరపుష్పక. ఇంగ్లీషున Hanbane Seeds.

ఖురాసానివాము:—దీనిరుచి కారం చేదు మిశ్రితంగా నుండును. వేడిచేయును. విపాకమున చేదు కారం రుచికిమారును మదమును కలిగించును. శ్లేష్మమును శోషింపజేయును రుచినిచ్చును. క్రిమిహారి. నిద్రనుపుట్టించును. వాము గుణములు దీనికికలవు. సంస్కృతమున తురుష్కా, మదకారిణీ. ఇంగ్లీషున Black Hendans Seebs.

కురువేరు:—దక్షిణ దేశంలో దీనిఉత్పత్తి ప్రచారములుమెండు. ఇది నీరుగల తేమప్రదేశములలో బుట్టును. ఇది తీగజాతికి చెందినది. తీగ తూటితీగవలెనుండును. వేరు నవరమువలె గుజ్జుగనుండును. వేరు సువాసనహెచ్చు. చల్లగనుండును. మద్రాసునందు పూలబజారులో విస్తారముగా నిది అమ్మబడుచున్నది. దీనికి చేదురుచి కొంచెంతీపి కలిగియున్నది. చలువచేయును. విపాకమున తీపిరుచికి మారును. తేలికనిచ్చును. అగ్నిదీపనం, పాచనం చేయును. రక్తపిత్తం, జ్వరం, శ్లేష్మం తాపం, దప్పి, వ్రణం పోగొట్టును. విసర్పం, హృద్రోగములను హరించును. అతిసారమును నశింపజేయును. తలవెంట్రుకల నల్లబరచును. స్త్రీలకు మిక్కిలి ప్రేమను గలిగించును. కురువేరు అల్లంకలిపి కషాయంకాచి త్రాగించిన అతిసారరోగం కట్టును. కురువేరు చల్లని నీటిలోగలిపి త్రాగించిన మద్యపానంవలన కలిగిన దాహం శాంతించును. కురువేరుచూర్ణం, పంచదార, తేనెకలిపి కొంచెం బియ్యపు కడుగుతోనిచ్చిన పిల్లల సర్వాతిసారములు హరించునని వంగసేనలో



కలదు. సంస్కృతమున వాలక, హ్రీబేరా, గ్రంధమూలకం. ఇంగ్లీషున Povonia Odorata అందురు.

కుశదర్భ:—ఇది వరిదుబ్బువలె పెరుగును. కొనలుసూది మొనలువలె వాడిగ నుండును. ఇది రెండడుగులవరకు బెరుగును. దీని వేళ్ళు సన్ననివట్టివేళ్ళవలె నుండును. ఈ వేళ్లు ఔషధమునకు చాలవరకు ఉపయోగించును. దీనిగడ్డి శుభాశుభకర్మల కుపయోగింతురు. దీనికి చిన్న వెన్నుండును. కుంచవంటి తెల్లనిపూవులుపూయును. దీనిని పశువులుమేయును. ఇది తృణపంచమూలములలో నొకటి. ఇది తీపి, వగరు కలిసిన రుచిగనుండును. శీతవీర్యంకలది. విపాకమున మధురరుచిగ మారును. మూత్రకృచ్ఛ్రం, అశ్మరి, దప్పి, పిత్తం, వస్తిరోగం, శ్లేష్మం, రక్తదోషం వీనిని హరించును. ఋతుదోషమును హరించును. గర్భమును నిలిపి కాపాడును. న్యగ్రోధాది గణమును బలయు, కుశకషాయంపెట్టి వ్రణములు కడిగినను లోనికిచ్చినను వ్రణముల శోధించి మాన్పునని చరకమున కలదు. కుశదర్భవేళ్ళుతీసి, బియ్యపు కడుగులో మెత్తగానూరి త్రాగించిన స్త్రీల ప్రదరరోగములు మూడురోజులలో నిస్సంశయముగా కట్టునని చక్రదత్తలో గలదు. మరియు కుశవేళ్ళు బలామూలం బియ్యపు కడుగుతో నూరి త్రాగించిన రక్తమూలములు స్త్రీల ప్రదరవ్యాధులు తగ్గిపోవునని వంగసేనలో గలదు.

సంస్కృతమున కుశ, బర్హి, సూచ్యగ్ర, ఇంగ్లీషున Poa Ciliaris (Roxb)

కుసుంబాచెట్టు:—ఇది వృక్షజాతిలోనిది. ఇది బాగుగా పూసిన నెల్లిగా కుంకుమరాశివలె కన్పించును. దీని చిగుళ్ళు కోడిజుట్టువలె నుండును. దూరంనుండి చూచిన అగ్నిజ్వాలవలె కనిపించును. ఇది బట్టలకు రంగువేయుటకు చాలా ఉపయోగకారి, ఇది కారం, తీపి రుచులు కలిగియుండును, వేడిచేయును, విపాకమున తీపిరుచిగా మారును.

అగ్నిదీప్తి నిచ్చును. శ్లేష్మమును హరించును. మేదస్సును క్షీణింప జేయును. మలమూత్రముల తగ్గించును. పైత్యమును వృద్ధిచేయును. మరియు ఈ కుసుంబా చెట్టుయొక్క ప్రతి అంగమునకు ఒక్కొక్క గుణము కలదు. చెక్క వాత కఫముల హరించును. మూత్రకృచ్ఛ్రమును, రక్తపిత్తమును పోగొట్టును. పువ్వు చేదురుచి. ఉష్ణకారి. కటివిపాకి. లఘుగుణం. వెండ్రుకలను నల్లబరచును. గింజలనుండి తైలము తీయుదురు. దీనిని కుసుంబా నూనె అని చెప్పుదురు. ఇది పైకి మర్దన చేయుటకే ఉపయోగించును. లోనికి త్రాగరాదు. వాతపు నొప్పులు, పక్షవాతపునొప్పులు, చర్మరోగములు హరించును. కుసుంబానూనె మర్దనచేసి వెండ్రుకలు లాగిన సుఖముగా నూడిపోవును. కుసుంబా నూనె, ఆవనూనె, అవిశనూనె మూడు కలిపి పైనపూసినను, లోనికిచ్చినను ప్రమేహము తగ్గును. సంస్కృతమున కుసుంబా, వహ్నిశిఖా, ఇంగ్లీషున Carthamus Tinctorius అందురు.

కుంకుడుచెట్టు :—ఇది పెద్ద వృక్షము. ఆకు గుండ్రముగానుండి కొంచెం కోలదనం కలిగియుండును. ఆకు నలుపు. పువ్వులు తెల్లగానుండి గుత్తులు గుత్తులుగా పూయును. కాయలు గుండ్రంగా గుత్తులు గుత్తులుగా కాయును. కాయలు ఎండబెట్టి చిదుగకొట్టి నీళ్ళలో కలిపి పిసికిన నురగ వచ్చును. రుచి ఘాటైన చేదు, ఉపరుచి కారం. గుణం తీక్ష్ణం. గురుత్వం గలది. వేడిచేయును. విపాకమున కారపు రుచిగా మారును. మూడు దోషములను శమింపచేయును. గర్భవాతమును కలిగించును. వాంతిని బుట్టించును. విరేచనము చేయును. ఉబ్బసము తగ్గించును. కుంకుడుపండు చనుబాలతో నరుగదీసి నాలుగయిదు చుక్కలు ముక్కులో నస్యంచేసిన పార్శ్వనొప్పులు హరించును. శ్వాస మూర్ఛ, మోహాపస్మారం మొదలగు రోగములు వెంటనే కట్టును. మగబిడ్డకు చనుబాలు ఆడరోగికిని, ఆడబిడ్డగల చనుబాలు మగరోగికిని



నస్యం చేయించవలెను. మరియు ఊపిరితిత్తులలోని శ్లేష్మముకూడా ఈ నస్యమువలన పడిపోయి సుఖము నిచ్చును. నాభి మొదలగు విష పదార్థములు ప్రమాదవశమునతిన్న కుంకుడుకాయలరసం లోనికిచ్చిన వాంతులై విషం హరించును. 5—6 తులముల రసం యివ్వవలసి యుండును. శిరస్సుపోట్లకు కుంకుడాకు మెత్తగా నలగకొట్టి శిరస్సునకు కట్టిన శిరోవాతం తగ్గును. చంటిబిడ్డల మలబద్ధమునకు, కడుపుబ్బి విరేచనం కాకయున్నప్పుడు కుంకుడుపండు అరగదీసి పుగాకుకాడకు ఆ గుంజు పట్టించి ఆసనములోనికి అంగుళం వరకు జొనిపిన వెంటనే విరేచనమై కడుపు ఉబ్బు తగ్గును. ఈ గుంజు నాభికికూడా పట్టు వేయవచ్చును. గుంజు గుడ్డకు చుట్టి యోనియందుంచిన గర్భపాతం చేయును. రసం త్రాగినను వాంతి యగును. గర్భపాతం చేయును. గర్భమందలి క్రిములు నశించును. విరేచనం చేయును. దీనిపండు తేనెతో అరుగదీసి నాకించిన ఉబ్బసపుదగ్గు హరించును.

సంస్కృతమున అరిష్టఫేనిల, కృష్ణబీజ, ఇంగ్లీషున A Soapnut Tree. హిందీన రీఠాహారీసా, బంగాలీన రిఠేగాఛ, మరాటీన రిఠా, గుజరాతీన అంఠా అందురు.

కుంకుమపూవు :—ఇది కాశ్మీరదేశమునందును, హీరాను పారశీకము, స్పెయిన్, ఫ్రాంసు, సిసిలీ దేశమందును పుట్టిన సుగంధ ద్రవ్యము. దీని కేసరము లెఱ్ఱగను, కొంచెం తెల్లగనుండును. కొంచెం చమురుకలిగియుండును. ఇది సముద్రమట్టమునకు 5200 అడుగుల ఎత్తుగల చలవ ప్రదేశమున పైరు చేయబడుచున్నది. ఇప్పుడు బజారులలో చేత కుంకుమపూవుకూడా అమ్మబడుచున్నది. అసలైన కుంకుమపూవు చేతిలో నలిపిన రంగు అంటుకొనదు. నీటిలోవేసిన ఎఱ్ఱబడదు. ఈ గుణముకలది అసలైనదని తెలియవలెను. సన్నని కేసరములుకలిగి తామరవాసన గలిగి యుండునది ఉత్తమ కుంకుమ పువ్వుగ గ్రహించ